పోతనామాత్య భాగవత పరిచయము

8 అష్టమ స్కంధము

భాగవత గణనాధ్యాయి
ఊలపల్లి సాంబశివరావు

http.telugubhagavatam.org

పోతనామాత్యుని భాగవత పరిచయము

అష్టమ స్కంధము

Bhagavata Parichayamu, Skandam .8

Presentation : E- book version

భాగవత గణనాధ్యాయి
ఊలపల్లి సాంబశివరావు

ఆగస్టు - 2020

http//telugubhagavatam.org
Bhagavata Parichayamu, Skandam .8

Presentation : E- book version

Publishing date : Aug - 2020.

Cutesy : http//telugubhagavatam.org

Writer : Bhagavta Gananadhyayi

Idea & Editing : Peddi Sambasiva Rao

Price : free distribution.

Available At : kinige.com
: teluguthejam.com
: telugubhagavatam.org

తెలుగుభాగవతం.ఆర్గ్ (telugubhagavatam.org)

హిందూ ధర్మానికి రామాయణం, భారతం, భాగవతం మూల స్తంభాలు. శ్రీమద్భాగవతాన్ని వ్యాసభగవానులు సంస్కృతంలో ప్రసాదించగా, బమ్మెఱ పోతనామాత్యులవారు విశిష్టగ్రంథంగా, ఈ పుణ్యపేటిని తెలుగువారికి ప్రసాదించారు. ఇది దేశభాషలలో తొలి సమగ్ర భాగవతం, పండితపామరులకు నచ్చే పురాణం, లలిత మనోజ్ఞ భరితమై అలరించే అద్భుత గ్రంథం. అమృతం కురిపించే నవసహస్రాధిక పద్యాల సమాహారం. మధుర మహిమాన్విత భాగవతంలో 'మధురాధిపతే రఖిలం మధురం'.

గ్రంథాలు ఒకనాడు మానవమస్తిష్కాలలో, తరువాత తాళపత్ర గ్రంథాలుగా, కాలక్రమేణా, రాతప్రతులుగా, సాంకేతిక అభివృద్ధితో ముద్రణ గ్రంథాలుగా, ముద్రణరహిత గ్రంథాలుగా రూపాంతరం చెందాయి, చెందుతున్నాయి. నవీన సాంకేతిక విస్ఫోటనా భాగాలైన గణని (కంప్యూటరు), జాలిక (ఇంటర్ నెట్), చరణి (మొబైల్) వంటి మాధ్యమాలలో మహాగ్రంథాలు అరచేత ఇముడుతున్నాయి.

లక్ష్యము

: Telugubhagavatam.org జాలగూడు (వెబ్ పోర్టల్)

భాగవత సందేశాలను విశ్వవ్యాప్తం చేయటము.

ఈ తపస్సు2007లో ఆరంభించారు.

కార్యక్రమాలు :

ఇంటర్ నెట్, మొబైల్ మాధ్యమాలలో భాగవత సేవ.

- ❖ నెట్టింటి భాగవతం/భాగవత మకరందం – జాలిక (ఇంటర్ నెట్) మాధ్యమం. భాగవతం సంపూర్ణ, సమగ్ర ప్రతిపదార్థాలు, భావాలు, వినుకరులతో.
- ❖ పోతన ఇతర రచనలు మూడు, మూల సంస్కృత భాగవతం తెలుగు లిపిలో, సంబంధ గ్రంథాలు, రచనలు, వ్యాసాలు, పరిశోధన పత్రాలు అనేకం అందుబాటు.

- ❖ రోజుకి వెయ్యి మందికి పైగా వీక్షిస్తున్నారు. అంతర్జాలంలో, ఇలా ఏకాస్థితంగా, సమగ్రంగా ఒక రచనలకు చెందిన ప్రప్రథమ జాలగూడు, తెలుగులో ఆధ్యాత్మిక పాఠ్యం అందించే జాలగూడులలో అత్యంత పెద్దది. ఈ ప్రయత్నం ప్రప్రథమం, వినూత్నం.

- చరవాణి భాగవతం/అరచేతిలో సంపూర్ణ భాగవతం – చరణి (మొబైల్) మాధ్యమం. ఆండ్రాయిడ్/ఆపిల్ విధానాలకు అనుకూలం. ఆప్ బుక్(చరణి గ్రంథం). అధిక జనాదరణ. సుమారు లక్ష దిగుమతులు. ఒక తెలుగులో సంపూర్ణంగా వచ్చిన యథామూల, ప్రతిపదార్థాలు, భావాలు, ఆడియో(శ్రవణ)గా సహేతంగా ప్రప్రథమంగా వచ్చినది.
- శ్రవణభాగవతం – యూ ట్యూబ్ ఛానలులో భాగవత పద్యాలు అన్నీ వినవచ్చు.
- దర్శన భాగవతం –భాగవత మూలపాఠం చెప్తూ, సంబంధ చిత్రాలు, పటాలు, పట్టికలతో విశ్లేషణాత్మక వినూత్న విధాన ప్రవచనం.
- వికీ పోతన తెలుగు భాగవతం.'తెలుగు వికీ సోర్సు' జాలగూడు. పోతన భాగవతం, వీరభద్రవిజయం, నారాయణశతకం, భోగినీదండకం, తెలుగు లిపిలో నారాయణీయం ప్రచురణ, నిర్వహణ.
- స్క్రిబ్డ్ భాగవత స్కంధాలు ప్రచురణ, "భాగవత రత్న" పురస్కారాల ప్రదానం. భాగవత జయంతి ఉత్సవాలు, దేశ, విదేశాలలో, స్థానికుల సహకారంతో పండుగలు.
- ఫేస్ బుక్, వాట్సప్, బ్లాగ్ వంటి మాధ్యమాలలో పద్యాల ప్రచారం. పారాయణల నిర్వహణ.

నూతన ఆవిష్కరణ

భాగవత మథనం చేయలేకపోయినా, తెలుగు భాగవతసారం అందిస్తే,అదొక పరిచయగ్రంథంగా, ఎందరికో పుణ్యం, విజ్ఞానం, మాధుర్యం, అందిస్తుందని భక్తులు సూచించారు. ఆ అమూల్య సూచనలకు క్రియారూపం ఇది.

భాగవతస్కంధాలకు డిజిటల్ పుస్తకరూపకల్పన.
అష్టమ స్కంధముతో ఆరంభం.
అక్కడక్కడ అంతరార్థాలు, విశేషాలు.

తెలుగు భాగవతం - ముఖ్య సంఘటనలు

2008-10-12 :
ఆరంభము– పోతన ఆంధ్ర మహా భాగవతం యూనీకోడీకరణ

2013-08-17
ఆవిష్కరణ – శ్రీకృష్ణాష్టమీ పండుగ సందర్భము
telugubhagavatam.org హైదరాబాదు,
చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రాంగణం

2016-11-05
ఆవిష్కరణ – చరణి గ్రంథం (మొబైలు బుక్కు) ఆంధ్రాయిడు,
ఐ-ఫోనులకుtelugubhagavatmబెంగళూరు,
వినాయకుని ఆలయ ప్రాంగణం
2017-08-14 :
ఆరంభం- "భాగవతరత్న" పురస్కార ప్రదానాలు,
తృతీయ వార్షికోత్సవం. పిహెచ్.డి.పరిశోధనా కృషికి,
గ్రహీత డా. వీపూరి వేంకటేశ్వర్లు గారు.

స్పందనలు

"ఏమని వర్ణింతునో?! నా నోట మాట రాక మనసు మూగ బోయింది."
అమ్మా శ్రీధర్
"పోతనామాత్యుని భాగవతం, కలగూరగంపా! రత్నాభరణాల ఖజానానా!"
"ఈకోవెలలో . . ఎన్నో . . . ఎన్నెన్నో . . . మరెన్నో!"

ఓలేటి వేంకట సుబ్బారావు

"తెలుగులో భాగవతం అందించినందుకు ఋణపడి ఉంటాం" మద్దులూరిశ్రీనివాసరావు,
ఎస్సెల్లార్ మెటలిక్స్ లిమిటెడ్

"ఈ బహుపవిత్ర పురాణాన్ని అందరికి సులువుగా చేరువలో ఉండేలా చేసిన మీకు, మీ బృందానికి అనేక ధన్యవాదాలు.".

ఎక్కిరాల వి.టి. ఆచార్యులు

"పరమాద్భుతం!".. ఆస్ట్రేలియా సిరిమల్లె పత్రిక
"తెలుగుభాగవతం జాలగూడు చూసి ఎంతో సంతోషించాను. ధన్యవాదాలు." రాళ్ళబండి శ్రీరిషి, అమెరికా
"ఆంధ్రులు అందరికీ, అనేక తరాల పాటుప్రయోజనకరమైన.
ఈ **తెలుగుభాగవతమ్.ఆర్గ్** *జాలగూడునకు కృతజ్ఞతలు చెప్పడానికి నా వద్ద ఉన్న మాటలు సరిపోవటంలేదు."*

దేశిక లక్ష్మీ నరసింహం, M.D, అమెరికా

"జాలగూడే కాకుండా **చరణి భాగవతం** *అందించడం చాలా బాగుందండి. ముఖ్యంగా నాలాంటి పరిశోధకులకు ఉపయుక్తంగా ఉంది....మీ కృషికి ధన్యవాదములు."*

ఆర్.వి.ఆర్ .శర్మ, ఏచూరి సంగీత

*"**తెలుగుభాగవతం.ఆర్గ్.**.అద్భుతం, దార్శనీయం, జ్ఞానమయం. సాంకేతికత సహాయంతో సనాతనాన్ని జ్ఞానశోధకులకు అందిస్తున్నందులకు మరోసారి ..."* వంశీకృష్ణ

"ఎప్పుడో చిన్నప్పుడు బడిలో, కళాశాలలోచదువుకున్న పద్యాలను మరల చూడటంతో ఎంతో సంతోషం కలిగింది"...

.ఆచార్య అండె మురళీ వరప్రసాద్,
విశ్రాంత డి.ఆర్.డి.ఓ. శాస్త్రజ్ఞులు.

భాగవత భక్తులందరినీ నల్లనయ్య చల్లనిచూపులతో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సత్సంతానంతో అనుగ్రహించు గాక.

సర్వం శ్రీకృష్ణార్పణ మస్తు..

.....

భూమిక : అష్టమ స్కంధము

భాగవతం: చదువుకుందాం; బాగుపడదాం అందరం :
బమ్మెర పోతన వ్రాసిన శ్రీ మహాభాగవతం "తెలుగువారి దైనందిన జీవితంతో పెనవేసుకుపోయిన కావ్యం". అని ఇరివెంటి కృష్ణమూర్తి గారు చక్కగా వెల్లడించారు. కరుణశ్రీ గారి మాటలలో చెప్పాలంటే మనకు పోతన గారి భాగవతం లభించటం జన్మజన్మల పుణ్యవిశేషం.

గుడులు కట్టించె కంచర్ల గోపరాజు
రాగములు కూర్చె కాకర్ల త్యాగరాజు
పుణ్యకృతి చెప్పె బమ్మెర పోతరాజు
రాజులీ ముప్వురును భక్తిరాజ్యమునకు.

సహజకవి, పోతన భాగవతంలో తత్వాన్ని నవరసపరిపూర్ణం చేసి అందించారు. ఈ భాగవత తత్వానికి హృదయం వంటిది అష్టమ స్కంధం. తెలుగు వారు గుండెలలో ఆప్యాయంగా దాచుకున్న అనేక ఘట్టాలు గజేంద్రమోక్షం, సముద్రమధనం, వామనావతారం, త్రివిక్రమా వతారం, మత్స్యావతారము అందంగా అమర్చబడ్డాయి. మధుర నాద

పరిపూర్ణ ఛంధస్సుతో రమణీయ పదాలు కూర్చిన పద్యం అనే ఏకత్వంలో అనేకభావాలు స్ఫురింపజేసారు కవితా బ్రహ్మ పోతన.

నీరాట వనాటములకు
బోరాటం బెట్లు కలిగెఁ? బురుషోత్తముచే
నారాట మెట్లు మానెను
ఘోరాటవిలోని భద్ర కుంజరమునకున్.

ఈ చమత్కారపద్యంతో ఆరంభమైన గజేంద్రమోక్షమనే అమృతాసాగరంలో ఎంత ఆస్వాదించినా దాహం తీరదు.

ఎవ్వనిచే జనించు జగ; మెవ్వని లోపల నుండు లీనమై;
యెవ్వనియందుడిందుఁ,బరమేశ్వరుఁడెవ్వఁడు; మూలకారణం
బెవ్వఁ;డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు; సర్వముఁ దానయైనవాఁ
డెవ్వఁడు; వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్.

కలఁ డందురు దీనుల యెడఁ
గలఁ డందురు పరమయోగి గణముల పాలం
గలఁ డందు రన్నిదిశలను
గలఁడు కలం డనెడి వాఁడు గలఁడో లేఁడో?

లావొక్కింతయు లేదు; ధైర్యము విలోలంబయ్యె; బ్రాణంబులున్
తావుల్ దప్పెను;మూర్ఛవచ్చె,దనువున్ డస్సెన్; శ్రమంబయ్యెడిన్;
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ; మన్నింపందగున్ దీనునిన్;
రావే! యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!

సిరికిం జెప్పఁడు; శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁ; డే
పరివారంబునుఁ జీరఁడభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తర ధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు; వివాదప్రోత్థితశ్రీకుచో
పరి చేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.

పాల సముద్రం చిలికినట్లు పదాలను చిలికి వెన్నదీసి ఆరగించ మని అందించిన సముద్రమధన ఘట్టపు సుధలు రుచికి
విడు విడుఁ డని ఫణి పలుకఁగఁ
గడుభరమున మొదలఁ గుదురు గలుగమి గెడఁవై
బుడబుడ రవమున నఖిలము
వడవడ వడఁకఁగ మహాద్రి వనధి మునింగెన్.
మ్రింగెడి వాఁడు విభుం డని
మ్రింగెడిదియు గరళ మనియు మే లని ప్రజకున్
మ్రింగు మనె సర్వమంగళ
మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో?

భక్తిరసావిష్కరణలో, కవితామాధుర్యంలో వితరణశీలి బలిచక్రవర్తి చరిత్ర, వామనావతారఘట్టాలు చిన్నవి కావు. ఎన్నెన్నో తేనెలూరు తేట తేట పద్యాలు. ఉదాహరణల :

వరచేలంబులొ మాడలో ఫలములో వన్యంబులో గోవులో
హరులో రత్నములో రథంబులో విమృష్టాన్నంబులో కన్యలో
కరులో కాంచనమో నికేతనములో గ్రామంబులో భూములో
ధరణీ ఖండమొ కాక యే మడిగెదో ధాత్రీసురేంద్రోత్తమా!

ఇంతింతై, వటుఁడింతయై మఱియుఁ దా నింతై నభోవీథిపై

నంతై తోయదమండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై.

మధురాతి మధురమై, మహామహితాత్మకమైన యీ అష్టమ స్కంధంలో పోతన కవితా పటుత్వం త్రివిక్రమ రూపం ధరించింది. ఈ పరమాద్భుత స్కంధంలో 14 ఛందో ప్రక్రియలతో ప్రయోగించిన 745 పద్యగద్యల వ్యాప్తి ఉన్నది.
వృత్తాల వారీ పద్యాలు
పద్యగద్యములు.745 +తేసీతో=52 +ఆసీతో.41;
మొత్తం = 838. వచనం=236, కందములు=217, మత్తేభం=70, సీసపద్యాలు=93,తేటగీతిసీసంతో=52,
చంపకమాల=5,ఉత్పలమాల=9, మాలిని=1ఆటవెలది.=67,తేటగీతి=7,శార్దూలం=33,
మత్తకోకిల=6,ఆటవెలదిసీసంతో=41, గద్యం=1,

స్వీయపరిచయం

మాది తూర్పు గోదావరి జిల్లా, ఊలపల్లి గ్రామము. మా తాతగారు చిట్టిరాజుగారు. వారి కుమారుడు, మానాన్నగారు అచ్యుత రామయ్య గారు. విశాఖపట్నం జిల్లా శ్రీరామపురం గ్రామస్థులు సాంబశివరావుగారి కుమార్తె వేంకట రత్నంగారు మా మాతృమూర్తి.
ఈ దంపతులు బహు సాత్వికులు, ఉన్నత సంస్కారులు. ఆ దంపతులకు మేము ఇద్దరు కొడుకులం. మా అన్నయ్య లక్ష్మీనారాయణ దేవ్. నేను సాంబశివరావును. మాకు సోదరీమణులు ఇద్దరు, శేషకుమారి, లక్ష్మి.
మా తల్లి దండ్రులు, అన్నగారు నన్ను ఎంతో గారాబంగా పెంచారు. ఆటపాటల్లో చదువులలో చురుకును గుర్తించి, నన్ను అనుగ్రహించి రాయవరం గ్రామస్థులు పూజారి తాతగారు పురాణ, ఆధ్యాత్మిక గ్రంథాల పఠనం పరిచయం చేసారు.
నాకు ఇవటూరి సూర్య భాస్కరరావు, సూర్యకాంతం దంపతుల పుత్రిక సౌ.ల. లలితతో వివాహమైంది. మా దంపతులకు ఫణి కిరణ్, భాస్కర కిరణ్ అనే కుమారులు కలిగారు. నేను వృత్తిరీత్యా విద్యుత్తుశాఖ ఇంజనీరుగా క్రీ.శ. 2007లో పదవీవిరమణ చేసాక, భాగవత గణనాధ్యాయం చేపట్టాను. దానిలో భాగం ఈ తెలుగుభాగవతం.ఆర్గ్. మున్నగు రూపాలలో పోతన భాగవతాన్ని అంతర్జాలం, చరణిమాధ్యమాలలో అందించే అదృష్టాన్ని భగవంతుడు మా కుటుంబానికి కలిగించాడు.

కృతజ్ఞతలు

ఈ ఘనత భాగవత సంకలనకు అవసరమైన బహుముఖ సహాయాలు, సాధనసంపత్తులు సమకూర్చి, ప్రోత్సహించిన రచయితలు, ప్రచురణకర్తలు, అంతర్జాల సంస్థలు, భాగవత బంధువులు, ఆత్మీయమిత్రులు, భక్తవరేణ్యులకు చెందుతుంది. మేము నిమిత్తమాత్రులము. ఎందరో మహానుభావులు. అందరికీ కృతజ్ఞతలు.

ఊలపల్లి సాంబశివరావు,
భాగవతగణనాధ్యాయి.

విషయ సూచిక

ఉపోద్ఘాతము – 1
స్వాయంభువాది చరిత్ర – 1
స్వాయంభువ మనువు.1. చరిత్ర – 2
స్వారోచిష మనువు.2. చరిత్ర – 3
ఉత్తమ మనువు.3. చరిత్ర –3
తామస మనువు.4. చరిత్ర –3
గజేంద్రమోక్షణ కథా ప్రారంభము –4
త్రికూటపర్వత వర్ణన –7
త్రికూట మందలి గజములు –10
గజేంద్రుని వర్ణన –13
గజేంద్రుని కొలను ప్రవేశము –15
కరి మకరుల యుద్ధము –17
గజేంద్రుని దీనాలాపములు –19
విష్ణువు ఆగమనము –25
గజేంద్ర రక్షణము –29
గజేంద్రుని పూర్వజన్మ కథ –31
లక్ష్మీ నారాయణ సంభాషణ –32
గజేంద్రమోక్షణ కథా ఫలశ్రుతి –32
రైవతమనువు.5. చరిత్ర –33
చాక్షుస మనువు.6. చరిత్ర –34
సముద్రమథన కథా ప్రారంభం – 34
సురలు బ్రహ్మ శరణు జొచ్చుట – 34
బ్రహ్మాదుల హరిస్తుతి –35
విశ్వగర్భుని ఆవిర్భావము –36
విష్ణుని అనుగ్రహవచనము –37
సురాసురల స్నేహము –38
మంథరగిరిని తెచ్చుట –39
సముద్ర మథన యత్నము – 40
కూర్మావతారము –42
సముద్రమథన వర్ణన –44
కాలకూట విషము పుట్టుట –45
శివుని గరళ భక్షణకై వేడుట –46
గరళ భక్షణము –48
సురభి ఆవిర్భావము –51
ఉచ్చైశ్రవ ఆవిర్భవము –51
ఐరావత ఆవిర్భావము –52
కల్పవృక్ష ఆవిర్భావము –52
అప్సరల ఆవిర్భావము –53
లక్ష్మీదేవి పుట్టుట –53
లక్ష్మీదేవి హరిని వరించుట –55
వారుణి ఆవిర్భావము –57
ధన్వంతర్యామృత జననము –58
జగన్మోహిని వర్ణన –59
అమృతము పంచుట –61
రాహువు వృత్తాంతము –62

సురాసుర యుద్ధము –63
బలి ప్రతాపము –66
హరి అసురుల శిక్షించుట –67
జంభాసురుని వృత్తాంతము –68
నముచి వృత్తాంతము –69
హరి హర సల్లాపాది –71
జగనమోహిని కథ –72
వైవస్వత మనువు.7. చరిత్ర –76
సూర్యసావర్ణి మనువు.8. చరిత్ర – 77
దక్షసావర్ణి మనువు.9. చరిత్ర – 77
బ్రహ్మసావర్ణి మనువు.10. చరిత్ర –78
ధర్మసావర్ణి మనువు.11. చరిత్ర – 78
భద్రసావర్ణి మనువు.12. చరిత్ర –78
దేవసావర్ణి మనువు.13. చరిత్ర –78
ఇంద్రసావర్ణి మనువు.14. చరిత్ర –79
బలి యుద్ధ యాత్ర –80
స్వర్గ వర్ణనము –81
దుర్భర దానవ ప్రతాపము –86
బృహస్పతి మంత్రాంగము –87
అదితి కశ్యపుల సంభాషణ –88
పయోభక్షణ వ్రతము –89
వామనుడు గర్భస్తు డగుట –91
గర్భస్థ వామనుని స్తుతించుట –92
వామనుడు అవతరించుట –92
వామనుడు విప్రులతో సంభాషణ –94
వామనుని భిక్షాగమనము –94
వామనుడు యజ్ఞవాటిక చేరుట –95
వామనుని భిక్ష కోరు మనుట –97
వామనుని సమాధానము –98
వామనుడు దాన మడుగుట –99
శుక్ర బలి సంవాదము –101
బలి దాన నిర్ణయము –104
వామనునికి దాన మిచ్చుట –105
త్రివిక్రమ స్ఫురణం –106
దానవులు వామనునిపై దాడి –110
బలిని బంధించుట -111
ప్రహ్లాదాగమనము –113
హిరణ్యగర్భాగమనము –114
రాక్షసుల సుతల గమనము –115
బలియజ్ఞమును విస్తరించుట –116
మత్స్యావతార కథా ప్రారంభం –118
మీనావతారుని ఆనతి –121
కల్పాంత వర్ణన –121
గురుపాఠీన విహరణము –122
కడలిలో నావను గాచుట –123
ప్రళయావసాన వర్ణన –124
మత్స్యావతార కథా ఫలశృతి –125
పూర్ణి –58

X

పోతనామాత్య భాగవత పరిచయము

అష్టమ స్కంధము

ఉపోద్ఘాతము

1: మంగళకరమైన పేరు కలవాడా! మేఘం వంటి కాంతివంతమైన దేహం కలవాడా! రాజులలో బహు గొప్ప వాడా! ఆఖిలలోకాలలో అందమైన వాడా! స్త్రీలకు మన్మథుని వంటివాడా! బహుగంభీరమైన వాడా! సుగుణాలనే సంపదలకు నిలయమైన వాడా! దశరథకుమారుడైన శ్రీ రామచంద్రా! అవధరించు!2: గొప్ప గుణములు కలిగిన ఆ మునీశ్వరులతో అఖిల పురాణాలను వివరించటంలో నేర్పరి అయిన సూతమహర్షి ఇలా అన్నాడు. "ప్రాయోపవేశం చేసి ఉన్న పరీక్షిత్తు మహారాజు శుకమహర్షిని చూసి"

స్వాయంభువాది చరిత్ర

3:"స్వాయంభువ మనువు వంశాన్ని గురించి, ఆ కాలంలోని జాతి ధర్మాలు, కట్టుబాట్ల గురించి. మానవులు, రాక్షసులు, దేవతలు అందరి పుట్టుకలు, బ్రహ్మలు జనించటం గురించి విన్నాను. కానీ...4: ఆ మనువులు ఎవరు? భగవంతుడైన విష్ణుమూర్తి, ఆయా మనువుల కాలంలో ఎందుకు జన్మించాడు? వర్తమాన మనువుకాలంలో ఏమిచేస్తున్నాడు? గతించిన మన్వంతరాలలోఎలాచరించాడు? భవిష్యత్తు మన్వంతరాలలో ఎలావర్తిస్తాడు? పూర్వం పెద్దలు ఏమని చెప్పారు? దయచేసి నాకు వివరంగా తెలియ చెప్పు."5: అని పరీక్షిత్తు మహారాజు కోరగా, శుక ముని ఇలా చెప్పసాగాడు.

6:"ఓ రాజా పరీక్షిత్తూ! ఈ కల్పంలో పద్నాలుగురు మనువులలోనూ ఆరుగురు మనువులు కీర్తిశేషులు అయ్యారు. లోకాలు, జనులు సృష్టి విధానాలు గురించి వరుసగా అన్నీ చెప్పాను. (ప్రస్తుతం ఏడవది అయిన వైవస్వత మన్వంతరం నడుస్తున్నది)

స్వాయంభువ మనువు-1. చరిత్ర

7:విను పరీక్షిన్మహారాజా! మొదటి మనువు స్వాయంభువుడు. అతనికి ఇరువురు కుమార్తెలు. వారి పేర్లు దేవహూతి, ఆకూతి. విష్ణుమూర్తి లోకాలకు ధర్మాన్నీ, జ్ఞానాన్నీ బోధించడం కోసం దేవహూతియందు కర్దమునికి కపిలుడు. ఆకూతియందు రుచిప్రజాపతికి యజ్ఞుడు అనే పేర్లతో అవతరించాడు. కపిలుడి చరిత్ర ఇంతకు ముందు చెప్పాను. ఇక యజ్ఞుని చరిత్ర చెప్తాను.8: ఓ రాజా! శతరూప భర్త అయిన స్వాయంభువ మనువు కామ భోగాల యందు విరక్తుడై, రాజ్య భారాన్నీ విడిచిపెట్టి, తన భార్య శతరూపతోపాటు, అడవికి వెళ్ళాడు. సునందా నది దగ్గర, పవిత్రమైన నియమ నిష్ఠలతో,
మౌనంగా ఒంటి కాలి మీద నిలబడి, నూరేళ్లు విశ్వవిఖ్యాతమైన తపస్సు చేసాడు.9: ఈ విధంగా తపస్సు చేస్తూ, స్వాయంభువ మనువు తన మనసులో భగవంతుని ఇలా ప్రార్థించాడు.10: "ఎవడైతే సృష్టి వలన చైతన్యం పొందకుండా, తన చైతన్యం వలన సృష్టి చేస్తాడో, లోకాలు నిద్రిస్తుండగా తాను మేల్కొని బ్రహ్మాండాన్ని తెలుసుకుంటాడో, తనకు తానే ఆధారమై ఉండి సమస్తమూ తానే అయి ఉంటాడో, తన రూపం కనబడకుండా తన ప్రభావాన్ని రూపొందిస్తాడో, తన సంకల్పానికి ఎదురు లేనివాడు ఎవడో, ఆది మధ్యాంతాలు లేకుండా అన్నిచోట్లా చేరి ఉంటాడో,తన మహిమ చూపుతూ శాశ్వతుడై విశ్వరూపుడుగా వర్ధిల్లుతాడో" అంటూ స్తుతిస్తూ...11: ఇంకా ఇలా ప్రార్థించాడు. "అహంకారరహితుడో, సంపూర్ణ బుద్ధివికాసము గలవాడో, ఆశలు లేకుండా పరిపూర్ణుడై ఉంటాడో, ఇతరుల ప్రేరణ లేకుండా ఇతరులకు బోధిస్తుంటాడో, తన దారి వదలకుండా సకల ధర్మాలకూ కారణమై ఉంటాడో ఆ పరమేశ్వరుడికి నమస్కారం చేస్తున్నాను." ఈ విధంగా ఉపనిషత్తుల ధర్మాన్ని ప్రకటిస్తూ ధ్యానంలో ఉన్న స్వాయంభువ మనువును చూసి...12: ధ్యానంలో నిమగ్నమై ఉన్న స్వాయంభువ మనువును భక్షించడానికి రాక్షసులు ప్రయత్నించారు. వారిని విష్ణుమూర్తి అవతారం అయిన యజ్ఞుడు తన

చక్రాయుధంతో సంహరించాడు. అది చూసి దేవతలు అందరూ ఆయనను పొగిడారు.13: పరీక్షిత్తూ! ఇది ప్రథమ మన్వంతరం సంగతి, ఇక రెండవ మన్వంతరం విషయం చెప్తాను విను.

స్వారోచిషమనువు-2 చరిత్ర

14: రెండవ మనువు స్వారోచిషుడు అగ్ని కుమారుడు. ఆ మనువు గొప్ప పుత్రులు ద్యుమంతుడు, సుషేణుడు, రోచిష్మంతుడు, మొదలైనవారు మిక్కిలి ప్రసిద్ధులై భూమిని పరిపాలించారు. ఆ మన్వంతరంలో ఇంద్రుడు రోచనుడు. దేవతలు, తుషితులు మొదలైన వారు. సప్తర్షులు ఊర్జస్తంబుడు మొదలైనవారు. విభుడు అను పేరుతో విష్ణువు వేదశిరుడు అను బ్రాహ్మణుడు అతని భార్య తుషిత లందు అవతరించాడు. ఆ అవతారంలో కుమార బ్రహ్మచారియై ఎనభై ఎనిమిదివేల మహా మునుల అనుగ్రహంతో వ్రతదీక్షాపరుడు అయ్యాడు.15: ఆ తరువాత..

ఉత్తమ మనువు-3

16: ఓ పరీక్షిన్మహారాజా! మూడవ మనువు "ఉత్తముడు". ఇతడు ప్రియవ్రతుని కొడుకు. ఇతను భూలోకం అంతటినీ మూడవ మనువుగా పాలించాడు. అతని పుత్రులు పవనుడు, సృంజయుడు, యజ్ఞహోత్రుడు మొదలైన వారు, మిక్కిలి గుణవంతులు. ఆ మన్వంతరంలో సప్తర్షులు వశిష్టుని కొడుకులైన ప్రమథుడు మొదలైనవారు. సత్యజిత్తు అను వాడు దేవతల ప్రభువైన దేవేంద్రుడు. దేవతలు సత్యులూ, భద్రులు మొదలైనవారు, విష్ణు సత్యసేనుడు అను పేరుతో ధర్మజుడు సూనృతులకు కుమారుడిగా అవతారం ఎత్తాడు. అతను సత్యజిత్తుకు చెలికాడై లోకం మెచ్చుకునేలా సత్య నిష్ఠతో దుర్మార్గులు అయిన యక్ష రాక్షసులను శిక్షించాడు."

తామసమనువు-4. చరిత్ర

17: శుకమహర్షి ఇంకా ఇలా చెప్తున్నారు..."నాలుగో మనువు కాలం గురించి వివరిస్తాను పరీక్షిన్మహారాజా!

రహస్యార్థం:

మనువులు 14 మంది. ఒక్కొక్క మనువు పరిపాలించే కాలాన్ని మన్వంతరం అంటారు. ఒక మన్వంతరం అంటే 71 మహాయుగాలు. వాటిలో ప్రస్తుతం జరుగుతున్నది వైవస్వత మన్వంతరం. గజేంద్రమోక్షం జరిగిన కాలం తామస మన్వంతరం. 14గురు మనువులలో ఈ తామసుడు 4వ వాడు. వైవస్వతుడు 7వ వాడు. కృత, ద్వాపర, త్రేత, కలియుగాలకి యుగధర్మం ఎలా ఉంటుందో, అలాగే స్వాయంభువాది 14 మన్వంతరాలకు ఆయా ధర్మాలు ఉంటాయేమో. మరి ప్రభవాది 60 సంవత్సరాలకు కూడ సంవత్సర ధర్మాలు ఉంటాయేమో!

18 : ఓ మహారాజా! నాలుగో మనువు 'తామసుడు'. ఇతడు ఉత్తముడి తమ్ముడు. అతని కొడుకులు కేతువు, వృషుడు, నరుడు, ఖ్యాతి మొదలైన వారు పదిమంది. వారు బలవంతులైన రాజులు. ఆ మన్వంతరంలో సత్యకులు, హరులు, వీరులు మొదలైనవారు దేవతలు. త్రిశిఖుడు అనేవాడు దేవేంద్రుడు. జ్యోతిర్వ్యోముడు మొదలైన వారు సప్తఋషులు. విష్ణుమూర్తి హరిమేధునకు పురంధ్రి అయిన హరిణికి 'హరి' అనే పేరుతో అవతరించాడు. దయాసముద్రుడు అఖిలలోకేశ్వరుడు మొసలినోటికి చిక్కిన గజేంద్రుడిని ప్రాణాపాయం తొలగించి రక్షించిన వాడు ఆ శ్రీహరి." అని చెప్పగా పరీక్షిన్మహారాజు శుకయోగిని ఇలా అడిగాడు.

రహస్యార్థం:

క్షరములకు అక్షరములకు అతీతమైనవాడు పరమాత్ముని ఉత్తమ పురుషుడు అని అంటారు. అతని సోదరుడు అంటే మాయా ప్రతిబింబుడు అయిన ఈశ్వరుడు. అతని వంశంలో ముఖ్యమైన వాడు అయి హరి, వాసుదేవ వ్యూహాత్మకుడు అయిన శ్రీమహావిష్ణువు. అట్టి విష్ణువు గజేంద్రుడు అనే జీవుడిని కామం అనే మొసలి వలన అయ్యే రాగహేతుకం అయిన జన్మ పరంపరల నుండి విముక్తుడిని చేసి రక్షించాడు, అని చక్కని పలుకులతో శుకుడు చెప్పగా, భూలోకంలో ముఖ్యుడు అయిన పరీక్షిత్తు ఇలా అన్నాడు.

గజేంద్రమోక్షణ కథా ప్రారంభము

19:"నీటిలో బతుకుతుంది మొసలి. అడవిలో తిరుగుతుంది ఏనుగు. వాటిలో అది భద్రగజం. అయితే ఆ రెంటికి అసలు పోరాటం ఎందుకు జరిగింది? ఎలా జరిగింది? అలా జరిగిన ఆ పోరాటంలో పురుషోత్తముడైన శ్రీహరి ఆ గజేంద్రుడి ఆరాటాన్ని ఎలా పోగొట్టి కాపాడాడు?


MR. ELEPHANT RINGING THE BELL FOR DINNER.



19. నీరాట వనాటములకుఁ
బోరాటం బెట్లు కలిగెఁ? బురుషోత్తముచే
నారాట మెట్లు మానెను?
ఘోరాటవిలోని భద్ర కుంజరమునకున్.

ప్రత్యేకతలు:

1. కంద పద్యాలకు ప్రతిపంక్తిలో రెండో అక్షరం ఒకటే రావాలి. దీనిని ప్రాస అంటారు. ఈ పద్యంలో చూడండి నాలుగు పాదాల్లోనూ 'రాట' వచ్చింది.

2. ఈ పద్యంలో యమకాలంకారం ఎంత అందంగా అలంకరించారో చూడండి. రాట 5 సార్లు ప్రయోగించారు.

3. సందేహం అడుగుతున్నాడు కదా, అందుకని, పద్యం చదువుతుంటేనే ఏదో ఊగిసలాటలా ఉందనిపించేలా ఇటూ అటూ ఊగుతునట్లు వ్రాసారు చూసారా? 4. మన గజరాజు, ఏనుగుల రకాలలో, ఉత్తమమైన భద్రగజాలకు రాజట.

వ్యాఖ్య :

భాగవతం బహుళార్థ సాధక గ్రంథం. అందులో పంచరత్న ఘట్టాలలో ఒకటైన గజేంద్రమోక్షంలోని ఎత్తుగడ పద్యం ఇది. చక్కటి ఏకేశ్వరోపాసనతో కూడుకున్న ఘట్టమిది. మంచి ప్రశ్న వేస్తే మంచి సమాధానం వస్తుంది. ఇంత మంచి ప్రశ్న పరీక్షిత్తు వేసాడు కనుకనే శుకుని నుండి గజేంద్ర మోక్షణం అనే సుధ జాలువారింది. ఇక్కడ పోతనగారి చమత్కారం ఎంతగానో ప్రకాశించింది. ఇందులో త్రిప్రాసం ఉంది "నీరాట, పోరాట, నారాట, ఘోరాట" అని. భాషకి అలంకారాలు అద్భుతమైన సౌందర్యాన్ని చేకూరుస్తాయి. రెండు లేక అంత కంటే ఎక్కువ అక్షరాలు ఉన్న పదాలు మరల మరల వస్తూ అర్థ భేదం కలిగి ఉంటే అది యమకాలంకారం. ఛేకాను ప్రాసంలో పదాల మధ్య ఎడం ఉండాలి. యమకంలో ఎడం ఉండటం లేకపోవడం అనే భేదం లేదు. ఇక్కడ పోతనగారు ప్రయోగించిన యమకం అనే అలంకారం అమిత అందాన్ని ఇచ్చింది. యమకానికి చక్కటి ఉదాహరణ ఇదే అని చెప్పవచ్చు. ఏనుగులు భద్రం, మందం, మృగం అని మూడు రకాలు. వాటిలో భద్రగజాన్ని దైవ కార్యాదులలో వాడతారు. అట్టి కోటి భద్రగజాలకు రాజు మన కథానాయకుడు గజేంద్రుడు. అఖిలలోకేశ్వరుడు, దయా సాగరుడైన శ్రీహరి మొసలి నోటికి చిక్కిన ఒక గజరాజుని ప్రాణభయం నుండి కాపాడి రక్షించాడు.

ఈ అద్భుత ఘట్టంలోని "ఎవ్వనిచే జనించు..." మున్నగు పద్యాలన్నీ అమృతగుళికలే కదా.

రహస్యార్థం: *నీరు అనగా చిత్స్వరూపి, బుద్ధి. (ప్రమాణం చిత్స్వరూపం, సర్వ వ్యాపకుడు అయిన విష్ణువే ద్రవ (జల) రూపం అయి నిస్సంశయంగా గంగారూపం పొందుతున్నాడు. అట్టి బుద్ధి రూపమే సంకల్ప రూపం పొందుతుంది. సంకల్పం మనస్సు ఒకటే. అది నీరాటము. సంకల్పం*

నుండి పుట్టేది కామము. వనమునకు వ్యుత్పత్తి "వన్యతే సేవ్యతే ఇతి వనం" అనగా జీవులచే సేవింపబడునది వనం. అలా కామం వనాటం. అంటే ఆత్మ యొక్క కళ అనే ప్రతిబింబం జీవుడు కదా! ఆ నీరాటమునకూ వనాటం అయిన కామమునకు సంసారం అనే ఘోర అడవిలో కలహం ఎలా కలిగింది? అని ప్రశ్న. పురుషోత్తముడు అయిన విష్ణువు పోరు అనే భవదుఃఖాన్ని ఎలా తొలగించాడని ప్రశ్న.

20: ఓ మునీంద్రా! నాకు ఈ గజేంద్రమోక్షణం కథ వినాలని కుతూహలంగా ఉంది. చెప్పు. చెవులకు పెద్దపండుగలా మనస్సుకు ప్రీతి కలిగేలా వింటాను.

రహస్యార్థం:

ఈ కథాస్థితి, వృత్తాంతపు వివరాలు చెప్పమని అడుగుతున్నాడు. మామూలు కోరిక కాదు వేడుక పుట్టిందిట. పెనుపండువు అంటే మోక్షం కావాలట.

గమనిక:

ఇది అష్టమ స్కంధంలో పరీక్షించే పరీక్షిత్తు అడుగుతున్నాడు. చతుర్థ స్కంధంలో హరీ! భవ దుఃఖ పద్యం 4–18 7 గుర్తుకు వస్తోంది కదండి. దాని భావం గుర్తు చేసుకుందాం. "శ్రీహరీ! సంసార దుఃఖం అనే భయంకరమైన కార్చిచ్చుకు చిక్కి మా "మనస్సు అనే ఏనుగు తపించి దప్పిగొన్నది". ఇప్పుడు నీ పవిత్ర గాథలనే అమృత స్రవంతిలో మునిగి తేలి సంసార తాపాన్ని పోగొట్టుకున్నది. పరబ్రహ్మతో ఐక్యాన్ని సంపాదించిన ధీరునివలె ఆ నదిలో నుండి తిరిగి బయటికి రావటం లేదు."

21: పండితులు వర్ణించే విష్ణుని కథలను పుణ్యకథలు అంటారు. వాటిని పెద్దలు కడు సంతోషంతో వింటారు కదా."

రహస్యార్థం:

హరికి వ్యుత్పఅంత్తి "హర్తిర్హతి పాపాని" పాపాలను హరించు వాడు హరి. అతనే పరబ్రహ్మ. అతని కథలు అంటే బ్రహ్మజ్ఞానం. దానిని ఆకర్ణించుటకు తెలుసుకొనుటకు పెద్దలు, జ్ఞానులు సహజంగానే ఇష్టపడతారు.



22: ఈ విధంగా తక్షక భయంతో ప్రాయోపవేశం చేపట్టిన పరీక్షిత్తు వ్యాసుని కొడుకైన శుకుణ్ణి అడిగాడు" అని చెప్పి సూతమహర్షి శౌనకాది మహర్షులకు సంతోషంగా ఇలా చెప్పాడు. "శుకుడు పరీక్షిత్తునకు ఇలా చెప్పసాగాడు.

రహస్యార్థం:

తక్షకుడు సర్పం. సర్పం కాలానికి సంకేతం. తత్ క్షణ కాలానికి అంటే ఆయా తగిన కాలానికి లేదా సంకేతం అనుకోవచ్చు. తక్షకుడు కాటేయటం అంటే కాలం కాటేయటం కదా మరి. మృత్యువు అనివార్య మహారహస్యం. చేరిన వానికి కాని తెలియనిది. మరి పరీక్షిత్తు ప్రాయోప విష్టుడై ఉన్నాడు కనుక తెలిసికొన అర్హుడు కావచ్చు. ఆ పైన పరీక్షించి చూసిన వాడు కనుక అన్నిటికన్నా ఉత్తమతమము అయిన విష్ణు సాయుజ్యం అపేక్షించాడు. చిలుక మధుర ఫలాలను అందించటానికి సంకేతం. శుకుడు కావలసిన దారి వివరిస్తున్నాడు. రండి మనం కూడా విందాం. అర్హత వచ్చి వెళ్ళేటప్పుడు ముందే దారి గురించి తెలిసి ఉంటే ఎంతో సులువుగా ఉంటుంది. పరీక్షిత్తు ముముక్షువు, ప్రాయోపవిష్టుడు అయి ఉన్నాడు అనగా, జనన మరణాది వృత్తులను అభిలషించక, ఉద్యోగి కార్యాలయం కట్టేసే సమయం కోసం ఎదురు చూసే విధంగా ప్రారబ్ధక్షయ సమయం అయిన మరణాసన్నం కోసం ఎదురు చూస్తున్నాడు. అలా పరీక్షిత్తు అపేక్షిస్తున్న సద్యోముక్తి మార్గం అను విహంగమార్గ నిర్దేశకుడు అనుయాయి అయిన శుకుడు చెప్పసాగాడు.

త్రికూటపర్వత వర్ణన

23: "మహారాజా! పాలసముద్రంలో త్రికూట మనే పర్వతం ఉంది. దాని ఎత్తు, వెడల్పు ఒక్కొక యోజనము (4 కోసులు అంటే సుమారు 14 కిలో మీటర్లు). దానికి బంగారపు, వెండి, ఇనుప శిఖరాలు మూడు ఉన్నాయి. కొండ సానువులలో, శిఖరాలలో యున్న రత్నాలు, ధాతువుల వలన దిక్కులు, భూమి, ఆకాశం చిత్రమైన రంగులతో మెరుస్తుంటాయి. దాని మీద పెద్ద పెద్ద చెట్లు, తీగలు, పొదలు, గలగలలాడే సెలయేర్లు ఉన్నాయి. వీటికి అలవాటుపడిన దేవతలు విమానాలలో తిరుగుతుంటారు. ఆ కొండ చరియలందు కిన్నరులు విహరిస్తుంటారు.

.....

రహస్యార్థం:

సుధారాశి, పాలసముద్రం అనగా ఇతరం ఏది చూడని, వినని, ఎరుగని, చలించని సహజ బ్రహ్మానంద స్థితి యగు పరబ్రహ్మము. అందు యోజనోన్నతం అనగా అనంత స్వరూపం గల పొడవు, వెడల్పు అనే పడుగు పేకలుగా కూర్చబడిన పరబ్రహ్మము. అందు గుణసామ్యం అగు

ప్రకృతి, రజోగుణం(కాంచనం,బంగారం),తమోగుణం (అయస్సారం, ఇనుము), సత్వగుణం (కలధౌత, వెండి) అనే త్రిగుణాలతో కూడినదిగా వ్యక్తమగుచున్నది. ఆయా త్రిగుణాల ప్రతిబింబాలు అయిన బ్రహ్మ, విష్ణు, రుద్రులు అనే మూడు శృంగములచే త్రికూట పర్వతం ప్రకాశించుతున్నది. అక్కడి చరియల సూత్రాత్మ (సూర్య చంద్రాది) కాంతులచే భాసమానములు అయిన సంసారం అనే మహా వృక్షాలు, ఆశ అనే లతలచే నిర్మితమైన పొదరిళ్ళు, వాసనా ప్రవాహాలు అనే సెలయేర్లు మరిగి దివ్యవిమానాలు అనే శరీరాలు, విశ్వ, తైజస, ప్రాజ్ఞులు అను కిన్నరులు తిరుగుతున్నారు.

24: ఆ త్రికూట పర్వతం నిండా ఎప్పుడు మాదీఫలం, లవంగం, పుల్ల మాదీఫలం, మామిడి, మొగలి, జీడిమామిడి, అంబాళం, తెల్ల తెగడ, పనస, రేగు, పొగడ, మఱ్ఱి, కొండమల్లి, కుంద, ఎఱ్ఱ గోరింట, పచ్చ గోరింట, కాంచనం, ఖర్జూరం, కొబ్బరి, వావిలి, చందనం, వేప, మందారం, నేరేడు, నిమ్మ, గురివింద, ఇప్ప, తాడి, తక్కోలం, చీకటి మాను, గిరికతాడి, తియ్యమామిడి, మద్ది, మోరటి, మారేడు, ఉసిరి, పోక, కడిమి, గన్నేరు, అరటి, వెలగ, ఉమ్మెత్త, కలజువ్వి, దిరిసెన, ఇరుగుడు, అశోక, మోదుగ, పొన్న, సురపొన్న, సంపెంగ, తామర, మరువక, మంచిమల్లె మొదలైనవి వసంతకాల శోభతో అలంకరింపబడి ఉంటాయి. ఆ చెట్లు కొమ్మలు, పొదలు అన్నీ ఎప్పుడూ చక్కగా చిగుర్లు చిగురిస్తూ, రెమ్మలు పల్లవిస్తూ, మొగ్గలు తొడుగుతూ, పూలు పూస్తూ, పండ్లు కాస్తూ ఉంటాయి. ఎఱ్ఱమన్ను, అనేక చక్కటి ఇసుకతిన్నెలు కల సెలయేర్లు ఉన్నాయి.

ఆ చెట్ల కొమ్మలకు పండిన పండ్లను చిలుకలు, కోయిలలు తమ వాడి ముక్కులతో పొడుస్తున్నాయి. ఆ పండ్ల రంధ్రాలనుండి రసాలు కారి కాలువలుగా ప్రవహిస్తున్నాయి. ఆ కొండలో బంగారం లాంటి మంచినీటి సరస్సు లున్నాయి. వాటిలో పసుపు కలువలు, తెల్లకలువలు, ఎఱ్ఱ కలువలు, పద్మములు ఉన్నాయి. వాటి సువాసనల మధువు ఎడతెగకుండ తాగి మదించిన గండు తుమ్మెదలు తమ ప్రియురాళ్ళతో చేరి విహరిస్తున్నాయి. ఆ దగ్గరలోని చక్కటి శకుంతపక్షులు, కలహంసలు, కారండవాలు, నీటికోళ్ళు, చక్రవాకాలు, కొంగలు,

కొక్కెరలు, చీకుకొక్కెరలు మున్నగు నీటిపక్షుల గగ్గోలుతోఆకాశం, నేల గింగిర్లెత్తుతోంది. చలువరాళ్ళు, మరకతాలు, వజ్రాలు, వైఢూర్యాలు నీలాలు, గోమేధికాలు పుష్యరాగాలు నిండిన మనోహరమైన బంగారు, వెండి శిఖరాలు, చరియలు ఉన్నాయి. అక్కడ విద్యాధరులు, దేవతలు, సిద్ధులు, చారణులు, గరుడులు, గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు తమ ప్రియురాళ్ళతో కలిసి జంటలు జంటలుగా విహరిస్తున్నారు. వారు రసవంతంగా మాట్లాడుతూ పాటలు పాడుతున్నారు. ఆ కొండ శుభాలకు శాశ్వత ఆలవాలంగా ఉంది. అందులో మదపుటేనుగులు, గురుపోతులు, గండభేరుండాలు, ఖడ్గ మృగాలు, సింహాలు, శరభాలు, పులులు, కుందేళ్ళు, చమరీమృగాలు, ముళ్ళ పందులు, ఎలుగుబంట్లు, జింకలు, తోడేళ్ళు, అడవిపందులు, అడవిదున్నలు, కోతులు, పెద్ద పెద్ద పాములు, పిల్లులు మొదలైన జంతువులు ఉన్నాయి. అవి ఎప్పుడూ పోరాటాలు చేస్తుంటే చూసిన, యమభటులు సైతం భయపడి శరణు వేడుతుంటారు.

రహస్యార్థం:

వసంత సమయ సౌభాగ్య సంపద అనగా ఈశ్వర ధ్యానం అంకురిస్తున్న, సంసారం అనే అరణ్యంలో రాగాది పల్లవములు, విషయ పుష్పములు మొదలుగా గల వృక్షాలతో శోభాయుక్తం అయి, మోహాన్ని కలిగిస్తున్నది. ఆ సంస్కృతి అనే పాదపములకు బీజము అజ్ఞానం. దేహమే ఆత్మ అనెడి భావన అంకురం. లేచిగురు అనే రాగం, కర్మం అను దోహజం (జలం), కలిగిన చెట్ల వేళ్ళకు కొమ్మలకు మధ్య ఉండే కాండం స్థూలోపాధి. చివరి కొమ్మలు ఇంద్రియాలు. పుష్పములు శబ్దాది విషయములు. ఫలములు అనేక జన్మల నుండి వస్తున్న కర్మ వాసనలచే జనించు ప్రారబ్ధానుభవాలైన దుఃఖాదులు. ఆ ఫలాల్ని అనుభవించేవి అయిన పక్షులు అను జీవులు. కలిగి ఉన్నాయి ఆ పాదపాలు. మణివాలుకానేక విమల పులినతలములు అనే రాబోవు దుఃఖాదులను మరగు పరచి తాత్కాలిక ఫలాలు అను ఆభాస సుఖాలను కలిగిస్తున్నాయి. ఆయా సౌఖ్యాలను దుఃఖాలుగా గ్రహించి భక్తి జ్ఞాన ప్రవాహాలు తీర్థస్థ జ్ఞాన ఫల రంధ్ర స్రావకములు అనే ఆనంద రసావాదకములు శుక, పికాది పక్షులు కలిగి ఉన్న ఆ వనాలు. భక్తి లతలు గుబురులు పుట్టి ప్రాకినవి. పుణ్యాలు అనే చివుర్లు చిగురించాయి. సచ్చిదానందం అను పుష్ప రస స్రావంతో కూడిన బ్రహ్మజ్ఞానం అనే ఫలం ఫలించింది. కనకమయం అనగా హిరణ్మయ మండలం. దాని యందలి హృత్పద్మాలు అందు నివసించే తృష్ణ సంబంధి మధుపాలు సంచరిస్తున్నాయి. మధుపాలు కనుక పైకి కిందకి అసంతుష్టిచే వ్యభిచరిస్తూ సంచరిస్తూ ఉంటాయి. సమీప సంచార నభోంతరాళ కల హంస పాలునీరు వేరు చేసి గ్రహించగల పక్షిరాజు అను పరమహంస. నామరూపాత్మక మాయాకల్పిత జగత్తు అనే నీరు వదలి. సచ్చిదానందరూప బ్రహ్మము అనే పాలు వేరు చేసి గ్రహిస్తాడు. అట్టి ద్విజ(పక్షి) శ్రేష్ఠులు పరమ హంసలు ఉన్నారు.ఇంకా లింగశరీరారణ్యం లో ఉండే, క్రోధం అను పెద్దపులి, లోభం అనే శరభం (సింహాలను చంపే క్రూర మృగం). మోహం అనే పంచాననం (సింవంగి), కామం అనే భల్లూకం

(ఎలుగు బంటు), మదం అను జంబుకం (నక్క), మత్సరం అను కోక (తోడేలు, అడవి కుక్క) కలిసి చిత్తం అనే హరిణం (లేడిని) బాధిస్తున్నాయి. అట్టి త్రికూటము నందు.

25: ఆ త్రికూటం దగ్గర ఉన్న అడవి నిండా చెంచిత స్త్రీలు, చెంచు పురుషులు, అడవి దున్నలు, ఎలుగుబంట్లు, పాములు, ఖడ్గమృగాలు,గురుపోతులు,కొండముచ్చులు,చమరీమృగాలు, ఈలపురుగులు,సింహాలు,శరభాలు, సీమపందులు, కోతులు, కాకులు, గుడ్ల గూబలు ఉంటాయి.

రహస్యార్థం:

తృష్ణ అనే చపల స్వభావ కోతులు, కామం అనే కాముకుని తీవ్ర సంకల్పం గల ఈల పురుగులు, పగ అనే రాత్రి తప్ప పగలు దృష్టి లేని గుడ్లగూబలు, కలిగి ఆత్మ దృష్టి, ప్రాపంచిక దృష్టి కలిగి ఉన్న సంసారం అనే అడవి యందు...

త్రికూట మందలి గజములు

26: ఆ అడవిలోని ఏనుగులు ఇతరులు కన్నెత్తి చూడలేనంత భయంకరమైనవి. అవి మదించిన తమ శరీరాలతో దిగ్గజాలను సైతం మించినవి. వాటిలో కొన్ని కొండగుహల నుండి బయలు దేరాయి. చెర్లాటాలు ఆడుతు దప్పి గొన్నాయి. జల క్రీడల కోసం సరస్సులవైపు నీటిగాలి వాలు పట్టి నడిచాయి.

రహస్యార్థం:

అభయం అయిన సమాధిలో యోగులు (ద్వైతులు) భయం కల్పించుకొని దుర్నిరీక్షణం అని చెప్పదగ్గ కూటస్థాది చైతన్య రూప ఏనుగులు. మూలాధారాది గుహల నుండి బయలుదేరి

పరాగ్దృష్టులకు భయంకరములై దిగ్దేవతలగు ఇంద్రాదులను జయించునవై సంచరిస్తున్నాయి. కర్మాది, అభాస సుఖాలైన విలాసేచ్ఛలచే క్షుత్పిపాసాది షడూర్ముల స్థానమగు మనస్సు అను కాసారం (సరస్సు) కోసం బయలు దేరాయి. (ఆకలి దప్పులు, శోక మోహములు, జరామరణములు షడూర్ములు)

27: చీకట్ల గుంపులు పగలంతా భయంతో కొండగుహలలో దాక్కొని సాయంకాలం సూర్యుడి శక్తి సన్నగిల్లటం కనిపెట్టి బయటకొచ్చాయా అన్నట్లు ఆ త్రికూటపర్వతం నుండి బయలుదేరిన ఏనుగులు ఉన్నాయి.

రహస్యార్థం: బ్రహ్మజ్ఞానం ప్రకాశించే సమయంలో (పగలు) కనబడని చీకటి అనే అవిద్య కొండ గుహలు అను హృదయ కుహరాలలో దాగి ఉండి, జీవుని వృత్తి బహిర్ముఖమైనప్పుడు ఆవరించినట్లు అజ్ఞానవృత్తులు బయలుదేరాయి.

27. అంధకార మెల్ల నద్రిగుహాంతర
వీథులందుఁ బగలు వెఱచి డాఁగి
యెదరు వేచి, సంధ్య నినుఁడు వృద్ధత నున్న
వెడలె ననఁగ గుహలు వెడలెఁ గరులు.

అందమైన ఉపమాలంకార వైభవం చూడండి. సాయంకాలం సూర్యుడు అస్తమిస్తుంటే అప్పటిదాకా గుహలలో ఉన్న చీకట్లు బైటికి వస్తాయి కదా. గజేంద్రుడు, అతని కోటి ఏనుగులు వెళ్తుంటే అలా ఉందట.

28: ఆ గుంపులోని గున్న ఏనుగులు భూలోకంలో మిక్కిలి బల సంపదతో కొండలను ఢీకొనుటకైన వెనుదీయవు. సింహాలకైన వెనుదీయకుండ ఎదిరించి నిలబడతాయి. చివరకి పిడుగులకు కూడ బెదరవు.

రహస్యార్థం:

కొండలంత కష్టాలు వచ్చినా, ధైర్యం విడనాడకుండా, కామాదులను జయించుటకు సింగము వంటి పట్టుదల కలవై ఎదుర్కుంటాయి. పిడుగుల వంటి ఆపదలు మీద పడినా తట్టుకుంటాయి కాని చలించవు. అంతటి అవిద్యావృత పారమార్థిక జీవులు అవి.

29: ఆ మదపుటేనుగులు భయంకరంగా విహరిస్తున్నాయి. వాటి గాలి సోకితే చాలు భయపడిపోయి, పులులన్నీ పొదలలో, భీకరమైన ఎలుగుబంట్లు గుహలలో దూరతాయి. అడవి పందులు గోతులలో దాక్కుంటాయి. జింకలు దిక్కులు పట్టి పోతాయి. అడవిదున్నలు మడుగుల్లో చొరబడతాయి. కోతులుకొండరాళ్ళపైకి ఎగబాకుతాయి. అడవిలోని పాములు పుట్టలలో దూరతాయి. నెమళ్ళు ఆకాశానికి ఎగురుతాయి. సవరపు మెకాలు తమ తోకకుచ్చుల చామరాలతో ఏనుగుల శ్రమ తీరేలా విసురుతాయి.

రహస్యార్థం:

బాహ్యంగా భయంకరంగా విహరించే ఏనుగులను చూసి ఇతర జంతువులు బెదురుతున్నాయి అనే చక్కటి స్వభావాలంకారం అలరిస్తుంది. కాని ఆయా జంతువుల రహస్య సంజ్ఞా భావం తీసుకుంటే, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సర, ఈర్ష్య మున్నగునవి వాటి అధిదేవతల యందు అణగి ఉన్నాయని భావం.

30: పడుచు తుమ్మెదల గుంపులు ఆ మదపుటేనుగుల సుగంధాల మదజల ధారలు కమ్మగా కడుపులనిండా తాగి సంతోషంతో జుం జుమ్మని పాడుతున్నాయి. 31: గండుతుమ్మెద ఒకటి తనతో క్రీడిస్తున్న ప్రియురాలైన ఒక ఆడతుమ్మెదకి అస్తమానం ఆ ఏనుగుల మదజలం ఎందుకులే అని నిండుమగతనం అందించింది.

రహస్యార్థం: మనస్సు సమాధి స్థితిలో ఉన్న ఆనందమును మరిగి, జగదాకార వృత్తులను వదలి, సంప్రజ్ఞతా సమాధి యందలి ఆనందమును పొందింది.

32: తుమ్మెద కడుపులు ఇంపైన మదగజాల మదజలగంధా లెంతో వేడుకతో ఆస్వాదిస్తూ చెవులు గింగిర్లెత్తేలా ఝంకారం చేస్తున్నాయి.

రహస్యార్థం: "తృష్ణా హృత్పద్మషట్పదీ" (హృదయ పద్మంలో ఉండే తుమ్మెద అంటే తృష్ణ). అలా హృదయ పద్మంలో ఉండే సంకల్పాలు అను తుమ్మెదల గుంపు, మాతంగీ అంటే పరాప్రకృతి సంబంధ నిర్వికల్పానందంచే, నిశ్చేష్టముగా ప్రణవనాదం చేశాయి.

33: ఆడతుమ్మెదలు ఆత్రంగా పోయి ప్రియులని ముసురు కొన్నాయి. మగ తుమ్మెదలు ఏనుగుల మదజల ధారలకు ఆశపడకుండా నిండుగా తమ మనసులలో సంతోషపడ్డాయి.

రహస్యార్థం: జీవులు, అవిద్యా ఉపాధులతో కూడి పృథక్కుగా ఉండే గజగంధము అను విషానందమును గైకొనక, సహజ ఆనందమును, తాదాత్మ్యఆనందమును ఆస్వాదిస్తున్నాయి.

34:ఆ సమయంలో, గున్నేనుగులు చెర్లాటలాడుతున్నాయి. పచ్చిక బయళ్ళని వాసన చూసి తొక్కుతున్నాయి. పళ్ళచెట్లని రాసుకు పోతూ చిగుళ్ళు గబగబ మేసేస్తున్నాయి. పులుల్ని, అడవి

దున్నలని, జింకల్ని తప్పించుకు పోనీయక నిలిపి శిక్షిస్తున్నాయి. మడుగుల్లో దిగి కలచేస్తున్నాయి. కొండలమీద వినోదంగా విహరిస్తున్నాయి.

రహస్యార్థం:

జీవులు జీవన్ముక్తి విహారాలతో ఆనందిస్తూ, మధ్య మధ్య జలభ్రాంతితో ఎండమావులను జలం అని మోసపోతూ, వివేకంతో సంసార పాదపాలను నిర్లక్షిస్తూ, విషయాది అను చివుళ్ళు భక్షిస్తూ, కామాది క్రూరమృగాల ఉద్రేకాలను అణచేస్తున్నారు.

36: తొండాలతో మదజలం నిండిన చెక్కిళ్ళతో కుంభ స్థలాలతో ఆ మదగజాలు ఢీకొంటుంటే కొండలు తలకిందు లౌతాయి, దిక్కులు బద్దలు అవుతాయి, లోకాలు భయపడి పోతాయి. (*ఎంత చక్కటి అతిశయోక్తి అలంకారం!*)

రహస్యార్థం:

జీవుడు అహంభావంతో ఇంద్రియ వ్యాపారాలకు ఆజ్ఞలను ఇచ్చేస్థానం ఆజ్ఞా చక్రం.గండస్థలం అను ఆజ్ఞా చక్రం. అందుండే మదజలం, మదించిన జలం అంటే పట్టుదల. అదే కర్తృత్వకాది అహంభావం. తొండం అంటే ఉచ్ఛ్వాసం అంటే ప్రాణాయామం. అలా ప్రాణాయామంతో అహంభావాన్ని ఘట్టన అంటే నిరోధం చేస్తుంటే, జగము అంటే శరీరం, గగుర్పాటు పొందింది.

గజేంద్రుని వర్ణన

37: ఆ అడవిలో ఎక్కడ చూసినా లెక్కలేనన్ని ఏనుగులు తిరుగుతున్నాయి. వాటిలో ఒక గజేంద్రుడు విడిపోయి వెనక బడ్డాడు.అనేక ఆడఏనుగులు సేవిస్తూ అతని వెంట ఉన్నాయి.

రహస్యార్థం: *సమిష్టి ఆత్మతత్వం నుండి వ్యష్టిరూపమును పొందడమే, ఆత్మ వలన ఎడబాటు పొందుట, సంసార అరణ్యంలో చిక్కుట, తప్పిపోవుట.*

---

38 : ఆ గజరాజు దైవవశం చేత బుద్ధి సరిగా పనిజేయక తనకు ఎటుపక్క కూడా దప్పికతో వచ్చే ఇతర ఏనుగుగుంపులు కనబడక విడిపోయి దారితప్పాడు. తన గుంపులోని ఏనుగుల గుంపుతో కాక వేరేదారి పట్టి పోసాగాడు.

రహస్యార్థం: *జీవుడు స్వస్థానాన్ని తప్పి, అన్నమయాది కోశం అనే భౌతిక దేహంతో, జ్ఞానం, విజ్ఞానం, ప్రజ్ఞానం మున్నగు ఆవరణల ఉపాధులతో కూడి పరిభ్రమణ శీలుడు అయి...*

39: అప్పుడా గజేంద్రుడు బల్లిదుడై తన ప్రియురాళ్ళకి నీటి గుంటల పక్కన ఉండే లేతపచ్చికలు మచ్చికతో అందిస్తోంది. చిగుళ్ళు పూలకొమ్మల గుత్తులు పంచిపెడుతోంది. మదజలంతో తడిసిన విసనకఱ్ఱల్లాంటి పెద్దపెద్ద చెవులతో వాటి చెమటలు ఆర బెడుతోంది. వాటి మెడలకింద మెల్లగా తన దంతాలతో గోకుతూ వలపుల ప్రేమ చూపుతుంది. వాటి వెనక్కి ప్రేమగా చేరి వాసన చూసి తొండాన్ని పైకెత్తి ఆకాశానికి చాచి ఋతు సమయాన్ని గుర్తిస్తోంది, క్రీడించి విశ్రమిస్తోంది.

రహస్యార్థం: బలిష్టమైన ఆ గజరాజు అను జీవుడు తన ప్రియురాలు అనగా మనస్సునకు సంతోషం కలిగించాలి అని, ఇంద్రియ విషయాలను నెరవేరుస్తూ, వృత్తులు అనే దంతాలతో అవిద్యను ఆనందింపజేస్తూ ఉన్నాడు.

40: గజేంద్రుని కుంభస్థలాల నిండుదనానికి సరితూగలేక లోకం లోని స్త్రీల స్తనాలు పైటకొంగుల మాటు కోరాయి. అతని నడకల ఠీవికి సరితూగలేక అతివల పాదాలు అందెల అంద తీసుకొన్నాయి. అతని తొండం సిరికి తూగలేక కన్నెల చిన్ని తొడలు ఒడ్డాణాల కాంతులను తోడు తెచ్చుకొన్నాయి. అతని దంతాల కాంతికి సరితూగలేనందుకే ఉవిదల చిరునవ్వులు ముఖ చంద్రకాంతుల ముసుగు వేసుకొన్నాయి. అతని లావణ్య స్వరూపాన్ని చూడగోరి అంజనావతి, అభ్రమువు, కపిల మొదలైన దిగ్గజాల భార్యలు వెంటబడ్డాయా అన్నట్లు ఆడ ఏనుగులు అనుసరిస్తుండగా ఒప్పులకుప్పలా ఆ గజరాజు ఒప్పి ఉన్నాడు. (చక్కటి స్వభావోక్తి అలంకారం ఆస్వాదించండి)

రహస్యార్థం: గజేంద్రుడు అను జీవుడు పంచకోశయుక్తుడై, సప్తధాతువులతోనూ, బహిరంతర ఇంద్రియాలతో, దశవిధ ప్రాణాలతోనూ, శబ్దాది విషయాలతోనూ, శరీర త్రయా న్వితుడై, అవిద్య అనే కన్యకతో పరిణయం కోసం అలంకృతుడైన పెళ్ళికొడుకులా కనబడుతున్నాడు.

41: ఇంకా గజరాజు అనేక అడవులలో తిరిగిన ఆయాసం వలన దప్పికతో స్వాధీనం తప్పిన మనస్సుతో దారి తప్పాడు. అలా ఆడ ఏనుగులు అన్నిటితోపాటు చాలా దూరం వెళ్ళాడు.

రహస్యార్థం: జీవుడు పునరపి జననం అనుకుంటూ అనేక జన్మలు పొందడానికి సిద్ధపడి, నివృత్తి మార్గం నుండి తప్పిపోయి, ప్రవృత్తి మార్గంలో ప్రవేశించాడు.

42: అక్కడ ఒకచోట గజేంద్రుడు ఒక మడుగుని చూసాడు. ఆ చెరువులో కొత్తగా విచ్చుకున్న కమలాలు ఉన్నాయి. అక్కడ తుమ్మెదల గుంపులు తిరుగుతున్నాయి. అది తాబేళ్ళు, చేపలు, మొసళ్ళతో దాటరానిదిగా ఉంది. దాని గట్టు మీద మఱ్ఱి, తాడి, మామిడి, మద్దిచెట్లు పూల తీగలు ఉన్నాయి. ఇంకా హంసలు, చక్రవాకాలు, కొంగలు విహరిస్తున్నాయి.

రహస్యార్థం:

కరణీవిభుడు అంటే అంతఃకరణుడు, ముఖ్య అహంకార విషయుడు అగు పారమార్థిక జీవుడు. ఆ జీవుడు 'నవపుల్లాంభోజ' అను అనాద్యవిద్యా వాసనలతో పరిమళించే హృదయ కమలాల వలన వికాసం పొందిన తుమ్మెదలు అను తృష్ణ పరంపర. క్షణక్షణం పాతాళం, అంతరిక్షం, దిగంతాలు పట్టి తిరుగుతూ ఉంటుంది. అలాంటి సంకల్పభావంతో కూడిన తృష్ణ అను తుమ్మెదలు కల లోభం, మోహం, కామం మున్నగు వాటిచే నివారించబడే జలచరాలు కలది, సుమనోవల్లీ కుటీరతీరం అంటే శుద్ధసాత్వికం అను కుటీర తీరం. భయకారణాలైన మోహం, అసూయ, దర్పం మొదలైనవాటితో చలించిపోతున్న కాసారాన్ని చూశాడు.

గజేంద్రుని కొలను ప్రవేశము

43: ఆ మదగజాలు, ఇతరులు ఎవరు తిరగని ఆ నిర్మలమైన పద్మాల సరస్సును చూసాయి.

రహస్యార్థం: ఇలా ఏకాంతం, నిస్సంకల్పం, విశుద్ధం అయి ఉన్న ఆ మానస సరోవరం చూసి,

44: ఇతరులు ఎవరు తిరగని ఆ నిర్మలమైన పద్మాల సరస్సును చూసిన ఆ మదగజాలు, వాటి దేహాలకి పద్మాల వాసనలతో కూడిన చల్లని పిల్లగాలులు హాయి కలిగించాయి. తామర తూళ్ళు తిన్న రాయంచల కలకలారవాలు చెవుల పండుగ చేస్తున్నాయి. విరిసిన తెల్ల కమలాలు కలువల సువాసనలు ముక్కులకు తృప్తి కలిగిస్తున్నాయి. స్వచ్ఛమైన అలలనుండి వెలువడిన నీటి తుంపరలు దప్పిక తీరుస్తున్నాయి. ముల్లోకాలకి సరికొత్త సౌభాగ్యాన్ని పుట్టించే ఆ సరస్సు యొక్క శోభ కళ్ళకి ఆనందం కలిగిస్తోంది. దాంతో ఆ మత్తేభాలు తమ పంచేంద్రియ జ్ఞానాలను మరచి ఆ మడుగు లోకి దిగాయి.

రహస్యార్థం:

ఇలా ఏకాంతం, నిస్సంకల్పం, విశుద్ధమై ఉన్న ఆ మానస సరోవరం చూసి, పూర్వకృత సత్ వాసనలతో స్థూల, సూక్ష్మ కారణ శరీరత్రయం అలరారు తుండగా, గుటీచక, బహూదక, హంస, పరమహంస (ఆశ్రమ విశేషాలు) సన్యాసులలో శ్రేష్ఠులు అయిన పరమ హంసల బ్రహ్మ విచారణా, శ్రవణానందాలు కలుగగా, శుద్ధ సాత్విక మగు వృత్తుల (ప్రాణాయామ శ్వాసలు) చేత నాసికా రంధ్రాలు పూర్ణీభవించగా, సత్సంకల్ప కల్లోల (పరిణామ) జలాలచేత జిహ్వ చాపల్యం శాంతించగా, అవస్థా త్రయంతో కూడి ఉండే ఇంద్రియ వ్యాపారాల అధిదేవతలను ఆయత్తపరచి, మానస కాసారం ప్రవేశించాడు.

45:~ ఆ ఏనుగుల గుంపు తొండాల నిండా నీళ్ళు నింపుకొని చెక్కిళ్ళ మీద జల్లుకొన్నాయి. గట్టిగా గటగట మనిచప్పుళ్ళు చేస్తూ తమ పెద్ద పెద్ద కడుపుల నిండా నీళ్ళు తాగాయి.

45. తొండంబులఁ బూరించుచు
గండంబులఁ జల్లుకొనుచు, గళగళరవముల్
మెండుకొన వలుఁదకడుపులు
నిండన్ వేదండకోటి నీటిం ద్రావెన్.

అడవిలో తిరిగే ఏనుగులు నీళ్ళమడుగులో తిరిగే చిత్రానికి చట్రం కట్టి చూపారు అందమైన ఈ చిన్న కందంలో.

రహస్యార్థం:
జీవుడు కామంచే ఆకర్షింపబడకుండా ఉన్నంత వరకూ అవిద్యావశుడు అయి ఉన్నప్పటికీ, ఆత్మానుసంధాన పరుడై ఉంటాడు. ఎలా అంటే, 'నేను బ్రహ్మం అయ్యాను' అనే వృత్తి (జ్ఞానం) పూరకం అంటారు. అదే తొండాలతో పూరించటం. అట్టి వృత్తిచేత వాయువును, ఆజ్ఞ యందు నిలుపుతూ దశవిధ నాదానుసంధానం (గళగళధ్వనులు), వాయువును కుంభించి, పూరించి (కడుపులు నిండన్), నిశ్చలత్వంతో మానస కాసారంలో తాదాత్మాకార వృత్తులతో ఉన్నాడు.

46: ఆ సమయంలో, గజరాజు తొండంలోకి నీళ్ళు పీల్చు కొన్నాడు. ఆకాశం కేసి తొండాన్ని ఎత్తి, నిక్కించి పుక్కిలించి ఆ నీటిని వేగంగా పైకి చిమ్మాడు. ఆ వడికి ఆ నీటితో పాటు పై కెగసిన పీతలు, మొసళ్ళు, చేపలు ఆకాశంలో తిరిగే మీనరాశిని, కర్కాటకరాశిని పట్టుకొన్నాయి. దేవతలు అది చూసి ఆశ్చర్యచకితులయ్యారు.

రహస్యార్థం: ఇలా జీవుడు మానససరస్సులోని సంకల్పాలను పరిపక్వస్థితిని కలచివేస్తుంటే, ఈశ్వరుడిలోని సూక్ష్మ వృత్తులతో ఐక్యం అయ్యాడు.

48 : మరి ఆ సరోవరంలో గజేంద్రుడు అడ్డులేకుండా విహరించ సాగాడు.అలా గజరాజు ఎదురులేకుండా పద్మాల సరోవరంలో ఈదుతున్నాడు. అప్పుడు, ఆడ ఏనుగులు అతని మీద నీళ్ళు చల్లాయి. ఆ నీటిలో తడిసిన అతడు సెలయేళ్ళతో ఒప్పిన నీలగిరిలా ఉన్నాడు. ఆడ ఏనుగులు అతని దేహం నిండా కలువపూలు నింపాయి. వాటితో సహస్రాక్షుడైన ఇంద్రునిలా ఉన్నాడు. ఆడ ఏనుగులు అతని పై కమలాల పుప్పొడి చల్లాయి. దానితో అతడు బంగారు కొండలా గొప్పగా ఉన్నాడు. ఆడ

ఏనుగులు అతనిపై కలువ తూండ్లు పరిచాయి. వాటితో అతడు సర్పాలు ధరించిన శివునిలా ప్రకాశిస్తున్నాడు. ఆడ మత్తేభాలు అతనిమీద ముత్యాలచిప్పలు వేసాయి. దానితో అతడు మెరుపుతీగలతో కూడిన మేఘాన్ని మించిపోయాడు.

రహస్యార్థం: ఆ జీవుడు, ప్రతిబంధాలు ఏవీ లేకుండా జ్ఞానంలో విహరిస్తూ, ఏనుగు నీలాద్రి మున్నగు రూపాలు పొందినట్లు, మూలాధారాది చక్రాలలో వాయువును బంధించినపుడు, ఆయా దేవతా వర్ణాలను పొంది తుదకు పరమంలో ఐక్యం అయ్యాడు.

50: అంతేకాక ఆ గజరాజు చేసిన విశేషమైన సంచారాలతో ఆ మడుగు చక్కదనాలు చెదిరి కొత్తందాలు సంతరించుకొంది. గడుసువాడైన విటునితో రతిక్రీడ చేస్తూ అతని కౌగిళ్ళలో చిక్కి వణుకుతున్న కుసుమ సుకుమారిలా చక్కగా ఉంది. మదించిన తుమ్మెదలు చెదిరిన ముంగురులుగా, రసాన్ని కోల్పోయిన పద్మాలు ముఖంగా, చక్రవాకాలు తమ స్థానాలనుండి చెదిరిన స్తనాలుగా, నలిగిన ఇసుక తిన్నెలు అలసిన పిరుదులుగా కనిపిస్తున్నాయి.

కరి మకరుల యుద్ధము

51: ఒక మొసలి రాజు ఆ మడుగులో ఒక మూల దాక్కొని గజరాజుని చూసాడు. భుగభుగ మని చప్పుళ్ళతో పెద్ద పెద్ద బుడగలు పుట్టి అలలు ఆకాశానికి ఎగిసిపడేలా పైకి ఎగిరాడు. మొసళ్ళు, చేపలు భయపడేలా, లోకానికి భీతి కలిగేలా పూత్కారం చేసాడు. వడికి లేచిన గాలికి ఘుమఘుమ అని సుడి గుండాలు లేచేలా తోకను ఊపాడు. హుంకారం చేస్తూ కుప్పించి ఎగిరాడు. రాహువు సూర్యుడిని పట్టుకొన్నట్లుగా ఆ మొసలిరాజు ఆ గజరాజుని ఒడిసిపట్టుకొన్నాడు.52: గజేంద్రుడు మొసలి పట్టునుండి తప్పించుకొన్నాడు. తన పొడవైన తొండాన్ని ఎత్తి కొట్టాడు. ఆ దెబ్బకి మొసలి బలం పోయినట్లు నీళ్ళలో పడిపోయింది. అతి వేగంగా అది గజరాజు ముందరి కాలు పట్టుకొంది.53: మొసలి తన కాలు పట్టుకోగా, గజరాజు ఏమాత్రం తడబాటు చెందలేదు. ధైర్యంగా తన దంతాల మొనలతో బలంగా ఆ మొసలి దేహం మీది చిప్పలు కదిలిపోయేలా పొడిచాడు. మొసలి పట్టు తప్పింది. వెంటనే మొసలి ఏనుగు కాళ్ళు వదలి తోకని గోళ్లతో చీరింది.

54. కరిఁ దిగుచు మకరి సరసికిఁ
గరి దరికిని మకరిఁ దిగుచు గరకరి బెరయన్
గరికి మకరి మకరికిఁ గరి
భర మనుచును నతల కుతల భటు లరుదు పడన్.

చెరువలో ఏనుగూ, మొసలి పెనుగులాడుతున్నాయి. అది చూసి పాతాళలోక వాసులు బెదురుతున్నారట!

మొసలి ఏనుగును మడుగులోకి లాగింది. ఏనుగు మొసలిని గట్టు పైకి ఈడ్చింది. రెండూ ద్వేషం, పట్టుదలలు పెంచుకొన్నాయి. "మొసలిని ఏనుగు తట్టుకోలేదు, ఏనుగుని మొసలి తట్టుకోలేదు" అనుకుంటూ పాతాళ, భూలోకాల శూరులు ఆశ్చర్యపోయారు.

55: ఏనుగు, మొసలి రెండు అభిమానంతో ఒకదాన్ని మించి ఒకటి ఢీకొన్నాయి. వాటి పోరు అన్ని లోకాలకి భయంకరంగా సాగింది. ఒకటి రెండవ దానిని ఓడించాలనే పట్టుదలతో మడుగునంతా కలచి వేసాయి. సింహంతో సింహం, కొండతో కొండ వెనుదీయ కుండ ఢీకొని పోరాడుతున్నట్లు రెండూ తీవ్రంగా పోరాడాయి. బయటికి లోపలికి లాగుతు, అటునిటు పడుతున్న తొట్రు పడలేదు. ఆ నీళ్ళలో బుడ బుడ బుగ బుగ మనే శబ్దాలు చెలరేగాయి. లేచిన నురగలు ఆకాశాన్ని తాకాయి. మొసలి ఏనుగులు రెండూ ఎడతెరపి లేకుండ ముట్టెలతో తాకుతూ, తలలు బద్ధలయ్యేలా, చిప్పల అమరికలు తప్పేలా, నెత్తుర్లు కారేలా హుమ్మంటు వాడిపండ్లతో పొడుచు కొన్నాయి. ఒకదానిని ఒకటి లాగేటప్పుడు కాళ్ళపట్టు తప్పిపోకుండ బలంగా నిలదొక్కుకున్నాయి. అప్పుడు సరస్సులోని నీళ్ళు వేగంగా సుళ్ళు తిరిగాయి. ఆ నీళ్ళ తాకిడికి మొసళ్ళు, తాబేళ్ళు, పీతలు, చేపలు, కప్పలు మొదలైనవి చచ్చిపోయాయి. బింకంతో వేగంగా మొసలి, ఏనుగూ ఒకదాని నొకటి అణగదొక్కుతూ చీకాకుపరచుకొంటూ బాగా అలసిపోయాయి. ఒకదాని దెబ్బలనుండి ఒకటి నాచును ఆల్చిప్పలను అడ్డంవేసి తప్పించుకొసాగాయి. శరీరాల మీద ఆశలు వదలుకొన్నాయి. ఎలాగైనా గెలవాలనే కోరిక రెట్టింపు చేసుకొన్నాయి. క్రమక్రమంగా చెలరేగుతు రేయింబగళ్ళు తిండి నిద్ర లేకుండ అవి రెండూ చాలా కాలం పోరాడాయి56: గజరాజు మిక్కిలి చురుకుదనం, పట్టుదలతో అనేక విధములుగ మొసలితో యుద్ధం చేస్తున్నాడు. అతని పరాక్రమం చూసి బెదిరి ఆకాశంలోని మకర మీన కర్కాటక రాసులు ఒక్క సారిగా సూర్యమండలంలో దూరాయి. (ఉత్ప్రేక్ష అలంకారం). భూలోకంలో మొసలితో చేపలు, పీతలు స్నేహం చూపాయి (మరి సహ జలచరాలు కదా)

57: గజేంద్రుడు నీటిలోకి మాటి మాటికి లాగుతున్న ఆ మొసలిని నీటి పోరాటంలో ఓడించాలని గగ్గోలు చేసాడు. దానిని వేగంగా వజ్రాయుధం లాంటి తన భయంకరమైన దంతాగ్రాలతో దాని రొమ్ము పగిలేలా చిమ్మి పొడిచాడు. ఇంద్రుని భుజంలాంటి తన తొండంతో దాని మెడను చుట్టి విసిరి కొట్టాడు.58: ఆ సమయంలో, మొసలితో పోరాడుతున్న గజరాజును ఒంటరిగా వదలి వెళ్ళిపోవడానికి ఆడ ఏనుగులకు కాళ్ళాడలేదు. అవి ఊరకే చూస్తున్నాయి. ఆడవారికి భర్తలమీద బంధం విడదీయరానిది కదా!61: మొసలికి బతుకుతెరువు నీళ్లే కదా! అందుకని దానికి క్రమంగా బలము పట్టుదల పెరిగాయి. గజరాజు కృష్ణపక్ష చంద్రునివలె తగ్గిపోసాగాడు. 62: మొసలి సింహంలా హుంకరించి ఒక్క ఉదుటున గజేంద్రుని కుంభస్థలం పైకి ఉరుకుతుంది. పాదాల మధ్య దూరి గిరగిర తిరుగుతుంది. మెడని, వీపుని తన్నుతుంది. సులువుగా ఎగిరి తోక కొరుకుతుంది. నలిగి పోయేలా ఢీకొడుతుంది. నీళ్ళలో ముంచుతుంది. తాను మునుగుతుంది.

దాగి దాగి మీద పడుతుంది. ఎముకలు దంతాలు విరిగేలా కొడుతుంది.63: మొసలి కనబడకుండా నీళ్ళల్లో దాగి ఉంటుంది. ఏనుగు గట్టుపైకి పోతుంటే అడ్డంగా వస్తుంది. కనబడి కాళ్ళకు చుట్టుకు పోతుంది. అటునిటు కదలకుండ చేసి భయంతో కూలిపోయేలా తోకతో కొడుతుంది. లేచినప్పుడు ఒళ్ళు జాడించి పైపైకి గెంతుతుంది. చటుక్కున తప్పుకుంటుంది. గోళ్లతో గీరుతుంది. ఒడిసిపట్టి వేధించి, కోపం చూపెడు తుంది. 64: ఇలా ఆ మొసలి సాటిమొసళ్ళు ఆశ్చర్యం పోయేలా, అవక్రపరాక్రమం చూపింది. మహామాయ అనే అంధకారం అల్పమైన జ్ఞానకాంతిని కప్పివేసినట్లు, రకరకాలుగా నీటిలో మునిగి తేలుతూ మొసలి క్రమక్రమంగా పెరిగే ఉత్సాహం, పోరాట పటిమ, గొప్ప సాహసాలతో గజరాజును ఆక్రమించసాగింది.

65: మహాయోగి వాయువులు బంధించి తన పంచేంద్రియాల ఆడంబరాన్ని అణగార్చి, బుద్ధి అనే తీగకు మారాకు పట్టించి, పట్టుదలగా దుఃఖ రాహిత్య ఆనందమయ పరబ్రహ్మ పదాన్ని అందుకొని ఆనందిస్తాడు. అలానే మొసలి తన రెండుకాళ్ళు నేలమీద గట్టిగా ఆనించి ఊపిరి బిగబట్టి పట్టిన ఏనుగు కాళ్ళను వదలకుండ జయింపరానిదై విజృంభించింది. 66: వనం (అడవి)లో తిరిగే గజరాజును పీడించే ఆ వనం (జలం) లో చరించే మొసలిని చూసి, ఇంద్రుడి ఏనుగు ఐన ఐరావతం, వనం (జలం) నుండి జనించింది కనుక తెల్ల బోయింది. ఆ ఐరావతం ఇంద్రుడిని పడేసి దేవతలకు పట్టు కుందామంటే చిక్కకుండ ఆకాశంలో పరిగెడుతోంది.67: బ్రతుకుతెరువులో పడిపోయి మోహం అనే తీగచే కట్టు బడిన పాదాలు విడిపించుకోడం చేతకాక సందేహానికి గురైన జీవుడి వలె గజేంద్రుడు భయంకరమైన ఆ మొసలి కోరలకు చిక్కి శల్యావశిష్టమైన కాలిగిట్టలు కలవాడై దీనంగా అలమటిస్తున్నాడు. 68: ఇలా, గజరాజు రాత్రులు బవళ్ళు సంధ్యలు ఎడతెగకుండ వెయ్యి సంవత్సరాల పాటు అలసిపోకుండా సోలిపోకుండా, విసిగిపోకుండా తీవ్రంగా మొసలితో యుద్ధం సాగించాడు.

గజేంద్రుని దీనాలాపములు

70: గజరాజు గొప్పబలంతో అనేక సంవత్సరాలు యుద్ధం జేసి చేసి చివరికి చితికిపోయాడు. తన సత్తువ శత్రువు బలం సరిపోల్చుకొని ఆలోచించుకొన్నాడు "అనవసర ప్రయత్నాలు నాకు ఎందుకు. దీనిని జయించటం, సరిసమంగా పోరాడటం రెండు నాకు సాధ్యంకావు." అని దుఃఖించాడు. పూర్వజన్మల పుణ్య ఫలం వలన కలిగిన మేలైన జ్ఞానం వల్ల అతడు ఈ విధంగా అనుకోసాగాడు.71: "ఈ మొసలిని ఏ విధంగా జయించగలను? ఇకపై నేను ఏదేవుణ్ణి ప్రార్థించను? ఎవరిని పిలవాలి? ఎవరు నన్ను రక్షిస్తారు? ఈ మహామొసలిని ఆపేశక్తి కలవారు ఎవరు? సర్వకార్యాలలో దిట్టలు, గొప్ప పుణ్యాత్ములు దిక్కులేని నా మొర వినేవారు లేకపోతారా? అట్టి వారికి మొరపెట్టుకుంటాను.

72. నానానేకపయూథముల్ వనములోనం బెద్దకాలంబు స
న్మానింపన్ దశలక్షకోటి కరిణీనాథుండనై యుండి మ
ద్ధానాంభః పరిపుష్ట చందన లతాంతచ్ఛాయలం దుండ లే
కీ నీరాశ నిటేల వచ్చితి? భయం బెట్లోకదే యీశ్వరా!

విశేషము

ప్రమాదంలో పడి అయ్యో ఇలా చేయకుండా ఉంటే.. అనిపిస్తుంది కదా. మన గజరాజు లెక్కలేనన్ని ఆడఏనుగులు. గున్న ఏనుగులు కొలుస్తుంటే తిన్నగా ఉండక ఇక్కడికెందుకు వచ్చానా దేవుడా అంటున్నాడు.

72: చాలాకాలం నుంచి అడవిలో ఎన్నో ఏనుగు గుంపుల గౌరవాన్ని పొందుతున్నాను. పదిలక్షలకోట్ల ఆడ ఏనుగులకు నాథుడుగా ఉన్నాను. నా దానజలధారలతో బలంగా పెరిగిన మంచి గంధంచెట్ల నీడలలో సుఖంగా ఉండకుండ, నీటిమీద ఆశతో ఇక్కడకి ఎందుకు వచ్చాను. భగవంతుడా! చాలా భయం వేస్తోంది. ఎలానో? ఏమిటో?.73: ఈ లోకము ఎవరి వల్ల పుడుతుందో, ఎవరిలో కలిసి ఉంటుందో, ఎవరి లోపల లయమై పోతుందో,ఎవరు పరమాత్ముడో, ఎవరు సృష్టికి ప్రధాన కారణమై ఉన్నాడో, ఎవరైతే పుట్టడం, గిట్టడం, వాటి మధ్య అవస్థలు లేని శాశ్వతుడో, తుది, మొదలు, మధ్య లేని అనంతుడో, ఎవరైతే సమస్తసృష్టి తానే అయి ఉంటాడో, అటువంటి స్వయంభువు, ప్రభువైన భగవంతుణ్ణి నే శరణు కోరుతున్నాను.

73. ఎవ్వనిచే జనించు జగ; మెవ్వని లోపల నుండు లీనమై;
యెవ్వని యందు డిందుఁ;బరమేశ్వరుఁ డెవ్వఁడు;మూలకారణం
బెవ్వఁ; డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు; సర్వముఁ దానయైన వాఁ
డెవ్వఁడు; వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్.

అద్భుతమైన అమృత గుళిక, ఈ పద్యం 1, 2 తరగతులు చదివే టప్పుడు ఈ ప్రార్థన నేర్పేవారు. చెరకు గడలాగా ఎన్నిసార్లు నమలినా రసం ఊరుతూనే ఉంటుంది.

74. ఒకపరి జగములు వెలి నిడి
యొకపరి లోపలికిఁ గొనుచు నుభయముఁ దానై
సకలార్థ సాక్షి యగు న
య్యకలంకుని నాత్మమూలు నర్థిఁ దలంతున్.

ఈ ప్రార్థన మరో అమృత గుళిక.

ఒకసారి లోకాలను సృష్టి చేసి, ఇంకొక సారి తనలో లయం చేసుకుంటూ, ఆ లోకాలు రెండు తానే అయి, అన్ని విషయాలను సాక్షీభూతంగా ఆలోకిస్తూ, ఆత్మలకు ఆత్మ అయిన ఆ పరమాత్మను ఆసక్తితో ధ్యానం చేస్తాను.

లోకాలు, లోకాలను పాలించేవారు, లోకాలలో ఉండేవారు అందరు నశించిన అనంతరం, ఆ కారు చీకట్లకు ఆవతల అఖండమైన రూపంతో ప్రకాశించే ఆ దేవుణ్ణి నేను సేవిస్తాను.76: అనేక వేషాలు వేసే నటుడి లాగ పెక్కు రూపాలతో ఎవరు క్రీడిస్తుంటాడో? ఋషులు దేవతలు కూడా ఎవరి గొప్పదనాన్ని వర్ణించ లేరో? ఎవరి ప్రవర్తన ఇతరులకు అగోచరంగా ఉంటుందో? అట్టి ఆ మహాదేవుణ్ణి నేను సంస్తుతిస్తాను.77: ప్రపంచంతో సర్వ సంబంధాలు వదలివేసిన మునులు, భగవద్దర్శనం కోరేవారు, సమస్త జీవుల మేలు కోరేవారు, మంచి మనసు కలవారు, సాటిలేని వ్రతాలు ధరించి ఎవరి పాదాలను సేవిస్తారో అట్టి భగవంతుడు నాకు దిక్కు అగు గాక.78: భగవంతుడికి పుట్టుక, పాపము, ఆకారం, కర్మలు, నామాలు, గుణాలు లేవు. అతడు లోకాలను పుట్టించడానికి, నశింప జేయడానికి తన మాయా ప్రభావంతో ఇవన్నీ ధరిస్తాడు. అతడు పరమేశ్వరుడు, అంతులేని శక్తి కలవాడు, బ్రహ్మ, నిండైన రూపం గలవాడు, ఏ రూపం లేనివాడు, చిత్రమైన ప్రవర్తన కలవాడు, సర్వసాక్షి, ఆత్మ ప్రకాశమైన వాడు, పరమాత్మ, పరబ్రహ్మ, మాటలకు, ఊహలకు అందనివాడు, పరిశుద్ధుడు, సత్వగుణంతో దరిజేర దగిన వాడు. నేర్పరులు చేసే ఫలాపేక్ష లేని కర్మలను మెచ్చువాడైన ఆ దేవదేవునికి నేను నమస్కారాలు చేస్తాను.79: భగవంతుడు శాంతస్వరూపుడు. పరలోక సౌఖ్యప్రదాత. మోక్షానికి అధిపతి. నిర్విశేషుడు. దుష్టులకు భయంకరుడు. సంసారబద్ధులకు అందనివాడు. సర్వ గుణ ధర్మాలు కలవాడు. సరళ స్వభావి. విశేషమైన జ్ఞానము కలవాడు. సర్వేంద్రియాల కార్యాలను చూసేవాడు. సమస్తానికి ప్రభువు. బహు క్షేత్రజ్ఞుడు. దయారసానికి సముద్రం వంటివాడు. సర్వానికి ఆది మూల పురుషుడు. ఆత్మకు ఆధారమైనవాడు. సకలేంద్రియాలకు నియామకుడు. దుఃఖాన్ని తొలగించేవాడు. మాయ అనే నీడతో ప్రకాశించే బహు నేర్పరి. మిక్కిలి గొప్పవాడు. సమస్తానికి ఆది బీజమైనవాడు. తనకి మూల కారణం ఏదీ లేనివాడు. అట్టి ఆ దేవ దేవునికి నన్ను కాపాడమంటూ నమస్కరిస్తున్నాను.

80: యోగీంద్రులు యోగం అనే అగ్నితో తమ సర్వ పూర్వ కర్మలను కాల్చివేసి. ఇతరమైనది మరేది తలచకుండ ప్రకాశించే తమ మనసులలో ఆ దేవదేవుని చూస్తుంటారు. అట్టి ఆ మహానుభావుడిని నేను సేవిస్తాను.81: పరమేశ్వరుడు సమస్త ఆగమాలు వేదాలు అనే నదులకు సంగమరూపమైన సముద్రం వంటివాడు. మోక్షస్వరూపుడు.
గొప్ప గుణాలకు నిలయమైన వాడు. ఆరణి కొయ్యలలోని అగ్నివలె సుగుణాలలో దాగి ఉండేవాడు. స్వయం ప్రకాశకుడు. గొప్ప మనస్సు కలవాడు. ప్రళయాన్ని, సృష్టిని నడిపేవాడు. నాలాంటి ఏ దిక్కులేని జీవుల పాపాలను శమింపజేసేవాడు. సర్వులలోను ఆత్మయై వెలుగువాడు. నాశనం లేనివాడు. పూజింప దగినవాడు. భార్యాపుత్రులు, ఇల్లు, పశువులు వంటి

వాటి యందు ఆసక్తి కలవారికి అందరానివాడు. అటువంటి ప్రభువునకు నమస్కారాలు చేస్తాను.82: ఇంతేకాకుండా.

83: దేవదేవుడు ధర్మం, కామం, ధనం అన్నిటి మీద ఆశలు పండితుల పూజలందుకొని వారు కోరుకొన్న వదిలిన ఉత్తమ వరాలు ప్రసాదిస్తాడు. భక్తితో దరిజేరి కోరిన వారికి దయతో నాశనం లేని శరీరాన్ని ఇస్తాడు. ఆనందసాగరంలో మునిగిన మనస్సులు కల ఏకాంతిక ముక్తులు ఆ దేవదేవుని అనునిత్యం ఆరాధిస్తారు. వారు దేవదేవుని పవిత్ర చరిత్రను కోరికలేమీ లేకుండ కీర్తిస్తుంటారు. ఆ మహాదేవుడు సృష్టికన్న ఆద్యుడు. ఇంద్రియ జ్ఞానానికి అందనివాడు, అధ్యాత్మయోగం వలన చేరదగినవాడు. పరిపూర్ణుడు. మహాత్ముడు. బ్రహ్మస్వరూపుడు. సర్వానికి పరమైనవాడు. ఇంద్రియములకు అతీతుడు. స్థూలస్వరూపుడు, సూక్ష్మ రూపుడు. అటువంటి పరాత్పరుని నేను సేవిస్తాను.84: గజరాజు ఇంకా ఇలా అనుకోసాగాడు.
85: సూర్యుడు అగ్ని మంటలను, వెలుగుని ప్రసరింపజేసి మళ్ళీ శమింపజేసే విధంగానే భగవంతుడు తన కిరణాలచేత బ్రహ్మదేవుడు మొదలైన దేవతలను, సకల జీవరాసులను, సమస్త లోకాలను నానా విధాలైన నామ రూప భేదాలతో సృష్టించి లయింపజేస్తాడు. ఆయన మనస్సు, బుద్ధి, ఇంద్రియాలు అన్నీ తానే అయి గుణాలను ప్రవర్తింప జేస్తాడు. ఆయన స్త్రీ, పురుష, నపుంసక, జంతు, దేవతల, నరులు వంటి వాటిలో ఏ ఒక్క రూపము కలవాడు కాదు. ఆయన కర్మ గుణ భేదాలకి సత్తు, అసత్తులకి అతీతుడు. అంతే కాకుండా అవన్నికూడ తానే అయి ఉంటాడు. అటువంటి ఆ ప్రభువును నేను స్మరిస్తాను.

★86. కలఁ డందురు దీనుల యెడఁ,
గలఁ డందురు పరమయోగి గణముల పాలం,
గలఁ డందు రన్నిదిశలను,
గలఁడు కలం డనెడి వాఁడు గలఁడో లేఁడో?

అర్థం చెప్పనక్కరలేని సుళువైన పదాలలోని ఈ ప్రార్థన ఒక అమృత గుళిక. అలంకారం యమకం, 'కలడ' అంటూ ప్రాస ప్రక్క అక్షరానికి కూడా పాకింది. ఇక ఓపిక సన్నగిలింది, ఇంకో దిక్కులేదు. ఓపక్క ఉన్నాడు ఉన్నాడు అంటూనే,. ఆయన కాపాడటానికి రావటంలేదు కనుక సందేహం వస్తోందిట.

86: దేవుడు ఆర్తులైన వారి వెంట, ఉత్తమయోగుల చెంత, అన్ని దిక్కులలో ఉంటాడంటారు. "ఉన్నాడు, ఉన్నాడు" అనే ఆ దేవుడు మరి ఉన్నాడో! లేడో!87.

కలుగఁడే నాపాలికలిమి సందేహింపఁ
గలిమిలేములు లేకఁ గలుగువాఁడు?
నా కడ్డపడ రాఁడె నలి నసాధువులచేఁ
బడిన సాధుల కడ్డపడెడువాఁడు?
చూడఁడే నా పాటుఁ జూపులఁ జూడకఁ
జూచువారలఁ గృపఁ జూచువాఁడు?
లీలతో నా మొఱాలింపఁడే మొఱఁగుల
మొఱ లెఱుంగుచుఁ దన్ను మొఱగువాఁడు?

అఖిల రూపముల్ దనరూప మైనవాఁడు
ఆదిమధ్యాంతములు లేక యడరువాఁడు
భక్తజనముల దీనుల పాలివాఁడు
వినఁడె? చూడఁడె? తలఁపడె? వేగ రాఁడె?

ఎంత చక్కటి సీసపద్యం! ఎంతచక్కగా వర్ణించాడు!!

87: నా విషయంలో ఆ భగవంతుడిని అనుమానించ వలసిన పని లేదు. అతడు ఐశ్వర్యం, పేదరికం లాంటివి చూడకుండా అందరికి అండగా ఉంటాడు. కాబట్టి నాకు అండగా ఉంటాడు. దుర్జనుల చేతిలో చిక్కుకున్న సజ్జనులకు సాయపడతాడు. అందువల్ల నాకు సాయం చేస్తాడు. బయటి చూపులు వదిలిపెట్టి తననే చూసేవారిని దయతో చూస్తాడు. కనుక నా కష్టాన్ని చూస్తాడు. దీనుల మొరలు విని తన్ను తానే మరచి పోతాడు కదా. నా మొర తప్పక వింటాడు. అన్ని రూపాలూ ఆయన రూపాలే. మొదలు, నడుమ, తుద అన్నవి ఆయనకు లేవు. భక్తులకు దిక్కులేని వారికి ఆయనే ఆధారం. మరి అటువంటి ప్రభువు ఇంకా నా మొర వినడేం? నా బాధ చూడడేం? నన్ను దయ చూడడేం? తొందరగా రాడేం?88:

విశ్వకరు విశ్వదూరుని
విశ్వాత్ముని విశ్వవేద్యు విశ్వు నవిశ్వున్
శాశ్వతు నజు బ్రహ్మప్రభు
నీశ్వరునిం బరమపురుషు నే భజియింతున్.

★*సుళువైన పదాల ఈ ప్రార్థన మరో అమృత గుళిక.*

ప్రభువు లోకాన్ని సృష్టించేవాడు. లోకులు అందుకోలేని వాడు. లోకానికి అంతరాత్మ అయినవాడు.లోకంలో బాగా తెలుసుకో దగిన వాడు లోకమే తానైన వాడు. లోకాతీతుడు.

ఎల్లప్పుడు ఉండేవాడు. పుట్టుక లేనివాడు. బ్రహ్మదేవునికి అధి నాయకుడు. లోకాన్ని నడిపించేవాడు. పరమాత్మ. అట్టి ఆది పురుషుని నేను ఆరాధిస్తాను.89: ఈ విధంగా గజేంద్రుడు భావించుకొని భగవంతుని తన మనస్సులో సంకల్పించుకొని ఇలా ప్రార్థించాడు.

★లా వొక్కింతయు లేదు; ధైర్యము విలోలంబయ్యె;బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను,మూర్ఛవచ్చె,దనువున్ డస్సెన్, శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ; మన్నింపందగున్ దీనునిన్;
రావే! యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!

ఈపోతన పద్యం తెలియని తెలుగువాడు ఉండడు.అలాంటి మహాద్భుత ప్రార్థన. చిన్నతనంలో అందరూ కంఠతా పట్టి, మాటిమాటికీ చదువుకునే పద్యం.

90: దేవా! నాలో శక్తి కొంచెం కూడా లేదు. ధైర్యం సడలి పోయింది.ప్రాణాలు కదలిపోతున్నాయి. మూర్ఛ వచ్చేస్తూ ఉంది. శరీరం స్రుక్కిపోయింది. బాగా అలసటగా ఉంది. నాకు నీవు తప్ప ఇతరులెవ్వరు తెలియదు. నీవే దిక్కు. ఆర్తితో ఉన్న నన్ను ఆదుకోవయ్య. ఓ స్వామీ! రావయ్యా! కరుణించు, వరాలిచ్చే ప్రభూ! కాపాడు, పుణ్యాత్ముడా!91: ఓ దయాసాగరా! నీవు సర్వ ప్రాణుల పిలుపులు వింటావట. వారిపై దయ చూపడానికి పోరాని చోట్లకైనా పోతావట. శరణన్న వారికి వెంటనే 'ఓయ్' అంటావుట. కాని ఇప్పుడు ఇదంతా సత్యమేనా అని అనుమానంగా ఉంది.92:

ఓ కమలాప్త! యో వరద! యో ప్రతిపక్షవిపక్షదూర! కు
య్యో! కవియోగివంద్య! సుగుణోత్తమ! యో శరణాగతామరా
నోకహ! యో మునీశ్వర మనోహర! యో విమలప్రభావ! రా
వే! కరుణింపవే! తలఁపవే! శరణార్థిని నన్నుగావవే!

★*ఎంతందంగా కుయ్యో, మొర్రో అంటున్నాడో.*

ఓ కమలాక్షుడా! ఓ వరాలు ఇచ్చే ప్రభూ! శత్రువులపై కూడ వైరం లేనివాడా! పండితులచే నమస్కారాలు అందుకొనే వాడా! ఉత్తమ సుగుణాలు కలవాడా! శరణు కోరు వారికి కల్పవృక్షం వంటివాడా! మునీంద్రులకు ప్రియమైనవాడా! నిర్మలమైన మహిమ కల వాడా! నా మొర విను. వెంటనే రా. కనికరించు. కరుణించి శరణు వేడుతున్న నన్ను కాపాడు.
93: ఇలా ప్రార్థించి "రక్షణ లేనివారిని రక్షించే ఆ భగవంతుడు నన్ను కాపాడుగాక!" అని గజరాజు మొర పెట్టుకొన్నాడు. ఆకాశం వైపు నిక్కి నిట్టూర్చాడు. ఆకాశానికి చెవులు అప్పగించి ఆక్రోశించాడు. ఆ సమయంలో...

విష్ణువు ఆగమనము

విశ్వమయత లేమి వినియు నూరక యుండి
రంబుజాసనాదు లడ్డపడక
విశ్వమయుఁడు, విభుఁడు, విష్ణుండు, జిష్ణుండు
భక్తియుతున కడ్డపడఁ దలంచె.

★ *ఈ అమృతగుళిక చూడండి. గజరాజు ఏ దేముడి పేరూ పెట్టి పిలవకపోయినా విష్ణుమూర్తి వస్తున్నాట్ట, ఎందుకంటే విశ్వం అంతా ఆయనే కనుక.*

94. బ్రహ్మదేవుడు మొదలగు వారికి విశ్వమంతా నిండి ఉండే గుణం లేకపోవుటచేత గజరాజు మొర వినబడినా వారు అడ్డుపడకుండ ఊరికే ఉండిపోయారు. విశ్వమంతా వ్యాపించే వాడు, ప్రభువు, విజయశీలి ఐన విష్ణువు భక్తుడైన గజరాజును రక్షించాలని నిశ్చయించుకొన్నాడు.

95: అల వైకుంఠపురంబులో నగరిలో నా మూల సౌధంబు దా
పల మందారవనాంతరామృత సరః ప్రాంతేందు కాంతోపలో
త్పల పర్యంక రమావినోది యగు నాపన్నప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము పాహిపాహియన గుయ్యాలించి సంరంభియై

★*ఇది ప్రతి తెలుగువాని నోటపలికే మరో ప్రసిద్ధ పద్యరత్నం.*

ఆపదలలో చిక్కు కున్న వారిని కాపాడే ఆ భగవంతుడు ఆ సమయంలో వైకుంఠంలో ఉన్నాడు. అక్కడ అంతఃపురంలో ఒక పక్కన ఉండే మేడకు సమీపంలో ఒక అమృత సరస్సుంది. దానికి దగ్గరలో చంద్రకాంతశిలల అరుగుమీద కలువపూల పాన్పుపై లక్ష్మీదేవితో వినోదిస్తున్నాడు. అప్పుడు భయంతో స్వాధీనం తప్పిన గజేంద్రుడు కాపాడమని పెట్టే మొరవిన్నాడు. గజరాజుని కాపాడడానికి వేగిరపడ్డాడు.

96: సిరికిం జెప్పఁడు;శంఖచక్ర యుగముం జేదోయి సంధింప,డే
పరివారంబునుఁ జీరఁ; డభ్రగపతిం బన్నింపఁ; డాకర్ణికాం
తర ధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు; వివాదప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.

★ విష్ణుమూర్తి భక్తరక్షణలో ఎంత గట్టిగా ఉంటాడో చూడండి. ఈ పద్యానికి ఒక కథ. పోతన బావ శ్రీనాథుడు ఈ పద్యం విని, 'ఏ పరికరాలు లేకుండా అంతటి దేవుడు పరిగెట్టాడని ఎలా వ్రాసావు? అని వెక్కిరించాడట. తరువాత వారిద్దరూ భోజనాలు చేస్తుంటే, పోతన కొడుకు, నూతిలో పెద్దరాయి పడేసి, 'మామా నీ కొడుకు...' అని అరిచాడట. ఎంగిలి చేత్తో పరిగెట్టుకొచ్చాడు శ్రీనాథుడు. 'బావా! తాడైనా లేకుండా ఎందుకు వచ్చావు కాపాడటానికి?' అన్నాడట పోతన.

గజేంద్రుడి ప్రాణాలు కాపాడాలనే వేగిరపాటుతో విష్ణువు లక్ష్మీదేవికి చెప్పలేదు. శంఖచక్రాలను చేతులలో ధరించలేదు. సేవకులను ఎవరిని పిలవలేదు. వాహనం ఐన గరుత్మంతుని పిలవలేదు. చెవికుండలాల వరకు జారిన జుట్టుముడి కూడ చక్కదిద్దు కోలేదు. ఆఖరికి ప్రణయ కలహంలో పట్టిన లక్ష్మీదేవి పైటకొంగు కూడ వదలి పెట్టలేదు.97: హరి భక్తులను ప్రోచుట యందు అనురక్తి గలవాడు. సర్వ ప్రాణుల హృదయాలనే పద్మాలలో నివసించేవాడు. ఆయన గజేంద్రుని మొరలన్నీ విన్నాడు. లక్ష్మీదేవితో సరససల్లాపాలు చాలించాడు. ఆత్రుత చెంది అటునిటు చూసి గజేంద్రుని కాపాడుట అనే బరువైన బాధ్యత తీసుకొని (అటుపిమ్మట ఆయుధాలను అవధరించి)ఆకాశమార్గాన బయలుదేరాడు.అప్పుడు...

98 : అలా విష్ణుమూర్తి గజేంద్రుని రక్షించటం కోసం లక్ష్మీదేవి కొంగు కూడ వదలకుండా తటాలున బయలు దేరటంతో విష్ణువు వెనుక లక్ష్మీదేవి, ఆమె వెనకనే అంతఃపుర స్త్రీలు, వారి వెనుక గరుడుడు, ఆయన పక్కనే విల్లు, గదా శంఖచక్రాలు, నారదుడు, విష్వక్సేనుడు వస్తున్నారు. వారి వెనువెంట వరసగా వైకుంఠపురంలో ఉన్న వాళ్ళందరు వస్తున్నారు.

గమనిక:

ఇది పోతనగారు ప్రసాదించిన పరమాద్భుత అమృత గుళికలలో ఒకటి. పండిత పామరుల నోళ్ళలో తరచుగా నానుతుండే పద్యం. నడకలో భావంలో ఉత్తమ స్థాయి అందుకున్నది. చదువుతుంటేనే వేగంగా పయన మౌతున్న విష్ణుమూర్తి వెనుక అంత వేగంగాను వెళ్తున్న లక్ష్మీదేవి సూదిమొనగా గల బాణపు ములుకు లాగ అనుసరిస్తున్న పరివారం మనోనేత్రానికి దర్శనమిస్తుంది. ★ {విష్ణుమూర్తి – (అ) ఆయుధములు 1.ధనుస్సు శాఙ్గము 2.గద కౌమోదకి 3.శంఖము పాంచజన్యము 4.చక్రము సుదర్శనము 5.కత్తి నందకము (ఆ) రథము శతానందము (ఇ)సేనానాయకుడు విష్వక్సేనుడు (ఈ) వాహనం గరుత్మంతుడు.

99: అప్పుడు పద్మం వంటి లక్ష్మీదేవి ముఖంలో చిందుతున్న మకరంద బిందువుల వంటి తియ్యటి చెమట బొట్లకు తుమ్మెదలు ఆనందంతో ముసిరాయి. విష్ణుమూర్తి తన పైట కొంగు పట్టుకొని లాక్కుపోతుంటే వైకుంఠుని వెన్నంటి పోతూ ఇలా అనుకుంది.

100: "ఎందుచేతనో విభుడు తాను వెళ్ళే చోటు చెప్పటం లేదు. దిక్కులేని స్త్రీల దీనాలాపాలు విన్నాడో ఏమో? దుర్మార్గులైన దొంగలు ఎవరైనా వేదాలను దొంగిలించారేమో? దేవతల రాజధాని అమరావతిపై రాక్షసులు దాడి చేసారేమో? విష్ణువు ఎక్కడ ఉన్నాడో చెప్పండి అంటు దుర్మార్గులు భక్తులను బెదిరిస్తున్నారో ఏమో?"101: అని అనేక విధాలుగా లక్ష్మి సందేహపడ సాగింది.

102: గజేంద్రుని కాపాడాలని పరుగు పరుగున వెళ్తున్న భర్త వెంట కోటి చంద్రుల కాంతి నిండిన ముఖంతో లక్ష్మీదేవి వెళుతోంది. అప్పుడు ఆమె చెవి లోలకులు కదుల్తున్నాయి. భుజాల మీద వీడిన కొప్పుముడి చిందు లేస్తోంది. స్తనాలపై పైటకొంగు తొలగిపోయింది. ఒడ్డాణం వదులై పోయింది. నుదిటి మీద రాసుకొన్న లేపనం చెదిరిపోయింది. మోము కోటి చంద్రుల కాంతితో నిండిపోయింది. స్తనాల భారంతో నడుం చిక్కి పోయింది. ఆమె పైట కొంగు ప్రియభర్త చేతిలో చిక్కుకొనే ఉంది.103:

అడిగెద నని కడువడిఁ జను;
నడిగినఁ దను మగుడ నుడుగఁ డని నడ యుడుగున్;
వెడవెడ సిడిముడి తడఁబడ
నడు గిడు; నడుగిడదు జడిమ నడు గిడునెడలన్.

★పద్యం నడకలోనే తడబాటును రకరకాలుగా చూపిన

బహు చక్కని ఆణిముత్యమిది.

అప్పుడు లక్ష్మీదేవి భర్తను అడుగుదామని వేగంగా అడుగులు వేసేది. అడిగితే మారు పలుకడేమో అని అడుగుల వేగం తగ్గించేది. చీకాకుతో తొట్రుపాటుతో అడుగులు వేసేది. మళ్ళీ ఆగేది. అడుగులు కదిలించలేక తడబాటుతో నడిచేది.

ఈ పద్యం
చూస్తున్నామా?
వింటున్నామా?
చదువుతున్నామా?
అనిపిస్తుంది.
సందర్భానికి తగిన పలుకుల నడకలు. భావాన్ని స్ఫురింపజేసే పద ధ్వని.
ఇంకా ఆపైన సందర్భశుద్ధికేమో బహు అరుదైన సర్వలఘు కందపద్యం ప్రయోగం.
ఆహా ఏమి పద్యం!కాదు అమృత గుళిక.

104: నిటలాలకము లంట నివుర జుంజుమ్మని
ముఖసరోజము నిండ ముసురుఁ దేంట్లు;
నళులఁ జోపఁగఁ జిల్క లల్ల నల్లన చేరి
యోష్ఠబింబద్యుతు లొడియ నుఱుకు;
శుకములఁ దోలఁ జక్షుర్మీనములకు మం
దాకినీ పాఠీనలోక మెసఁగు;
మీన పంక్తుల దాఁట మెయిదీఁగతో రాయ
శంపాలతలు మింట సరణిఁ గట్టు;
శంపలను జయింపఁ జక్రవాకంబులు
కుచయుగంబుఁ దాఁకి క్రొవ్వుజూపు;
మెలఁత మొగిలు పిఱిఁది మెఱుఁగుఁదీవయుఁ బోలె
జలదవర్ణు వెనుకఁ జనెడునపుడు.

★*ఏమి వర్ణన, ఏమి వర్ణన!? అందుకే, పద్యరత్నమిది.*

కరిని కాపాడాలని కంగారుగా వెళ్తూ విష్ణుమూర్తి లక్ష్మీదేవి కొంగు వదల లేదు. దానితో భర్త వెనుకనే వెళ్తున్న లక్ష్మీదేవి–మేఘం వెంట మెరుపు తీగ వలె లక్ష్మీదేవి విష్ణుమూర్తి వెంట వెళ్ళసాగింది. ఆ సమయంలో ఆమె నుదుటి మీది ముంగురులను చక్కదిద్దుకోబోతే, పద్మంలాంటి ఆమె మోము నిండా తుమ్మెదలు ముసురుకున్నాయి. వాటిని తోలుతుంటే, ఆమె పెదవులను చూసి దొండపండనుకొని చిలుకలు వచ్చి చేరాయి. చిలకలని తోలుతుంటే, చేపల లాంటి ఆమె కన్నులను చూసి ఆకాశగంగ లోని పెనుచేపలు ఎగసి పడ్డాయి. చేపలను తప్పించుకోగానే ఆమె శరీరపు మెరుపు చూసి ఆ దేహలతని ఒరుసుకోడానికి మెరుపు తీగలు బారులు తీరాయి. మెరుపుతీగలను దాటగానే, చక్రవాకపక్షుల జంటలు మిడిసిపాటుతో గుండ్రటి ఆమె స్తనద్వయాన్ని తాకాయి.

105: విష్ణుమూర్తి రాక్షసుల బతుకు తెరువులను నశింపజేసేవాడు,దయారసంతో మించేవాడు, మహాయోగుల హృదయాలనే వనాలలో విహరించేవాడు, గొప్ప ఓర్పుగల వాడు, భక్తుల గొప్పదనాన్ని పెంపొందించేవాడు, నవయౌవనంతో వెలుగొందే లక్ష్మీదేవితో కలిసి విహరించే వాడు. జయశీలుడు, మహా కాంతిమంతుడు. అట్టి భగవంతుడిని ఆకాశమార్గంలో వస్తుండగా దేవతలు చూసారు.106: అలా గజేంద్రుని కాపాడటానికి వెళుతున్న విష్ణుమూర్తిని దేవతలు కనుగొని107: గజేంద్రుని ఆర్తి బాపటానికి ఆరాటంగా ఆకాశంలో వెళ్తున్న శ్రీమహావిష్ణువును చూసి దేవతలు"అదుగదుగో మహనీయుడైన విష్ణుమూర్తి వస్తున్నాడు. అతని వెనుకనే శ్రీమహాలక్ష్మి వస్తున్నది చూడండి. అదిగో పాంచజన్య శంఖధ్వని. సర్పాలను సంహరించేవాడు

గరుత్మంతుడు అదిగో చూడండి వెంట వస్తున్నాడు." అనుకుంటు "నారాయణునికి నమస్కారం" అంటు నమస్కారాలు చేస్తున్నారు.108: ఆ సమయంలో గజేంద్రుడిని రక్షించాలని వెళ్తున్న తొందరలో, విష్ణుమూర్తి దేవతల మొక్కులు అందుకోలేదు. అలా మనోవేగంతో వెళ్ళి, ఏనుగు, మొసలి పోరాడుతున్న మడుగుని చూసాడు. ఆ మడుగులో శింశుమార చక్రంలో లాగ గొప్ప మొసళ్ళు, పీతలు, చేపలు జంటలు జంటలుగా ఉన్నాయి. కుబేరుని ధనాగారంలోని కచ్చపం అనే నిధి వంటి శ్రేష్ఠమైన తాబేళ్ళు ఉన్నాయి, ధనవంతుని సుఖజీవనంలోని అనురాగం లాగ ఎఱ్ఱని జీవనం (నీరు) నిండుగా ఉంది, వైకుంఠం వలె శంఖం, చక్రం (చక్రవాక పక్షులు), కమల (లక్ష్మి) లతో అలంకరింపబడి ఉంది. సుఖదుఃఖాలనే ద్వంద్వాలతో నిండిన సంసారం వలె జలచరాల జంటలతో కలచబడిన బురద కలిగి యున్నది.

గజేంద్ర రక్షణము

109: దయాసాగరుడైన నారాయణుడు మొసలిని చంపమని తన చక్రాన్ని పంపాడు. ఆ చక్రం భూమండలాన్ని కంపింప జేసే వేగం కలది. గొప్ప అగ్నికణాల జల్లుతో ఆకాశమండలాన్ని కప్పివేసేది. అనేక విధములైన బ్రహ్మాండభాండాల సమూహాలలోను ఎదురు లేనిది. దేవతలను అందరిన కాపాడేది.110: ఇలా పంపగానే, 111: చక్రాయుధం సరోవరంలోని లేలేత పద్మాలని కౌగలించుకోడానికి వెళ్తున్న సూర్యబింబంలా వెళ్ళింది. గుభిల్లు గుభిల్లనే పెద్ద చప్పుడుతో మడుగు కలచిపోయేలా లోపలికి దూకింది. రివ్వున మనో వేగంతో ఆ చెడ్డదైన మొసలి ఉన్న చోటు సమీపించింది.112: రివ్వున పోయి, చక్రాయుధం మొసలి తలని భయంకరంగా తెగనరికింది. ఆ మకరం మేరు పర్వతమంత పెద్ద దేహం గలది, అడవి ఏనుగులకు సైతం భయం కలిగించేది, కామక్రోధాలతో నిండినది. గజరాజు రక్తధారల రుచిమరిగినది, అంతులేని ఉత్సాహంతో అలసటలేకుండ పోరాడుతుంది, గెలుపుని నమ్మకంగా కోరుతున్నది. విష్ణుచక్రం వెళ్ళి అలాంటి మొసలి శిరస్సుని ఖండించి ప్రాణాలు తీసింది.

గమనిక:

ఈ అద్భుతమైన పోతన పద్యం ఒక అమృత గుళిక. కామక్రోధన గేహమట. సంసార చక్రంలో చిక్కి ముక్తి కోరుతున్న జీవుని బాధించే కామం. అది క్రోధానికి గృహమట.

ఎంత బలమైనదో వివరించారు కూడా. అంతేనా పద్యం చివర భాగందాకా ఆగారు. అంతటి దానిని వదుల్చుకోవడానికి అంతులేని మానవ ప్రయత్నం, దేవ సహాయం రెండూ కావాలని సూచిస్తూ. కామానికి సంకేతం మకరం అని రూఢి చేయబడింది. ఇందుకే పోతనగారు భక్తిప్రపత్తి ముఖ్య మన్నది.

113: ఇలా రెప్పపాటు కాలంలో మొసలి శిరస్సును సుదర్శన చక్రం ఖండించిన ఆ సమయంలో

114: మకర మొకటి రవిఁ జొచ్చెను;
మకరము మఱియొకటి ధనదు మాటున డాఁగెన్;
మకరాలయమునఁ దిరిగెఁడు
మకరంబులు కూర్మరాజు మఱువున కరిగెన్

ద్వాదశరాశులలో ఉండే మకరం సూర్యుని చాటున నక్కింది. నవనిధులలో ఉండే మకరం కుబేరుని చాటున దాక్కుంది. సముద్రంలో ఉన్న మకరాలు ఆదికూర్మం చాటుకి చేరాయి.

(మకరం అంటే మొసలి. ఇలా మొసళ్ళు అన్నీ బెదిరిపోవడానికి కారణం భూలోకంలో ఒక మడుగులో ఉన్న గజేంద్రుని హరించ సిద్ధపడ్డ మకరం ఖండింపబడటం. విష్ణుమూర్తి సుదర్శనచక్రం అంటే ఉన్న విశ్వవ్యాప్త భీతిని స్ఫురింపజేసినట్టి కవి చమత్కారం యిది. (1)ఆకాశంలో ఉన్న మకరం అంటే ఆకాశంలో (1.మేషము 2.వృషభము 3.మిథునము 4.కర్కాటకము 5.సింహము 6.కన్య 7.తుల 8.వృశ్చికము 9.ధనుస్సు 10.మకరము 11.కుంభము 12.మీనము అనబడే ద్వాదశ రాసులు ఉన్నాయి కదా వాటిలోని మకరం) (2) పాతాళంలో ఉన్న మకరం అంటే కుబేరుని వద్ద (1.మహాపద్మము 2.పద్మము 3.శంఖము 4.మకరము 5.కచ్ఛపము 6.ముకుందము 7.కుందము 8.నీలము 9.వరము అనబడే నవనిధులలోని మకరం. (3) సముద్రంలోని మకరాలు అంటే మొసళ్ళకి అదే కదా నివాసం. ఆ మకరాలన్నీ. ఇంకా సముద్ర మథన సమయంలో ఆది కూర్మం సముద్రంలోనే కదా అవతరించింది.)

115: కారుచీకటి నుండి వెలువడిన చందమామ లాగ, సంసార బంధాల నుండి విడివడిన సన్యాసి లాగ, గజేంద్రుడు మొసలి పట్టు విడిపించుకొని ఉత్సాహంగా కాళ్ళు కదలించాడు. ఆదరంతో ఆడదిగ్గజాలు లాంటి ఆడ ఏనుగులు తొండాలతో పోసిన అమృత జలంలో స్నానం చేసి అలసట తీర్చుకొని గజేంద్రుడు గర్వించి చక్కదనాలతో ఉన్నాడు.

గమనిక:

ఉత్తి విరక్తుడు కాదు సంసారదుఃఖము వీడ్కొన్న విరక్తచిత్తుడు అనడంతో గజేంద్రుడు ముముక్షువైన జీవుడు అని సంకేతం రూఢి అయింది గమనించారా?

116: విష్ణుమూర్తి విజయసూచకంగా పాంచజన్య శంఖాన్ని ఊదాడు. ఆ శంఖం దయారసానికి సాగరం వంటిది. తన మహా గొప్పధ్వనితో పంచభూతాల మహా చైతన్యాన్ని పటాపంచలు చేసేది. అపారశక్తితో కూడిన తెల్లని కాంతితో ఇంద్రాది ప్రభువులకైన బెరకు పుట్టించేది, దీనుల దుఃఖాన్ని పోగొట్టేది. శత్రువుల సైన్యాలను పారదోలేది.117: శ్రీహరి పాంచజన్యం ధ్వనించగానే దేవతల దుందుభులు మోగాయి. పద్మాల సువాసనలతో కూడిన గాలులు వీచాయి. పూల వానలు కురిసాయి. దేవతా స్త్రీలు నాట్యాలు చేసారు. సకల ప్రాణుల జయజయధ్వానాలు నల్దిక్కుల వ్యాపించాయి. తన తరంగాలతో సముద్రుడు ఉప్పొంగి ఆకాశగంగ ముఖపద్మాన్ని ముద్దాడి ఆనందించాడు.118: మహారాజా! విష్ణుమూర్తి తన పొడవైన చేతితో గజేంద్రుని సరస్సులోంచి బయటకు తీసుకొని వచ్చాడు. అతని మదజల ధారలు తుడిచాడు. మెల్లగా దువ్వుతు దుఃఖాన్ని పోగొట్టేడు.119: విష్ణుమూర్తి చేతి స్పర్శ వల్ల గజేంద్రుని శరీరతాపం అంతా పోయింది. గజరాజు సంతోషంగా ఆడఏనుగుల సమూహంతో కలిసి చేస్తున్న ఘీంకార నాదాలతో సొంపుగా ఉన్నాడు.120: శ్రీహరి దయవల్ల బతికినట్టి గజేంద్రుడు, ఇదివరకు లానే తన ఆడ ఏనుగులను తన తొండంతో మెల్లగా తాకాడు. మళ్ళీ మిక్కిలి ప్రేమగా వాటి తొండాలను తన తొండంతో నొక్కాడు.

గజేంద్రుని పూర్వజన్మ కథ

121: పరీక్షిన్మహారాజా! అప్పుడు దేవల ముని పెట్టిన శాపం నుండి విముక్తి కావడంతో "హూహూ" అనే పేరు గల ఆ గంధర్వుడు ఆ కఠినమైన మొసలి రూపం విడిచిపెట్టేడు. తన పూర్వపు నిర్మలరూపం ధరించాడు. మిక్కిలి భక్తితో విష్ణుమూర్తికి మొక్కి స్తోత్రాలు చేసి ఆ దేవదేవుని అనుగ్రహం పొందాడు. భక్తిగా వంచిన శిరస్సుతో మరల మరల నమస్కరిస్తూ సంతోషంగా పుణ్యాత్ముడై గంధర్వ లోకానికి వెళ్ళిపోయాడు. అప్పుడు విష్ణుమూర్తి గజరాజును చేతితో దువ్వుటచే, వెంటనే గజరాజు అజ్ఞాన మంతా తొలగిపోయింది. అతను విష్ణుదేవుని సారూప్యం పొంది ప్రకాశించాడు.

122: రాజా! మొసలితో పోరాడిన ఆ గజరాజు పూర్వ జన్మలో ఇంద్రద్యుమ్నుడు అనే ద్రవిడ దేశపు మహారాజు. అతడు అతి శ్రేష్ఠమైన విష్ణు భక్తుడు. ఒక పెద్ద పర్వతంమీద మౌనవ్రతం పూని సర్వాత్మ ఐన శ్రీహరిని గూర్చి విశేష పూజలు జరిపేవాడు.123: పరీక్షిన్మహారాజా! ఒక రోజు విష్ణుమూర్తిని మనసులో ధ్యానం చేస్తూ ఇంద్రద్యుమ్నుడు మౌనంగా ఏకాగ్రచిత్తంతోఉన్నాడు. అప్పుడు అక్కడకి అగస్త్య మహర్షి వచ్చాడు. రాజు తనను గౌరవించ లేదని, లేవకుండ మౌనంగా ఉన్నాడని ఆగ్రహించాడు "ఓరీ మూర్ఖుడా! పిసినిగొట్టు! ఏనుగు కడుపున జన్మించు." అని అతనికి శాపమిచ్చాడు.124: అగస్త్య మునీశ్వరుని అవమానించిన గొప్పవాడైనట్టి ఇంద్రద్యుమ్న మహారాజు ఏనుగుగా పుట్టాడు. అందుకే ఎంతటి గొప్ప పుణ్యాత్ములైనా సరే బ్రాహ్మణులను అవమానించరాదు.125: ఓ రాజేంద్ర! ఇంద్రద్యుమ్నుడు గజేంద్రుడుగా, అతని భటులందరు

ఏనుగులుగా పుట్టారు. ఏనుగుగా పుట్టినా కూడ అతనికి విష్ణుభక్తి వల్ల గొప్పదైన ముక్తి లభించింది.126: భక్తుడు తన పనులు తాను నిర్వర్తించాలి, విష్ణుమూర్తిని సేవించాలి. ఈ రెండు నియమాలు సక్రమంగా పాటిస్తే క్రమంగా అతని పాపాలన్నీ నశించిపోతాయి. మిక్కిలి బలవంతమైనట్టి విష్ణుభక్తి ఎప్పటికి నశించదు.127: దుర్జనుల ఏనుగులు, గుఱ్ఱాలు, సంపదలు అన్ని నశించిపోతాయి. వారి ఆలుబిడ్డలు నశించిపోతారు. గుణవంతులైన సజ్జనులు చెడకుండ బతుకుతారు. వారికి విష్ణుభక్తి మీది ఆసక్తి చెడదు.

లక్ష్మీ నారాయణ సంభాషణ

128: గజేంద్రుని రక్షించాక లోకాలకు తండ్రి ఐన విష్ణుమూర్తి చిరునవ్వుతో ఉన్న లక్ష్మీదేవితో ఇలా అన్నాడు. 129: "చిన్నదానా! పద్మముఖీ! ఆకాశమార్గంలో నా వెనకాతలే విలాసంగా వస్తూ, నేను నీ పైటకొంగు విడువ కుండా పట్టుకొని ఉన్నందుకు నన్ను గురించి ఏమనుకొన్నావో ఏమిటో?130: ఓ వనితా! ఇది నీకు తెలుసు కదా! తెలిసి ఇతరులకు మొరపెట్టకుండ గుర్తుపెట్టుకొని నన్ను వేడుకొన్న వారిని ఎవరినీ, ఎప్పుడూ నేను విడువను. నన్ను విడిచిపెట్టిన వారిని నేను విడిచిపెడతాను."131: శ్రీహరి మాటలు విని పద్మాలలో నివసించెడి లక్ష్మీదేవి చిరునవ్వు చిందే ముఖపద్మంతో గోవిందుడితో ఇలా అంది.132:"ఓ దేవదేవా! సమస్తానికి ప్రభువా! ఓ నా స్వామీ! నీ పాదాలను మనస్సులో పెట్టుకొని పూజించడమే నా పని కదా. కనుక ఏమీ అనుకోకుండానే నిన్ను అనుసరించి వస్తున్నాను.133: ఓ దేవాధిదేవ! ఓ మహాప్రభూ! దీనుల మొరలను దయతో వినటానికైనా, వారిని కాపాడటానికైనా, మంచి మంచి దీవెనలు అందుకోటానికైనా, దీనబంధు! దీనరక్షక! నీకే తగునయ్యా."134: ఇలా చెప్పిన పిమ్మట లక్ష్మీదేవి తగిన పలుకులతో శ్రీహరిని స్తుతించింది. ఆయన ఆ పరమభక్తు రాలైన లక్ష్మిని చక్కటి మాటలు, చిరునవ్వులతో కౌగలించు కొన్నాడు. గరుడులు గంధర్వులు, సిద్ధులు, దేవతలు జయ జయధ్వానాలు చేసారు. స్వామి గరుడవాహనం అధిరోహించాడు. పరివారసమేతంగా వైకుంఠానికి తరలి వెళ్ళాడు." అని చెప్పి శుకమహర్షి ఇలా చెప్పాడు.

గజేంద్రమోక్షణ కథా ఫలశ్రుతి

135: "ఓ మహారాజా! నీకు నేను వివరించిన విష్ణు మహిమతో కూడిన గజేంద్రమోక్షణం అనే ఈ కథ వినెడివారి కీర్తి వృద్ధి చెందుతుంది, పాపాలు పరిహారమౌతాయి, చెడ్డ కలలు తొలగి పోతాయి, కష్టాలు దూరమౌతాయి. ప్రతిరోజు ఉదయమే లేచి పవిత్రంగా నియమంగా పారాయణగా చదివెడి నిర్మలమైన మనస్సు గల బ్రాహ్మణులకు అనేక రకాలైన వైభవాలు గొప్ప సంపదలు సమకూరుతాయి, ఆపదలు అంతరిస్తాయి, సౌఖ్యాలు దరిజేరతాయి, శుభాలు వృద్ధిచెందుతాయి, మోక్షం సులభ మౌతుంది. సంతోషాలు సమకూరతాయి." అని ఆనందంగా విష్ణుమూర్తి చెప్పాడు.

136:ఈ విధంగా చెప్పి శ్రీహరి ఇంకా ఇలా అన్నాడు "తెల్లవారకముందే నిద్రలేచి ప్రశాంతమైన మనస్సుతో విష్ణుమూర్తిని, గజేంద్రుడిని, ఆ పద్మసరస్సును, శ్వేతద్వీపాన్ని, పాలసముద్రాన్ని, త్రికూటపర్వత గుహలను, అడవులను, పేము, వెదురు, పొదలు, కల్ప వృక్షాలను, బ్రహ్మవిష్ణు మహేశ్వరులు నివసించే ఆ త్రికూట పర్వత శిఖరాలను, కౌమోదకీ గదను, కౌస్తుభ మణిని, సుదర్శన చక్రాన్ని, పాంచజన్య శంఖాన్ని, లక్ష్మీదేవిని, ఆది శేషుడుని, గరుత్మంతుడిని, వాసుకిని, ప్రహ్లాదుడిని, నారదుడిని, మత్స్య, కూర్మ, వరాహ మొదలైన అవతారాలని, ఆయా అవతారాలలో చేసిన కృత్యాలను, సూర్యుడు, చంద్రుడు, అగ్నులను, ఓంకారాన్ని, ధర్మం, తపస్సు, సత్యాలను, వేదాన్ని, వేదాంగాలను, శాస్త్రాలను, గోవులు, బ్రాహ్మణులు, సాధువులు, పతివ్రతలను, చంద్రుడి భార్యలను (దక్షపుత్రికలు నక్షత్రాలు అయిన అశ్వని, భరణి మున్నగు ఇరవైఏడు మంది), కశ్యపుడి భార్యలను (అదితి, దితి మున్నగు వారు పదిహేనుమందిలో దక్షపుత్రికలు పదముగ్గురు వైశ్వానరుని కుమార్తెలు ఇద్దరు) గంగ, గౌరి, సరస్వతి, యమున, సునంద మొదలైన పుణ్యనదులను, దేవతలను, దేవతా వృక్షాలను, ఐరావతాన్ని, అమృతాన్ని, ధ్రువుని, బ్రహ్మర్షులను, పుణ్యాత్ములైన మానవులను, ఏకాగ్రచిత్తులై తలంచేవారికి, విష్ణువునకు చెందిన నిర్మలపదం చనిపోయే సమయంలో అనుగ్రహిస్తాను." ఇలా చెప్పి విష్ణువు శంఖాన్ని పూరించాడు. దేవతలు అందరు ఆయన పాదపద్మాలకు నమస్కారాలు చేసారు. శ్రీహరి గరుడుని అధిరోహించి పయనమయ్యాడు. దేవతలు సంతోషించారు." అని చెప్పి శుకబ్రహ్మ పరీక్షిత్తుతో ఇంకా ఇలా అన్నాడు.137: గజేంద్ర మోక్షం కథను భక్తితో నియమంగా చదివేవారికి గజేంద్రుడిని రక్షించిన శ్రీమహావిష్ణువు ఇహలోక వైభవాలైన ఏనుగులు, గుఱ్ఱాలు, రథాలు, మరియు పరలోక సౌఖ్యాన్ని, మోక్షాన్ని అనుగ్రహిస్తాడు.

రైవతమనువు – 5 చరిత్ర

138 : ఓ పరీక్షిన్మహారాజా! నాలుగవ మనువు తామస మనువుకు తమ్ముడైన రైవతుడు అయిదో మనువు అయ్యాడు. అతని కుమారులు ప్రతివింధ్యుడు, అర్జునుడు మొదలైనవారు భూమండలానికి రాజులు అయ్యారు.139: రాజా పరీక్షిత్తూ! ఈ అయిదో మన్వంతరంలో హిరణ్యరోముడు, ఊర్ధ్వ బాహుడు, వేదశీర్షుడు మున్నగువారు, సప్తర్షులు అయ్యారు, భూతరయులు మొదలైనవారు దేవతలు అయ్యారు. శుభ్రుడికి, పతివ్రత అయిన వికుంఠ అనే అతని భార్య కడుపున, "వైకుంఠుడు" అనే పేరుతో విష్ణుమూర్తి పుట్టాడు. అతడు అన్ని లోకాల వారు గౌరవించేలా "వైకుంఠము" అనే లోకాన్ని సృష్టించాడు. అతనిని లక్ష్మీదేవి స్వయంగా పెళ్ళి చేసుకుంది. ఆ దేవదేవుని మహిమను, సుగుణాలను ఊహించడం సాధ్యం కాదు. భూమండలంలో గల ధూళి కణాలు అన్నిటినీ తెలుసుకోగలమేమో కాని వైకుంఠుని గుణగణాలు తెలుసు కోవటం సాధ్యం కాదు.140: అటు పిమ్మట...

చాక్షుసమనువు - 6. చరిత్ర

141:పరీక్షిత్తు మహారాజా! ఆరవమనువుగా, చక్షువు పుత్రుడు చాక్షుషుడు అయ్యాడు. ఆ చాక్షుష మన్వంతరంలో, అతని కొడుకులు అయిన పురుడు, పురుషుడు, సుద్యుమ్నుడు మున్నగువారు రాజులయ్యారు, మంత్రద్యుముడు ఇంద్రుడు అయ్యాడు,ఆప్యాదులు దేవతలు అయ్యారు. హవిష్మంతుడు, వీరకుడు మున్నగువారు సప్తర్షులు అయ్యారు, వైరాజుకీ సంభాతికీ "అజితుడు" అనే పేరుతో విష్ణువు పుట్టాడు. అతడే కూర్మరూపం ధరించి మంథర పర్వతాన్ని సముద్రంలో మునిగిపోకుండా మోసాడు. దేవతలు ప్రార్థించగా క్షీరసాగరాన్ని చిలికి అమృతాన్ని దేవతలకు అందించాడు.

విశేష వివరణ: చతుర్దశ మన్వంతరాలలో నాలుగవదైనతామస మన్వంతరంలో గజేంద్ర మోక్షం ఘట్టం జరిగింది. తరువాత అయిదవదైన రైవత మన్వంతరం, ఆ తరువాతది ఆరవది అయిన చాక్షుష మన్వంతరం. ఈ మన్వంతరంలో క్షీరసాగర మధనం జరిగింది. ఆ పిమ్మట వచ్చినది ప్రస్తుతం నడుస్తున్న వైవశ్వత మన్వంతరం.

సముద్రమథన కథా ప్రారంభం

142: శుక మునీశ్వరుడు అలా చెప్పగానే పరీక్షిత్తు మహారాజు ఇలా అడిగాడు.143: "మునిశ్రేష్ఠుడవైన శుకుడా! పూర్వకాలంలో విష్ణుమూర్తి పాలసముద్రాన్ని ఎందుకు చిలికాడు? పాల సముద్రంలోని అంత పెద్ద కవ్వపు కొండ మంథర పర్వతం కిందకు దూరి తాబేలు రూపంలో ఎందుకు మోసాడు? అమృతాన్ని దేవతలకు ఎలా అందించాడు? అలా చిలుకుతుంటే పాలసముద్రం లోనుంచి ఏమేమి పుట్టాయి? ఇవన్నీ ఆశ్చర్యకరమైన విషయాలు కదా! వాటన్నిటినీ నాకు వివరంగా చెప్పు.144: ఉత్తమ పండితుడవు అయిన శుకమహర్షి! భగవంతుడి కథలు ఎన్ని చెప్పినా నాకు తృప్తి కలగదు. చెవులారా వింటాను, విష్ణు కథలు ఇంకా చెప్పు."145: ఇలా అడిగిన పరీక్షిత్తు మాటలు విని సంతోషించి శుకమహర్షి విష్ణుకథలను చెప్పడానికి పూనుకున్నాడు" అని చెప్పి సూత మహర్షి శౌనకుడు మున్నగు మహర్షులతో మరల ఇలా చెప్పసాగాడు "అప్పుడు శుక ముని పరీక్షిత్తుకు ఇలా చెప్పసాగాడు

సురలు బ్రహ్మ శరణు జొచ్చుట

146:"రాజా పరీక్షిత్తూ! రాక్షస మూకలు విజృంభించి ఆయుధాలు ధరించి దేవతలను మించి గట్టి యుద్ధాలు చేశారు. దేవతల బలం తగ్గి, సామర్థ్యాలలో తేడాలు గల ఆ యుద్ధాలలో అనేక ఇక్కట్ల పాలై, ప్రాణాలు అరచేతులలో పెట్టుకుని, శత్రువులను లొంగదీసుకునే ఉపాయం తెలియక తల్లడిల్లిపోయారు.147: అలాంటి యుద్ధాల సందర్భంలో, వరుణుడు మున్నగు దేవతా

ప్రముఖులతో కూడి, దేవేంద్రుడు మేరుపర్వతానికి వెళ్లాడు. అక్కడ దేవతలకు పెద్ద అయిన బ్రహ్మదేవుని దర్శించి నమస్కారం చేసాడు. దేవతలు అందరూ ఆయనకు రాక్షసుల దురాగతాలను ఇలా వివరించారు.148 :"దుర్వాసుడి శాపం వలన లోకాలు అన్నీ పౌరుషమూ వైభవమూ కోల్పోయాయి. ఇంద్రుడితో సహా అన్ని లోకాల వారూ ఓడిపోయారు. పండుగలు అంతరించాయి." 149: తమ ఇల్లూ, వాకిలీ విడిచిపెట్టి కాంతి విహీనులు అయి తన వద్దకు వచ్చిన దేవతలను బ్రహ్మదేవుడు చూశాడు. పరమాత్మకు నమస్కరించి, ధ్యానం చేసాడు. తరువాత వికసించిన ముఖకమలంతో ఇలా అన్నాడు.150:"నాకూ, మీకూ, కాలానికీ, మానవులకూ, పశువులకూ, పక్షులకూ, చెట్లకూ, తీగలకూ, చెమటతో పుట్టే అల్పజీవులకూ, మూలపురుషుడు భగవంతుడు. అతనిని మనము శరణు వేడుదాము. మీరు దుఃఖపడకండి.151: భగవంతుడికి చంపదగినవాడు, కాపాడదగినవాడు, కష్టపెట్టదగినవాడు, గౌరవించదగినవాడు అనే తారతమ్య భేదం లేదు. సృష్టిని రక్షించడానికి, నాశనం చేయడానికి అతడే కర్త. అటువంటి భగవంతుడే మన మనోవ్యథలు పోగొట్టేవాడు. మనకు ఎల్లప్పుడూ ఆధారమైన వాడు.152: వరాలు ఇచ్చే వాడు, పరమాత్ముడూ, సకల లోకాలకు తండ్రి, దయామయుడు అయిన ఆ స్వామిని దర్శనం చేసుకుంటే, మన దుఃఖాలు, బాధలూ అన్నీ దూరం అవుతాయి." అని చెప్పి, బ్రహ్మదేవుడు వేగంగా అజితుడైన ఆ భగవానుని స్థానానికి వెళ్ళాడు.153

బ్రహ్మాదుల హరిస్తుతి

అలా బ్రహ్మదేవుడు దేవతలు కలిసి భగవంతుని వద్దకు వెళ్ళి ఏకాగ్రచిత్తంతో అదృశ్యరూపుడు అయిన భగవంతుడిని ఈ విధంగా ప్రార్థించాడు.154: "భగవాన్! నీ మాయ వలన సృష్టి సమస్తమూ మోహంలో మునిగిపోతుంది,నీ మాయను దాటడం ఎవరి వల్లా కాదు, ఏమాత్రమైనా నీ మాయను గెలిచినవారు ఎవరూ లేరు,నీవు ప్రాణులు అందరి ఎడల సమానంగా మెలగువాడవు, నీ వల్ల పుట్టిన భూమి నీ పాదాలు,శివుడు నీ మనస్సు, అగ్ని నీ ముఖము, సూర్యచంద్రులు నీ కన్నులు, దిక్కులు నీ చెవులు,జలం నీ వీర్యం,త్రిమూర్తులకు నీ రూపం పుట్టిల్లు, సృష్టి సమస్తమునకు మూలాధారం నీ కడుపు, ఆకాశం నీ శిరస్సు, ఈ విధంగా విశ్వరూపుడవైన నీకు నమస్కరిస్తున్నాను.155: నీ బలం నుండి దేవేంద్రుడూ, అనుగ్రహం నుండి దేవతలు, ఆగ్రహం నుండి రుద్రుడు, పౌరుషం నుండి బ్రహ్మదేవుడు, ఇంద్రియాల నుండి వేదాలూ, మునులూ, పురుషాంగం నుండి ప్రజాపతి, రొమ్ములనుండి లక్ష్మీదేవి, నీడ నుండి ధర్మము, వీపు నుండి అధర్మము, తల నుండి స్వర్గము, నవ్వు నుండి అప్సరసలు,ముఖం నుండి బ్రాహ్మణులు, బ్రహ్మము, భుజాల నుండి రాజులు. బలము, తొడల నుండి వైశ్యులు, నేర్పరి తనము, పాదాల నుండి శూద్రులు, శుశ్రూష, క్రింద పెదవి నుండి లోభము, పై పెదవి నుండి ప్రేమ, ముక్కుపుటాల నుండి కాంతి, స్పర్శ నుండి కామము, కనుబొమలు నుండి యముడు,

పక్కభాగం నుండి కాలము సంభవించాయి, యోగమాయ వలన ద్రవ్యము, వయస్సు, కర్మము, గుణవిశేషాలు విధింపబడ్డాయి, నీ ఆత్మతంత్రం నుండి ధర్మము, అర్థము, కామము, మోక్షము కలిగాయి, నీ వలన లోకాలు, లోకపాలకులు ఏర్పడి అభివృద్ధి పొందుతారు, దేవతలకు ఆయుస్సు, ఆహారము, బలమూ నీవే. పర్వతాలపై అధికారివి నీవే. ప్రజలను పుట్టించి వారిని కాపాడే కర్మకాండల కోసం ఏర్పడిన అగ్నివి నీవే, సముద్రంలో రత్న రాసులను విస్తరింపజేసేది నీవే, మోక్షానికి ద్వారమైన పరబ్రహ్మం నీవే, చావు బ్రతుకులు నీ రూపాలే, ప్రాణులకు అన్నింటికీ ప్రాణం నీవే, తేజస్సు, అహంకారం, వాయువు నిండిన ప్రాణుల దేహాలలో, అవయవాలలో, ఆత్మలో నీవే నివసిస్తావు, పరమశక్తివైన మహాప్రభూ! మాపై దయచూపు.156:

★156: మొదల జల మిడిన భూజము
దుది నడుమను జల్లదనము దొరకొను మాడ్కిన్
మొదలను హరికిని మ్రొక్కిన
ముద మొందుదు మెల్ల వేల్పుమూకలు నేమున్.

చెట్టు మొదలు వద్ద నీళ్ళు పోస్తే చెట్టు కొనకొమ్మలలోనూ, మధ్యలోనూ, చల్లదనం వ్యాపిస్తుంది. అలాగే మొదట నీకు మొక్కితే దేవతలూ, నేనూ సంతోషిస్తాము.157: పుణ్యాత్మా! దయామయా! గొప్ప తేజస్సు గలవాడా! కష్టాలపాలై నిన్ను దర్శించాలి అనుకునే వారికి నీ ముఖపద్మం సకాలంలో సమగ్రమైన సంపదను సమకూర్చుతుంది."

విశ్వగర్భుని ఆవిర్భావము

158 : దేవతా సమూహాలతో కూడి బ్రహ్మదేవుడు ఇలా అనేక రకాలుగా విష్ణుమూర్తిని స్తోత్రం చేసాడు. అంతట కరుణించి విశ్వాలు అన్నిటినీ తన గర్భంలో ధరించే ఆ మహానుభావుడు ప్రత్యక్షం అయ్యాడు.159: అలా ప్రత్యక్షమైన మహావిష్ణువు రూపు వెయ్యి సూర్యుల తేజస్సు ఒకటిగా పోతపోసిన ప్రకాశ వైభవంతో ప్రకాశిస్తోంది. చూస్తున్న దేవతల చూపులు చెదిరి పోయాయి. స్వామిని చూడగానే కొంతసేపు భయపడ్డారు, ఆశ్చర్యచకితులు అయ్యారు. వారికి ప్రభువును చూడటం సాధ్యం కాదు కదా!160: ఆ సమయంలో విష్ణుమూర్తి ఎలా ఉన్నాడు అంటే...161: భగవంతుడు శ్రీహరి హారాలు, కిరీటాలు, భుజకీర్తులు, కుండలాలు, కాలి అందెలు, మొలనూలు, కంకణాలు, కౌస్తుభరత్నము, కౌమోదకీ గద, శంఖము, చక్రము, విల్లు ధరించి దర్శనం ఇచ్చాడు. మరకత మణి వంటి నల్లని మేను, కాంతులీనే పద్మాల వంటి కళ్ళు, చెక్కిళ్ళపై ప్రతిఫలిస్తున్న తళతళలాడే మకర కుండలాల కాంతులూ కలిగి ఉన్నాడు. బంగారురంగు పట్టు వస్త్రం ధరించి ఉన్నాడు. మెడలో వైజయంతీమాల ప్రకాశిస్తూ ఉంది. ఎంతో అందంగా ఉన్న స్వామి రూపాన్ని బ్రహ్మదేవుడు, శివుడు, దేవతలు సంతోషంతో పొంగిపోతూ దర్శించుకున్నారు. బ్రహ్మదేవుడు భగవంతునికి నమస్కారం చేసి ఇలా స్తోత్రం చేయటం మొదలెట్టాడు.

162: జనన మరణాదులు లేనివాడవు, మహర్షులచే కీర్తింపబడువాడవు, మోక్షసౌఖ్యాన్ని సమృద్ధిగా అందించే వాడవు, సుగుణ మయుడవు, సూక్ష్మమైన అన్నిటి కంటే బహు సూక్ష్ముడవు, మిన్నలను అన్నింటిని మించిన మిన్నవు, పుణ్యాత్ముడవు అయిన నిన్ను స్తుతిస్తున్నాము.163: ఓ పరమపురుషా! శ్రీమహావిష్ణూ! నీ రూపం సమస్తమైన భువనాలకూ శ్రేయోదాయకం అయినది. ఆ రూపం శాశ్వతమైన వేద మంత్రంతో కూడి మీ యందే మాకు కనబడుచున్నది.164: కుండకు మన్నే ఆధారం, కనుక కారణభూతం. దీనిని ఘటపటన్యాయం అంటారు. అలాగే, ఈ సృష్టికి మొదలూ, మధ్య, అంతమూ నీలోనే ప్రకాశితమవు తున్నాయి. ఈ సృష్టి ఆది,మధ్య, అంతములను మూడుదశలకు కారణభూతం నీవే.

విశేష వివరణ:

కుండలు ఎన్ని రకాలైనా ఎన్నైనా అన్నీ మట్టియొక్క రూపాలే, మట్టి అంతా ఒక్కటే. అందుచేత కుండకు ఆధారం మట్టి,పటములు అంటే వస్త్రాలు ఎన్ని రకాలైనా ఎన్నైనా అన్నీ దారాలయొక్క రూపాలే, దారాలు అన్నీ ఒక్కటే. అందుచేత పటమునకు ఆధారం దారం,ఇలా ఆధారభూతాల గురించి చెప్పే న్యాయం "ఘటపటన్యాయం".

165: ప్రపంచాన్ని నీ మాయచేత అనేకమార్లు సృష్టించి, త్రిగుణాలతో కూడినవాడవై ప్రపంచమంతా నిండి వుంటావు. అందుచేత గుణసంపన్నులైన వారు నిన్ను విష్ణువు అను పేర పరిగణిస్తూ, గుణవంతుడవైన నిన్ను దర్శిస్తారు.166: భూమిలో ఆహారాన్నీ, ఆవులలో పాలనూ, కఱ్ఱలలో అగ్నిని కనుగొనే విధంగానే ఆత్మజ్ఞానం కలవారు తమ బుద్ధిద్వారా గుణరహితుడవైన నిన్ను ఈ విశ్వంలో దర్శిస్తారు.167: మేము దిక్కులేని వారము అయ్యాము. అనేకరకాల కష్టాలతో కలత చెందిన మనసులు కలవారమై బాధలు పడుతున్నాము. కార్చిచ్చు యొక్క మిక్కిలి వేడిమి ధాటికి తపించిన ఏనుగుల మంద ఉప్పొంగుతున్న గంగలోని నీళ్ళు కనుగొన్న విధంగా, చిట్టచివరికి నిన్ను దర్శించ గలిగాము. ఇక మా కోరికలు నెరవేరితీరుతాయి.168: శ్రీమన్నారాయణా! లోకమంతటా నిండి ఉండే నీవు మహాత్ముడవు. లోకాలన్నీ అనుక్షణం వీక్షిస్తూ ఉంటావు. అట్టి నీకు మేము మనవి చేసుకోవలసిన పని లేదు. నీ పాదదర్శనం మాకు శుభమును కలిగిస్తుంది. అగ్నిలోని విస్ఫులింగాలవలె నేనూ, ఈ లోకపాలకులూ, దేవతలూ నీలోని అంశలమే."169: ఇలా విష్ణుమూర్తి నాభి కమలంలో పుట్టిన బ్రహ్మదేవుడు మున్నగు దేవతా ప్రముఖులు శ్రీమహావిష్ణువును ప్రార్థించారు" అని చెప్పి శుకమహర్షి పరీక్షిన్మహారాజుకు మరల ఇలా చెప్పసాగాడు.

విష్ణుని అనుగ్రహ వచనము

170: అలా బ్రహ్మదేవ ప్రముఖులు ప్రార్థించగా భగవంతుడు సంతోషించాడు. దేవతల దేహాలు నిలువెల్ల పులకించాయి. అప్పుడే తమ కష్టాలనుండి గట్టెక్కినట్లు తలచారు. భయంకరమైన ప్రారబ్ధమనే సముద్రాన్ని మథించడానికి ఉత్సాహపడ్డారు. అప్పుడు భగవంతుడు విష్ణుమూర్తి

మేఘ గంభీరకంఠస్వరంతో ఇలా అన్నాడు.171:"ఓ చతుర్ముఖ బ్రహ్మదేవుడా! ఓ దేవతలకు ప్రభువు అయిన దేవేంద్రుడా! నుదుటి కన్నుగల ఓ త్రినేత్రుడా రుద్రుడా! ఓ దేవతా ముఖ్యులారా! ప్రస్తుతం మీరు రాక్షసులతో మంచిగా ఉండి, స్నేహం చేసి జీవించడమే మంచిది.172: అది ఎలాగంటే?...173: ఎలుకకోసం పాము పొంచి ఉండే విధంగా, బలం చేకూరేదాకా సమయంకోసం నిరీక్షిస్తూ శత్రువుల బారినుండి శరీరాన్ని దాచుకుని ఉండటం ఉత్తముల లక్షణం.174: ఓ దేవతలారా! వినండి. మీరు అమృతాన్ని పుట్టించే ప్రయత్నం స్వచ్ఛమైన మనసులతో చేయటం మేలు. అమృతాన్ని త్రాగినవారికి ఆయుస్సు పెరుగుతుంది, మరణంలేని మనుగడ లభిస్తుంది.175: మీరందరూ పాలసముద్రంలో రకరకాల తృణధాన్యాలను, ఔషధాలను, మొక్కలను, తీగలను, విరివిగా తెప్పించి వేయండి. మంథరపర్వతాన్ని కవ్వంగానూ, సర్పరాజు వాసుకిని కవ్వం తాడుగానూ చేసుకుని నా సహాయంతో పాలసముద్రాన్ని చిలకండి. అందువల్ల, మీకు ప్రయోజనం కలుగుతుంది. పాపాత్ములైన రాక్షసులు అనేక కష్టాల పాలవుతారు. అన్ని సంపదలూ మీకు లభిస్తాయి. ఆ పాలకడలి నుండి ఒక విషం పుడుతుంది. అందుకు మీరు కలతచెంది భయపడరాదు. అలా చిలికేటప్పుడు, ఇంకా అనేక వస్తువులు పుడతాయి. వాటిపట్ల ఇష్టానిష్ఠాలు చూపరాదు. 176: అలా క్షీరసాగర మథనం చేయమని ఆజ్ఞాపించి.177: ఆది, ఆంతము లేని అచ్యుత భగవానుడైన శ్రీమహావిష్ణువు అదృశ్యం అయ్యాడు. బ్రహ్మదేవుడు, పరమశివుడూ సంతోషంగా తమతమ నిలయాలకు వెళ్ళారు.

సురాసురల స్నేహము

178: దేవతలు యుద్ధం మాట విడిచిపెట్టారు. దేవతా శత్రువైన బలిచక్రవర్తి పట్ల దేవతలు అందరూ స్నేహాన్నీ, భక్తిని కనబరచారు, కానుకలు సమర్పించారు, అతని ఆజ్ఞలను సంతోషంగా పాలించారు.179:

మంచి మనసుతో తనను సేవిస్తున్న బలహీనులైన దేవతలను, కక్షగట్టి చంపేయాలి అనుకుంటున్న తన వారైన రాక్షసులను బలిచక్రవర్తి ఎంతో నేర్పుతో చంపవద్దని వారించాడు.180: అలా దేవతలను చంపవద్దని వారించి బలి, రాక్షస మూకలతో ఇలా అన్నాడు. 181:"శత్రువులు బెదిరిపోయి శరణు వేడినప్పుడు పరాక్రమ వంతులు తమ పౌరుషాలు చూపరాదు. తగిన సమయం గమనించాలి కదా! అందుచేత, ఇప్పుడు దేవతలపై మీ బాహుబలాన్ని ప్రకటించరాదు."182: బలి చక్రవర్తి కొలువు కూటములో చేరి అతనిని సేవించారు. సకల లోకాలలోని రాజ్యాలనూ గెలుచుకున్న వైభవం, దేవతా వీరులను ఓడించిన గర్వంతో బలిచక్రవర్తి సుఖంగా ఉన్నాడు. శచీదేవి భర్త అయిన దేవేంద్రుడు చక్కటి మంత్రి వలె ఓదార్పు మాటలతో విరోచనుని పుత్రుడైన బలిచక్రవర్తికి ప్రశాంతత కలిగించాడు. పురుషోత్తముడైన విష్ణువు నియమించిన నీతిమార్గాన్ని అనుసరించి దేవతా ప్రముఖులు

అందరూ రాక్షసులతో స్నేహంగా మెలగసాగారు. అలా శంబరాసురునికి ఇచ్చకపు మాటలు చెప్పి, అరిష్టనేమితో అనునయంగా మాట్లాడి, త్రిపురాలలో నివసించే దానవులతో ఒప్పుకోలు మాటలు జరిపి, జంభాసురుని ఒప్పుకోలు సంపాదించి, హయగ్రీవాసురుని వైరం మాన్పించి, నముచి, తారక, బాణాసురులతో మిత్రత్వం సాగించి, విప్రచిత్తితో స్నేహం కలుపుకుని, శకుని, విరోచనస ప్రహేతులచే రాకపోకలు జరిపి,మయ, మాలి, సుమాలి మొదలగు రాక్షస ప్రముఖులకి స్నేహం చూపించి, కుంభ, నికుంభాసురులతో సౌజన్యం చేపట్టి, పౌలోమి, కాలకేయ, నివాతకవచాది రాక్షస వీరుల పట్ల స్నేహంతో బాంధవ్యాలు కలిపి మాట్లాడుతూ, వజ్రదంష్ట్రి వద్ద లొంగి మెసలి,మిగిలిన దానవులు, దైత్యులు మున్నగు రాక్షసుల ఎడ అతిస్నేహం పెంపొందించుకుని, మనం మనం అక్కచెల్లెళ్ళ పిల్లలం మనలో మనకి దెబ్బలాటలు ఎందుకు? ఇన్నాళ్ళు మనలో మనం గొడవలు పడి బాగా నలిగిపోయాం కదా.అందుచేచ ఇకనుండి విరోచనుని కుమారుడు అయిన బలిచక్రవర్తే రాక్షసులం, దేవతలం మనం అందరకు మహారాజు. మనం అందరం అతని ఆజ్ఞకు లోబడి ఉందాం అని చెప్పారు. ఇంకా మన రెండు వంశాలు చక్కగా వర్ధిల్లు మార్గం చెప్తాం అని, ఇంద్రుడు బలి చక్రవర్తుల నాయకత్వంలో ఐకమత్యంతో దేవతలు రాక్షసులు పట్టుబట్టి పాలసముద్రాన్ని చిలికి అమృతాన్ని సంపాదించటానికి ఒప్పించారు.అంతా కలిసి వడివడిగా మంథర పర్వతం దగ్గరకి వెళ్ళారు.

మంథరగిరిని తెచ్చుట

183: దేవతాశిల్పి అయిన త్వష్ట పదునుపెట్టిన త్రవ్వు గోలలతో, దేవదానవులు మంథర పర్వతాన్ని కొంత త్రవ్వారు, రోకళ్ళను క్రిందకి చొప్పించారు. పొడుగుపాటి తాళ్ళతో బిగించి కట్టారు. చేతుల బలంకొద్దీ ఆ కొండను మెల్లగా రోకళ్ళతో కుళ్ళగించి, కదిలించి, తమ తమ బిరుదులు వాడుతూ గట్టిగా కేకలు వేస్తూ, పెరికి పెళ్లగించి పైకెత్తారు. బలమైన తమ చేతులు, తలలు, భుజాలతో జారకుండా కాసుకుంటూ కొండను ఎత్తుకున్నారు. మెల్లగా తప్పటడుగులు వేయసాగారు. అలాగే "బరువు ఎక్కువగా ఉంది, జాగ్రత్తగా పట్టండి" అంటూ చురుకుగా

మంథర అనే ఆ కొండను సముద్రం వైపుకు మోసుకుంటూ తీసుకొచ్చారు. 184: మంథరపర్వతాన్ని మోయడానికి దేవదానవులకు శక్తి సరిపోలేదు. ఆశ్చర్యకరంగా అదిఒరిగి నేలమీద పడిపోయింది. అప్పుడు కొందరు మరణించారు, కొందరు నలిగిపోయారు, మరి కొందరు పారి పోయారు.

185: "విష్ణువు దగ్గరకి ఎందుకు వెళ్ళాం? మత్తెక్కినట్లు ఈ పనికి ఎందుకు పూనుకున్నాం? ఈ మంథర పర్వతాన్ని కోరి పెకలించుకుని తెచ్చాం? అందుచేత ఈ మధ్యలో పడి చనిపోయారు.186: ఇలాంటి పని భగవంతుడు ఎందుకు అప్పజెప్పాడు? మనలాంటి వారు ఇలాంటి పనులు చేపట్టి చేయగలరా? ఆ లక్ష్మీపతి అయిన విష్ణువు సహాయం చేయటానికి ఇంకా ఎందుచేత రావటం లేదో? ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నాడో? మనకు సాయం రాకుండా ఇలా ఎందుకు మరచిపోయాడో?"

187: దేవదానవులు ఇలా అనుకుంటూ మంథర పర్వతం పడిపోవటం వలన కలిగిన కష్టాన్ని ఓర్చుకోలేక దుఃఖపడు తున్నారు. వారి భీతిని, ఆపదను తెలుసుకున్న సర్వవ్యాపకుడు అయిన విష్ణువు ఆ ప్రదేశం దగ్గరకి వచ్చాడు.188: దయామయుడై, గదను ధరించి, గరుడవాహనంపై అధిరోహించి వచ్చి, విష్ణుమూర్తి కోటి సూర్యుల కాంతితో వారి ఎదుట ప్రత్యక్షం అయ్యాడు. "ఓ దేవదానవులారా! భయపడకండి" అన్నాడు. మంథర పర్వతాన్ని ఎంతో నేర్పుగా చేత్తో పట్టుకుని బంతిలా ఆడిస్తూ, దయామృతం చిలికే చూపులతో వారిని కాపాడాడు.189: దేవదానవులు విష్ణుమూర్తిని సేవించుకున్నారు. విష్ణుమూర్తి గరుడుని పాల సముద్రం వద్దకు తీసుకుపొమ్మని ఆజ్ఞాపించాడు. గరుడుడు ఆ పర్వతాన్ని, విష్ణుమూర్తిని మూపుపై ధరించి ఆటంకం లేకుండాఎగురుతూ తీసుకెళ్ళాడు. 190:అలా గరుడుడు తీసుకెళ్ళి పాలకడలి ఒడ్డున విష్ణువును, మంథరపర్వతాన్ని దించాడు, భక్తితో నమస్కరించి సెలవు తీసుకొని తన నివాసానికి వెళ్ళిపోయాడు.191: అంతట.

సముద్ర మథన యత్నము

192: ఓ పరీక్షిన్మహారాజా! దేవతలూ, రాక్షసులూ సర్పరాజైన వాసుకిని పిలిపించారు. అతనికి ప్రీతి కలిగేలా మాట్లాడారు. అమృతంలో అతనికి కూడా భాగం ఇవ్వటానికి ఒప్పుకున్నారు. మెల్లగా శరీరాన్ని దువ్వి స్నేహం కనబరచారు. "నీ కంటే సమర్థులు ఇంకెవరూ లేరు" అని పొగుడుతూ, కవ్వపు తాడుగా ఉండటానికి ఒప్పించారు. వాసుకికి ముళ్ళు గుచ్చుకోకుండా ఉండటానికి, మంథరపర్వతాన్ని చదును చేశారు.

ఆ పెద్ద కొండను కవ్వంగా తీసుకుని, వాసుకిని తాడుగా చుట్టి, పాలసముద్రాన్ని కుండగా చేశారు. రెండు పక్షాలవారు రెండువైపులా బారులు తీరి, వస్త్రాలు ఎగగట్టు కున్నారు. జుట్టు గట్టిగా ముడులు వేసుకుని, పాల సముద్రాన్ని చిలకడానికి తలపడ్డారు.193: అటు పిమ్మట. 194: విష్ణువు, దేవతలు వాసుకి తలవైపు పట్టుకోడానికి సిద్ధపడసాగారు. విష్ణుమాయ కమ్మిన రాక్షసులు అంతా ఒళ్ళు తెలియని పట్టుదలతో వాదులాటకు దిగారు.195:

★స్వచ్ఛమైన ఫణంబు మీరలు చక్కఁబట్టి మథింపఁగాఁ
బుచ్ఛ మేటికి మాకుఁ బట్టఁగఁ? బూరుషత్వము గల్గి మే
మచ్ఛమైన తపోబలాధ్యయనాన్వయంబుల వారమై
యిచ్ఛయింతుమె తుచ్ఛవృత్తికి? నిండు మాకు ఫణాగ్రముల్.

"మీరు స్వచ్ఛమైన పడగలు పట్టుకుని చిలుకుతారా? మేము తుచ్ఛమైన తోక పట్టుకోవాలా? ఇది మాకు చాల అవమానకరం, మేము గొప్ప పౌరుషము, తపస్సు, విద్యలు, బలమూ కలవారము. మేము ఈ నీచమైన పనికి ఒప్పుకోము. మాకు పడగలు ఇవ్వండి, మీరు తోక పుచ్చుకోండి" అని రాక్షసులు వాదించారు196: ఇలా పాము పడగలు పట్టుకుంటాము అంటున్న రాక్షసులను చూసి.197: దానవాంతకుడు విష్ణుమూర్తి ఆశ్చర్యంతో వాసుకి పడగ విడిచిపెట్టాడు, రాక్షసులు గర్వంతో కూడిన ముఖాలతో కేకలు వేస్తూ పడగలు పట్టుకున్నారు, దేవతలు వినయంతో వాసుకి తోకపట్టుకున్నారు.198: ఇలా వరుసలు కట్టి లాగే స్థానాలను ఏర్పాటు చేసుకున్నారు. క్షీరసాగరం మధ్యన మంథర పర్వతాన్ని ఉంచి, దేవతలు నాగరాజు వాసుకి తోక భాగము, రాక్షసులు పడగలభాగం పట్టుకునిచిలుకుతున్నారు.ఇంతలో...

199:విడు విడుఁ డని ఫణి పలుకఁగఁ
గడుభరమున మొదలఁ గుదురు గలుగమి గెడఁవై
బుడబుడ రవమున నఖిలము
వడవడ వడఁకఁగ మహాద్రి వనధి మునింగెన్.

అమృతమథన సమయంలో వాసుకి "వదలండి వదలండి" అన్నాడు. మంథర పర్వతం అడుగున కుదురు లేకపోవడంతో అధిక బరువు వలన పడిపోతూ సముద్రంలో "బుడ బుడ" మని మునిగింది. దేవ రాక్షస సమూహం సమస్తం "వడ వడ" వణికింది.200: దాని అధికమైన బరువు వలన కవ్వం కొండగా ఉన్న ఆ మంథర పర్వతాన్ని మళ్ళీ పైకి దేవరాక్షస శూరులు ఎత్తలేకపోయారు. తమ భుజబలాలు కోల్పోయారు. ఎంతో సిగ్గుపడ్డారు. పరాక్రమాలు కోల్పోయి సముద్రం ఒడ్డున నిలబడి తెగ బాధపడసాగారు. అవును, ఎంతటి వారికైనా ప్రబలమైన విధిని దాటడం సాధ్యం కాదు కదా!

కూర్మావతారము

201: దేవతలు అందరూ అలా మునిగిపోతున్న మంథర పర్వతాన్ని చూస్తూ అంతులేని దుఃఖసాగరంలో మునిగిపోతుంటే చూసిన విష్ణుదేవుడు, వారు చూస్తుండగానే సముద్రం మధ్య లోకి దిగాడు.202: విష్ణుమూర్తి దేవతలపై గల ప్రేమను వెల్లడిచేస్తూ, మహాకూర్మావతారం ఎత్తాడు.



ఆ పెద్ద తాబేలు పైడిప్ప చక్కగా గట్టిగా లక్ష యోజనాల వెడల్పుతో ఉంది. ఆకలేసిందంటే మొత్తం బ్రహ్మాండాన్ని సైతం మింగగలంత పెద్ద నోరు లోకంలోని జీవరాశి అంతటిని లోపల ఇముడ్చుకోగలంతటి కడుపు. కాళ్ళు విశ్వగోళం మీద విశ్వగోళం పడ్డా తట్టుకోగలంతటి బలమైన కాళ్లు. లోపలికి బయటకు కదలాడే పెద్ద తల, కమలాల వంటి చక్కనైన రెండు కళ్ళు ఉన్నాయి. అలా బహు సుందర రూపంతో మహావిష్ణువు అందగిస్తున్నాడు.203: చిన్న ముత్తెము చిప్పంత సుళువుగా, కూర్మరూపధారి అయిన విష్ణువు సముద్రం లోపలకి వెళ్ళాడు. వాసుకి భూరి నాగేంద్రునితో సహా మంథర మహాపర్వతాన్ని అవలీలగా పైకెత్తాడు. ఇది చూసి దేవేంద్రుడు మున్నగు వారంతా సంతోషంతో తబ్బిబ్బయి, తలలు ఊపుతూ భూమండలం నలుదిక్కులా, ఆకాశం అంతా మారుమ్రోగేలా "ఆహా! ఓహో! మేలు మేలు శ్రీహరీ! పద్మాక్షా! శరణం శరణం" అంటూ జయధ్వానాలు చేయసాగారు..204: ఇలా మంథర పర్వతాన్ని ఎత్తి.... 205:ఆహా! ఎంతటి విచిత్రమైన విష్ణు లీలలు? సముద్రాన్ని చిలికేవారిలో ఒకడిగా ఉన్నాడట, పాల సముద్రం అనే పెరుగుకుండకు కుదురు తానేనట, చిలికే కవ్వంగా ఉన్న మంథరపర్వతం, కవ్వానికి కట్టిన చిలుకుతాడుగా ఉన్న మహానాగుడు వాసుకి తానేనట



205.

తరిగాంద్రలోన నొకఁడట
తరి గడవకుఁ గుదురు నాఁక త్రాడఁట చేరుల్;
దరి గవ్వంబును దా నఁట
హరిహరి! హరిచిత్రలీల హరియే యెఱుఁగున్.

ఆహా! విష్ణువు లీలలు విష్ణువుకే తెలుసు.206: సముద్రాన్ని కుండగానూ, పర్వతాన్ని కవ్వంగానూ, సర్పాన్ని కవ్వంతాడుగా చేయగలవాడు, ఆపై చిలికి వెన్నతీసినట్లు లక్ష్మిని, అమృతాన్ని సంపాదించగల సమర్థత కలవాడు ఆ లక్ష్మీపతి శ్రీమన్నారాయణుడు తప్ప మరొకరు ఎవ్వరూ లేరు కదా!207: గొల్ల వారి వృత్తి దేనికీ తీసిపోయేది కాదు. పాలసముద్రాన్ని చిలికి, దేవతలు గొల్లవారు అయి అమరత్వాన్ని అందించే అమృతాన్ని, శ్రీమహావిష్ణువు గొల్ల అయి శ్రీమహాలక్ష్మిని పొందగలిగాడు.

సముద్రమథన వర్ణన

208 : అలా, దేవతలు, రాక్షసులు విష్ణుమూర్తితో చేరి

కవచాలు ధరించారు, దట్టీలు గట్టిగా కట్టారు, కట్టుబట్టలు సిరిచుట్లు చుట్టారు, చేతులూ చేతులూ చరచుకున్నారు, భుజాలు భుజాలు రాసుకున్నారు, "లేవండి, లేవండి, చిలుకుదాం, రండి రండి" అంటూ హెచ్చరించుకున్నారు. గొల్లపల్లెల్లో గోపాలకులు పెరుగు గబ గబా చిలికే విధంగా, పాలసముద్రం మధ్యన కవ్వంగా ఉన్న మంథరపర్వతానికి చుట్టిన కవ్వం తాడుగా ఉన్న వాసుకి అనే పెద్ద పాము తలా తోకా, రాక్షసులూ దేవతలూ పట్టుకుని గబ గబా మథించసాగారు. వారి పెను కేకలతో బ్రహ్మాండం నిండి పోతుంది. "గుబ గుబ" అంటూ కవ్వం కొండ గిర గిర తిరగ సాగింది. అది తిరిగే వేగానికి "భుగ భుగ" అంటూ శబ్దాలు పుట్టి ఆకాశం అంతా వ్యాపించసాగాయి. పాలమీగడతేటలోని కాంతిపూరిత తుంపరల పరంపరలు, లెక్కకు మించిన చుక్కల చక్కదనాలతో, పైకెగరసాగాయి. దేవదానవులు తమ చేతులతో గట్టిగా పట్టుకుని చిలకడం వల్ల ఆ సర్పరాజు శరీరం నుండి విషాగ్ని జ్వాలలు విపరీతంగా వ్యాపించసాగాయి. దాంతో వారికి దాహం పెరిగిపోసాగింది. అయినా వారు ఏమాత్రం అలసట చెందటం లేదు. ఆ పాలసముద్రం ఒడ్డునున్న కొండమల్లి పూలగుత్తులలోని విరివియైన మకరంద సుగంధాలు నిండిన మందమారుతాలు వీచసాగాయి. ఆ చల్లగాలి వల్ల వారి శరీరాలమీది చెమట ధారలు ఇంకిపోసాగాయి. వారు ఒకరి నొకరు వేళాకోళాలు చేసుకుంటూ, గప్పాలు కొడుతూ, "భళి భళి" అని పొగడుకుంటూ, "అలా ఇలా" అంటూ మందలించుకుంటూ, అసూయతో పోటీలు పడి మరీ జలధిని మథించసాగారు, ఆ కవ్వపు కొండ గబ గబా తిరుగుతుంటే, "ఘుమ ఘుమ" అని శబ్దాలు వెలువడసాగాయి, కవ్వం తాడైన వాసుకి సర్పరాజు నోటినుండి భయంకర "ఫూఫూ" అనే శబ్దాలు పుట్టసాగాయి, పర్వతపు తిరుగుళ్ళకు సముద్రంలో గుంపులు గుంపులుగా ఉన్న తాబేళ్ళు, పీతలు, పాములు, మొసళ్ళు, పెద్ద చేపలు, తిమింగలాలు, హంసలు, చక్రవాకాలు, కొంగలు, కప్పలు, బెగ్గురుపక్షులు,

భయంతో చేసే ఆర్తనాదాలు ముప్పిరి గొనసాగాయి. రాక్షసులు, దేవతలు పెద్దగా అట్టహాసాలు, హెచ్చరికలు నలుపురిగా చేయసాగారు, ఆ శబ్దాల తాకిడికి పదిదిక్కులూ పగిలి పాదులూడి కూలిపోయినట్లు కాసాగాయి. ఒకడిని మించి ఒకడు అరవసాగారు, అమృతం కోసం ఉబలాటపడసాగారు, కొత్త వస్తువుల పుట్టుక కోసం ఎదురుచూడసాగారు, "ఇంకా ఎంతసేపు చిలకాలి?"అని విష్ణువును అడగసాగారు.

అలా ఎడతెగని ఆశతో పట్టిన పట్టు విడువకుండా క్షీర సాగరాన్ని మథించసాగారు.209: ఏమని చెప్పేది! పాలసముద్రంలో మంథరపర్వతం గిరగిరా తిరుగుతుంటే, దాని శబ్దం బ్రహ్మాండం అంతా నిండిపోయి, బ్రహ్మదేవుడి చెవులు గింగురుమన్నాయి. 210: అలా మథిస్తున్నప్పుడు పాలసముద్రం మధ్యలో...211: సర్పరాజు తోకా తలా పట్టుకుని దేవతలూ రాక్షసులూ కలిసి, వంతులువారీగా తొందర తొందరగా ముందుకూ వెనక్కూ కదులుతూ ఉంటే, మంథర పర్వతం ఎడం పక్క నుండి కుడి పక్కకు, మరల కుడి పక్క నుండి ఎడం పక్కకు అలా తిరుగసాగింది.212: అలా గిరగిరా కొండ కదులుతుంటే కడలిలోని పక్షులు, మొసళ్ళు, తాబేళ్ళు, చేపలు, సర్పాలు తొట్రుపడుతూ పక్కలకు పడుతూ భయంతో ఎగిరి గట్టుమీదకి పడి పొర్లుతూ ఉన్నాయి.213: ఈ భూమండలాన్ని ఏలే ఓ రాజా! పరీక్షిత్తూ! అంతటి రాక్షసులూ దేవతలూ కలిసి త్రిప్పుతున్న మంథర పర్వతం రాపిడీ, ఆ కూర్మరాజు వీపు దురదను అయినా పోగొట్టలేకపోయింది.214: అలా క్షీరసాగరం చిలుకుగా చిలుకగా....

కాలకూట విషము పుట్టుట

215: పరీక్షిన్మహారాజా! అల్లకల్లోలమైన ఆ పాలకడలిలో నుండి అగ్నిజ్వాలల కోలాహలంతో కూడిన "హాలాహలము" అనే మహావిషము పుట్టింది. అది చూసి భయంతో దేవతలూ, రాక్షసులూ పట్టుకున్న నాగరాజు వాసుకిని వదలిపెట్టి పారిపోసాగారు.(*లకార ప్రాసతో హాలాహల, కోలహలాలకు జత కట్టించిన బమ్మెరవారి పద్యం మధురాతి మధురం)216:* మంథర పర్వతంతో చిలికిన చిలుకుడుకు పాలసముద్రంలో పుట్టిన హాలాహలం, ప్రళయకాలంలో, పరమేశ్వరుని నుదుటి కన్ను నుండి వెలువడే మహా భయంకరమైన అగ్ని

జ్వాలల కంటె నూరురెట్లు చురుకైనది, కల్పాంతకాలపు అగ్నికంటె వెయ్యిరెట్లు తీవ్రమైనది, మహాప్రళయకాలపు లక్ష సూర్యుల తేజస్సువలె తేరిచూడరానిది, ప్రళయకాలపు కాళరాత్రిలో మెరిసే మేఘాల నుండి కురిసే పిడుగులవలె మహా భీకరమైనది, భగ భగ మండే పంచభూతాలవలె భరింపలేనిది. భుగ భుగ మనే పొగలతో, చిటపటమనే నిప్పుకణాలతో, ధగ ధగ మని మెరిసే పెనుమంటలతో, ఫట ఫట మంటూ ఆ మహా విషం ఆకాశం అంత ఎత్తు పొంగుతోంది,దిక్కులంతా వ్యాపిస్తోంది, బయళ్ళన్నీ నిండిపోతోంది, మంథర పర్వతాన్ని దాటి సముద్రంలో నలువైపులా వ్యాపిస్తోంది, చెలియలికట్టల గట్లు దాటేస్తోంది,. దేవదానవుల గుంపులను దాటిపోతోంది, కొండగుహలలో తొట్రుపడకుండా ఎత్తైన పర్వతశిఖరాలలో నిప్పులు నింపేస్తోంది, అడవులను కాల్చేస్తోంది, పొదరిళ్ళలో పూల గుత్తులను మాడ్చేస్తోంది. గ్రామాలను కాల్చేస్తోంది, నదీనదాలను ఎండగట్టేస్తోంది, దిగ్గజాల కుంభస్థలాలపైకి ప్రాకేస్తోంది, సూర్యగోళాన్ని నక్షత్రాలను అణగద్రొక్కేస్తోంది, మహర్లోకాన్ని మసిచేస్తోంది, ఊర్ధ్వ లోకాలకు కీడు కలిగేటట్లు పెరిగిపోతోంది, చుట్టు ముట్టి క్రమ్ముకొని బ్రహ్మాండం బద్ధలయిపోయేలా విస్తరిస్తోంది, పాతాళ లోకం దాకా వ్రేళ్ళూనుతోంది. ఆ హాలాహలం ఎటుచూస్తే అటుపక్క అసాధారణంగా అన్నిలోకాలలోనూ కూరుకుపోతోంది, జింకవలె గంతులు వేస్తోంది, సింహమువలె దూకుతోంది, పక్షిలా ఎగురుతోంది, ఏనుగులా స్థిరంగా నిలబడిపోతోంది, లోకాలన్నిటా గగ్గోలు పెట్టిస్తోంది. ఆ పెనుమంటల వేడికి తట్టుకోలేక దేవతలు కొందరు భస్మం అయ్యారు,రాక్షసులు నేలకూలారు, చుక్కలు రాలాయి, కిన్నర దంపతులు నశించారు, గంధర్వుల విమానాలు కాలి పోయాయి, సిద్ధుల గుంపులు చెదిరి పోయాయి, గ్రహాలు సంకటపడ్డాయి, నదులు ఎండిపోయాయి, సముద్రాలు ఇంకి పోయాయి, అడవులు మాడిపోయాయి, పట్టణాలు బావురు మన్నాయి, పురుషులు వెతల పాలయ్యారు, పుణ్యస్త్రీలు పొగిలిపోయారు, పర్వతాలు బ్రద్దలైపోయాయి, జీవరాసులు అడుగంటిపోయాయి, లోకాలు తపించి పోయాయి, దిక్కులు కలత చెందాయి, చెట్లు తలక్రిందులు అయ్యాయి, నేలలు బదాబదలు అయ్యాయి, అకాలంలో ప్రళయం వచ్చినట్లు అయింది.217: ఓ రాజా! అప్పుడు ఆ విషాగ్నిని అడ్డగించే సాహసం చేసి కాపాడే మహనీయులు లేకపోయారు. భార్య, పిల్లలు అనే మమకారం లేకుండా పారిపోయికూడా జనులు ప్రాణాలు పోగొట్టు కుంటున్నారు.218 : అలా హాలాహలం వ్యాపిస్తున్న సమయంలో. . . .

శివుని గరళ భక్షణకై వేడుట

219: ఆ సమయంలో బ్రహ్మాది దేవతా ప్రముఖులు అందరూ ఆర్తితో ఆశ్రయించిన వారిని కాపాడే వాడు, సుఖప్రదాత అయిన శంకరుని వేడుటకు కైలాసానికి వెళ్ళారు. పరమశివుని మందిర ద్వారపాలకులు అడ్డుకున్నారు. కానీ వారిని తప్పుకోమని లోనికి ప్రవేశించి ఈశ్వరుని

దర్శనం చేసుకుని "శరణు, శరణు చిత్తగించు దయతో చూడు, కాపాడు" అంటూ మొరపెట్టుకున్నారు.220: అలా దేవతలు దుఃఖంతో వచ్చుటను దయామయుడైన చంద్రరేఖను భూషణంగా ధరించే శంకరుడు చూసాడు. అప్పుడు సతీదేవితో కలిసి పేరోలగంలో ఉన్న శివుడు దేవతలకు దర్శనం ఇచ్చి ఆదరంగా "చెప్పుకోండి మీ విన్నపం" అన్నాడు.221: అలా అవసరమిచ్చిన సర్వాలంకార భూషితుడైన శంకరునకు, బ్రహ్మ మొదలైన దేవతలు అందరూ సాగిలపడి నమస్కారాలు చేసి ఇలా ప్రార్థించారు.222:

"ఓ పరమేశ్వరా! పంచ భూతాలకూ ఆత్మ అయిన వాడా! సర్వ భూతాలకూ అధినాథా! జీవులకు కారణమైన రూపమైన దేవా! ఓ దైవమా! మహాదేవా! దేవతలకు వందనీయుడా! ఈ లోకాలు అన్నిటికి ప్రభువు నీవే. సంసారబంధాలలో పడవేయటం, మోక్షము అనుగ్రహించటం, ఏదైనా, నీవల్లనే సాధ్యం అవుతుంది, జ్ఞానులు, ఆర్తులకు శరణు ఇచ్చేవాడవు, ఆదిగురువు అయిన నిన్ను కోరి ప్రార్థిస్తారు, సృష్టి, స్థితి, సంహార కార్యాలు సమస్తమునకు కారణ భూతుడవై, బ్రహ్మ, విష్ణు, శివ పేర్లతో విరాజిల్లుతుంటావు, భావానికి అందని పరబ్రహ్మవు, సదసద్రూప పరమాత్మవు నీవే, శక్తి యుక్తుడవు, శబ్దానికి జన్మస్థానం అయిన శబ్దబ్రహ్మము నీవే, లోకానికి అంతరాత్మవు, సర్వ చరాచరాలకు ప్రాణము నీవే,223: రుద్రదేవా! అన్నిలోకాలు నీలోనే పుడతాయి, నీలోనే నివసిస్తాయి, ప్రాణులు అన్నీ నీలోనే లయమవుతాయి, నీ ఉదరం ప్రాణులు అన్నిటికి అలవాలం.224: అగ్ని నీ ముఖము, జీవాత్మ పరమాత్మ నీవే అయి ఉంటావు, కాలం నీ నడక, భూమండలం నీ పాదం, వాయువు నీ శ్వాస, వరుణుడు నీ నాలుక, దిక్కులు నీ చెవులు, స్వర్గం నీ నాభి, సూర్యుడు నీ దృష్టి, నీరు నీ వీర్యం, సముద్రాలు నీ గర్భం, ఆకాశం నీ శిరస్సు, ఓషదులు నీ రోమ సమూహాలు, పర్వతాలు నీ ఎముకలగూడు, చంద్రుడు నీ మనస్సు, వేదాలు నీ ధాతువు, ధర్మశాస్త్రాలు నీ హృదయం, ఉపనిషత్తులు నీ ముఖాలు, నీ రూపం పరతత్వం, నీవు స్వయంప్రకాశుడవు, శివ అనే నామం కలిగిన పరంజ్యోతివి నీవు.225:

ఓ పరమేశ్వరా! మహాప్రభూ! కొందరు నీవు ఉన్నావు అంటారు. కొందరు లేవు అంటారు. ఇంకా కొందరు నీవు సగుణరూపుడవు అంటారు. మరికొందరు నీవు ఉన్నావో లేవో అనే సందేహాలతో కొట్టుమిట్టాడుతుంటారు.226: చంద్రకళను శిరసున ధరించు వాడా! పురాణ పురుషుడా! దీనులను రక్షించువాడా! దయామయా! దేవ దేవ! తరచి చూస్తే ప్రాణమూ, ఇంద్రియాలూ, ద్రవ్యమూ, గుణాలూ సర్వం నీ స్వభావసిద్ధాలు. కాలమూ యజ్ఞమూ నీవే, సత్యమూ, ధర్మమూ, ఓంకారమూ, మోక్షమూ నీవే, అన్నింటికి నీవే ఆధారం, వేదరూపుడవు నీవే, సత్త్వము, రజస్సు, తమస్సు అనే త్రిగుణాలను నీవు నేత్రాలుగా కలిగి ఉంటావు,సమస్త రూపాలు నీవే, లీలగా చూసే నీ మూడోకన్ను చూపుల మంటలతో యమాదులను సైతం భస్మం చేస్తావు, మన్మథుడు, త్రిపురాసురులు, దక్షయజ్ఞం, కాలకూటవిషం మున్నగు సర్వ భూతాల వలన నీకు హాని కలుగుతుందని సంకోచం లేకపోవటంలో ఆశ్చర్యం ఏమాత్రం లేదు.227:

నుదుట కన్ను గల ముక్కంటి! శంకరా! ముగ్గురు మూర్తులకూ, మూడులోకాలకూ, మూడు కాలాలకూ నీవే మూలం. మొదట భేదంతో కనిపించినా, చివరకి అభేద స్వరూపంతో ఒప్పారుతుండే పరబ్రహ్మవు నీవే.228 : దేవా! శంకరా! సదసద్రూపమైన ఈ చరాచర జగత్తునకు మూలాధారం నీవు. బ్రహ్మాదులు సైతం నిన్ను ప్రస్తుతించడానికి భయపడి పెదవులు కదల్చలేరు. అంతటి నిన్ను స్తుతించడానికి మేము ఏమాత్రం సరిపోము కదా!229: ఓ పరమేశ్వరా! దేవతలూ, రాక్షసులూ కలిసి భుజబలాలతో పాల సముద్రాన్ని మథించారు. దానిలో నుంచి హాలాహలం అనే మహా విషం పుట్టింది. లోకాలను క్షోభ పెడుతోంది. అతలాకుతలం చేస్తోంది. ఎవరూ దానిని అడ్డుకోలేకుండా ఉన్నారు. అతిశయించిన దయ జాలువారగా ప్రాణికోటిని అనుగ్రహించు. ఆ హాలాహల విషాన్ని పరిగ్రహించు.

*('శివా! నీ దయ అతిశయించునట్లు, వికసించునట్లు ప్రకాశింప జేయవయ్యా దయాసాగరా, అలా నీ దయ వర్షించకపోతే లోకాలు ఈ హాలాహల విషాగ్నికి కాగిపోతాయయ్యా.' ఇంతటి చిక్కనైన భావాన్ని 'దయ దొంగిలింపన్' (దయ + దొంగలింపగా) కాపాడవయా అనే భావ ప్రకటనతో అలవోకగా చెప్పిన పోతనామాత్యులకు ప్రణామములు.)*230:

అర్ధచంద్రుని అలంకారంగా ధరించిన మహా ప్రభూ! పరమేశ్వరా! ఈ ఆపదను తొలగించడానికి, ఆనందం చేకూర్చడానికి, జయాన్ని సంపాదించడానికి, క్రూరులను హతమార్చడానికి నీవు మాత్రమే సమర్థుడవు.231: సమస్త లోకాల యందూ కీర్తింపబడు స్వామీ! శివా! నీవే మాకు దిక్కు. నిన్ను తప్ప మరెవ్వరినీ ఆశ్రయింపము. నీవు తప్ప మరెవ్వరూ లోకాలను కాపాడలేరు. నిన్ను మించిన గొప్పవాడు మరెవ్వరూ లేరు.

గరళ భక్షణము

232: ఇలా తనను స్తుతిస్తున్న బ్రహ్మాది దేవతలను చూసి, సర్వప్రాణులనూ సమానంగా ఆదరించే పరమ విభుడు, శంకరుడు తన అనుంగు భార్యతో ఇలా అన్నాడు....

233:"ఓ లేడి కన్నుల సుందరీ! సతీదేవీ! చూడు లోకాలు ఎంత దుఃఖంలో ఉన్నాయో! ఎంత తీవ్ర ప్రభావంతో ఉన్నాయో! నీళ్ళలో పుట్టినది ఆ హాలాహల విషం. శక్తిసామర్థ్యాలుగల ప్రభువు ప్రజల కష్టాన్ని తొలగించాలి. దానితో కీర్తి వస్తుంది. 234: ఓ మగువా! పార్వతీ దేవి! ప్రాణభయంతో ఆశ్రయించిన జీవులను కాపాడటం ప్రభువుల కర్తవ్యం. ప్రాణాలు నిమిషంలో నశించి పోయేవి. అందువలనే ఉత్తములు ప్రాణులకు తమ ప్రాణాలను అర్పించుటకు సైతం వెనుకాడరు.235:

పరహితము జేయు నెవ్వఁడు
పరమ హితుం డగును భూత పంచకమునకుం
బరహితమె పరమ ధర్మము
పరహితునకు నెదురులేదు పర్వేందుముఖీ!

ఓ సౌందర్యరాశీ! పార్వతీదేవీ!ఇతరులకు సాయం చేసేవాడు, పంచభూతాలకు పరమాప్తుడు అయి ఉంటాడు. పరోపకారమే పరమోత్తమ ధర్మం. పరోపకారికి ఎక్కడా తిరుగు లేదు.236: ఓ మృగాక్షీ! ఉమాదేవీ! ఓ పద్మాక్షి! విష్ణుమూర్తిని తృప్తిపరిస్తే, లోకాలు అన్నీ తృప్తి చెందుతాయి. ఆ విష్ణుమూర్తీ, లోకాలూ సంతోషించేలా హాలాహల విషాన్ని అదుపు చేయడం మంచిపని.237: వికసించిన పద్మం వంటి మోము గల సతీదేవీ! హాలాహలాన్ని దండిస్తాను. చాలా చిన్న తియ్యని పండు రసంవలె హాలాహలాన్ని మింగుతాను. ఇవాళ ఈ జీవలోకం సమస్తాన్ని కాపాడతాను. నువ్వు చూస్తూ ఉండు."238: ఇలా "హాలాహలం మింగుతాను" అంటున్న తన భర్త అయిన భవునితో, ప్రియభార్య భవానీదేవి ఇలా అంటోంది. "స్వామీ! మీ మనస్సుకు తగినట్లు చేయండి." ఇలా చెప్తున్న శుక మహర్షితో పరీక్షిన్మహారాజు ఇలా అడిగాడు.239: "భయం చెంది అమరత్వం కోరుతున్న దేవతలు హాలాహలాన్ని "మ్రింగు" అని కోరారే అనుకో! పద్మం గర్భంలో పుట్టిన బ్రహ్మదేవుడు మున్నగువారు తమను కాపాడటానికి "పూనుకోవయ్యా హరా!" అని వేడుకున్నారే అనుకో! ఆ పరమ శివుడు లోకాలకు మేలు జరుగుతుంది కదా అని "సరే" అన్నాడే అనుకో! తన ప్రాణేశ్వరుడైన పరమేశ్వరుడు ఆది అన్నది లేనివాడు కావచ్చు అనుకో, అయినా పార్వతీ దేవి కంటి ఎదురుగా భయంకరమైన అగ్ని జ్వాలలతో కూడిన హాలాహలాన్ని చూస్తూ, "మింగు" అని పరమశివునికి చెప్పింది."240: ఇలా అడిగిన పరీక్షిత్తుతో శుకముని ఇలా అన్నాడు...241:

మ్రింగెడి వాఁడు విభుం డని
మ్రింగెడిదియు గరళ మనియు మే లని ప్రజకున్
మ్రింగు మనె సర్వమంగళ
మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో!

ఆమె సర్వమంగళ కదా మరి, అంతేకాక ఆమె తన మనస్సులో తన మంగళసూత్రాన్ని అంత గట్టిగా నమ్మింది. కనుకనే మింగేవాడు తన భర్త అని, మింగేది విషం అని తెలిసి కూడ లోకకల్యాణంతో అందరికి మేలు జరుగుతుందనే ఉద్దేశంతోనే పార్వతీదేవి హాలాహలాన్ని మింగమని పరమ శివునికి చెప్పింది.

గమనిక:

(ఇది అసామాన్య శబ్దార్థసౌందర్యభరితమైన పద్యం. శివుడు లోకాలన్నిటినీ దహించి వేస్తున్న ఆ హాలాహలాన్ని మింగాడు అనగానే కాపాడమని అడిగిన గొప్పవాళ్ళు బ్రహ్మాది దేవతలు కనుక లోకమంగళం కోసం మింగాడు. సరే మరి ఆయన భార్య అడ్డుపడకుండా ఎలా ఒప్పుకుంది?

భార్య తన భర్త ఇంతటి సాహసానికి పూనుకుంటే

చూస్తూ ఊరుకుంటుందా!

అందులో ఈవిడ భర్త శరీరంలో సగం పంచుకొన్నావిడ.

ఇదే అనుమానం పరీక్షిత్తు అడిగితే శుకుడు చెప్పిన సమాదానం ఈ పద్యం. మ్రింగ్ మ్రింగ్ అంటూ ఎలా ధ్వనిస్తోందో. (పూర్ణానుస్వరపూర్వక గకార ప్రాస) అటుపక్క ఆ గరళానికి, మంగళ మంగళ అంటూ సమాధానాలను వేసిన తీరు పద్యానికి ఎంత అందాన్నిచ్చిందో! మరల మరల ప్రయోగించిన గ', ళ' లు, మింగటంలో గళం లోనే ఆపేసాడు అని,

శక్తి స్వరూపిణి స్త్రీతో పాలుపంచుకుంటుంటే

ఎంతటి కాలకూటవిషం ఎదురొచ్చినా మంగళానికి లోటు ఉండదు అని స్ఫురిస్తోంది.)

242: దేవతలు మహాదేవుని చుట్టూ చేరి "జయ జయ" ధ్వానాలు చేశారు. పరమ శివుడు మేఘ గంభీర కంఠస్వరంతో "ఓహో! లోకద్రోహీ! పారిపోకు రా! రా!" అని, సర్వనాశనము చేసే ఆ హాలాహల మహావిషాన్ని తన చేయి చాచి పట్టుకుని, ముద్ద చేసి, నేరేడు పండునోట్లో వేసుకున్నంత సులువుగా, విలాసంగా భుజించాడు.243: పరమ శివుడు అలా అతి భీకరమైన మహా విషాగ్నిని మ్రింగే సమయంలో. . . .244: మహాదేవుడు ప్రచండమైన ఆ హాలాహలాగ్నిని ఆహ్వానిస్తున్నప్పుడు, దానిని సమీపించే టప్పుడు, పదిలంగా పట్టుకుని ముద్దచేసేటప్పుడు, నోట్లో ఉంచుకునేటప్పుడు, తినేటప్పుడు, మింగేటప్పుడు కాని, ఆయన కంఠహారాలుగా ఉన్న సర్పాలు కదలలేదు, చెమటలు గ్రమ్మ లేదు, కన్నులు ఎఱ్ఱబార లేదు, సిగలోని చంద్రుడు కందిపోలేదు, ఆయన ముఖ పద్మం వడల లేదు.245: పరమేశ్వరుడి ఉదరం సమస్త లోకాలకూ నివాసం కనుక. ఆయన ఆ భీకరమైన విషాగ్నిని ఉదరంలోనికి పోనివ్వకుండా, ఏదో చిన్న పండును ఉంచుకున్నట్లుగా, తన కంఠ బిలంలో కుదురుగా ఉండేలా జాగ్రత్తగా నిలుపుకున్నాడు.246: మెచ్చినప్పుడూ, నచ్చినప్పుడూ ఇచ్చవచ్చినంత ఎవరికైనా ఇవ్వవచ్చు. కానీ, ఇతరుల కోసం భగభగ మండే చిచ్చును కోరి కబళంచేసి మింగటం అన్నది, ఆ చిచ్చర కన్ను గల పరమ శివుడైన హరునికి తప్పించి ఎవరికి సాధ్యం అవుతుంది?247: ఓ రాజోత్తమా! పరీక్షిత్తూ!

హరుడు హాలాహలాన్ని కడుపులోకి మ్రింగకుండా కుత్తుకలో నిలుపుకోవడంతో ఆయన కంఠంమీద నల్లమచ్చ ఏర్పడి ఒక ఆభరణంగా నప్పింది. ఆలోచించి చూస్తే ఉత్తములకు సాధు సంరక్షణ అలంకారమే కదా.248:అలా హరుడు హాలాహలం భుజించాక...249: శంకరుడు విషాగ్నిని తన గొంతులో ధరించటం చూసి, విష్ణువు,బ్రహ్మ, పార్వతీదేవి, దేవేంద్రుడు అచ్చమైన మనస్సుతో"మేలు, మేలు" అని మెచ్చుకున్నారు. 250: ఎలాంటి వారైనా ఈ హాలాహల భక్షణం కథను మనస్ఫూర్తిగా విన్నా, వ్రాసినా, చదివినా భయానికి గురికారు. వారికి పాముల వల్ల, తేళ్ళ వలన, అగ్ని వల్ల కష్టాలు కలుగవు.

సురభి ఆవిర్భావము



251: హాలాహలభక్షణం పిమ్మట మరల, దేవతలు రాక్షసులు సముద్రాన్ని చిలక సాగారు.252: ఇలా చిలుకుతుంటే పాలసముద్రంలోనుండి కామధేనువు పుట్టింది. అది తెల్లని శరీరం, జిల్లుమంటూ పాలధారలను బాగా ఇచ్చే పొదుగూ, చక్కని కొమ్ములు కలిగి ఉంది. కోరిన కోరికలను పుష్కలంగా తీరుస్తుంది, 253: కామధేనువు హోమ కార్యక్రమాలకు తగినదని దేవమునులు ముందే గ్రహించారు. యజ్ఞకార్యాలకు తగినట్లు హవిస్సు సమకూర్చగల ఆ సురభి అనే కామధేనువును తీసుకున్నారు254: అలా చిలుకుతుంటే క్షీరసాగరమునుండి..

ఉచ్చైశ్రవ ఆవిర్భవము

255: చంద్రుడంత తెల్లగా ఉండే "ఉచ్చైశ్రవము" అనే గుఱ్ఱం పాలసముద్రం నుండి లెస్సగా పుట్టింది. విష్ణుమూర్తి సూచన మేరకు, దానిని ఇంద్రుడు తీసుకోలేదు. దానిని రాక్షసరాజు బలి కావాలని తీసుకున్నాడు.256: ఆ ఉచ్చైశ్రవము అనే ఆ హరి (గుఱ్ఱం) దృఢమైన రొమ్ము, చిక్కని పిరుదును, చక్కటి తోక, కాంతివంతంగా తళతళలాడే ముఖము, స్వచ్ఛమైన గిట్టలు, పొట్టి చెవులు, శుభ్రమైన కన్నులు, బలమైన మెడ కలిగి చూడముచ్చటగా ఉంది.257: ఉచ్చైశ్రవం పుట్టిన తరువాత క్షీరసాగర మథనంలో . . . .

ఐరావత ఆవిర్భావము

258: భూమండలాన్ని ఏలే మహారాజా! పరీక్షిత్తు! పాలసముద్రంలో "ఐరావతం" అనే ఏనుగు పుట్టింది, దానికి నాలుగుదంతాలు ఉన్నాయి. వాటితో కొండల శిఖరాలను సైతం కూల్చివేయగలదు. ఆ గజరాజం వెండికొండ వలె మనోహరంగా విలసిల్లుతూ ఉంటుంది.259: ఆ ఐరావతము తడబాటు లేని నడకల వేగం కలిగినది. పెద్ద శరీరం, పొడవైన తొండము, పెద్ద కుంభస్థలము కలది, ఐరావతము నడకలు ప్రాయంలో ఉన్న స్త్రీల కులుకు నడకలకు ఒజ్జబంతి అనే విధంగా ఉంటుంది.260: ఇంకా సముద్రాలకే రాజు వంటి ఆ పాలవెల్లిని దేవతలూ, రాక్షసులూ చిలుకుతుంటే...

కల్పవృక్ష ఆవిర్భావము

261: ఆలా కడలిని చిలకడం కొనసాగుతుండగా, అందులో నుండి కల్పవృక్షం పుట్టింది. ఆ కల్పవృక్షం సకల ఋతువుల్లోనూ రాలిపోని పూలతో విరబూసి, ఇంద్రుని వనానికి ఇంపు కూర్చుతూ ఉంటుంది. ఆశ్రయించిన వారి కోరికలను తీర్చుతుంది.

అప్సరల ఆవిర్భావము

262: ఆ క్షీరసాగరాన్ని అలా మంథరపర్వతం అనే కవ్వంతో చిలుకుతూ ఉండగా, దానిలోనుండి అప్సరసలు పుట్టారు. 263: అలా పాలకడలిలో పుట్టిన అప్సరసలు, వానాకాలం లోని మెరుపుతీగల వంటి తళుకైన శరీరాలూ, ఒకదానితో ఒకటి ఒరుసుకుపోతున్నట్లుండే స్తన ద్వయమూ, చిక్కిన చక్కని నడుములు, నిండైన కొప్పులూ, అందమైన చూపులతో చక్కగా అమరి ఉన్నారు264: అటుపిమ్మట, రత్నాలకు నిలయమైన ఆ పాలసముద్రంలో చంద్రుడు జన్మించాడు. అతడు బ్రహ్మదేవుని అనుమతితో తన మొదటి స్థానాన్నే అధిష్టించాడు.

లక్ష్మీదేవి జననము

తొలుకారు మెఱుఁగు కైవడి
తళతళ మని మేను మెఱవ ధగధగ మనుచున్
గలుముల నీనెడు చూపులఁ
జెలువంబుల మొదలి టెంకి సిరి పుట్టె నృపా!

265: రాజా! పరీక్షిత్తూ! పాలకడలిలో ఆ తరువాత, అందచందాలకు ఆది రూపు అయిన లక్ష్మీదేవి పుట్టింది. ఆమె తొలకరి మేఘాలలో మెరిసే మెరుపు తీగల వంటి తళతళ మనే శరీరకాంతితో, సంపదలను వెదజల్లే ధగధగ మనే చూపులతోవిరాజిల్లుతున్నది.266: బ్రహ్మదేవుడు పాలసముద్ర జలాలపైన తేలే మీగడ మిసమిసలు నేర్పుగా తీర్చి దిద్ది ఆమె దేహాన్ని నిర్మించాడు, ఆపైన తొలకరి కాలపు మెరుపుల అంచులలోని సరిక్రొత్త కాంతిరేఖలతో మెరుగు పెట్టాడు, ఆపైన కోమలమైన తీగల నున్నని చెలువముతో ప్రతిదినం చెలిమి చేయించాడు, ఎఱ్ఱతామరల కొలనులో వేకువజామున వెదజల్లే సువాసనలు ప్రోదిచేసి, బంగారు సంపెంగల దండ అందాన్ని సమకూర్చి, బాలచంద్రుని సొగసుతో పదును పెట్టి ఈ అందాల రాశిని సృష్టించాడా అన్నట్లు లక్ష్మీదేవి ఒప్పారింది.267:"ఎఱ్ఱని కెంపులలా మెరిసే పెదవులు, ఊగుతున్న సన్నని నడుము, మెరుపు కాంతుల మేలైన మొగము, తళుకులొత్తు కన్నులు, పెంపొందిన కొప్పు, పెద్ద కటిప్రదేశము, చిక్కని కుచాలూ ఎంత చక్కగా ఉన్నాయో" అంటూ..268:ప్రజలందరూ పొగడుతూ ఉండగా.269: జవరాలైన లక్ష్మీదేవికి మంగళస్నానం చేయించడం కోసం ఇంద్రుడు వెలకట్టలేని రత్నాలు పొదిగిన పీఠం అమర్చాడు. దేవతా ముత్తైదువలు కడవలతో నిండుగా నిర్మలమైన నీళ్ళు తెచ్చారు, భూదేవి ఆ కలశాలలోకి చిగుళ్ళను ఇచ్చింది. ఆవులు పాలు, పెరుగు నెయ్యి, పంచిత గోమయాలు అనే పంచ గవ్యాలనూ ఇచ్చాయి. వసంతుడు విరివిగా తేనె అందించాడు. మునులు సంకల్పం చెప్పారు. మేఘాలు పణవాలు, గోముఖాలు, బాకాలు, తప్పెట్లు, మద్దెలలు, శంఖాలు, వీణలు, వేణువులు మ్రోగినట్లు ధ్వనించాయి. గంధర్వులు పాడారు. గంధర్వ కాంతలు నాట్యాలు ఆడారు. 270: మహా పండితులు మంగళాశీస్సులు పలుక సాగారు. దిగ్గజాలు తొండాలు చాచి పుణ్యతీర్థాల లోని జలాలు తెచ్చి, అన్నులమిన్న అయిన లక్ష్మీదేవికి స్నానం చేయించాయి.271: ఓ గొప్పవాడా! పరీక్షిన్మహారాజా! సముద్రుడు కట్టుకోవడానికి పచ్చని పట్టుబట్టల జత లక్ష్మీదేవికి ఇచ్చాడు. వరుణుడు పూతేనెలకోసం మధుకరాలు మూగుతున్న వైజయంతీ మాల సమర్పించాడు. విశ్వకర్మ బంగారపు బాహుపురులూ, కంకణాలూ, కాళ్ళకు గజ్జలు, కడియాలు మున్నగు ఆభరణాలు అందించాడు, బ్రహ్మదేవుడు చేతిలో ఉండే లీలాకమలాన్ని ఇచ్చాడు. నాగరాజులు కర్ణాభరణాలు సమర్పించారు. వేదాలు మంగళకరమైన స్తోత్రాలను సమకూర్చాయి. దిక్కులు "ఎల్ల లోకాలకు ఏలికసానివి అయి జీవించు" అని దీవించాయి.272: అంతే కాదు, సాగరంలో పుట్టిన లక్ష్మీదేవి ఎంతటిది అంటే.273: లక్ష్మీదేవి అమృతాన్ని చిలికించే తన వాక్కులతో ఎవరితో పలుకుతుందో అతడే పరబ్రహ్మ. ఆమె మెచ్చుకుంటూ అందమైన తన చేతితో ఎవరిని వరిస్తుందో అతడే సమస్త లోకాలకూ అధిపతి. ఆమె తీగవంటి తన దేహాన్ని ఎవరి మేనుతో చేరుస్తుందో అతడే సర్వజ్ఞుడు. ఏ ఇంట్లో అయితే ఆమె ఎల్లప్పుడూ నివసిస్తూ ఉంటుందో అది పరమాద్భుత అమృత నిలయం.

ఆమె చూపులు ఎచ్చట ప్రసరింపజేస్తూ ఉంటుందో అది ఇంద్రునికీ, కుబేరునికీ, యమునికీ ఆయువుపట్టు. ఆ సుందరి చిరునవ్వు దుఃఖాన్ని తొలగించుతుంది, సృష్టిని ప్రకాశింపజేస్తుంది.274: ఇంకా ఆ మనోహరాంగి లక్ష్మీదేవి తన నిండు మనసులో ఇలా భావిస్తుంది....275: ఒక్కోసారి బ్రహ్మాండం అంతటినీ తన బొమ్మరిల్లుగా భావించేది. ఒకమారు, సకల లోకాలూ ఉండే బ్రహ్మాండ భాండాలను తన ఇంటిలోని కుండల దొంతరలు అనుకునేది. బ్రహ్మదేవుడు మొదలగు దేవతలను తన ఆట బొమ్మలుగా ఒకసారి అనుకునేది. ఒకమాటు భూమండలాన్ని తన బొమ్మల కొలువు అని భావించేది. సూర్యచంద్రులను అక్కడ ఉండే చిరుదీపాలుగా చూసేది. సరస్వతీదేవిని, పార్వతీదేవిని తన అనుంగు చెలికత్తెలుగా ఆదరించేది.276: లక్ష్మీదేవి అలా అవతరించినది. పిమ్మట277: ఆ సుందరాంగి ఇందిరాదేవి దేవత లందరి మధ్య, ఝంకారం చేస్తున్న తుమ్మెదలతో కూడిన కలువల దండను చేతులలో పట్టుకుని, మేఘాల నడుమ మెరిసే మెరుపు తీగ వలె (తగిన వరుడిని వరించడానికి) నిలబడింది.278 : అపురూపమైన ఆకారం కలిగినామె ఆ మహాలక్ష్మి. నవనవోన్మేష స్వరూపాలు కలిగిన ఆమె కళ్ళు, ఉరోజాలు, శిరోజాలు, పిరుదులు, నడుము, ముఖముచూసి, ఒక్క శ్రీమహావిష్ణువు తప్ప దేవతలు అందరూ ధైర్యాన్ని కోల్పోయి తబ్బిబ్బు పడ్డారు.

లక్ష్మీదేవి హరిని వరించుట

279: తన చుట్టూ అన్ని వైపులా పరివేష్టించి ఉన్న యక్షులు, రాక్షసులు, సిద్ధులు, సాధ్యులు, దేవతలు, గరుడులు, గంధర్వులు, చారణులు మొదలైన వారందరినీ పరికించి చూసి, వరునికై చూస్తున్న సౌభాగ్యవతి, నిండు జవరాలు, కన్యకారత్నం అయిన ఇందిర ఇలా ఆలోచించింది.



280:

ఐదువనై యుండ నలవడ దొక చోట
నొకచోట సవితితో నోర్వ రాదు
తగ నొకచోట సంతత వైభవంబుఁ గా
దొకచోట వేఁడిమి నుండఁ బోల
దొకచోటఁ గరుణ లే దొక్కింత వెదకిన
నొకచోట దగ్గఱి యుండఁ బెట్ట
నెఱయంగ నొకచోట నిలుకడ చాలదు
చర్చింప నొకచోట జడత గలదు

కొన్నిచోట్ల కామగుణ గరిష్ఠంబులు
క్రోధ సంయుతములుఁ గొన్ని యెడల
గొన్ని మోహలోభకుంఠితంబులుఁ గొన్ని
ప్రమద మత్సరాను భావకములు.

ఒకచోట పునిస్త్రీగా ఉండటానికి వీలుండదు. (మన్మథుడు విగతదేహుడు). ఒకచోట సవతి వల్ల ఓర్చుకోడం కష్టం. (శివుడు అర్ధనారీశ్వరుడు). ఒక చోట వైభవం స్థిరంగా ఉండదు. (ఇంద్రుడికి రాక్షసులతో యుద్ధాలు ఓడటం). ఒకచోట తాపం భరించలేము. (సూర్యుడు). ఒకచోట ఎంత వెతికినా దయ కనిపించదు. (యముడు). ఒకచోట దగ్గరగా ఉండలేము. (అగ్ని), ఒకచోట నిలకడలేదు. (వాయుదేవుడు). ఒకచోట జడత్వం ఎక్కువ. (వరుణుడు). కొన్ని చోట్ల కామగుణం ప్రబలంగా ఉంటుంది. (గంధర్వులు).

కొన్ని చోట్లు క్రోధపూరితములు. (రుద్రుడు). కొన్నిచోట్ల మోహము లోభము నిండిన మొరటుదనం ఉంటుంది. కొన్ని చోట్ల గర్వము, మచ్చరము కూడి ఉంటాయి. (రాక్షసులు). అని లక్ష్మీదేవి అక్కడ ఉన్న గొప్పవారిని తరచి చూసి భావిస్తున్నది.

ఈ పద్యంలో జాలువారుతున్న కవితాధార, దానికి తగ్గ తేనెకన్నా మధురమైన శైలి, శైలితో నిండుగా పాత్రపోషణ ఎంతో చక్కగా సహజ అలంకారంగా అమరాయి. 281:

అలా అక్కడ ఉన్న గొప్పవారందరి నడవడికల గురించి భావించుకొని వారి సంగతి వదలివేసి...282: విష్ణుమూర్తిని నచ్చుకుంటూ ఇలా అనుకుంది. "విష్ణువు (శాశ్వతుడు కనుక) దగ్గర అయితే (నిత్య) సౌభాగ్యవతిగా ఉండవచ్చు, వంతుకు వచ్చే సవతులు లేరు, ఇతని ఇల్లు ఎడతెగని సంపదలకు నిలయం. ఇతడు అందగాడు, చందనం వలె చల్లని వాడు. ఎప్పుడూ కలత చెందడు. దయామయుడు, నిర్మలమైన వాడు. ఇతనిని చేరి సేవించవచ్చు. ఆడినమాట

తప్పడు. స్థిరత్వం కలవాడు, ఏ పనిలోనూ ఆలస్యం లేని వాడు. సజ్జనులను కాపాడే వాడు, కామం, క్రోధం మొదలైన చెడ్డగుణాలు లేని వాడు". "ఇతడు నాకు తగిన భర్త" అని నిశ్చయించుకుంది. పద్మాలవంటి కన్నులు గల విష్ణుమూర్తి మెడలో పూలమాల వేసి వరించింది.283: లక్ష్మీదేవి కలువ పూలమాలతో మోక్షదాయకుడైన విష్ణువును వరించింది. తాను చేరి నివసించడానికి ఆయన వక్షస్థలాన్ని ఎన్నుకొని, సిగ్గుతో కూడిన చూపులతో మరీ మరీ చూసింది.284: ఇందిర పెల్లుబికిన ప్రేమతో తల ఎత్తింది. కానీ మొలకలెత్తిన సిగ్గుతో తల వంచింది. తన ప్రాణవల్లభుడైన విష్ణుని చూడడం వలన కలిగిన తొట్రుపాటు వలన ఆమె మోము ఎత్తనూ ఎత్తదు, దించనూ దించదు.285: విష్ణుమూర్తి తన కేసి చూస్తే లక్ష్మి చూసేది కాదు. లక్ష్మీదేవి తనని చూస్తే విష్ణువు చూడటానికి సిగ్గు పడేవాడు. లక్ష్మీ విష్ణువు ఒకరినొకరు సరిసమానంగా చూసుకునేలా మన్మథుడు తొందరలు పెట్టాడు.286: లోకాలకు తండ్రి అయిన విష్ణుమూర్తి, లోకాల తల్లి అయిన లక్ష్మీదేవిని తన వక్షస్థలమునందు చేర్చుకున్నాడు. అప్పుడు ఆమె కరుణారస పూరిత చూపుల వలన ప్రజలు ఎన్నో శుభాలను పొందారు. అటువంటి మహా మంగళకరమైన ఆ సాధ్వీమణి పూర్వం వలె భర్తతో చేరిన పుణ్య సంపద వలన లోకాలు పెంపొందాయి.287: ఇలా లక్ష్మీదేవి వరించి విష్ణువును చేరబోతున్న సమయంలో, కడలిరాజు అయిన సాగరుడు, అల్లుడైన విష్ణుమూర్తికి తనలో ఉన్నట్టి కౌస్తుభం అనే అమూల్యమైన రత్నాన్ని కానుకగా ఇచ్చాడు. దానిని తన వక్షస్థలం మీద విష్ణువు ధరించాడు. అప్పుడు ఆ ఆదిలక్ష్మి శ్రీవత్సము, కౌస్తుభము, వైజయంతిమాల, ముత్యాలహారము మొదలైన విభూషణాలతో భూషితమైన ఆ పద్మనయనుడైన శ్రీమహావిష్ణువు ఎదపై నివసించింది. అప్పుడు...288:

లక్ష్మీదేవి నారాయణుని చేరిన కల్యాణ సమయంలో, ముందు శంఖ, మృదంగ ధ్వానాలు, మురళీరవాలు మ్రోగాయి. పెనుచీకట్లు తొలగిపోయాయి. ఆటపాటల వేడుకలతో దేవతలు విలసిల్లారు. సర్వలోక పూజ్యులు, బ్రహ్మాది దేవతలు విష్ణునామాంకితాలైన మంత్రాలతో స్తోత్రాలు చేశారు.289: పరీక్షిన్మహారాజా! ఆ సముద్ర రాజపుత్రి లక్ష్మీదేవి చల్లని చూపులతో తియ్యగా చూసింది. ప్రజలకు సంపదలు చేకూరాయి, శుభాలు సమకూరాయి. జగత్తు సుఖజీవనంతో జీవించింది.290:

ఓ రాజా! పరీక్షిత్తూ! క్షీరసాగర రాకుమారి అయిన మహాలక్ష్మి శుభకరమైన చూపులు కరువై రాక్షసులు పరితపించారు. విచారంతో తహ తహ లాడుతూ, జాలితో బుడబుడ దుఃఖించారు. వారికి కీడు తోచి తూలిపోయారు.

వారుణి ఆవిర్భావము

291: పిమ్మట, దేవతలు, రాక్షసులు పాలసముద్రాన్ని చిలికేటప్పుడు, వారుణి అనే కన్యక పుట్టింది. కలువ కన్నుల విష్ణుమూర్తి అనుమతితో, ఆ కన్యను రాక్షసులు తీసుకున్నారు.

ధన్వంతర్యామృత జననము

292: అలా ఇంకా చిలకగా చిలకగా ఆ పాల సముద్రంలోంచి...293: అమృత కలశం చేత పట్టుకుని **ధన్వంతరి** అనే దివ్యపురుషుడు విష్ణువు అంశతో జనించి, ఆ పాల కడలిలోనుండి వెలుపలికి వచ్చాడు.

ఆ దివ్యపురుషుడు మంచి ప్రాయం కలవాడు, ఆజాను బాహువుడు, శంఖం వంటి కంఠం,ఎఱ్ఱనికళ్ళు, ఎత్తైన రొమ్ము, నల్లని తల వెంట్రుకలు, మేఘవర్ణపు దేహము కలవాడు, పట్టువస్త్రాలు, పూలమాల, మెరుస్తున్న నగలు, మణులు పొదిగిన మకరకుండలాలు, రత్నాల అందెలు, మొదలైన అలంకారాలు ధరించిన వాడు, సింహం వంటి శక్తియుక్తులు కలవాడు. అతడు బహుయోగ్యుడు, పవిత్ర యజ్ఞాలలో హవిర్భాగాన్ని పొందువాడు, సమస్త వైద్య శాస్త్రాలలోను ఆరితేరినవాడు, దేవతా ప్రముఖుడు.294: అలా ధన్వంతరి అమృత కలశం ధరించి కడలి వెలుపలికి రాగానే. 295: పరీక్షన్మహారాజా! ధన్వంతరి చేతిలోని అమృతకలశాన్ని రాక్షసులు చూసారు. దేవతలను త్రోసిపుచ్చి, సాటిలేని బలంతో చెలరేగి, ఎగబడి ఆయన చేతులలోని కలశాన్ని లాక్కున్నారు.296: అలా అమృతాన్ని అపహరించి...297: "మనకు చావు లేకుండా చేసే మందు సులువుగా దొరికేసింది" అంటూ అసురులు అమృత భాండాన్ని లాక్కుపోయారు. దేవతలు భయంతో "అమృతం నిండా ఉన్న కుండ పోయింది, పోయింది" అంటూ విష్ణుమూర్తికి మొరపెట్టుకున్నారు.298 : భక్తుల కోరికలను తీర్చు పరమేశ్వరుడు అయిన విష్ణుమూర్తి, దేవతలు పెట్టే మొరలు ఆలకించి, ఇలా అన్నాడు "మీరేమీ బాధ పడనక్కర లేదు. మీ కోరిక నెరవేరేలా నా మాయాబలంతో పరిస్థితులను మరల్చుతాను." ఆ సమయంలో రాక్షసులు ఆ అమృతాన్ని తామే తాగేద్దాం అనుకున్నారు.

కానీ, రాక్షసులలో కలి పురుషుని మాయ ఆవహించి, అమంగళకరమైన కలహం బయలుదేరింది. బలహీనులైన వారు కొందరు సత్రయాగం వంటి గొప్ప యాగాలలో ఎలా అయితే పడిన శ్రమకు తగినంత భాగాలు వేసుకుని పంచుకోవటం న్యాయం. ఇది తరతరాలుగా పూర్వంనుంచీ వస్తున్న ధర్మం. కాబట్టి అమృతకలశాన్ని వదిలిపెట్టండి అని చెప్తూ, జాతి మాత్సర్యంతో రెచ్చిపోతున్న రాక్షసులను అడ్డుకున్నారు. ఆ సమయంలో.299: ఒకడి చేతిలో ఉన్న అమృతకలశాన్ని ఇంకొక బలవంతుడు లాక్కున్నాడు. వాని కంటె బలవంతుడు ఒడిసి పట్టి లాక్కుని, పారిపోయాడు. తక్కినవారు అరిచారు.

జగన్మోహిని వర్ణన

300: ఇలా రాక్షసులు అమృతకలశం కోసం పెనగు లాడుతున్నారు...301: ఈలోగా విష్ణుమూర్తి తనలో తాను చిరునవ్వులు నవ్వుకున్నాడు. రాక్షస వీరులను అణచడానికి మాయా మోహినీ రూపం ధరించాడు.

ఆ మోహినికి మెత్తని అడుగులు, నిగనిగ మెరసే మోకాళ్ళు, అరటిబోదెలవంటి తొడలు, పెద్ద పెద్ద పిరుదులు, బాగా సున్నితమైన నడుము, చిగురుటాకుల వంటి ఎఱ్ఱని అరచేతులు, పెద్ద వక్షోజాలు, శంఖంవంటి కంఠం, దొండపండు లాంటి పెదవి, చంద్రబింబం వంటి ముఖము, తెల్లని కన్నులు రెండు, నల్లని తుమ్మెదలవంటి శిరోజాలు, నెలవంక వంటి నుదురు చక్కగా అమరి ఉన్నాయి. ఆమె అలంకరించుకున్న చెవిలోలకులు, బాహుపురులు, హారాలు, కంకణాలు, వాటిని మించిన చిరు సవ్వళ్ళు చేసే కాలి అందెలు ఎంతో శోభిస్తున్నాయి.302: ఆ సమయంలో, శ్రీమహావిష్ణువు, అలా లోకాన్ని అంతటినీ మోహింపజేసే రూపంతో మాయామోహినీ అవతారం ధరించి...303: పైటకొంగును వక్షోజాలపైనుండి జార్చి, మెల్లగా సర్దుకుంటోంది. తళతళ మెరుస్తున్న చెక్కిళ్ళను చేతిపై చేర్చి మరల వదిలివేస్తోంది. జిగేలుమని మెరుస్తున్న కడగంటి చూపులను ప్రసరించి, మళ్ళీ కనురెప్పలు మూస్తోంది. అందంగా చిరునవ్వులు చిలకరించి, ఎఱ్ఱని పెదవిని మెలిపెడుతోంది, కొప్పులో వికసించిన

పూలపరిమళాలు వ్యాపింపజేసి, కంకణాదులను మ్రోగేలా చేస్తోంది. నిలకడ లేకుండా మెలగుతూ నెమ్మేని కాంతులను పొంగిపొరలేలా చేస్తూ, పల్చగా ఉన్న తెల్లని పైటను ఆడిస్తోంది.

విశేషం :

జాఱించు, జాఱించిలొలయించు, నొలయించి,.. అంటూ పూర్వపాదాంత పదాన్ని గ్రహించి, ఉత్తరపాదం ఆరంభించడం ప్రయోగిస్తూ, ముక్తపదగ్రస్త అలంకారాన్ని అత్యద్భుతంగా మధురాతి మధురంగా ప్రయోగించిన మా పోతన్న గారికి శతకోటి పాదాభివందనాలు . . .

304: ఇలా ఆ మాయలమారి జవరాలు, జగత్తుని మోహింపజేసే దేవతలాగ ఒప్పి ఉండి, తన అందమైన ముఖ సుగంధానికి ఆకర్షితమై ముసురుతున్న తుమ్మెదలను అదలిస్తూ, మురిసిపోతూ, చిగురాకుల పొదల వెంట సంచరిస్తున్న ఆమెను అసుర వీరులు చూసి, మోహంలో పడిపోయి, ఆమెతో ఇలా అనసాగారు...305:

"ఓ కమలాల వంటి కన్నులున్న కోమలాంగీ! చక్కదనాల జవరాలా! ఓ వన్నెలాడీ! ఏమి లావణ్యం! ఏమి మాధుర్యం! ఎక్కడి నుండి వచ్చావు? ఏమి కావాలి? నీ పేరేమిటి? గంధర్వ, సిద్ధ, దేవత, రాక్షస, చారణ, మానవ కన్యలలో ఎవరి యందూ నీ అంత అందచందాలు లేవు. నీ మిక్కిలి ప్రియమైన మనసుకి, అవయవాలకు నిండుదనం సమకూర్చిన బ్రహ్మదేవుడు నిన్ను ప్రీతితో సృష్టించాడు కాబోలు! మేము కశ్యపుని సంతతి వారము, దేవతలకు సోదరులము. ఎదురులేని పౌరుషం కలవారము. ఒకే ప్రయోజనాన్ని ఆశించి శ్రమించి సంపాదించిన ఈ పదార్థాన్ని పంచుకోడంలో జ్ఞాతులమైన మాలో మాకు పంపకాలు కుదరటం లేదు. నువ్వు పంచు.306: గజరాజువంటి చక్కటి నడక గల సుందరీ! మేము ఉభయులము బారులు తీరి వరుసగా కూర్చుంటాము. పరాయి వారు, తన వారు అనే భేద భావం చూపకుండా మా ఉభయులకూ సరిగా ఈ అమృతాన్ని నువ్వు పంచి పెట్టు."307:

ఈ విధంగా అమృతం పంచమని హెచ్చరిస్తున్న రాక్షసులను చూసి, మాయా మోహినీ రూపంలో ఉన్న విష్ణుమూర్తి తన అందమైన వాలుచూపుల తూపులతో వారి ఓరిమిలను బద్దలు చేసి, చిరునవ్వులు చిందిస్తూ ఇలా అన్నాడు.308:

సుందరులగు పురుషులఁగని
పొందెడు నాయందు నిజము పుట్టునె మీకున్?
బృందారకరిపులారా!
చెందరు కామినుల విశ్వసింపరు పెద్దల్.

"ఓ అసురులారా! నేను అందమైన మగవారిని చూసుకుని పొందగోరే దానను. మీకు నా మీద నమ్మకం కుదురుతోందా? పెద్దలు అందగత్తెలను నమ్మి దరిచేరరు కదా!309:

పలుకులు మధురసధారలు
దలఁపులు నానా ప్రకార దావానలముల్
చెలుములు సాలావృకములు
చెలువల నమ్ముటలు వేదసిద్ధాంతములే?

అందగత్తెల మాటలు తియ్యనైన తేనెలు జాలువారుతూ ఉంటాయి. వారి ఆలోచనలు అనేక విధాలైన కార్చిచ్చులు, వారి స్నేహాలు తోడేళ్ళవంటివి. అటువంటివారిని విశ్వశించడాలు అంగీకారమైనవి కావు.

అమృతము పంచుట

310: సరే! అనుమానాలు వదలిపెట్టండి. అలాగే కానివ్వండి. శక్తివంచన లేకుండా చక్కగా పంచిపెడతాను.'' ఇలా జగన్మోహిని చెప్పగా, దానవులు మాట్లాడకుండా, అమృత కలశాన్ని ఆ వనితారత్నానికి ఇచ్చారు.

311: ఓ రాజా పరీక్షిత్తూ! ఆ జగన్మోహినీదేవి మెరుగారు చూపులు, చల్లని పలుకులు, బుజ్జగింపులు కట్టుతాళ్ళలా సాగి సాగి రాక్షసుల నోళ్ళను కట్టేశాయి.312: ఆ విధంగా రాక్షసులు అందించిన, అమృతకలశాన్ని, మాయా సుందరి మోహినీ రూపంలో ఉన్న విష్ణుమూర్తి తన చేతులలోకి తీసుకున్నాడు. చిరునవ్వులు చిందే పలుకులతో "నేను పంచిపెట్టిన విధంగా 'ఔను', 'కాదు' అనకుండా ఒప్పుకోవాలి"అన్నాడు.ఆ షరతులకు అంగీకరించిన రాక్షసులు, దేవతలు "సరే" అన్నారు. వారందరూ ఉపవాసం ఉండి స్నానాలు చేసి హోమాలు ఆచరించారు. బ్రాహ్మణులకు గోదానాలు, భూదానాలు, హిరణ్యదానాలు మున్నగు దానాలు ఇచ్చి, వారి ఆశీర్వచనాలు అందుకున్నారు. తెల్లని బట్టలు కట్టుకున్నారు. చందనం పూతలు, పూలమాలలు, ధూపాలు, దీపాలు అలంకరించిన బంగారు మండపంలో చేరారు. తూర్పుకు

కొసలు ఉండేలా పరచిన దర్భాసనాల మీద తూర్పుముఖంగా వరుసలు కట్టి కూర్చున్నారు.313: అప్పుడు, కటిభారంతో, స్తనాలభారంతో, శిరోజాలభారంతో చిక్కిన చక్కనమ్మ జగన్మోహిని, తన పద్మం వంటి చేతిలో అమృతకలశాన్ని పట్టుకుని ఒయ్యారంగా వచ్చింది. ఆమె ధరించిన రకరకాల ఆభరణాలు సవ్వళ్ళు చేస్తున్నాయి.314: పరీక్షిత్తూ! రాజా! ఆ మోహినీ అవతారం, ధరించిన కర్ణాభరణాల తళతళ మెరుపులు, ఆమె ముక్కుకు, ముఖానికి, చెవులకు, చెక్కిళ్ళకు, కనుగొనలకు మనోహరంగా వ్యాపిస్తున్నాయి.

అలా లక్ష్మీదేవితో సాటిరాగల ఆ అందగత్తెను చూసిన దేవతలకు, రాక్షసులకు అందరికీ మనసు చెదిరి పోయింది.315: అలా దేవదానవులు సిద్ధపడుతున్న సమయంలో....316:
"రాక్షసులకు అమృతం పోయడం అంటే, పాములకు పాలుపోసినట్లే, ఆపదలు కలిగిస్తుంది" అంటూ మోహినీ దేవి అసురులను అందరిని ప్రత్యేకంగా ఒక పక్క కూర్చోబెట్టింది.317: అలా దేవదానవులను రెండు వేరువేరు వరుసలుగా కూర్చోబెట్టింది.318 : "రాక్షసులారా! తొందర పడకండి, ఆలస్యం చేయకుండా వస్తాను, నెమ్మదిగా కూర్చోండి." అంటూ పలకరిస్తూ, కన్నులు కదలించింది. రెండు పాలిండ్ల పైనున్న పైటకొంగు జార్చింది. 'వదిన, మరది' వరసలు కలిపింది. మర్మస్థానాల మరుగు తొలగించినట్లే తొలగించి మరల కప్పేసింది. చిరునవ్వులతో మైమరపించింది. అద్భుతమైన నెరజాణ మాటలతో రాక్షసులను లొంగ దీసుకుంది. దేవతలను "ఆలస్యం చేయకుండా తొందరగా తాగండి" అంటూ అమృతాన్ని దేవతలకు పంచేసింది. దేవతలు సంతృప్తితో అమృతాన్ని ఆరగించి, ఆమెను అభినందించారు.319: అలా మోహినీ అవతారమెత్తి విష్ణువు అమృతం అంతా దేవతలకు పంచిపెట్టు సమయంలో...320:

ఆ మాయా మోహిని చూపులకు కరిగి పోయిన రాక్షసులు "ఈ మగువ మనకు, దేవతలకు తేడాలేకుండా పంచిపెడతాను అని పూనుకుంది కదా. అలా చేయకుండా మాట తప్పుతుందా? లేదు అలా తప్పదు. కానీ, మనం సాహసించి రమ్మని పిలిస్తే బదులు పలకదేమో! తిరిగి చూడదేమో! స్తనద్వయం మీద పైట కప్పేసుకుంటుందేమో! మరోమాట కలిపితే కంగారుపడి వెనకడుగు వేస్తుందేమో! మన యందు అలుగుతుందేమో! మన మీద చూపుతున్న విశ్వాసం చెడుతుందేమో!" అనుకుంటూ, జంకుతూ గొంకుతూ, ఊరకే ఉండిపోయారు తప్పించి "సుందరీ! తొందరగా తీసుకురా!" అని పిలవలేకపోయారు.

రాహువు వృత్తాంతము

321: మోహిని అలా అమృతం అంతా అమరులకే పోస్తున్న సమయంలో...322: రాహువు దేవతలలో రహస్యంగా కలిసిపోయి దేవతల రూపు ధరించి అమృతం తాగుతుండగా సూర్యచంద్రులు చూసారు. చూసి మోహినికి సైగలు చేసారు. వెంటనే విష్ణువు చక్రాయుధంతో రాహువు తల ఖండించాడు. అమృతం ఆనటం వలన, రాహువు తల నిర్జీవం కాలేదు.

అమరత్వం పొందింది. మొండెం నేలపై కూలిపోయింది.323: అలా అమరత్వం పొందిన రాహువు శిరస్సును బ్రహ్మదేవుడు గౌరవించి గ్రహంగా చేసి ఆకాశంలో నిలబెట్టాడు. రాహుగ్రహం ఆ పగను వదలకుండా, అమావాస్య, పూర్ణిమల్లో సూర్య చంద్రులను నేటికీ పట్టుకుంటోంది.324: విష్ణుమూర్తి ఒక్క చుక్క కూడా రాక్షసులకు మిగల్చకుండా, అమృతం అంతా దేవతలకు బాహాటంగా పోసి, మోహినీ రూపాన్ని వదలిపెట్టి నిజాకారాన్ని ధరించాడు. ఇదంతా చూస్తున్న రాక్షస వీరులు దుఃఖించారు.325:

దేవతలు, రాక్షసులు సమాన సంకల్పము, శక్తి, బలము, తెలివి, ధనము, ఆత్మగౌరవము ఉన్నవారే. కానీ ఇద్దరికి రెండు రకాల ఫలితాలు అందాయి. దేవతలు శుభాలను పొందారు. విష్ణువును ఆశ్రయించని కారణంచేత రాక్షసులు శుభాలను పొందకుండా అనేక దుఃఖాలపాలయ్యారు. అవును, విష్ణువును శరణు వేడని వారు శుభాలు పొందలేరు కదా!
326: రాక్షసులు అమృతం త్రాగాలని సంకల్పించి, పాలసముద్రాన్ని చిలికినా దుఃఖాన్ని పొందారు. అవును, లక్ష్మీపతి విష్ణుమూర్తి యందు భక్తిలేని వివేకహీనులు కోరిన కోరికలు తీరి కృతార్థులు కావడం జరుగదు కదా.327: ఓ పరీక్షిన్మహారాజా! రాక్షసులను తన కంటి చూపులతోనే నిరోధించి, కష్టపడి సాధించిన అమృతాన్ని, దేవతలకు ఇచ్చి విష్ణుమూర్తి గరుత్మంతుని ఎక్కి వెళ్ళిపోయాడు.

సురాసుర యుద్ధము

328 : దేవతలకే మొత్తం అమృతం అంతా చిక్కడం వలన రాక్షస వీరులకు చీకాకు పుట్టింది. వారు అనేక రకాల ఆయుధాలతో సేనలతో యుద్ధానికి సిద్ధపడి బయలుదేరారు.

శైలి :

అమృతం సాధించటంలో కష్టం, ఆ కష్టానికి ఫలం దక్కనందున చీకాకు మనసుతో పెట్టుకున్న కృద్ధత తీవ్రతను కష్టసాధ్యమైన "ద్ధ" కార ప్రాసతో సూచించిన తీరు బావుంది.

329: విరోచనుని (ప్రహ్లాదుని కొడుకు) కొడుకు అయిన బలిచక్రవర్తి, నూరు యజ్ఞములు చేసి పదవి పొందిన ఇంద్రుడు మొదలైన బలవంతులు ఖడ్గాలు చేబూని మదించిన స్వాభిమానాలు కలవారై, చెలరేగి బాహాబాహి పోరాటాలు సాగించారు.

ప్రాస. న్యూనఫలదాయక పోరాటాలు.
కనుక కఠినతరమైన "న్య" కార ప్రాస.

330:నిండు పున్నమి నాటి చంద్రునికి సాటివచ్చే ప్రకాశంతో బలిచక్రవర్తి, మయాసురు డంతటి వానిచే నిర్మింపబడినది, చూపులకు అందనిది, ఎన్నో విశిష్ట శస్త్ర అస్త్రాది ఆయుధాలు కలది, ఆకాశంలో కూడా వెళ్ళగలది.

గొప్ప గొప్ప రాక్షస యోధులు ఎందరో సిద్ధంగా గల గొప్ప వాహనంపై బయలుదేరాడు. అలా వస్తున్న బలిచక్రవర్తి వాహనం ముందు వింజామరలతో, జెండాలతో ప్రకాశిస్తున్న దానవ సైన్యాలు నడుస్తున్నాయి.331: అలా వస్తున్న బలిచక్రవర్తి ముందు భాగంలో నముచీ, శంబరాసురుడు, బాణాసురుడు, ద్విమూర్ధుడు, శకుని, జంభాసురుడు, అయోముఖుడు, ప్రహేతి, హేతి, భూతసంత్రాసుడు, హయగ్రీవుడు, కపిలుడు, ఇల్వలుడు, ఉత్కలుడు, మేఘ దుందుభి, మయుడు, త్రిపురాసురుడు, విప్రచిత్తి, విరోచనుడు, వజ్రదంష్ట్రుడు, తారకుడు, అరిష్టుడు, అరిష్టనేమి, శంభుడు, నిశంభుడు, శంకుశిరుడు మొదలైనవారు, పౌలేములు, కాలకేయులు, నివాతకవచులు మున్నగువారు, మిగిలిన సేనానాయకులు అందరూ వారి వారి సేనలను నడుపు కుంటూ వస్తున్నారు. వారు రథాలు, గుఱ్ఱాలు, ఏనుగులు, జింకలు, సింహాలు, పందులు, శరభాలు, దున్నపోతులు, గురుపోతులు, ఖడ్గమృగాలు, గండ భేరుండాలు, సవరపుమృగాలు, నక్కలు, పులులు, ఎద్దులు మొదలైన జంతువులను, రాబందులు, గ్రద్దలు, కాకులు, కోడిపుంజులు, కొంగలు, డేగలు, హంసలు మున్నగు పక్షులను,తిములు, తిమింగలాలు మున్నగు జలచరాలను, నరవాహనాలను, రాక్షసాకారాలతో, దేవతాకారాలతో వికారాలైన ఆకారాలు గల జంతువులను వాహనాలుగా చేసికొని ఎక్కి వస్తున్నారు. తమతమ సంకేతాలైన గొడుగులు, జెండాలు, కవచాలు, ఆయుధాలు, వాహనాలపై వేసే అంగీలు, శిరస్త్రాణాలు మున్నగు సమస్త సాధనాలతో సిద్ధంగా వస్తున్నారు.

దేవేంద్రుడు ఐరావతంపై ఎక్కి వస్తున్నాడు. అతనితోపాటు అగ్ని, వరుణుడు, వాయువు, యముడు మొదలైన అనేక దేవతలు తమ సైన్య సమూహాలతో వచ్చి వెనుదీయకుండా దానవులను ఎదిరించారు. రెండు పక్షాల వారూ అమిత ఉత్సాహంతో, వేగిరిపాటుతో, గట్టిగా పూని యుద్ధం చేయడానికి సన్నద్ధులు అయ్యారు. క్రోధోద్రేకాలతో పరస్పరం అధిక్షేపించు కుంటున్నారు.332: ఓ మహారాజా! అప్పుడు ఆ రెండు పక్షాల సైన్యాలూ, కఠినమైన కోరలు, అందమైన అలపజ్జాలు, నెమలి పురులు, వింజామరలు, వెల్లగొడుగులు, రంగురంగుల జెండాలు, గాలికి కదలాడే తలపాగాలు, ధ్వనించే కంకణాలు మున్నగు ఆభరణాలు, సూర్యకాంతికి మెరుస్తున్న ఆయుధాలు, రకరకాల డాలువార్లు, వీర హారాలు, బాణాలతో నిండిన అమ్ముపొదులు కలిగి చెలరేగాయి. ఆ ఉభయ సైన్యాలు మొసళ్ళ గుంపులతో కూడి పోరాడటానికి వచ్చిన రెండు సముద్రాలవలె ఒప్పి ఉన్నాయి.333:

భేరీ వాద్యాలనుండి వెలువడే **'భం'** అనే శబ్దాలు, ఏనుగుల ఘీంకారాలు, గుఱ్ఱాల సకిలింపులూ, పెద్ద పెద్ద రథచక్రాల శబ్దాలు ఎంత భయంకరంగా ఉన్నాయంటే, కులపర్వతాలు సైతం తలకిందులై పోతున్నాయి.334: ఇలా రెండు పక్షాల సైన్యాలు గుమిగూడాయి. బలిచక్రవర్తితో దేవేంద్రుడు, తారకునితో కుమార స్వామి,హేతితో వరుణుడు,ప్రహేతితో మిత్రుడు, కాలనాభునితో యముడు, మయాసురునితో విశ్వకర్మ, శంబరునితో త్వష్ట, విరోచనునితో సవితు, నముచితో పరాజిత్తూ, వృషపర్వునితో అశ్వనీ దేవతలు, బాణుడు మొదలైన బలి కొడుకులతో సూర్యుడు, రాహువుతో చంద్రుడు, పులోమునితో వాయువు, శుంభ నిశుంభులతో

భద్రా కాళీ, జంభునితో వృషాకపి, మహిషునితో విభావసుడు, ఇల్వలునితో వాతాపితో బ్రహ్మపుత్రులూ, దుర్మర్షణునితో మన్మథుడూ, ఉత్కలునితో సప్తమాతృకలూ, శుక్రునితో బృహస్పతీ, నరకునితో శనైశ్వరుడు, నివాతకవచులతో మరుత్తులు, కాలకేయులతో వసువులు, దేవతలు, పౌలోములతో విశ్వేదేవులు, క్రోధవశులతో రుద్రులు, ద్వంద్వ యుద్ధాలలో ఎదిరించారు. అంతేకాకుండా, కాలిబంట్లు కాలిబంట్లతో, రథాలవారు రథాలవారితో, వాహనాలవారు వాహనాల వారితో, ఎదిరించి పోరాడారు.

ఆ సేనావాహినులు సింహనాదాలు చేస్తూ, బిట్టుగా నవ్వుతూ, ఒకరినొకరు కేకేస్తూ, ధిక్కారాలు చేస్తూ, భూజాలు తట్టి ముందుకురుకుతూ, గావుకేకలతో ఉప్పొంగిపోతూ, హుంకారాలు చేస్తూ, గర్విస్తూ, అల్లెత్రాళ్ళు మ్రోగిస్తూ, బాణాలను నాటుతూ, గండ్రగొడ్డళ్ళతో నరుకుతూ, చక్రాలతో ఖండిస్తూ, శక్తులతో ముక్కలు చేస్తూ, కొరడాలతో కొడుతూ, గొడ్డళ్ళతో నరుకుతూ, గదలతో మొత్తుతూ, చేతులతో చరుస్తూ, కత్తులతో ఉత్తరిస్తూ, అడ్డకత్తులతో నొప్పిస్తూ, ఈటెలతో తెగవేస్తూ, తాళ్ళతో కట్టేస్తూ, గుదియలతో అదరగొడుతూ, రోకళ్ళతో దంచుతూ, సమ్మెటలతో బాదుతూ, పిడికిళ్ళతో పొడుస్తూ, తోమరాలతో పిండిచేస్తూ, శూలాలతో కుమ్ముతూ, గోళ్ళతో చీలుస్తూ, చెట్లూ కొండలూ విసురుతూ, కొరవులతో కాల్చుతూ పలు విధాలుగా పోరాటాలు చేసారు.

ఆ యుద్ధం పగిలిపోయిన తలలు, బద్దలైపోయిన పుఱ్ఱెలు, చీలిపోయిన చెక్కిళ్ళు, చిక్కుపడిపోయిన కొప్పులు, విరిగిపోయిన పండ్లు, తెగిపోయిన భుజాలు, తునాతునకలై

పోయిన చేతులు, విరిగిపోయిన నడుములు, వికారమైపోయిన ముఖాలు, లొట్టపోయిన కన్నులు, తెగిపోయిన చెవులు, ముక్కలైపోయిన ముక్కులు, విరిగిపోయిన తొడలు, తెగిపోయిన పాదాలతో, చినిగిపోయిన కవచాలు, రాలి పోయిన నగలు, పడిపోయిన జెండాలు, విరిగిపోయిన గొడుగులు, కృంగిపోయిన ఏనుగులు, నుగ్గునుగ్గయిపోయిన రథాలు, కూలిపోయిన గుఱ్ఱాలు, చెల్లాచెదురయిపోయిన సైన్యసమూహాలతో, కొట్టుకుంటున్న

కొనప్రాణాలు, పొర్లాడుతున్న శరీరాలతో, సంతోషంతో చిందులు తొక్కుతున్న పిశాచాలు, పారుతున్న నెత్తురు ఏరులు, పోగులు పడుతున్న మాంసాలు, పెరుగుతున్న పీనుగుల పెంటలతో, రాబందులు, గద్దలు మున్నగు పక్షులు చేస్తున్న రొదలతోను మిక్కిలి భయంకరంగా రూపొందింది.

బలి ప్రతాపము

335: ఆ యుద్ధంలో దైత్యరాజు బలి చక్రవర్తి, స్వర్గాధిపతి దేవేంద్రునిమీద పది బాణాలు, ఆయన వాహనం ఐరావతంమీద మూడు బాణాలు, ఆయన రథం లాగే గుఱ్ఱాలమీద నాలుగు బాణాలు, రథసారథి మీద ఒక బాణం వేసాడు. వెంటనే ఆకాశలోకాలకు ప్రభువు అయిన దేవేంద్రుడు అ బాణాలన్నిటిని ఖండించాడు. ఆ అసుర చక్రవర్తి బలి దేవేంద్రుని పరాక్రమాన్ని మెచ్చుకున్నాడు.336: దుష్టులను శిక్షించుట యందు శక్తి గల ఇంద్రుడు తన బాణాలన్నింటినీ వరసపెట్టి ఖండించగా, యోధుడైన బలి ఉపాయంతో గొప్పదయిన శక్తి ఆయుధాన్ని చేపట్టాడు. దానినికూడా ఇంద్రుడు ఆశ్చర్యంగా ఖండించాడు. పిమ్మట బలి ఈటె, శూలం, తోమర అందుకోగా, వెంటనే వాటిని కూడా ఇంద్రుడు తునాతునకలు చేసాడు. అక్కడితో ఆపకుండా, బలి వేటిని ఎక్కుపెట్టినా వాటన్నిటినీ, ఇంద్రుడు పట్టుదలగా ముక్కలు ముక్కలు చేసేశాడు. అంతట బలి రథాన్ని విడిచిపెట్టి, తన నేర్పు ప్రదర్శిస్తూ, శత్రువులకు కనబడకుండా చేసే పలు మాయలను పన్నాడు. ఆకాశంలో మాయను కల్పించాడు. దానిని చూసి దేవతా సమూహాలు భయపడిపోయాయి.337:

ఇలా బలిచక్రవర్తి పన్నిన ఇంద్రజాలం వలన దేవతలమీద పర్వతాలు వచ్చి పడ్డాయి, కార్చిచ్చుతో మండుతూ చెట్లు చెలరేగాయి, కొండశిఖరాల నుండి రాళ్ళ వాన వర్షించింది, పెద్దపెద్ద నాగుపాములు మీదపడి కరిచాయి, తేళ్ళు కుట్టాయి, అడవి పందులు, పులులు, సింహాలు మీదమీదకి దూకి చీల్చ బోతున్నాయి. అడవి ఏనుగులు వచ్చి పడదొక్కాయి, మహారక్కస మూకలు లక్షల సంఖ్యలలో, దిసమొలలతో శూలాలు ధరించి, "రండి రండి", "నరుకుతాం, కోస్తాం" అంటూ కేకలు పెట్టారు. రాక్షస వీరులు ఎంతో మంది గదాదండాలు ధరించి, వికారమైన ముఖాలతో, వ్రేలాడుతున్న శిరోజాలతో "పోనివ్వకండి, పోనివ్వకండి... నరకండి, నరకండి" అంటూ వెన్నంటి తరుమసాగారు. భీకరమైన, గంభీరమైన పిడుగులతో కూడిన మేఘ సమూహాలు గాలివాలులకు చెలరేగి, నిప్పుల కుప్పలనూ, మంటల రాసులనూ కురిపించాయి. పెనుగాలుల వలన చెలరేగిన కారుచిచ్చు ప్రళయ కాలపు అగ్నివలె మండసాగింది. తీవ్రమైన తుఫాను వలన అల్లకల్లోలమైన సముద్రము అలలు, సుడిగుండాలు పెద్దపెద్దవాటితో పొంగి గట్లుదాటి పొర్లసాగింది. అప్పుడు, ప్రళయకాలమా అన్నట్లు నింగీ, నేలా,రాత్రీ, పగలూ తేడా తెలియరాకుండా పోయింది.338:

ఓ పరీక్షిన్మహారాజా! ఆ రాక్షస రాజేంద్రుడు బలి పన్నిన రకరకాల మాయా జాలాలకు విరుగుడు తెలియని వజ్రాయుధధారి అయిన ఇంద్రుడు మున్నగు ఆదిత్యులు దిక్కుతోచక చిక్కులలో పడ్డారు.339: ఆ సమయంలో దేవతలు.340:"దేవా! జనార్దనా! ఈ రాక్షసరాజు మాయాజాలాలలో చిక్కుకుపోయాము. ఇప్పుడు మాకు దారేది? ఇప్పుడు ఎక్కడకి పోవాలి? ఇక్కడకి రావయ్యా! మమ్ము కాపాడవయ్యా! కుయ్యో మొఱ్ఱో" అంటూ విష్ణువునకు మొరపెట్టుకున్నారు.

హరి అసురులను శిక్షించుట

341: అలా దేవతలు విష్ణుమూర్తికి మొరపెట్టుకుంటున్న సమయంలో. . 342: మహావిష్ణువు తన వాహనం పక్షిరాజు గరుడుని మీద కూర్చుని అక్కడకి వచ్చాడు. అప్పుడు ఆయన వక్షస్థలం మీద కౌస్తుభమణి, లక్ష్మీదేవి ప్రకాశిస్తూ ఉన్నాయి. చక్రాయుధంతో సహా అనేక ఆయుధాలు ఆయన వద్ద ఉన్నాయి. చూడశక్యము కానంతటి ధగధగలాడే కిరీటాలు మున్నగునవీ,సరిక్రొత్త పసుపుపచ్చని పట్టు బట్టలూ,తగిన ఆభరణాలు అనేకమూ ధరించి ఉన్నాడు. వికసించిన పద్మాల వంటి కన్నులతో విరాజిల్లుతున్నాడు.343: అలా కమలాల వంటి కన్నులు గల కాంతుడు విష్ణువు రాగానే, ఆ రాక్షసుల మాయలు అన్నీ కకావికలై, పనికిరాకుండాపోయి, విరిగిపోయాయి. దేవతలు అందరూ అప్పుడే నిద్ర మేల్కొన్న విధంగా చెలరేగారు. పురుషోత్తముని పాదాశ్రయంతో పరిష్కరింపబడిన ఆపదల పట్టులు విడిపోతాయి కదా!344: ఆలా వైష్ణవ ప్రభావంతో రాక్షసమాయలు విరిగి పోయినప్పుడు...345: రాక్షస వీరుడు కాలనేమి భీకరమైన సింహాన్ని ఎక్కి వచ్చి, గరుత్మంతుని తలమీద వాడియైన బల్లెంతో కుమ్మాడు. విష్ణువు అతని ఆయుధాన్ని లాక్కొని ఆ రాక్షసుడుని చచ్చేలా పొడిచాడు.346: తరువాత విష్ణుని మాలీ, సుమాలీ బెదిరించారు. అంతట నారాయణుడు తన మహా శక్తిమంతమైన చక్రాయుధంతో వారి తలలు తెగనరికాడు. మాల్యవంతుడు గద పట్టుకుని గరుడుని రెక్కలు చెదరగొట్టాడు. హరి వాని తల కూడా చక్రాయుధంతో ఖండించాడు.347: ఇలా శ్రీమహావిష్ణు కరుణాకటాక్షానికి పాత్రులై తిరిగి బలం పుంజుకున్న వరుణదేవుడూ, వాయుదేవుడు, దేవేంద్రుడు మున్నగు దేవతా ప్రముఖులు ఇంతకు ముందు ఎవరు ఎవరితో చేశారో మరల వారు వారిని పోరులో ఎదిరించి పోరాడి వారిని పొడిచారు.348: అంతట బలిచక్రవర్తిని జయించడానికి సాహసించి బాహుబలంతో పూనుకుని ఇంద్రుడు పట్టుదలగా వజ్రాయుధాన్ని పైకెత్తాడు. దానితో రాక్షసు లందరూ హాహాకారాలు చేశారు.349: వజ్రాయుధాన్ని ఎత్తి పట్టుకుని జళిపిస్తూ, ఇంద్రుడు తన ఎదుట పరాక్రమం ప్రదర్శిస్తున్న బలిచక్రవర్తితో ఇలా అన్నాడు.350: ఓ రాక్షసుడా! మాయతో మోసగించి గెలవడం లోకంలో ఎక్కడైనా శౌర్యము కాదు, ధైర్యము కాదయ్యా. పౌరుషం కల మగవాడు తన శక్తి సామర్థ్యాలు తానెరిగి, ఎదుటివానిని ఎదిరించాలి,అంతటి శక్తి ఉన్నా, మాయ చేసి కనిపించకుండా దెబ్బతీస్తే,చుట్టాలు నవ్వుతారు,పండితులు తిడతారు,ఆడపిల్లలు

పెదవి విరుస్తారు సుమా.351: "ఓ దుష్టా! ఇక నీ మాయలు చెల్లవు. మాతో పోరాటాలంటే నవ్వులాటలేం కావు. దేవేంద్రుడి చేతికి చిక్కావు. ఈ తళతళలాడే వజ్రాయుధంతో నరికేస్తా. తొందరగా నీ కోరికలు అన్నీ చెప్పుకో. నీ వారిని కలుసుకో. ఇవాళ్టి పోరులో నీ అహంకారం ఈ దేవేంద్రుడు అణచివేస్తాడు."352: అంటూ నిందిస్తున్న అదితి పుత్రుడైన దేవేంద్రుడితో, హిరణ్యకశిపుని మనుమడు విరోచనుని పుత్రుడు అయిన బలిచక్రవర్తి ఇలా అన్నాడు.353: "ఓహో దేవేంద్రుడా! నువ్వొక్కడవే మొనగాడివు అనుకోకు. మిడిసిపడి తెగడబోకు. జయాపజయాలు దైవాధీనాలు. ఎవరికైనా ఇవి తప్పవు సుమా! బ్రహ్మాదులైనా సరే సుఖదుఃఖాలను తప్పించుకోలేరు. ఇంతోటిదానికి సంతోషించడం గానీ, దుఃఖించడం గానీ తగదు సుమా! దేవుడు అరచేతిలో ఉసిరికాయ కాదు. ఇలా ప్రగల్భాలు పలకడం పద్ధతి కాదు.354: ఇంద్రా! ఎంతటి దేవతలలో మేటివి అయినా. జయాలు అపజయాలూ, సంపదలూ ఆపదలూ సర్వం అశాశ్వతాలు అనీ, అవి గాలిలో దీపాలు, చంద్రకళలు, మేఘమాలికలు, మెరుపుతీగలు వంటివి అనీ తెలుసుకో. విఱ్ఱవీగబోకు."355: ఇలా దేవేంద్రుడిని తూలనాడి...356: వీరాధివీరుడు, దానవ సామ్రాజ్యాధినేత అయిన బలిచక్రవర్తి ఇంద్రుని శరీరం మీద నాటేలా వాడైన ఇనపబాణాలు వేసాడు. అతని చెవులు చిల్లులు పడేలా భీకరమైన పలుకుల వంటి సూటిపోటి మాటలు పలికాడు.357: ఇలా సత్యవాది అయిన బలిచక్రవర్తి తిరస్కారాలు విన్నట్టి ఇంద్రుడు...358 : ఓరాజా! అంకుశం దెబ్బ తిన్న ఏనుగులాగ త్రుళ్ళిపడ్డాడు, ఆగ్రహంతో బలిని పట్టుకుని విసిరివేసాడు, దానితో బలిచక్రవర్తి పెద్ద పర్వతంలా కూలి పడిపోయాడు.

జంభాసురుని వృత్తాంతము

359: జంభుడు అనే రాక్షసుడు తన చెలికాడు అయిన బలిచక్రవర్తి పడిపోవడం చూసి, తన స్నేహాన్ని ప్రకటింపజేస్తూ సాటిలేని పరాక్రమంతో దేవతల ప్రభువు అయిన ఇంద్రుని "నిలు, నిలు" అంటూ ఎదిరించాడు.360: అలా సింహాన్ని వాహనంగా చేసుకుని వచ్చిన జంభాసురుడు గదను పైకెత్తి పరాక్రమంతో పర్వతాల గర్వం అణచిన ఇంద్రుని పైకి విజృంభించాడు. కేకలు వేస్తూ సురలోక గజేంద్రము అయిన ఐరావతాన్ని ఒక్క చరుపు చరిచి రెచ్చి పోయాడు.361: జంబాసురుని ఆ క్రూరగదాఘాతంతో ఐరావతం ఉత్సాహం కోల్పోయింది. భరించ లేనంతటి బాధతో తిరిగి తోకను కూడా కదలించ లేక నేలపై ముందుకు వాలిపోయింది362: జంభాసురుని గదాఘాతానికి ఐరావతం నేలకు వాలిపోయిన ఆ సమయంలో ...363: ఇంద్రుని సారథి అయిన మాతలి, వెయ్యి గుఱ్ఱాలను పూన్చిన రథాన్ని సిద్ధం చేసి తెచ్చాడు. ఇంద్రుడు అధిరోహించాడు. అప్పుడు ఆ జంభాసురుడు వాడియైన బల్లెంతో మాతలిని గట్టిగా పొడిచాడు,364: జంభాసురుని బల్లెపు దెబ్బతిని, తల్లడిల్లకుండా మాతలి

గట్టిగా కేకలు వేసాడు. అతనిని భయపడవద్దని చెప్పి, ఇంద్రుడు వజ్రాయుధంతో జంభుని తల నరికాడు.

అది చూసి, రాక్షస సైన్యాలు చెల్లాచెదురు అయ్యాయి.365: నారదుని ద్వారా మహా బలవంతులైన జంభాసురుని సోదరులు బలుడు, పాకుడు, నముచి, తమ సోదరుడు యుద్ధంలో చనిపోయాడని తెలుసుకొని, రణరంగంలోకి దుమికారు. శత్రుపురాలను వ్రక్కలించు వాడైన ఇంద్రుని సూటిపోటి మాటలతో నిందించారు. మేఘాలు వర్షధారలతో కొండను కప్పేసినట్లు, తమ బాణాలతో ఇంద్రుని కప్పి వేసారు.366: దేవేంద్రుని వేయి గుఱ్ఱాలను బలాసురుడు వెయ్యి బాణాలతో అదరగొట్టాడు. మాతలిని, రథాన్ని, ఇంద్రుడి ప్రతి అవయవాన్నీ రెండువందల బాణాలతో బాధించాడు. పాకుడు ధనుస్సుకు బాణాన్ని సంధించడం, ప్రయోగించడం తెలియని వేగంతో యుద్ధం చేసాడు. నముచి వాడియైన బంగారు పిడులు కలిగిన బాణాలను వేసి కేకలు పెట్టాడు. ఇలా వానాకాలంలో మేఘాలు సూర్యుని కప్పేసిన విధంగా, బలవంతులైన ఆ ముగ్గురు ఇంద్రుడిని, అతని రథాన్ని, సారథిని, అమ్ముల సమూహాలతో ముంచివేశారు.367: అలా ఇంద్రుడు బాణాలచే కప్పబడిన సమయంలో...368: దేవతలందరూ "అయ్యో! స్వర్గాధిపతీ! అసురుల బాణాలకు గురయి పోయావా!" అంటూ ఆర్తనాదాలు చేశారు. ఆ రాక్షసరాజుల యుద్ధవ్యూహం మధ్యలో చిక్కుకుపోయారు. సముద్రం మధ్యలో అల్లల్లాడిపోతూ మునిగిపోతున్న పడవలోని వర్తకుల వలె హాహాకారాలు చేసారు.369: ఇంతలో దేవేంద్రుడు "ఓ దేవతలారా! భయపడకండి. నేను ఇక్కడే ఉన్నాను." అంటూ ఆ అమ్ముల పంజరాన్ని చీల్చుకుని గుఱ్ఱాలతో కూడిన రథంతోపాటు ఉల్లాసంతో మహిమతో ఉదయకాలంలో తూర్పున ఉదయించే సూర్యుడిలా ప్రకాశిస్తూ బయటకు వచ్చాడు.370: ఇలా ఇంద్రుడు అసురుల అమ్ముల పంజరం నుండి వెలువడి...371: వెనుదిరిగి పారిపోతున్న తన సైన్యాన్ని ఓహో! అంటూ గట్టిగా పిలిచాడు. సైనికులను యుద్ధానికి పురిగొల్పాడు. పాకుడి తలను వాడి బాణాలతోనూ, బలాసురుడి తలను వజ్రాయుధంతోనూ నేలకూల్చాడు. అది చూసి బలి బంధువులు భయపడిపోయారు. అతని సేనా నాయకులు భయకంపితులై ఏడుస్తూ పారిపోసాగారు.

నముచి వృత్తాంతము

372: బల, పాకాసురులు మరణించిన పిమ్మట, యుద్ధ భూమిలో ఇంద్రునికి నముచి ఎదురునిలిచాడు....373: తన బంధువులను దేవేంద్రుడు చంపాడని అధికమైన దుఃఖం, కోపం ఉప్పొంగాయి. బంగారపు పిడి, గంటలు కలిగి జనులకు చూడటానికే భయంపుట్టేలా ఉన్న ఇనుప శూలాన్ని చేపట్టాడు. "దీనితో చస్తావు" అని సింహంలా గర్జిస్తూ ఆ శూలాన్ని సాచిపెట్టి ఇంద్రుడిపైకి విసిరాడు.374: నముచి విసిరిన శూలం ఆకాశంలో వస్తుండగానే, ఇంద్రుడు

దానిని ఖండించాడు. నముచి తల నరకడానికి అనేకమైన బాణాలు వేశాడు, వజ్రాయుధం ప్రయోగించాడు. కానీ నముచి తలను వజ్రాయుధం సైతం ఖండించ లేకపోయింది. నముచి చలించకుండా నిలబడి ఉండడం చూసి దేవతల ప్రభువు అయిన ఇంద్రుడు ఆశ్చర్యపోయాడు.375: ఇలా వజ్రాయుధం ప్రయోగించినా ఎదురు నిలబడగలిగిన నముచిని చూసి, సందేహించి, ఇంద్రుడు తనలో ఈ విధంగా అనుకున్నాడు.376: ఈ వజ్రాయుధానికి కొండల రెక్కలు కత్తిరించేటప్పుడు వాడి తగ్గలేదు. వృత్రాసురుడు మున్నగు రక్కసులను సంహరించేటప్పుడు ఏనాడూ పని సాధించకుండా వెనుదిరిగింది లేదు. ఇప్పుడు నముచి విషయంలో ఇలా అయింది ఏమిటి? అసలు, నేను ఇంద్రుడి నేనా? ఇది వజ్రాయుధమేనా? దీనిని ప్రయోగించడంలో పొరపాటు ఏమైనా జరిగిందా? ఈ దుష్టరాక్షసుడు దీని పదును తెగకుండా చేసాడా ఏమిటి? ఇది ఇవాళ ఎందుకు శక్తిని కోలుపోయింది? అనుకుంటూ దేవేంద్రుడు తెగ విచారిస్తున్నాడు. ఇంతలో ఆకాశవాణి "ఇంద్రా! ఈ రాక్షసుడు తడివాటితో కానీ, పొడివాటితో కానీ చావులేకుండా వరం పొందాడు. వేరే మరొక దానిని దేనినైనా వేగిరం ప్రయోగించు"అని పలికింది.377: ఇలా ఇంద్రుడు దివ్యవాణి ఆకాశం నుండి పలికిన మాటలు విని....378: "తడిదీ పొడిదీ కాని వస్తువు సముద్రపు నురుగు ఒక్కటే" అని తనలో విచారించుకున్నాడు. ఆ ప్రకారంగానే సముద్రపు నురుగు అద్దిన వజ్రం ప్రయోగించి, ఇంద్రుడు నముచి శిరస్సు నరికేసాడు. అందుకు దేవతలు మెచ్చుకున్నారు.379:

అలా ఇంద్రుడు నముచి తల ఖండించిన సమయంలో .380: ఓ పరీక్షిన్మహారాజా! దేవేంద్రుని మునులు పొగుడుతూ దోసిళ్ళకొద్దీ పూలతో సంతోషంగా దీవించారు. విశ్వావసువూ, పరీవసువూ అనే గంధర్వ ప్రభువులు పాటలు బహు సొంపుగా పాడారు. దేవతా స్త్రీలు నాట్యాలు చేశారు. దేవదుందుభులు మ్రోగాయి. రణరంగంలో అగ్ని, యముడు, వరుణుడు, వాయువు తమతో తలపడిన వారిని భయంకరంగా పారదోలారు. చిన్న జంతువులను సింహాలు పారద్రోలినట్లు, దేవతావీరులు రాక్షసుల అహంకారాన్ని అణచి ఓడించారు. రాక్షస సంహారాన్ని ఆపించడంకోసం బ్రహ్మదేవుడు నారదమహర్షిని పంపాడు.381: ఆ దేవదానవ సంగ్రామాన్ని ఆపడానికి వచ్చిన నారదుడు దేవతలతో ఇలా అన్నాడు.382: ఓ పాండవ వంశంలో ఉత్తముడవయిన పరీక్షిన్మహారాజా! "ఓ దేవతలారా! మీకు అమృతం లభించింది కదా. మీరు అందరూ చక్కగా శ్రీమహావిష్ణువును ఆశ్రయించి బాగుపడ్డారు. మీ శత్రువులు నశించిపోయారు. బాగు బాగు. ఇంక యుద్ధంతో పని లేదు, ఆపేయండి" అంటూ నచ్చజెప్పి నారదుడు యుద్ధం ఆపించాడు.383: ఈ విధంగా నారదమునీంద్రుడు చెప్పిన మాటలు విని, రాక్షసులతో యుద్ధాన్ని చాలించి, దేవతావీరులు అందరూ దేవతాలోకానికి వెళ్ళిపోయారు. పరాజితుడు అయిన బలిచక్రవర్తిని, చావకుండా మిగిలిన రాక్షసులు పిలుచుకొని వెళ్ళి,

పడమటికొండ శిఖరానికి చేరుకున్నారు. శుక్రాచార్యుడు మృతసంజీవని అనే విద్య ప్రయోగించాడు.
దాని మహత్మ్యం వలన గొంతులు తెగి శరీరం వదిలిన రాక్షసులు అందరనూ మరల బ్రతికించాడు. బలి చక్రవర్తి దైహిక బాధలు అన్నీ కూడా ఆ భర్గుని కుమారుడు అయిన శుక్రాచార్యుని దయతో చల్లారాయి. ఆ బలి ప్రపంచతత్వం తెలిసినవాడు కాబట్టి, ఓటమి పాలైనా దుఃఖపడలేదు.'' అని శుకబ్రహ్మ పరీక్షిన్మహారాజుతో ఇలా అన్నాడు.

హరి హర సల్లాపాది

384: శివుడు కైలాసపర్వతంపై ఒకనాడు కొలువుతీరి ఉన్నాడు. ఆ సమయంలో విష్ణువు మోహినీరూపంలో రాక్షసులను మోసగించి దేవతలకు అమృతాన్ని పంచిపెట్టిన సంగతి విన్నాడు. అతడు పార్వతీదేవితోపాటు నందీశ్వరునిపై కూర్చుని ప్రమథగణ సమేతుడై వైకుంఠానికి వెళ్ళాడు. విష్ణువు శివుణ్ణి గౌరవించాడు. శివుడుకూడా విష్ణువును గౌరవించాడు. విష్ణువు క్షేమం అడిగి తమ క్షేమాన్ని తెలిపి తియ్యని మాటలతో తన ప్రసంగాన్ని ప్రారంభించాడు. తరువాత శివుడు చనువుగా విష్ణువుతో ఇలా అన్నాడు.385: దేవదేవా! వాసుదేవా! జగదీశ్వరా! ఎల్లప్పుడూ సర్వ లోకాలలో నిండి ఉండేవాడవు. సమస్త వస్తువులకూ కారణ భూతుడవు అయిన ప్రభువు నీవే. ఆదిమధ్యాంతాలు లేకుండా, లోపల, వెలుపల అంతటా నిండినవాడవు. పరిపూర్ణ సత్యం నీవు. ఆనందంతో కూడిన జ్ఞానం, మార్పులేని మూలవస్తువు నీవు. సాటిలేనివాడవు, దుఃఖదూరుడవు, గుణాతీతుడవు నీవు. అన్నింటి పుట్టుకకు, మనుగడకు, నాశనానికీ కారణం నీవు. మాయతో కూడిన పరమాత్మవు. మోక్షాన్ని కోరేవారు స్వార్థాన్ని, అహంకారాన్ని విడిచి ఎల్లప్పుడూ నీ పాదాలను సేవిస్తారు.386:
నీవు పరబ్రహ్మవని కొందరు భావిస్తారు. నీవు ధర్మమని కొందరు తలుస్తారు. ప్రకృతి పురుషుల కంటె పరుడవని కొందరంటారు. నీవు శక్తిరూపుడవని కొందరు ధ్యానిస్తారు. విష్ణువుగా, శాశ్వతునిగా, స్వతంత్రునిగా, పరమపురుషునిగా, ఉత్తముడుగా కొందరు నిన్ను ఊహిస్తారు. అన్నింటినీ మించి సాటిలేనివాడవు నీవు. సదసత్తులకు పవిత్రమైన నిలయం నీవు. ఆలోచించి చూస్తే కంకణం మొదలైన బంగారు నగలు బంగారము వాస్తవంగా ఒకటే కదా. అనంతమైన అలలు, సముద్రము ఒకటేకదా. అలాగే, పైకి భేధం కనిపిస్తున్నా నీకు ఈ సృష్టికి వాస్తవంగా భేదం ఉంది అని భావించే పని లేనేలేదు.387: ఓ కమలలోచనా! నీ లీలను మరీచి మొదలైన మహర్షులు సైతం తెలియలేరు. నీతోపాటు ఉండే నేను కూడా తెలుసుకోలేను. నీమాయ తెలియక దేవతలు, రాక్షసులు కష్టపడతారు. ఇంక తక్కినవారెంత? నీవు ఏరూపాన్నీ పొందకుండా పెంపొందుతావు. రూపాన్ని పొంది, అన్నింటినీ పుట్టించి కాపాడి అంతం చేయడానికి కారణమవుతావు. సకలచరాచర రూపుడవై వెలుగొందుతావు. ఆకాశంలో గాలి విహరించే విధంగా సర్వాత్మకుడవై అన్నింటిలోనూ నీవు చేరే వుంటావు. లోకాలు పుట్టడము

విడిపోవడము రెండూ నీవే. ఆలోచిస్తే అన్నీ నీవే.388: మాధవా! మహిమతో కూడిన నీ మగసోయగాన్ని పెక్కుసార్లు కన్నాము, విన్నాము. నీ ఆడరూపాన్ని ఏనాడూ చూడలేదు. మోహినిగా నీవు రాక్షసులను మోసగించి ఇంద్రాది దేవతలకు అమృతాన్ని పంచి ఇచ్చిన ఆ రూపాన్ని చూపించు. దాన్ని చూడాలని, నా మనసు కుతూహలపడుతున్నది.389: ముకుందా! మగవాడిగా మోహంలో పడవేసి నీవు లోకాలను ఎన్నో చిక్కులకు గురిచేస్తావుట. అటువంటి నీవు ఆడరూపంలో లోకాలను ఆకర్షించడంలో ఆశ్చర్యం ఏముంది."390: పైవిధంగా పలుకుతున్న పరమేశ్వరుని మాటలకు గంభీరంగా నవ్వుతూ విష్ణువు ఇలా అన్నాడు.391: "మహేశ్వరా! క్షీరసాగరం మథన సమయంలో పుట్టిన గరళాన్ని కంఠాన ధరించి లోక క్షేమంకరమైన కంఠం గలవాడవై శ్రీకంఠునిగా ప్రసిద్ధుడైన వాడవు. నీమనస్సుకు సంతోషం కలిగిస్తాను, తొందర పడవద్దు. ఆనాడు రాక్షసులను మోసగించడం కోసం నేను ధరించిన మోహినీరూపం లోకాన్ని మోహింప జేసేది. దానిని నీవు చూడాలనుకుంటే చూపుతాను. మనసులో సంకల్పంగా పుట్టిన కోరికలు తీర్చుకోదగ్గవే కదా."392:

ఇలా చెప్పి, అప్పుడు అక్కడ కమలాలవంటి కన్నులు గల ఆ విష్ణుమూర్తి మాయం అయిపోయాడు. కలిసి కూర్చుని ఉన్న పార్వతీదేవి, శంకరుడు విష్ణుమూర్తి ఎక్కడకు వెళ్ళాడా? అని అన్ని వైపులకీ చూస్తున్నారు.

జగనమోహిని కథ

393: అంతలో శంకరుని ఎదుట ఒక ఉద్యానవనం,ఆ వనంలో ఒక చెట్ల వరుస, అందులో ఒక చెట్టు నీడలో ఒక ఎలప్రాయపు సుందరాంగి కనబడింది. ఆమె కుచకుంభముల మీద పైట తొలగింది. కొప్పుముడి వీడింది.

నుదుట ముంగురులు ముసురుతున్నాయి. నడుము ఉందా? లేదా? అనే అనుమానానికి అవకాశమిస్తూ కదలాడుతోంది. చెవుల కమ్మల కాంతులు చెక్కిళ్ళపై చిందుతున్నాయి. పిరుదుల బరువుతో పాదాలు తడబడుతున్నాయి. తళుకు చూపులు దిక్కులలో పిక్కటిల్లుతున్నాయి. జారిపోయిన చీర కుచ్చెళ్ళను ఎడమచేతితో పట్టుకుంది. బంగారు కాలిఅందెల గలగలలు చేతికంకణాల ఝుణ ఝుణాలు అతిశయిస్తున్నాయి. అలా బంతితో ఆడుతున్న ఆ యింతిని శంకరుడు చూసాడు. 394: ఇంతకు ముందే మగువ వలపుతో సగమైన మగవాడు కదా శివుడు! ఆ జవరాలి ప్రాయము, రూపము, ఒయ్యారము, విలాసము ఆయనను బాగా ఆకర్షించాయి. ఆయన కంటిరెప్ప కూడా వేయకుండా మైమరచి ఆమెను చూడసాగాడు. ఆయన చిత్తం మెత్తబడింది.395:

"ఎవరమ్మాయో ఈ అన్నులమిన్న! ఏ కల్పంలోనూ ఇప్పటి వరకూ ఇంతటి అందమైన స్త్రీ కనబడలేదు. ఈమెను బ్రహ్మ సృష్టించ లేదనడం తథ్యం. ఈ ఒయ్యారిని ఇల్లాలుగా పొందే అదృష్టవంతుడు ఎవడో? ఈ లావణ్యవతి లీలావిహారాలకు నాకు లభిస్తుందా?" అని అనుకున్నాడు శివుడు.396:

అంతలో మన్మథుని జయించి నంతటి పరమశివుని నిబ్బరం సైతం నీరైపోయేలాగ, మోహిని ముడుచుకున్న కొప్పుముడి వీడింది, వెంట్రుకలు భుజాల మీద, మెడ మీద చెదరి పడి చలిస్తున్నాయి,ఆమె నుదుటిపై కస్తూరి బొట్టు కరిగి పోతోంది, ముద్దులు మూటగట్టే ముఖకాంతులు నలుదెసలా ప్రసరిస్తున్నాయి, చిరునవ్వులు చిందుతున్నాయి, చెమటతో తడిసి తడబడుతూ తనువున పులకలు మొలకెత్తుతున్నాయి, మనసుకు ఇంపునింపే బంతిని అందమైన హస్తంతో అందుకుంటోంది, దానిని రొమ్ముపై ఉంచుకుంటోంది, చెక్కిలిపై చేర్చుకుంటోంది, గడ్డానికి తాకించుకుంటోంది, చనుమొనలపై ఆనించుకుంటోంది, గోళ్ళతో మీటుతోంది, సొగసైన చేతులలో బంతిని కుడిఎడమలకు తృళ్ళిపడేలా ఒయ్యారంగా ఎగురవేస్తోంది, బంతి ఎగరేస్తుంటే మెల్లమెల్లగా కదలాడే మేలిమి కంకణాలు ఝుణ ఝుణ ధ్వనిస్తున్నాయి, కుచకుంభాలు ఒకదానితో ఒకటి రాసుకుంటున్నాయి, తనకుతానే చిన్నచిన్న పందాలు వేసుకుంటోంది, సన్నని నడుం వణికేట్లు మెడలోని హారాలు చిక్కుపడేటట్లు తిరుగాడుతోంది, అలా తిరిగేటప్పుడు చెవులకుండలాల కాంతులు చెక్కిళ్ళపై చిందులాడుతున్నాయి, ఆమె గుండ్రంగా తిరుగుతూ బంతిని పట్టుకుని పక్కలకు కదులుతోంది, అప్పుడు ఆమె పైటచెరగు జారిపోతోంది, ఒడ్డాణంలోని బంగారుచిరుగంటలు మ్రోగుతున్నాయి, కాలిఅందెలు ఘల్లు ఘల్లుమంటున్నాయి, కరకంకణాల రత్నాలు, ఆమె బంతి వెనువెంట పరుగెత్తి పట్టుకొంటూ పట్టుకుని నేలపై చరుస్తూ అది పైకెగిరినప్పుడు రెండుచేతులూ చేర్చి చాలా మార్లు పట్టుకుంటోంది, బంతి ఎగిరేటప్పుడు పడేటప్పుడు పొడవైన వలలు వేసి లాగుతున్నట్లు తన

సోగచూపులు వ్యాపింప జేస్తోంది, బంతిని కొడుతూ ఒకటి నుండి పది, నూరు అంటూ వరుసగా ఎంతో నేర్పుతో లెక్కపెడుతోంది,

ఎఱ్ఱతామరలవంటి తన పాదాల అరుణకాంతులతో తూర్పు కొండ మీది సూర్య బింబాన్ని స్ఫురింపజేస్తోంది, నెమ్మోము చంద్రుని వెన్నెల వెలుగులతో చంద్రమండలాలను సృజిస్తోంది, అప్పుడప్పుడు కుచకలశాల మిట్టపల్లాల నుండి జారిపోయిన పైట సవరించుకుంటోంది, చెక్కిళ్ళపై చిందే చెమటబొట్లను కొనగోళ్ళతో చిమ్ముతోంది, ఎఱ్ఱని పెదవిని దొండపండుగా భ్రమించి వచ్చిన రాచిలుకలను తోలుతోంది, పద్మంవంటి ముఖంలోని సువాసన కోసం మూగిన కొదమ తుమ్మెదలను అదలిస్తోంది, అందమైన మందగమనం నేర్చుకోవడానికి వచ్చిన రాయంచ జంటలను గెంటుతోంది, సొగసైన చూపులకోసం ముచ్చటపడి వచ్చిన నెమళ్ళ జంటలకు దూరంగా వెళ్తోంది, పొదరింట్ల దరి చేరకుండా చిగుళ్ళవంటి చేతులకు మనసుపడి వచ్చిన కోయిల జంటలకు దూరమవుతోంది, తీగఉయ్యాల మీద ఊగుతోంది, పూల గురివింద గుబుర్లపై ఎక్కుతోంది, పుప్పొడి గుట్టలను దాటుతోంది, మకరందాల మడుగులు దాటుతోంది, క్రీడాపర్వతాలపై విహరిస్తోంది, చిగురుటాకుల ఆసనాలపై అలసట తీర్చుకుంటోంది, తీగ ఇండ్లలో దాగుడు మూతలు ఆడుతోంది, మొగలిపొదలకు ఆనుకుంటోంది, పూరేకుల గవాక్షాలలో తొంగిచూస్తోంది, మెట్టతామర మొక్కలను తాకుతోంది, సంపెంగ పొదల గడపలలో నిలబడుతోంది, అరటి ఆకులద్వారాలు తెరుస్తోంది, కమ్మని పుప్పొడి బొమ్మలను బుజ్జగిస్తోంది, రత్నాలబాటపై విహరిస్తోంది, చంద్రకాంత వేదికలను సమీపిస్తోంది.
రత్న పంజరాలలోని గోరువంకలకు మాటలు నేర్పుతోంది, ఇష్టం వచ్చిన దానిని చూస్తోంది, చూచిన దానిని మెచ్చు కుంటోంది, మెచ్చుకొన్నదానిపై అచ్చెరువు కనబరుస్తోంది, మైమరస్తోంది, మైమరపిస్తోంది. అలా ఆ వాల్గంటి ఒంటరిగా ఆ తోటలో అంతులేని అందచందాలతో జగన్మోహిని అయి సంచరించసాగింది.397:

అందమైన ఆ వగలాడి వాడి చూపులకు శివుడు నిగ్రహాన్ని పూర్తిగా కోల్పోయాడు. తన్నుతానే మరచిపోయాడు. అంతే కాదు తన ఇల్లాలినీ, ప్రమథగణాలనూ విస్మరించాడు.398: అలా శంకరుడు మైమరచి ఆమెని చూస్తున్న ఆ సమయంలో...399: మోహిని బంతిని ఎగురవేసింది. పట్టుకుందాం అంటే వీలు చిక్కలేదు. దాంతో ఆ బంతి జారి పడిపోయింది. దానిని తీసుకోడానికి వస్తుండగా గాలి తాకిడికి చీర ముడి ఊడిపోయింది. అప్పుడు శివుని మనసు చలించింది.400: కడగంటి కాంతులు తళుక్కుమని మెరుస్తున్న మోహిని, చీర సరిగా కట్టుకోడానికి ప్రయత్నించింది. ఆమె మేను పులకించింది. స్తనభారంతో ఆమె వంగింది. రెండు చేతులతో ఆమె వక్షః స్థలాన్ని కప్పుకున్నది. ఆమె కొప్పుముడి వీడి వేలాడుతున్నది. ఆ స్థితిలో ఆమెను చూసి కామావేశంతో శివుడు చలించి పోయాడు. అతడు సిగ్గు పడేటట్లు సతీదేవి చూస్తున్నది. అయినా ఆయన చంద్రుని వంటి మోము గల ఆ మోహిని చేయి పట్టుకోడానికి వెళ్ళాడు.401: మోహిని సమీపిస్తున్న శివుని అడుగు దూరంలో చూసింది. చీర ఊడిన సిగ్గుతో నవ్వుతూ చెట్ల చాటున దాగింది. ముక్కంటి ఆ వాల్కంటి వెంటబడ్డాడు.402:

బాగా ఈడేరిన ఆడఏనుగుతో క్రీడించటానికి వెన్నాడిన మదించిన మగ ఏనుగు వలె, పరమేశ్వరుడు పరుగెత్తి మోహినిని సమీపించాడు. అబలా "పోవద్దు, పోవద్దు" అంటూ ఆమె జడ పట్టుకున్నాడు. వేగిరపాటుతో కౌగిలించుకున్నాడు. పరవశత్వంతో రతిక్రీడకు పూనుకోబోగా, ఆమె అతని పట్టు వదిలించుకుంది.403: "మన్మథుడు తిరిగి శివుని జయించాడా?" అన్నట్లు ఆడఏనుగును వెంటాడే మగఏనుగు వలె శివుడు మోహినీరూపంలోవున్న విష్ణువు వెంటబడ్డాడు. ఆ మాయామానిని జడ వీడి వీపుపై వేలాడుతున్నది. ఆమె పిరుదుల బరువుతో అలసిసొలసి వెనుతిరిగి చూస్తూ పరిగెడుతున్నది. ఆమె వెంట శివుడు కొండలు, నదులు, సరస్సులు, అడవులు దాటి వెళ్ళసాగాడు. అమోఘమైన ఆమహాత్ముని వీర్యం నేలపై పడింది. అది పడిన ప్రదేశమంతా వెండిగా, బంగారంగా రూపుదాల్చింది.

ఆతరువాత శివుడు తన్ను తాను తెలుసుకున్నాడు. పరమాత్ముని మాయతో కలిగిన మైమరపును గుర్తించాడు.404: భువన స్వరూపుడైన శివుడు తన మహిమాతిశయంవల్ల విష్ణుమాయ తెలుసుకుని, వెను తిరిగాడు. విష్ణువు సిగ్గుతోపాటు, స్త్రీ రూపాన్ని విడిచిపెట్టి మగవాడిగా మారిపోయాడు.

405: కాము గెలువవచ్చుఁ గాలారి గావచ్చు
మృత్యుజయముఁ గలిగి మెఱయవచ్చు
నాఁడువారి చూపుటంపఱ గెలువంగ
వశము గాదు త్రిపురవైరి కైన.

మన్మథుడిని ఓడించి కామాన్ని జయించవచ్చు. యముని ధిక్కరించి, మృత్యుంజయుడై ప్రకాశించవచ్చు. కానీ, ఆడవారి వాలుచూపుల వాడి బాణాలను గెలవడం త్రిపురాంతకుడైన ఆ మహాశివుడికైనా సాధ్యంకాదు.406: అంత మోహినీరూపాన్ని చాలించిన విష్ణువు శివునితో ఇలా అన్నాడు...407: "ఓ మహాదేవా! నీవు ఒక్కడవు తప్ప మరింకెవడూ నా మాయను తెలుసుకోలేడు. మోహినిగా మారిన నా మాయలో పడి మోసపోకుండా ధైర్యంతో పొరపాటు తెలుసుకొని మేలుకొన్నావు. కాలంతో కలిసి నీమాయ నాలో చేరింది. ఈమాయ నన్ను గెలువజాలదు. అల్పజ్ఞులు తెలుసుకోలేని నా మాయను నీవు ఇప్పుడు నేర్పుతో తెలుసుకున్నావు." అంటూ విష్ణువు శివుడిని గౌరవించాడు. విష్ణువు పట్ల తన స్నేహాన్ని ప్రకటించి, పరమేశ్వరుడు సతీదేవితో ప్రమథగణాల సేవలందుకుంటూ తన నివాసానికి వెళ్ళాడు.408:

ఓ పరీక్షిన్మహారాజా! సంసార సముద్రంలో మునిగిపోయే అల్పులైన జనులు సైతం, సముద్రాన్ని చిలికేటప్పుడు సముద్రము మధ్యన మునిగిపోతున్న మంథరపర్వతాన్ని మోయడం కోసం కూర్మావతారాన్ని ధరించిన విష్ణువు చరిత్రను విన్నా పాడినా గొప్ప పుణ్యాన్ని, విశేషసుఖాన్ని చూరగొంటారు, ఇందులో ఏమాత్రం సందేహం లేదు.409: శ్రీమన్నారాయణుడు జగన్మోహినిగా స్త్రీ రూపం ధరించి ఉపాయంగా రాక్షసులను మోహింపజేసి ఆపదలలో హడలి పోతున్న దేవతలకు అమృతాన్ని పంచిపెట్టి దివ్య తేజస్సుతో విరాజిల్లాడు. ఆ విష్ణుమూర్తినీ ఆయన మోహినీ రూపాన్నీ తలచితలచి మొక్కుతాను. అది పాపపు చీకట్లను రూపుమాపే సూర్యుని రూపంగా భావిస్తాను."410: అని శుకుడు ఇంకా ఇలా అన్నాడు.

వైవస్వతమనువు - 7 చరిత్ర

11: "ఓ రాజా! ఇప్పుడు వైవస్వతుడనే ఏడవమనువు పాలిస్తున్నాడు. అతనినే శ్రాద్ధదేవుడు అంటారు. అతనికి బలవంతులైన పదిమంది కొడుకులు ఉన్నారు.412: ఆ వైవస్వతుని పదిమంది కొడుకులూ ఇక్ష్వాకుడు, నభగుడు, ధృష్టుడు, శర్యాతి, నరిష్యంతుడు, నాభాగుడు, దిష్టుడు, కరూశకుడు, వృషధ్రుడు, వసుమంతుడు అనేవారు. ఈ పదిమందీ రాజులు అయ్యారు. పురందరుడు అనేవాడు ఇంద్రుడు అయ్యాడు. ఆదిత్యులు, మరుత్తులు, అశ్వినులు, వసువులు, రుద్రులు అనేవారు దేవతలు అయ్యారు. గౌతముడు, కశ్యపుడు, అత్రి, విశ్వామిత్రుడు, జమదగ్ని, భరద్వాజుడు, వసిష్టుడు అనేవారు సప్త ఋషులు అయ్యారు. అందులో కశ్యపుని భార్య అయిన అదితి గర్భంలో విష్ణువు వామన రూపంలో జన్మించి, ఇంద్రునికి తమ్ముడు అయ్యాడు. ఇంతవరకూ ఏడు మన్వంతరాలకథ చెప్పాను. ఇక రాబోయే మన్వంతరాల గురించి మహావిష్ణువు పరాక్రమాన్ని గురించి చెబుతాను. శ్రద్ధగా విను." అని శుకుడు ఇలా అన్నాడు. .

సూర్యసావర్ణిమనువు - 8 చరిత్ర

413: "ఓ రాజా! సంధ్య, ఛాయ అని సూర్యుని భార్యలు ఉన్నారు. వారు విశ్వకర్మ కుమార్తెలు. వారిద్దరే కాక సూర్యునికి బడబ అనే భార్య కూడా ఉంది. సంధ్యకు యముడు, శ్రాద్ధదేవుడు, యమున పుట్టారు, ఛాయకు సావర్ణి, శనైశ్చరుడు, తపతి పుట్టారు. తపతిని సంవరుణుడు పెండ్లాడాడు. బడబకు ఇద్దరు అశ్వినీదేవతలు కలిగారు. రాబోయే కాలంలో సావర్ణి ఎనిమిదవ మనువు అవుతాడు. అతడు ఇప్పుడు తపస్సు చేస్తున్నాడు.414: పరీక్షిత్ మహారాజా! ఒకసారి ఉన్నట్లు కనిపించి ఇంకొకసారి చూద్దామన్నా కనిపించకుండా మాయమయ్యే, సంపదలకోసం ఒక్కొక్క మనువు దిగిపోయే సమయానికి మరొక మనువు కాచుకొని సిద్ధంగా ఉంటాడు.415: సూర్య సావర్ణి పాలించే ఎనిమిదవ మన్వంతరంలో అతని కొడుకులైన నిర్మోహుడు, విరజస్కుడు మొదలైనవారు రాజులు అవుతారు. సుతపులు, విరజులు, అమృతప్రభులు దేవతలు అవుతారు. గాలవుడు, దీప్తిమంతుడు, పరశురాముడు, ద్రోణుని కొడుకైన అశ్వత్థామ, కృపుడు, వ్యాసుడు, ఋష్యశృంగుడు, సప్తఋషులు అవుతారు. ఇప్పుడు వారు తమతమ ఆశ్రమాలలో ఉన్నారు. విరోచనుని కొడుకైన బలిచక్రవర్తి ఇంద్రుడు అవుతాడు.416:
రాజా! పరీక్షిత్తూ! పూర్వం బలిచక్రవర్తి బలవంతుడై స్వర్గలోకాన్ని స్వాధీనం చేసుకోగా విష్ణువు వామనుడుగా వెళ్ళి అతనిని మూడడుగులు దానం అడుగుతాడు. దానం ఇచ్చిన బలిని భగవంతుడు బంధించాడు. తరువాత బలికి అమరావతికంటే సొగసైన సుతలలోకాన్ని ఇచ్చాడు. దానిలో బలి సుఖంగా ఉన్నాడు. అటు తర్వాత విష్ణువు వేదగుహికి సరస్వతికి సార్వభౌముడు అనే పేరుతో జన్మిస్తాడు. పాత దేవేంద్రుని పదవినుండి తొలగిస్తాడు. ఆ పదవిలో బలిచక్రవర్తిని నిలుపుతాడు. విష్ణువు నుండి బలిచక్రవర్తి ఇంద్రపదవి పొందినప్పటికీ అతడు మొదట విష్ణువుకు దానం చేసిన పుణ్యం చెడదు.

దక్షసావర్ణిమనువు- 9 చరిత్ర

417: అటు తరువాతి కాలంలో వరుణుని కొడుకైన దక్షసావర్ణి తొమ్మిదవ మనువు అవుతాడు. అతని కొడుకులైన ధృతకేతువు, దీప్తకేతువు మొదలైనవారు రాజులు అవుతారు. పరులు, మరీచులు, గర్గులు మొదలైనవారు దేవతలు అవుతారు. అద్భుతుడు అనేవాడు ఇంద్రుడు అవుతాడు. ద్యుతిమంతుడు మున్నగువారు సప్తఋషులు అవుతారు.418: ఆ కాలంలో విష్ణువు ఆయుష్మంతుడికి, అంబుధారలకు జన్మిస్తాడు. అతని రక్షణలో దేవేంద్రుడైన అద్భుతుడు మూడు లోకాలను సంతోషంగా పరిపాలిస్తాడు.

బ్రహ్మసావర్ణిమనువు - 10 చరిత్ర

419: పరీక్షిత్తుమహారాజా! అటు పిమ్మట ఉపశ్లోకుడి కొడుకైన బ్రహ్మసావర్ణి పదవ మనువు అవుతాడు. అతని కొడుకులైన భూరిషేణుడు మొదలైనవారు రాజులు అవుతారు హవిష్మంతుడు మొదలైనవారు ఋషులు అవుతారు. శంభుడు అనేవాడు ఇంద్రుడు అవుతాడు. విబుద్ధి మొదలైనవారు దేవతలు అవుతారు420: ఆకాలంలో విష్ణువు విశ్వసృజునికి విషూచికి విష్వక్సేనుడు అనేపేరుతో జన్మించి శంభునికి చెలికాడై లోకాన్ని కాపాడుతాడు.

ధర్మసావర్ణిమనువు - 11 చరిత్ర

421: ఆతరువాత వచ్చే కాలంలో ధర్మసావర్ణి పదకొండవ మనువు అవుతాడు. అతని కొడుకులైన సత్యధర్ముడు మున్నగు వారు పదిమంది రాజులు అవుతారు. విహంగములు, కామగమనులు, నిర్వాణరుచులు దేవతలు అవుతారు. వైధృతుడు ఇంద్రుడు అవుతాడు. అరుణుడు మొదలైనవారు సప్తఋషులు అవుతారు.422: ఆకాలంలో విష్ణువు ధర్మసేతువు అనే పేరుతో సూర్యుని కొడుకుగా జన్మిస్తాడు. అతడు మహిమలతో సంపన్నుడై వైధృతుడు సంతోషించేటట్లు మూడు లోకాలను కరుణతో కాపాడుతాడు.

భద్రసావర్ణిమనువు - 12 చరిత్ర

423: పరీక్షిన్మహారాజా! ఆ తరువాత రాబోయేకాలంలో భద్ర సావర్ణి పన్నెండవ మనువు అవుతాడు. అతని కొడుకులైన దేవవంతుడు, ఉపదేవుడు, దేవజ్యేష్ఠుడు మున్నగు వారు రాజులు అవుతారు. ఋతుధాముడు అనేవాడు ఇంద్రుడు అవుతాడు. హరితులు మొదలైనవారు దేవతలు అవుతారు. తపోమూర్తి, తపస్వి, అగ్నీధ్రకుడు మొదలైనవారు సప్తఋషులు అవుతారు.424: ఆ కాలంలో విష్ణువు సత్యతపుడు, సూనృతలకు స్వధాముడు అనే పేరుతో జన్మిస్తాడు. మనువు సంతోషించేటట్లు లోకాన్ని రక్షిస్తాడు.

దేవసావర్ణిమనువు13 చరిత్ర

425: ఓ పరీక్షిత్తూ! ఆ తరువాత కాలంలో దేవసావర్ణి పదమూడవ మనువు అవుతాడు. అతని కుమారులైన చిత్రసేనుడు, విచిత్రుడు మొదలైనవారు రాజులు అవుతారు. సుకర్ములు, సుత్రాములు దేవతలు అవుతారు. దివస్పతి అనేవాడు ఇంద్రుడు అవుతాడు. నిర్మోహుడు, తత్త్వదర్శుడు మొదలైనవారు సప్తఋషులు అవుతారు.426: ఆ కాలంలో విష్ణువు దేవహోత, బృహతిలకు యోగవిభుడు అనే పేరుతో పుడతాడు. దివస్పతి కి మిక్కిలి సహాయం చేస్తాడు.

ఇంద్రసావర్ణిమనువు14 చరిత్ర

427: ఆ తరువాత రాబోయేకాలంలో ఇంద్రసావర్ణి పద్నాల్గవ మనువు అవుతాడు. అతని కొడుకులైన గంభీరుడు, వసువు మొదలైనవారు రాజులు అవుతారు. పవిత్రులు, చాక్షుషులు దేవతలు అవుతారు. శుచి అనేవాడు ఇంద్రుడు అవుతాడు. అగ్ని బాహువు, శుచి, శుక్రుడు, మాగధుడు మొదలైనవారు సప్తఋషులు అవుతారు.428: ఆ కాలంలో విష్ణువు సత్రాయణుడు, వితానలకు బృహద్భానుడు అనే పేరుతో పుట్టి దేవతలు సంతోషించేటట్లు క్రియాకలాపాలు పెంపొందిస్తాడు. 429: ఓ రాజా! మూడు లోకాలలోనూ ప్రఖ్యాతి పొందే మనువుల విధానాన్ని చెప్పాను. పద్నాలుగుమంది మనువులు అంతరించి వెయ్యి యుగాలు గడిస్తే బ్రహ్మకు ఒకదినం అవుతుంది." అని శుకుడు చెప్పగా పరీక్షిత్తు ఇలా అన్నాడు.430: అలా శుకమహర్షి పద్నాలుగురు మనువుల గురించి వివరించిన పిమ్మట, పరీక్షిన్మహారాజు ఇలా అన్నాడు...431:

"ఓ మునీంద్రా! శుకా! ఈ పదవులలో మనువులను ఎవరు నియోగిస్తారు? దేనివల్ల వారు అంతటి గొప్ప వైభవాన్ని పొందుతారు?ఆ మన్వంతరాలలో ఎందుకు జన్మిస్తారు?. నాకు తెలిసేటట్లు చెప్పు."432: అని అడిగిన పరీక్షిత్తుతో శుకుడు ఇలా అన్నాడు.433: మనువులు, ఋషులు, మనువుల కొడుకులు, ఇంద్రులు, దేవతలు విష్ణుదేవుని ఆజ్ఞకు లోబడి ఉంటారు. యజ్ఞుడు మున్నగువారందరు విష్ణుదేవుని అంశతో రూపు దాలుస్తారు. అతని సహాయంవల్ల మనువులు లోకాలను ఏలుతారు. క్రమంగా నాలుగు యుగాల చివర వేదాలను కాలం మింగేస్తుంది. పుణ్యాత్ములైన ఋషులు తమ తపశ్శక్తి వలన మరల వేదాలను దర్శిస్తారు. పూర్వం వలె ధర్మం నాలుగు పాదాలతో నడుస్తుంది. విష్ణువు ఆజ్ఞ చెల్లుబడి అవుతుంది. తమతమ కాలాలలో రాజులు లోకాన్ని పంచుకుని పాలిస్తారు.434: విష్ణువు శక్తిమంతులను ఇంద్ర పదవిలో, పెక్కు విధాల దేవతల పదవులలో నెలకొల్పుతాడు. వారు తమకు నిర్ణయింపబడిన నియమాలతో మూడు లోకాలనూ ఏలుతారు. లోకాలు సుభిక్షంగా ఉంటాయి.435:

ఓ పుణ్యాత్ముడా! పరీక్షిత్తూ! శాశ్వతుడైన విష్ణువు యోగీంద్రుని రూపంతో యోగం బోధిస్తాడు, మౌని రూపంతో కర్మానుష్ఠను ప్రబోధిస్తాడు. ప్రజాపతి రూపంతో సృష్టిస్తాడు. ఇంద్రుడై రాక్షసుల గర్వాన్ని అణచివేస్తాడు. సిద్ధ స్వరూపంతో జ్ఞానం ఉపదేశిస్తాడు. కాల రూపంతో కడతేరుస్తాడు. అవ్యయుడైన ఆ విష్ణువు పెక్కు పేర్లతో, పెక్కు రూపాలతో కూడి ఉంటాడు. అతడు విషయాసక్తుల కంటికి కనిపించడు. అతడు జరిగిన కాలంలోను జరుగుతున్న కాలంలో, జరగబోయే కాలంలో పెక్కురీతుల వేర్వేరు రూపాలతో ప్రకాశిస్తాడు".436:

ఈ విధంగా మన్వంతరాల గురించి తెలిపిన శుకమునితో పరీక్షిత్తు ఇలా అన్నాడు. .437: "బలి చక్రవర్తిని పద్మనేత్రుడైన విష్ణుమూర్తి దేనికోసం మూడడుగుల నేల యాచించాల్సి వచ్చింది? ఆయన పూర్ణపురుషుడు, పూర్ణకాముడు, నిర్వికారుడు, సంపత్కారి అయిన లక్ష్మీదేవి భర్తా కదా? అంతటి వాడు ఇలా దరిద్రుని వలె పరాయివాడైన బలి వద్దకు ఎందుకు వెళ్ళాడు? ఏ తప్పూ చేయని బలిని ఎందుకు బంధించాడు? ఈ కథ వినాలని కుతూహలంగా ఉంది"

బలి యుద్ధ యాత్ర

438 : ఇలా బలి వృత్తాంతం అడిగిన మహారాజు పరీక్షిత్తుతో శుకముని ఇలా అన్నాడు.439: "ఇంద్రుని చేతిలో ఓడిపోయిన పిమ్మట బలిచక్రవర్తి శుక్రాచార్యుని దయవల్ల తేరుకున్నాడు. శుక్రునికి కనికరం కలిగేటట్లు శిష్యుడై సేవించాడు. బలి భక్తికి శుక్రుడు మెచ్చుకున్నాడు. బలిచేత నియమపూర్వకంగా విశ్వజిద్యాగాన్ని చేయించాడు. బలిచక్రవర్తికి హోమాగ్నినుండి బంగారువస్త్రాలు కప్పిన రథము, సూర్యుని గుఱ్ఱాలవంటి గుఱ్ఱాలు, సింహం జెండా, గొప్పవిల్లు, అంబులపొదుల జంట, కవచము లభించాయి. పుణ్యాత్ముడైన అతని తాతగారు ప్రహ్లాదుడు వాడిపోని పద్మాలదండ ఇచ్చాడు. శుక్రుడు చంద్రుని వంటి తెల్లని శంఖాన్ని ఇచ్చాడు.440: ఈవిధంగా...441: బలిచక్రవర్తి బాణాలు, రథము, ఖడ్గము, అమ్ములపొదులు, విల్లు, పూలదండ, గుఱ్ఱాలు, కవచము, రత్నఖచిత సువర్ణకంకణాలు సంపాదించాడు. అటుపిమ్మట పగవారిపై పగతీర్చుకొవాలని నిశ్చయించుకున్నాడు. 442: గొప్పదానాలతో బలిచక్రవర్తి బ్రాహ్మణులను సంతోషపెట్టి వారి దీవనలు అందుకున్నాడు. పెద్దలను, నిండుభక్తితో ఇలవేల్పులను పూజించాడు. నిర్మల చరిత్రుడైన ప్రహ్లాదుడిని ఆహ్వానించి ప్రణమిల్లాడు. నిగనిగలాడే రథంపై కూర్చుని కొండశిఖరాన ప్రచండంగా మండే కార్చిచ్చు వలె ప్రకాశించ సాగాడు.

443: బలిచక్రవర్తితో సమానబలము గల దైత్యసేనాపతులు ఆయన ముందు వినమ్రులై నిలిచి కొలువసాగారు. వారు మృత్యు దేవతను, యమధర్మరాజును దండింప గల ఉద్దండులు. దేవతలు, సిద్ధులు, సాధ్యులు, గంధర్వులు మొదలైనవారిని భంగపరిచిన వారు. దిక్కులను

ముక్కలు చేయగలవారు.444: పరీక్షిన్మహారాజా! బలిచక్రవర్తి అతిశయించిన బలంతో తన చూపులతో ఆకాశాన్ని కబళిస్తూ, నింగినీ నేలనూ తలకిందులు చేయాలని పొంగిపడుతూ దేవతల రాజధాని అమరావతి పట్టణం దారి పట్టాడు.

స్వర్గ వర్ణనము

445: బలశాలి అయిన బలిచక్రవర్తి ఇలా దేవేంద్రునిపై పగ తీర్చుకోవాలని సంకల్పించుకుని, వేగంగా దీర్ఘమైన ప్రయాణాలు సాగించి సాగించి...446: బలి స్వర్గ లోకాన్ని సమీపించాడు. ఆ స్వర్గం పుణ్యాత్ములకు నివాస స్థానం. అక్కడ రోగాలు, చెడుకలలు, ఆకలి బాధలు, దుఃఖాలు ఉండవు. అక్కడ పూలు, పండ్లు నిండుగా ఉండే చెట్లు దండిగా ఉంటాయి. గాలికి సవ్వడి చేస్తూ జెండాలు ఎగురుతుంటాయి. దేవతల విమానాలు తిరుగుతుంటాయి. పవిత్రమైన ఆకాశ గంగానదీజలాలు ప్రవహిస్తూ ఉంటాయి. బలిచక్రవర్తి అట్టి స్వర్గసీమలోని447: మిక్కిలి విశాలమైన దేవతల పట్టణం అమరావతి నగరం దరిచేరి వేగంగా ముందుకు సాగాడు. మొదట పెద్ద పెద్ద తోటలు కనిపించాయి. ఆ తోటలలోని చెట్లు ఎల్లప్పుడూ అందంగా పొటమరించే చిగురుటాకులు, రెమ్మలు, మొగ్గలు సగం విచ్చిన విరులు, నిండుగా విరిసిన పూల గుత్తులు, పూపిందెలు, లేతకాయలు, దోరకాయలు, పండ్లగెలలతో నిండి బరువెక్కి వంగి ఉన్నాయి.

దట్టమైన ఆ తోటలలో తుమ్మెదల గుంపులు జంటలు కట్టి సొగసైన కొత్త పూలలో నిండా ఉన్న మకరందాన్ని కొసరి కొసరి తాగి బలిసి కైపెక్కి జుంజుమ్మని సంతోషంతో విహరిస్తున్నాయి. కోయిల గుంపులు జంట బాయక కలిసి మెలిసి గున్నమామిడి చెట్లకొమ్మలలో మూగి సొంపుగా చిగురుటాకులు మెక్కి ఉత్సాహంతో గానాలు చేస్తున్నాయి. చిలుకల గుంపులు మత్తెక్కి త్వరపడుతూ, పోరాడుతూ చెలరేగి నేర్పుతో తియ్యని పండ్లు తిని కలకల ధ్వనులు సలుపుతున్నాయి. పావురాలు చిలుకలను మించి ఆకాశానికి ఎగురుతూ ఆడపావురాలను చెంతకు పిలుస్తూ అటూ ఇటూ పోనీయకుండా అడ్డగిస్తూ తమ నెలవులపై వాలి కువకువ లాడుతున్నాయి.

రాయంచలు చెలువైన సరస్సులవద్ద ఉత్సాహంగా పెంటి హంసలతో కలిసి తమ వాడిముక్కులతో లేతతామరతూండ్లు చీల్చి తిని సంతోషంగా సవ్వడి చేస్తున్నాయి. అందమైన ఆ సరస్సులు హంసల కాంతికంటే అధికంగా మిలమిల మెరుస్తూ లక్ష్మీమందిరాలవంటి బంగారు సరోజాలతో విరాజిల్లుతున్నాయి. ఆ సరస్సుల అలలలో తడిసి వడవడ వణుకుతూ అల్లిబిల్లిగా అల్లుకుని నేల వాలిన దట్టమైన తీగల సందులలో జొరబడి ఇంపైన పూలవాసనలతో బరువెక్కి లోపలకు దూరలేక చల్లగాలులు చతికిలపడు తున్నాయి.ఆ గాలులతో కలిసి పైకెగిరిన పుప్పొడులు ఆకాశంలో నిండి రంగురంగుల మేలుకట్టు చాందినీలను సృష్టిస్తున్నాయి.

పుప్పొడి రంగులతో కలసిన కాలువల గట్లపై ఇచ్చవచ్చినట్లు పచ్చిక గుబురులు మేస్తూ మైమరచి నెమరువేస్తూ తమ పెద్ద పొదుగులు కదలిస్తూ కామధేనువులు నడచివస్తున్నాయి. వాటి దూడలు వాడవాడలలో చెంగుచెంగున దూకి ఆడుకుంటూ తల్లుల వెంట వెడుతున్నాయి. కామధేనువులు దూడలతో కూడి ఇండ్లు వాకిండ్లు చేరి పొరులు కోరినన్ని పాలు కురిపిస్తున్నాయి. కోరినవారి కోరికలు తీర్చే కల్పవృక్షాలు ఆ కామధేనువులకు నిలువనీడలు ఇస్తున్నాయి. ఆ కల్పవృక్షాల చిగుళ్ళను, పూలగుత్తులను కోసి మదపుటేనుగులు ఆడ ఏనుగులకు ప్రేమతో ఇచ్చి సంతోషింపచేస్తున్నాయి. ఆ మదపు టేనుగులు క్రీడాపర్వతాల సొగసుతో ఒప్పారుతున్నాయి. అవి పడచు అందగత్తెలకు నడకలు నేర్పు గురువులై మురిపెంగా నడుస్తున్నాయి. ఆ ఏనుగుల శరీరాలు రాచుకోవడం వల్ల కరకుతనంపోయి నున్నబడుతున్న మకరతోరణ స్తంభాలు కన్నులవిందు చేస్తున్నాయి.

మకరతోరణాల స్తంభాలవద్ద రంభ మొదలైన అప్సరసలు నిలబడి ఉన్నారు. వారు మన్మథుని ఒరలోనుండి తీసిన వాడికత్తులవలె తళతళ మెరుస్తున్నారు. నిలకడగల మెరుపు తీగలవలె ఉన్నారు. కాళ్ళు, చేతులు మొదలైన అవయవాలు కలిగిన నెలవంకల వలె ఉన్నారు. రూపుదాల్చిన మోహినీ విద్యలవలె చూపులకు హాయి కలిగించుతూ శృంగార రహస్యాలు తెలుసుకోవడంలో పేరుపొందిన వారై విమానాలపై స్వర్గలోకానికి వచ్చు పుణ్యాత్ములకు త్వరగా ఎదురుపోయి సగౌరవంగా తోడ్కొని పోతున్నారు.

ఆ పట్టణానికి చుట్టూ అందమైన అగడ్తలు ఉన్నాయి. ఆ అగడ్తల నీటిలో కలహంసలూ, రాజహంసలూ, చక్రవాకాలు, బెగ్గురు పక్షులూ విహరిస్తున్నాయి అందలి కలువలలో, కమలాలలో తుమ్మెదలు సంతోషంతో సంచరిస్తుంటాయి. ఆ అగడ్తలు తరంగాలు లేని గంగానది ఆకాశానికి పొంగినట్లు వెరగు కలిగిస్తుంటాయి. దేవకన్యలు గుంపులు గుంపులుగా చేరి వాటిలోని తేటనీటిలో అందంగా హాయిగా జలకాలు ఆడుతూ ఉంటారు.

ఆ పట్టణం ముంగిటిలో భద్రమైన బంగారు తలుపులుగల పెద్ద గోపురాలున్నాయి ఆ గోపురద్వారాల గడపలను దేవ వేశ్యలు పూజిస్తుంటారు. ఆ ద్వారాల పక్కన అరుగులపైన రత్నాల కాంతులు వెదజల్లు ఇంద్రనీలాల స్తంభాలున్నాయి. ఆ నాలుగు ద్వారాలకూ పద్మరాగాల మాలలు వేలాడుతున్నాయి. ఆ ద్వారాల దగ్గరి చావిళ్ళలో పరాక్రమవంతులైన ద్వార పాలకులు ఆయుధాలు ధరించి మెలకువతో కాపలా కాస్తున్నారు. వారు దేవదానవుల యుద్ధాల కబుర్లు చెప్పుకుంటూ ఉంటారు. అచ్చటి ఎత్తైన మెట్ల వరుసలు వీరరస సముద్రపు చెలియలికట్టల వంటి అచ్చమైన పాలరాళ్ళతో కట్టబడిఉన్నాయి. అచ్చటి తోటలు అత్యంత శోభాయమానంగా, వజ్రాలు, వెండితో నిర్మింపబడినాయి. ఆ కోటల పైభాగాలు నిండుచంద్రుని కిరణాలు వెల్లివిరిసే తెల్లని అద్దాలవలె ఉన్నాయి. వాటి కాంతులు చుక్కలను ధిక్కరిస్తాయి. ఆ పట్టణలక్ష్మిపాయంతో నిండిన యువతివలె మేఘాలను చూస్తూ బ్రహ్మను ప్రార్థించి సంపాదించిన బంగారు పరదాలవలె పెద్ద పెద్ద వెండి ప్రాకారాలు ప్రకాశవంతములై ఉన్నాయి. ఆ ప్రాకారాలపై మరకత మణులతో నిర్మించిన బురుజులు ఉన్నాయి. కోట్లకొలది గంధర్వ సైనికులు యుద్ధసన్నద్ధులై వాటిని కాపాడుతుంటారు. ఆ బురుజులపై ఎత్తైన వజ్రాల స్తంభాలు ఉన్నాయి. వాటిమీద శత్రువీరుల ప్రాణాలు తీసే శతఘ్నులు అమర్చబడి ఉన్నాయి. వాటికి రెండువైపులా రథాల ఇరుసులు రాచుకుంటూ ఆరిపోని దీపాలవలె సూర్య చంద్ర మండలాలు వెలుగుతూ ఉంటాయి.

ఆ పట్టణంలోని మేడలు ఆకాశాన్ని తాకుతుంటాయి. అందలి సుందరీమణులు చంద్రబింబాన్ని నిగ్గుటద్దంగా భావించి తొంగిచూస్తూ తమ నొసటిపైని ముంగురులను సరిదిద్దుకొని తిలకాలను అలంకరించుకుంటారు. అప్పుడు వారి వెనుక వైపుగా వచ్చిన వారి ప్రియుల ప్రతిబింబాలు కనిపించగానే తమ భర్తలు ఇతర స్త్రీలను వలచి వారికి వశుల అయ్యారని భ్రమించి తత్తరపాటుతో వెనుతిరిగి అంతలో ప్రతిబింబాలు మాసిపోగానే ఆ స్త్రీలు ఏకాంతంగా తమ ప్రియుల కోసం ఎదురు చూస్తూ ఉంటారు. ముత్యాల హారాలతో కూడిన ఆ ముద్దుగుమ్మల గుబ్బచన్నుల సొగసుతో పక్కల చుక్కలు మెరుస్తుండగా, ఆ మేడల శిఖరాలను సింగారిస్తూ బంగారు కలశాలు ప్రకాశిస్తున్నాయి. ఆ మేడల లోపల బంగారు మయాలైన పరుపులు, కిటికీలు ఉయ్యాలలు, మెట్లు మొదలైనవి ఎంతో మనోహరంగా విరాజిల్లుతున్నాయి.
ఆ మేడల బంగారు కిటికీల సందుల గుండా కర్పూరము, కుంకుమపువ్వు, సాంబ్రాణి కలసిన సువాసనల పొగలు వెలువడుతుంటాయి. ఆ పొగలను మేఘాలుగా భ్రమపడిన నెమళ్ళు అనుకోకుండా తమకు పండగ వచ్చిందని ఆనందంతో తమ రంగురంగుల పింఛాలు విప్పి చెట్ల కొమ్మలపై నాట్యాలు చేస్తుంటాయి. అవి మన్మథుని శృంగార

శాస్త్రాలకు, పదాలకు టీక వివరిస్తున్నట్లు, అర్థాలు చెప్తున్నాయా అన్నట్లు కేకలు వేస్తుంటాయి. అప్పుడు నెమళ్ళ పింఛాలను అల్లెత్రాళ్ళుగా, వాటి కేకలను ధనుష్టంకారాలుగా భావించి వెంటనే సూర్యుని పైకి ఉరికే రాహువు వలె జెండాలు ఆకాశానికి ఎగురుతున్నాయి. జెండాలు, గొడుగులు తమ యుద్ధలక్షణాలుగా అవక్ర పరాక్రమంతో విజృంభించి పెద్దపులులు, ఏనుగులు, సింహాలు, శరభాలు, తోకచుక్కల్లా శత్రువులను లెక్కచేయకుండా కేకలు వేస్తూ గుంపులు గుంపులుగా సైనిక సమూహాలు రాక్షసులతో ద్వంద్వ యుద్ధాలు చేయడానికి దుముకుతున్నాయి.

కత్తులు, శూలాలువంటి ఆయుధాల తళతళలు మెరుపుల వలె దిక్కుల అంచులవరకు వ్యాపిస్తున్నాయి. చక్రాల ధ్వనులు ఉరుములవలె ధ్వనిస్తున్నాయి. వీరుల శరవర్షాలతో మేఘాల వలె ఒప్పుతున్న రథాలు రాజిల్లుతున్నాయి. ఆ రథాలకు వాయువును, మనస్సును కూడా మించిన వేగంతో పరుగెత్తగల సూర్యుని గుఱ్ఱాలు పూన్చబడి ఉన్నాయి. ఆ పట్టణంలో ఎత్తైన తెల్లని మదపుటేనుగులు ఉన్నాయి. వాటి చెక్కిళ్ళమీద మదజలకణాల సమూహాలు సహస్ర నయనుడైన దేవేంద్రుని ఔదార్య విశేషాలను లెక్కిస్తున్నట్లు ఉంటాయి. ఇంద్రుని సందర్శించడానికి గుమికూడిన సమస్త దిక్పాలకుల శుభంకరములైన బంగారుకంకణాల నుండి రాలిన ధూళి కణాలతో ఆ పట్టణ వీధులన్నీ నిండి ఉన్నాయి. ఆ మార్గాలకు పైభాగాలలో లక్షల కొలది విమానాలు వస్తూ పోతూ ఉంటాయి. అవి రోహణ పర్వత చరియలవలె వెలుగులు వెదజల్లుతుంటాయి. ఆ విమానాలలో తమ ప్రియులతో విహరించే అందగత్తెలు భేరి, వీణ, పణవము, మద్దెల, బాకా, శంఖము మొదలైన వాటిని మోగిస్తూ వాటికి తగినట్లుగా పాటలు

పాడుతూ, నాట్యాలు చేస్తూ ఉంటారు. చక్కగా అలంకరించిన గద్దెలు, మండపాలు ముంగిళ్ళలో పెద్ద పెద్ద
రత్నాల దీపాలు వెలుగుతుంటాయి. దేదీప్య మానములైన సభామంటపాలలో చింతామణులు ప్రకాశిస్తుంటాయి.
ఇంకా...

అమరావతి పట్టణ వైభవాలు:

- అది సముద్రం మాదిరిగా అనిమిషకౌశిక వాహిని విశ్రుతమైనది.(చేపలతో, నదులతో దేవతలు, ఇంద్రుడు, ఆకాశగంగతో పేరెన్నికగన్నది.)
- వేదవాక్యం వలె అకల్మష సువర్ణ ప్రభూతమై ఉన్నది. (పవిత్ర అక్షరాలతో నిండినది. నిర్మలమైన బంగారంతో అతిశయించినది.)
- శివుని కంఠం మాదిరిగా భోగిరాజ కాంతమై ఉన్నది. (సర్పరాజులతో ప్రకాశించుచున్నది. ధనవంతులైన ప్రభువులతో ఒప్పుచున్నది.)
- జవరాలి వక్షోజంవలె సువ్రతమై ఉన్నది. (గుండ్రంగా ఉన్నది. మంచి చరిత్ర కలది.)
- వృత్తసమూహంవలె సదాగురు, లఘు నియమాభి రామమై ఉన్నది.(గురువులు, లఘువులు, యతులతో ఒప్పుతున్నది.బృహస్పతి నీతినియమాలతో ఉన్నది.)
- శ్రీరామచంద్రుని తేజస్సువలె ఖర దూషణాది దోషా చరులకు చేరరానిదై ఉన్నది. (ఖరుడు, దూషణుడు మొదలైన రాక్షసులకు చేరశక్యం కానిది. కఠినమైన నిందల వంటి దోషములు ఆచరించు వారికి పొందశక్యం కానిది.)
- విద్వాంసుని చరిత్రవలె అమలాంతరంగ ద్యోతము. (స్వచ్ఛమైన హృదయాలకు స్ఫురించేది. నిర్మల మనస్కులైన పుణ్యాత్ములతో ప్రకాశించేది.)
- అభిమానవంతుని ప్రవర్తనంవలె సన్మార్గభాతి సుందరమైనది. (మంచి మార్గాన మిక్కిలి చక్కగా ప్రకాశించునది. ఆకాశమార్గాన చుక్కలతో మిక్కిలి చక్కనైనది.)
- అందమైన ఉద్యానవనంవలె రంభాంచితా శోక పున్నాగమైనది.(అరటిచెట్లతోకూడిన అశోక, పున్నాగ వృక్షాలు కలది. రంభతో కూడిన ఆనందంతో ఉన్న పురుషశ్రేష్ఠులు కలది.)
- సురపొన్న వృక్షంవలె సురభి సుమనో విశేషమైనది. (సుగంధభరిత పుష్పాలతో అతిశయించినది. కామధేనువులు, దేవతలతో నిండినది.)
- ఆదిశేషుని శిరస్సులా ఉన్నత క్షమా విశారదమైనది. (మహోన్నత భూమండలం కలది. విశేష క్షమా గుణంతో ఒప్పుతున్నది)
- శరత్కాలం వలె ధవళ జీమూత ప్రకాశితమైనది (తెల్లని మేఘాలతో విరాజిల్లుతున్నది. తెల్లని కొండలతో ప్రకాశించుచున్నది.)

- కృష్ణాజిన దానంవలె సరస తిలోత్తమమైనది. (మంచినవ్వులతో ఒప్పిదమైనది. సరసురాలైన తిలోత్తమతో కూడినది)
- ఉత్తమ పురుషుని వాక్కువలె అనేక సుధారస ప్రవర్షమైనది. (అఖండ తియ్యదనాన్ని వర్షించేది. అఖండ అమృతవర్షాన్ని కురిపించేది.)
- వర్షఋతువు ప్రారంభంవలె ఉల్లసదింద్ర ఉల్లాసంగా యున్న ఇంద్రగోపమైనది. (ప్రకాశించే ఆరుద్ర పురుగులు కలది. ప్రకాశించే ఇంద్రునిచే రక్షింపబడేది)
- నందీశ్వరుని మూపురంవలె విచక్షురార్యాలం కృతమైనది. (శివపార్వతులతో అలంకరింపబడి, వేల్పుపెద్దలతో విరాజిల్లుతున్నది.)

ఇట్లు ఐశ్వర్యవంతమై పరమ ధన్యమైన ఆ అమరావతీ నగరానికి చేరింది. బలిచక్రవర్తి నగరకోటముట్టడికి సైన్యాలకు ఆజ్ఞ ఇచ్చి, మార్గాలన్నీ అరికట్టి పట్టుదలతో ఉన్నాడు.

విశేషము :

వచనాల పటుత్వానికి పెట్టింది పేరు పోతనామాత్యుల వారి రచనా శైలి. అలాంటి మహాకవి "నూటికి నూరు పాళ్లు స్వచ్ఛమైన సురేంద్రపురి పైకి దోషాచార చక్రవర్తి ఆక్రమిస్తున్నాడు" అని చమత్కారంగా సూచించిన తీరూ, ఒక్కొక్క వర్ణనకూ రెండేసి అర్థాలను ఆపాదిస్తూ అలంకరించిన తీరు అత్యద్భుతం.

448: దేవేంద్రుడి పట్టణంలోని స్త్రీలు ఎల్లప్పుడూ నవ యౌవ్వన యువతులుగా, చిరునవ్వులతో ఉంటారు. వారికి అలసట, వడలిపోవడం లాంటివి ఉండవు. కన్నులార్పడం ఉండదు (అందుకే దేవతలను అనిమిషులు అంటారు). కాల ప్రభావానికి లొంగి ముసలివారు కారు. దుష్టులను దరిచేర నీయరు. పుణ్యాత్ములను ఎడబాయరు.

దుర్భర దానవ ప్రతాపము

449: అలా బలి సైన్యం సురేంద్రపురిని చేరి, అప్పుడు.450: అమరావతి పట్టణాన్ని రాక్షసులు ముట్టడించి విజయశంఖాలు పూరించారు. వారి శంఖారావాలకు దేవతా స్త్రీల గర్భాలు బ్రద్దలై పోయాయి. ఆ గర్భాలలోని శిశువులు ఆక్రోశించారు.451: దానవులు అమరావతి పట్టణాన్ని ఆక్రమించిన ఆ సమయంలో...452: బలిచక్రవర్తి వచ్చి పట్టణాన్ని ముట్టడించడం దేవేంద్రుడు తెలుసుకున్నాడు. కోటకు బలమైన కాపలా ఏర్పాటు చేసాడు. దేవతావీరులతో కలిసి దేవమంత్రి అయిన బృహస్పతిని పిలిపించాడు. బలిచక్రవర్తి దండెత్తి వచ్చిన సంగతి ఇలా చెప్పసాగాడు "వాడు ప్రళయాగ్ని వలె మండిపడుతున్నాడు. క్రూరులైన రాక్షసులతో కూడి ఉన్నాడు. మనతో ఓడిపోయి ఈనాడు తిరిగి మనపైకి వచ్చాడు. ఏ తపస్సువలన వాని కింత శక్తి వచ్చిందో? ఈ దురాత్ముడు ఎవరి సహాయాన్ని పొందాడో? వీనిని గెలిచే మార్గమేది? ఏం చేయాలి? పరాక్రమంతో వీడిని రణరంగంలో ఎదిరించి నిలువగల వీరుడు ఎవడు?453: ఈ బలిచక్రవర్తి

ఆకాశాన్ని కూడా కబళించే టంతలా ఉన్నాడు. మేరు పర్వతంకంటే ఎత్తు పెరిగి విఱ్ఱవీగుతున్నాడు. కాలయమునివలె వచ్చి మన మీద పడ్డాడు. తిరుగబడితే బ్రహ్మను కూడా భంగపరుస్తాడు" అని ఇంద్రుడు వాపోతూ ఇంకా ఇలా అన్నాడు.454:"మహాత్మా! బృహస్పతీ! రాజ్యాన్ని వీడికి వదలి పెట్టడానికి వీలులేదు. యుద్ధానికి వెళ్ళడానికి వీలులేదు. వెడితే తిరిగి వస్తామనే నమ్మకం లేదు. ఈ రాక్షసుడి చేతిలో ప్రాణాలు కోల్పోలేము. వీడి బారినుండి తప్పించుకొని బ్రతికే దారి తెలుపు."

బృహస్పతి మంత్రాంగము

455: ఇలా బలి బారినుండి తప్పించుకోడం ఎలా? అని అడిగిన ఇంద్రుడితో బృహస్పతి ఇలా అన్నాడు.456: "దేవేంద్రా! శ్రద్ధగా విను. బ్రహ్మవాదులైన భృగువంశపు బ్రాహ్మణులు వీనికి బల సంపదను సమకూర్చారు. ఈ రాక్షసుని ఎదిరించడానికి విష్ణువుకు, శివునికి తప్ప, నీకు కాని, నిన్ను మించిన ఇంకెవరికి కానీ శక్తి చాలదు. నీవిప్పుడు రాజ్యాన్ని, రాజధానిని విడిచి పెట్టి వెళ్ళడమే మేలు. పగవారికి కష్టాలు వచ్చినప్పుడు పసిగట్టి మళ్లీ తిరిగి రావడం మంచిదని నా అభిప్రాయం. బలికి బ్రాహ్మణుల శక్తి వల్ల బలం సమకూరింది. కొన్నాళ్ళు పోయాక వీడు బ్రాహ్మణులను గౌరవించడు. దానివల్ల వీని పరాక్రమం సన్నగిల్లుతుంది. అంత వరకూ శత్రువు పేరు కూడా ఎత్తవద్దు..457:

పరు గెలువ వలయు నొండెను
సరిపోరగ వలయు నొండెఁ జా వలె నొండెన్
సరి గెలుపు మృతియు దొరకమి
సరసంబుగ మున్న తొలఁగి చనవలె నొండెన్.

ఎదిరించి శత్రువును జయించాలి. లేదా, వాడితో సమానంగా నైనా పోరాడాలి. లేదా, రణరంగంలో వీరమరణం పొందాలి. గెలుపు, సమానత్వము, మరణము కలగవు అనే పక్షంలో ముందే తొలగి వెళ్ళిపోవడమే మేలైన పని."458: ఈ విధంగా బృహస్పతి సమయోచితమైన కర్తవ్యాన్ని తెలియజెప్పాడు.

ఆ మాటలకు ఇంద్రుడు, దేవతలూ ఒప్పుకున్నారు. స్వర్గలోకాన్ని విడిచి పెట్టి తమకు ఇష్టమైన రూపాలు ధరించి అనుకూలమైన చోట్లకు వెళ్ళిపోయారు. బలిచక్రవర్తి పగవారు లేని అమరావతిని సునాయాసంగా ఆక్రమించాడు. ముల్లోకాలను తన వశం చేసుకున్నాడు. విశ్వవిజేత అయి చాలాకాలం పాలించాడు.శిష్యులపై వాత్సల్యం కలిగిన శుక్రుడు మొదలగువారు బలిచక్రవర్తి చేత నూరు అశ్వమేధయాగాలు చేయించారు.459: ఆ రాక్షస మహారాజు బలిచక్రవర్తి రాజ్యంలో చేయి సాచి దానం అడిగే యాచకులు లేరు. దాతలు తమ దానం ఇచ్చే గుణం వదలిపెట్ట లేదు. సకల పంటలు సానుకూలంగా పండేవి. శత్రువులు లేరు.

దేవాలయాలు ఉత్సవాలు, వేడుకలతో వెలుగుతుండేవి. బ్రాహ్మణుల కోరికలు తీరేవి. కాలానికి తగిన విధంగా వానలు కురిసేవి. దానితో భూమికి వసుంధర అనే పేరు సార్థకమైంది.

అదితి కశ్యపుల సంభాషణ

460: దేవతలు తరలిపోవడం, బలి అమరావతిని ఆక్రమించుకోవడం జరిగిన పిమ్మట...461: దేవతలతల్లి యైన అదితి అమరావతిని రాక్షసులు ఆక్రమించుకోవడం, తలదాచుకోవడానికి తనకు పుట్టిన దేవతలు అందువల్ల తరలిపోవడం తలచుకుంటూ దిక్కులేనిదాని వలె దుఃఖించింది. ఒకనాడు ఆమెభర్త కశ్యపప్రజాపతి తపస్సు చాలించి ఇంటికి వచ్చాడు. అదితిచేత పూజలు అందుకున్నాడు. బాధతో కుమిలి, కుంగిన ఆమె ముఖ పద్మాన్ని చూచి ఆమెను చేరదీసి ఓదార్చాడు. "ఓ కమలాక్షీ! ఎందుకు బాధపడుతున్నావు?" అని అంటూ...462: కశ్యపుడు తన ఇల్లాలు అదితితో ఇంకా ఇలా అన్నాడు.463: "చిన్నదానా! స్వచ్ఛమైనదానవు నీవు. ఎందుకు ఇలా విచారంగా ఉన్నావు? బ్రాహ్మణులను ఏ లోటూ లేకుండా ఆదరిస్తున్నావు కదా! దేవతలకు పూజలు సమయాను గుణంగా సాగుతున్నాయా? మన వారు అందరూ ఇక్కడ వేళకు సరిగా హోమకార్యాలు నెరవేరుస్తున్నారా? నీ కొడుకులు ధర్మాన్ని పాటిస్తున్నారా?

అతిథులకు అన్నపానాలు ఇచ్చి ఆదరిస్తున్నావు కదా! మర్చిపోకుండా బిచ్చగాళ్లకు, సేవకులకూ, సజ్జనులకు సత్కారాలు చేస్తున్నావు కదా!464: అన్నమైనా, మజ్జిగైనా, నీళ్ళైనా చివరకు కూరగాయలైనా తమకు ఉన్నంతలో అతిథులకు లేదనకుండా పెట్టాలి. అలా పెట్టకపోతే ఎంతటి ధనవంతులైనా వారు దరిద్రులే.465: అంతేకాకుండా...466: చంద్రుని వలె చల్లని మగువా! దేవతలు అందరకు ఆత్మ విష్ణుమూర్తి. ఆయన ముఖము అయిన అగ్నిని, బ్రాహ్మణులను సంతోష పెడితే విష్ణువు సంతోషపడతాడు. విష్ణుమూర్తి తృప్తిచెందితే, సమస్తలోకాలు తృప్తి చెందుతాయి.467: లేడికన్నులతో అందంగా ఉండే అదితీ! నీ విషయంలో నీ కొడుకులు వినయంగా ఉంటున్నారా? కోడళ్ళు నీకు ఎదురు చెప్పకుండా ఉంటున్నారా? ఇంట్లో ఇబ్బందులు ఏమి లేవు కదా!".468: ఇలా కుశలం అడిగిన భర్త కశ్యపప్రజాపతితో అదితి ఇలా అన్నది.469: "ఓ నా హృదయానికి ప్రభువు అయిన పతీ! దితి బిడ్డలు బలవంతులై నా బిడ్డలపై సవితి సోదరులు అన్న ప్రేమ ఏమాత్రం చూపకుండా, పగబూని ఓడించి, పారద్రోలారు. సాహసంతో అమరావతిని ఆక్రమించు కొని పాలిస్తున్నారు.

ఈ విషాదవార్త నీకేమని చెప్పమన్నావు. నా పిల్లలకు మేలు కలిగే మార్గం ఏదో ఆలోచించి చూడు. 470: దితి, నేను అక్కాచెల్లెళ్ళమే. అయినప్పటికీ ఆమె నాతో ఎప్పుడూ కలహిస్తూనే ఉంటుంది. దేవతలను ఆమె పిల్లలు రాక్షసులు బాధపెడుతున్నా ఆమె మెచ్చుకుంటుందే కాని వద్దని అనదు.471: ఎండకన్నెరగని ఇంద్రుని ఇల్లాలు శచీదేవి ఈనాడు పలు కష్టాలకు గురై బాధపడుతూ ఉంది. ఇంద్రుడు ముల్లోకాల రాజ్యసంపదను పోగొట్టుకొని ఈనాడు అడవుల్లో

ఇడుములు పడుతున్నాడు. కలవారిబిడ్డలై అల్లారు ముద్దుగా పెరిగిన జయంతాదులు ఈనాడు బోయపిల్లల వెంట తిరుగుతున్నారు. దేవతల నెలవైన అమరావతి ఈనాడు రాక్షసులకు ఆలవాలమైనది. అన్ని లోకాలలో బలి బలవంతుడు అవుతున్నాడు. అతనిని ఇంద్రుడు నిలువరించలేక పోతున్నాడు. యజ్ఞాలలో హవిర్భాగాలు అన్నింటినీ బలి దోచుకుంటున్నాడు.

ఒక్క కబళం కూడా దేవతలకు చిక్కనివ్వడు.472: మహాత్మా! కశ్యపా! బిడ్డలు అందరి ఎడలా నీవు సమానమైన వాడవు. ప్రేమతో బిడ్డలను కన్న ప్రజాపతివి కాబట్టి, నీవు దుర్మార్గులైన బిడ్డలను కనిపెట్టి దండించాలి కదా.473: మహానుభావా! సకల కల్యాణాలను సమకూర్చే వాడవు నీవు. ఉత్తములైన దేవతలు కష్టాలకు గురయ్యారు. భాగ్యాలు కోల్పోయారు. వారి దుఃఖాన్ని తొలగించు. వారిని అమరావతిలో నెలకొల్పడము, రాక్షసులను శిక్షించడము చేయవలసిన మంచిపనులు తొందరగా ఆలోచించి ఈ కార్యం ఏ విధంగా నెరవేరుతుందో చూడు. మమ్మల్ని నీ కరుణారస ప్రవాహంలో ముంచెత్తు."474: ఇలా అంటున్న తన ప్రియ భార్య మాటలు విని, కశ్యపప్రజాపతి కొంచెంసేపు ఆలోచించాడు. జ్ఞానదృష్టితో రాబోయే కాలంలో జరగబోయే సంగతులు తెలుసుకుని ఇలా అన్నాడు.475: "ఇల్లాలా! తండ్రి ఎవడు? కొడుకు ఎవడు? పుట్టిన స్థలాలు ఏవి? పుట్టుకకు కారణము ఏమిటి? శరీరాలు ఏ పాటివి? ఈ సంసారాలు ఏ మాత్రమైనవి? ఆలోచిస్తే ఇదంతా భగవంతుడైన విష్ణుమూర్తి మాయ తప్ప మరేమీ కాదు. అజ్ఞానంలో బంధింపబడి ఉండడమే దీనికి మూలం. అందువల్ల జరిగిన దానికి చింతించి చిన్నబుచ్చుకోకు.

పయోభక్షణ వ్రతము

76: సరే, ప్రస్తుతానికి తగిన కార్యాన్ని చెబుతాను విను.477: ప్రియురాలా! అదితీ! విష్ణుమూర్తి భగవంతుడు, పురుషోత్తముడు, జనార్దనుడు, దయాసముద్రుడు, సర్వాంత ర్యామి, జగదీశ్వరుడు. కనుక అయనను ఆరాధించు. ఆయన సంతోషిస్తే చాలు. నీ కోరికలు అన్నీ తీరుస్తాడు. అన్ని ప్రయోజనాలు నెరవేరుతాయి. అతనిని పూజించి సమస్త సంపదలను పొందు."478: ఇలా హరిని పూజించమని చెప్పిన భర్త కశ్యపుని మాటలు విని భార్య అదితి ఇలా అంది.479:"స్వామీ! పరమాత్ముడైన శ్రీమహావిష్ణువును ఏవిధంగా ధ్యానించాలి? అందుకు తగిన మంత్రమేది? దాని నియమాలు ఏవి? పూజింప వలసిన కాలమేది? అన్నీ నాకు ఉపదేశించు.".

480: ఇలా భగవంతుని పూజించే విధానం చెప్పమని అడిగిన భార్య అదితికి కశ్యపుడు పయోభక్షణం అనే వ్రతాన్ని ఉపదేశించాడు. దానికి తగిన కాలాన్ని, మంత్రాన్ని, నియమాన్ని, వ్రతకాలంలో పాటించవలసిన ఉపాస, దాన, భోజనాది విధివిధానాలను బోధించాడు. అదితి

ఫాల్గుణ మాస శుక్ల పక్ష మొదటి దినము అయిన పాడ్యమి నాడు ఆ వ్రతాన్ని ప్రారంభించింది. పన్నెండు దినాలు యథావిధిగా భగవంతుడు విష్ణుమూర్తికి సమర్పిస్తూ వ్రతం ఆచరించింది. వ్రతం ముగించి నియమవంతురాలై ఉన్న ఆమెకు విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. ఆయన చతుర్బాహుడు. శంఖాన్ని, చక్రాన్ని ధరించి, పచ్చని పట్టువస్త్రాన్ని కట్టుకొని ఉన్నాడు. కన్నులకు కానరాని భగవంతుడు అలా ఆమె కన్నుల ఎదుట సాక్షాత్కరించాడు.481:

సంతోషంవల్ల అదితి కన్నులనుండి కురిసిన కన్నీళ్ళు ఆమె వక్షస్థలంపై జాలువారాయి. ఆమె శరీరము అంతా పులకరించింది. భక్తితో స్తోత్రాలు చేస్తూ నుదుటిపై చేతులు జోడించి స్వామికి నమస్కరించింది.482: అదితి ఆ దేవదేవుని రూపాన్ని చూపులతో తనివితీరా త్రాగింది. నిండు సంతోషంతో మైమరచి ఆ లక్ష్మీపతిని మృదుమధుర వాక్కులతో ఇలా స్తుతించింది.483: "యజ్ఞేశ్వరా! విశ్వంభరా! అచ్యుతా! నీ పేరు తలస్తే చాలు సర్వ మంగళాలు ఒనగూడుతాయి, లోకమే రూపమైనవాడవు, పూజించేవారిని ఆపదలనుండి ఆర్తినుండి బ్రోచేవాడవు, దీనులందరికి దిక్కైనవాడవు, పాదంలో పవిత్రమైన గంగానది కలవాడవు, లోకాలు పుట్టి పెరిగి గిట్టుటకు కారణమైనవాడవు, ఎల్లప్పుడూ ఆనందంతో అలరారేవాడవు, శాశ్వత లీలావిలాసాలు కలవాడవు, అంతటా నిండిన వాడవు, నీవు భక్తులపాలిటి కల్పవృక్షానివి, సుగుణనిధివి, పరమాత్ముడవు, వేదాలకు ఆధారమైనవాడవు, సేవించేవారి యందు వాత్సల్యము కలవాడవు, కమలాల వంటి కన్నులు కలవాడవు, పరమపురుషుడవు, ఈలోకంలో మంచి మనుగడ, కలిమి, ఇహము, పరమూ, ధర్మార్థ కామాలు, వేదవిజ్ఞానము, శత్రు జయము నిన్ను పూజించని వారికి లభించవు కదా!484: తండ్రీ! బలవంతులైన రాక్షసులు నా బిడ్డలైన దేవతలను అదలించి, బెదరించి స్వర్గ లోకాన్ని పాలిస్తున్నారు. కన్నకడుపు కదా! ఆ బెంగతో దేవతల కన్నతల్లినైన నాకు నాటి నుండి కంటికి నిద్ర కరువైంది. ఈ నా గర్భశోకాన్ని పోగొట్టి కాపాడు."

485: అని పలికిన అదితి మాటలు విని శ్రీమహావిష్ణువు చిరునవ్వు చిందించాడు. శరణు వేడిన వారికి కామధేనువు అయిన ఆ పరమాత్ముడు అదితితో ఇలా అన్నాడు.486: "అమ్మా! తేజస్సుతో కూడిన రూపంతో నీ కడుపున జన్మిస్తాను. నీ కోడళ్ళు, కొడుకులు, నీ మగడు, నీవు మెచ్చుకొనేటట్లు చేస్తాను. మీ ఆలుమగలు సంతోషించేటట్లు, రాక్షసులు కళవళ పడేటట్లు చేస్తాను.
నీ ఒడిలో ఆడుకోవాలని నాకు కుతూహలంగా ఉంది.487: నువ్వు బాధపడకు. సహనంతో కూడిన ఉపాయంతో తప్ప బలం చూపెట్టి రాక్షసులను మట్టుపెట్టడానికి వీలు లేదు. నీ నియమాలకు, భక్తికి నేను సంతోషించాను. ఇంద్రుడు, శచీదేవి, దేవతలు సంతోషించే విధంగా రాక్షసుల రాజ్యాన్ని అపహరించి దేవతలకు ఇస్తాను. ఇంక నువ్వు దుఃఖించేపని లేదు.488:నా

రూపాన్ని స్మరించుకుంటూ నీ భర్తను సేవించు. నేను నీ గర్భంలో చేరతాను.మక్కువ, కనికరంతో నన్ను పెంచు తల్లీ!
489: దేవతలు స్వర్గాన్ని పాలించేటట్లు చేస్తాను. శచీదేవి సౌభాగ్యాలను కాపాడతాను. రాక్షసులను అధికారం నుంచి తొలగించి, వారి ఇల్లాళ్ళ అలంకరాలను పోగొడతాను."490: ఆ విధంగా భక్తజన విధేయుడైన విష్ణుమూర్తి సెలవిచ్చి మాయమయ్యాడు.

వామనుడు గర్భస్తు డగుట

కృతార్థురాలైన అదితి సంతోషంతో తన ప్రాణవల్లభుడైన కశ్యపప్రజాపతిని చేరి సేవించసాగింది. అటు పిమ్మట ఒకనాడు...491: తపస్సులో ఉన్న కశ్యపునిలో విష్ణువు తేజస్సు ప్రవేశించింది. వాయువు కొయ్యలో అగ్నిని చేర్చిన విధంగా అదితి యందు కశ్యపుడు తన అసాధారణమైన వీర్యాన్ని చేర్చాడు.492: రాజా పరీక్షిత్తూ! ఈ విధంగా కశ్యపుడు చాలాకాలంగా మహా తపో విశేషంతో సంపాదించిన వీర్యంవల్ల అదితి గర్భాన్ని ధరించింది. ఆమె మనసు చాలా ఉల్లాసాన్ని పొందింది.493:

చలచలనై పిదపిదనై
గలలంబై కరుడు గట్టి గళనాళముతోఁ
దలయేర్పడి గర్భంబై
నెలమసలం జీరచిక్కె నెలఁతకు నధిపా!

ఒక నెల గడిచింది. అదితి కడుపులో క్రమక్రమంగా ద్రవ రూపము, మెత్తని రూపము గడ్డకట్టి పిండరూపము ఏర్పడింది. నెల తప్పింది. గొంతుతోపాటు తల ఏర్పడి గర్భం నిలిచింది. 494: అదితి చూలాలైన తరువాత వరుసగా ఒకటి, రెండు, మూడు, నాలుగు నెలలు గడిచాయి. క్రమంగా నెలలు పెరిగినాయి. దానితోపాటు రాక్షసులు నాశనం కావడానికి నెలలు సమీపించాయి.495: పరీక్షిన్మహారాజా! అదితి గర్భంలో అవయవాలతోకూడిన ఆ అద్భుత శిశువు గొప్ప మేఘాలు కప్పిన సూర్యబింబాల వెలుగుతో కదలాడ సాగాడు. 496: అదితి గర్భంలోని చిన్నారి శిశువు భూగోళాలను, ఖగోళాలను, సముద్రాలను, సమస్తలోకాలను తన కడుపులో ఇముడ్చుకొని సన్ననైన చిన్ని రూపంతో అందంగా అణగిమణిగి ఉన్నాడు.497: అదితి క్రమక్రమంగా నిండుచూలాలు అయింది...498: ఆమె రెప్పలు అందంగా ఒప్పాయి: కన్నులు నిర్మలమయ్యాయి: స్తనాగ్రాలు నల్లపడ్డాయి: ఒడ్డాణం బిగువైంది, ముఖం తెల్లబడింది: పిరుదులు బరువెక్కాయి: నడుము విస్తరించింది: మనస్సు తేలికపడింది. దేహం మహత్వాన్ని పొందింది. గర్భం అతిశయించింది.499: పెద్దముత్తైదువలు ఆదిత్యులకు తల్లి అయిన అదితికి నుదుట విభూతి పెట్టారు, తిలకం దిద్దారు, పట్టుబట్టలు కట్టారు. ఆమె గర్భానికి రక్ష

కట్టారు.500: ఈ విధంగా హరి గర్భస్తుడు అయి...501: అదితి గర్భంలో విశ్వగర్భుడైన భగవంతుడు పూర్ణుడు అవుతూ పూటపూటకూ పెరగసాగాడు. గర్భం బరువెక్కసాగింది. దేవతల కన్నతల్లి అదితి నీళ్ళాడే సమయం ఆసన్నమయింది.

గర్భస్థ వామనుని స్తుతించుట

502: ఆ సమయంలో బ్రహ్మదేవుడు వచ్చి, అదితి గర్భంలో అందంగా కలియ తిరుగుతూ కదలాడుతున్న భగవంతుని ఉద్దేశించి ఈవిధంగా స్తోత్రం చేసాడు.503: "అదితి గర్భంలో వర్ధిల్లుతున్న ఓ స్వామీ! నీవు ముల్లోకాలనూ జయింపగల వాడవు: దేవాధిదేవుడవు: ముల్లోకములను ఆక్రమించు వాడవు: మహాత్ముడవు: కిరణముల రూపమున సర్వస్వము నందు వ్యాపించి ఉండువాడవు: కిరణములకు మూలమైన వాడవు:పృశ్ని అను నామాంతరం గల అదితి గర్భంలో పుట్టిన వాడవు, (పూర్వం పృశ్ని, సుతపులకు పుత్రుడుగా పృశ్నిగర్భుడు విష్ణుమూర్తి పుట్టాడు): సర్వులకు ఇష్టుడవైన విష్ణువు నీవు. సమస్త భువనాలనూ సంతోషంగా నీ కడుపులో దాచుకుంటావు: ఈ లోకాలకు మొదలు, నడుమ, తుది నీవే: చరాచర ప్రపంచం పుట్టడానికి కారణం నీవే: కాలమై సమస్తమూ నీ లోపలే ధరిస్తావు: ప్రవాహం ప్రాణికోటిని ధరించినట్లు సమస్త జీవులను నీలోనే నిలుపు కొంటావు: సృష్టికర్తలకు సృష్టికర్తవు నీవు: స్వర్గ లోకాన్ని పోగొట్టుకొని దేవతలు కష్టసముద్రంలో మునిగారు. వారిని కాపాడి గట్టు చేర్చే తెప్పవు నీవు.504: మహానుభావా! చాలా కాలంగా దేవతలు స్వేచ్ఛకోసం ఆరాటపడుతున్నారు. వారికి సంతోషాన్ని సమకూర్చడానికై తొందరగా అదితి గర్భం నుండి బయటకు వేంచేయవయ్యా."505: కమలంలో పుట్టిన బ్రహ్మదేవుడు ఈ విధంగా స్తుతిస్తూ ఉన్న ఆ సమయములో. .

వామనుడు అవతరించుట

506: అలా బ్రహ్మదేవుడు స్తోత్రం చేసిన పిమ్మట, నిర్మలమైన నియమంతో గొప్ప పతివ్రతగా పేరు పొందిన దేవేంద్రుని తల్లి అయిన అదితి గర్భం నుండి వామన రూపంతో సకల లోకాధీశుడు అయిన మహావిష్ణువు జన్మించాడు. అది శ్రవణద్వాదశి అనగా శ్రవణ నక్షత్రంతో కూడిన భాద్రపద శుద్ధ ద్వాదశి తిథి, అభిజిత్తు లగ్నం, పట్టపగలు సూర్యుడు ఆకాశం నట్టనడుమ ప్రకాశిస్తున్నాడు, గ్రహాలు, నక్షత్రాలు, చంద్రుడు ఉచ్ఛదశలో ఉన్నాయి. అట్టి శుభకర సమయంలో వామనుడు అవతరించాడు.507: వామనుడు జన్మించినప్పుడు అతనికి నాలుగు చేతులు, ఆ చేతులలో శంఖము, చక్రము, గద, పద్మము,కపిల రంగు వస్త్రము, మకరకుండలాలతో మెరిసే చెక్కిళ్ళు, రొమ్ముపై శ్రీవత్సము, కమలాల వంటి కన్నులు కలిగి ఉన్నాడు. తుమ్మెదలు మూగిన అందమైన వనమాల వైజయంతి మాల మెడలో వేళ్ళాడుతున్నది.

రత్నాలు కూర్చిన బంగారు వడ్డాణం బాహుపురులూ, కిరీటమూ, హారాలూ, కాలిఅందెలూ, కాంతులు వెదజల్లుతున్నాయి. కమనీయమైన మెడలో కౌస్తుభమణి మెరుస్తున్నది. అతని రూపం అఖిల జనుల మనస్సులను అకర్షిస్తున్నది.508: వామనుడు పుట్టటంతో యక్షులు, గరుడులు, దేవతలు, సిద్ధులు, నాగులు తమ చింతలు అన్నీ విడిచిపెట్టారు. సాధ్యులు, చారణులు, ఋషులు, ఋత్విజులు, విద్యాధరులూ సంతోషించారు. సూర్య చంద్రులు మిక్కిలి ప్రకాశవంతులై కాంతులు విరజిమ్మారు. గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు వాద్యాలు మ్రోగిస్తూ ఆటపాటలతో ఆకాశంలో నాట్యాలు చేశారు.509: వామనుడు అవతరించడంతో, బ్రాహ్మణులు, దేవతలతో సేవింపడుతూ, సకల దిక్కులందలి కావిరిరంగు కరగిపోయింది, సప్తసముద్రాలు నిర్మలం అయ్యాయి, భూమి, ఆకాశం నిర్మలంగా అలరాయి.510: వామనుడు జన్మించడంతో, పొదరిండ్లు విశేషంగా పూలజల్లులు విరజల్లాయి. దేవతలు కురిపించిన పూలవానల మకరంద బిందువులు అంతటా వ్యాపించాయి. పుప్పొడుల కుప్పలతో భూభాగం నిండిపోయింది.

511: అలా వామనుడు అవతరించిన పిమ్మట...512: "ఇంతటి మహానుభావుడు ఇంతకాలము నా కడుపులో ఎలా ఉన్నాడా" అని వామనుడిని చూసి అదితి ఆశ్చర్యపడింది. ఆనందంతో కూడిన జయజయ శబ్దాలతో కశ్యపుడు స్వామిని పూని సంస్తుతించాడు.513: అటుపిమ్మట వామనుడు ఆయుధాలు, అలంకారాలు కలిగిన తన దివ్య రూపాన్ని వదిలిపెట్టి, కపటబ్రహ్మచారిగా మారురూపాన్ని పొందాడు. పొట్టి బాలుడుగా, వడుగు చేయదగిన వయస్సు కలవాడుగా అయ్యాడు. ఆ కొడుకుని చూచి అదితి ఆనందంతో మైమరచి, పారవశ్యమున...514: కన్నబిడ్డయైన వామనుని "నా కన్నతండ్రీ! నా పాలి దేవుడా! నా నోములపంటా! నా ముద్దుల కన్నా! నాచిన్న వడుగా! నా వంశాలంకారమా! నా పెన్నిధీ!రావయ్యా.515: నా కన్నా! రావయ్యా" అంటూ అదితి దగ్గరకు పిలిచింది, అక్కున చేర్చుకుంది, మోహాన్ని దువ్వింది. తను కడుపారా కన్న ఆ చిన్నారి బాలుని కన్నుల నిండుగా చూచింది.516:"ఈ ఇల్లాలికి లక్ష్మి, పార్వతులే సరిజోడియైన వారు. ఇతరులు సరిజోడి కాదు." అంటూ పెద్ద ముత్తైదువలు బాలెంతరాలైన అదితికి పది రోజులు పురుడు నడిపినారు.517: అటు పిమ్మట, వామనుడికి వడుగు చేయడంకోసం కశ్యప ప్రజాపతిని ముందుంచుకొని మునీంద్రులు తగిన సకల ఉపనయన కార్యకలాపాలు జరిపించారు. వామనుడికి సూర్యుడు గాయత్రి మంత్రాన్ని బోధించాడు. బృహస్పతి జంధ్యాన్ని,కశ్యపుడు ముంజ (దర్భల మొలతాడునూ), అదితి కౌపీనాన్ని (గోచీని), భూదేవి నల్లని జింకచర్మాన్ని, చంద్రుడు దండాన్నీ, ఆకాశం గొడుగును, బ్రహ్మ కమండలాన్ని, సరస్వతీదేవి జపమాలనూ, సప్తఋషులు పవిత్రమైన దర్భలను ఇచ్చారు.518: పరీక్షన్మహారాజా! యక్షుల ప్రభువు అయిన కుబేరుడు వామనుడికి భిక్షాపాత్ర ఇచ్చాడు. జగన్మాత పార్వతీదేవి ప్రత్యక్షమై అక్షయం అంటూ ఆ బ్రహ్మచారికి పూర్ణభిక్ష పెట్టింది.519: ఆ పరిశుద్ధులైన బ్రహ్మఋషులు వామనుని ఆదరంగా

హోమానికి సిద్ధంచేసారు. తరువాత, ఆ బ్రహ్మచారి సంప్రదాయం ప్రకారం వేదమంత్రాలు చదువుతూ, వెలిగే అగ్నిహోత్రంలో ఉత్సాహంతో హోమం చేసాడు.

వామనుడు విప్రులతో సంభాషణ

520: ఈ విధంగా ఉపనయనం పూర్తై కృతకృత్యుడు అయిన మాయాబ్రహ్మచారి ఇతర దేశాలనుండి వచ్చిన కొందరు బ్రాహ్మణులను చూసి ఇలా అడిగాడు.521:"దానాలు అందుకోవడానికి బ్రాహ్మణులు దాతల చెంతకు వెళ్తున్నారా? వారు కోరిన ధనాలను దాతలు ఇస్తున్నారా? మీరుకూడా అలా ధనాన్ని తెచ్చుకుంటారా? ఈ విధంగా అర్థులకు అడిగినది ఇచ్చే మహా దాత ఎవరో చెప్పండి?"522: అని అడిగిన, వామనుడితో వివిధ దేశాలకు చెందిన బ్రాహ్మణులు ఇలా అన్నారు.523: "ఓ! వామనుడా! ధనమిచ్చేదాతలు అనేకులు ఉన్నారు. బ్రాహ్మణులు కోరిన సంపదలను పొందుతున్నారు. కానీ ఆ దాతలలో బలిచక్రవర్తితో సమానమైన మహాదాత లేడు. అతను శుక్రాచార్యుని అనుమతితో గొప్ప యాగాలు నూరు చేసాడు. అతనిని అడిగితే నీవు గొప్ప సంపద సంపాదించుకో వచ్చు."524: ఆ విధంగా తెలియపరచిన బ్రాహ్మణుల మాటలు విని లోకాలకు మేలు కలిగించడం కోసం వామనుడు ప్రయాణం అయ్యాడు. మంచి ముహూర్తములో, పెద్దల దీవనలు తల్లితండ్రుల అనుమతి పొంది బయలుదేరాడు.

వామనుని భిక్షాగమనము

525: వామనుడు మిక్కిలి దీనుడై ఉన్న దేవేంద్రుడిని కాపాడాలి అనుకున్నాడు. వెంటనే బలిచక్రవర్తిని దానం అడగడానికి నిశ్చయించుకుని, పేదరికాన్ని ప్రదర్శిస్తూ బలి నివాసానికి బయలుదేరాడు.526:

హరిహరి; సిరి యురమునఁ గల
హరిహరిహయుకొఱకు దనుజు నడుగం జనియెన్;
బరహితరత మతియుతులగు
దొరలకు నడుగుటయు నొడలి తొడవగుఁ బుడమిన్.

ఔరా! రొమ్మున లక్ష్మీదేవి కలిగిన మహా సంపన్నుడు విష్ణుమూర్తి. అయినా, అతడు ఇంద్రుడి కోసం బలిని బిచ్చమడగడానికి ప్రయాణమై వెళ్ళాడు. ఇతరులకు మేలుచేసే ఉద్దేశంతో బిచ్చమెత్తడం కూడా గొప్పవారికి ఒక అలంకారమే కాబోలు ఈ భూలోకంలో.

అలంకారవైభవము: ఈ పద్యంలోని అలంకార వైభవం ఎంతబాగుందో. (1) హరిహరి– అయ్యో, ఔరా వంటి పదం, (2) హరి= విష్ణువు, (3) హరిహయుడు= ఇంద్రుడు.

527: భగవంతుడైన వామనుడు తన కడుపులో సమస్త లోకాలను భరించేవాడు కదా. అందుకే, అతడు ఒయ్యారంగా నడిచేటప్పుడు అతని బరువు తట్టుకోలేక భూమి కృంగి పోయింది. ఆదిశేషుడు వంగిపోయాడు.528: వామనమూర్తి అలా వెళ్ళి వెళ్ళి...529: నర్మదానది శుభాలను అందించేది, యమబాధలు అనే బాణాల నుండి కవచంలా కాపాడేది, బహు గడుసుది అయిన ముక్తికాంత మనసులోని గుట్టు బయట పెట్టేది, తన నీళ్ళతో దోషాలను నివారించేది. వామనుడు తన దారిలో అలాంటి మహిమాన్వితమైన నర్మదానదిని దాటాడు.530: మంచి తేజస్సు గల ఆ వామనుడు నర్మదానదిని దాటి దానికి ఉత్తర తీరంలో ఉన్న.. .531: బలిచక్రవర్తి యాగసాలను దర్శించాడు. అలా వామనుడు చూసినపుడు యాగసాలలో రాక్షసులు పెక్కువిధాలైన పెద్దపెద్ద సందడులు చేస్తున్నారు. ఆ యజ్ఞంలో పాల్గొన్న ఉద్దండులైన మునులను చూసి దేవతలు, సిద్ధులు భయపడుతున్నారు. ద్వారానికి ముందువైపు స్థలం ఏనుగులు, గుఱ్ఱాలు, సైన్యాలతో నిండిపోయి ఉంది. అక్కడి యజ్ఞకుండాల పొగలతో సూర్యుని రథం, గుఱ్ఱాలు పూర్తిగా కప్పబడి పోతున్నాయి.

వామనుడు యజ్ఞవాటిక చేరుట

532: ఆ వైభోగం అంతా చూస్తూ, వామనుడు బలిచక్రవర్తి యజ్ఞవాటికను సమీపించాడు.533: అలా వేంచేసిన వామనుని చూసి, సభలోనివారు "శివుడో, విష్ణువో, బ్రహ్మయో, సూర్యుడో, అగ్నియో ఇలా మారు వేషంతో వచ్చి ఉండవచ్చు. ప్రపంచంలో ఇంతటి కాంతి, అందము ఉండే బ్రహ్మచారి ఎవరుంటారు!" అనుకుంటూ ఆశ్చర్యంతో చకితులై రహస్యంగా గుసగుసలాడారు.534: పొట్టి బ్రహ్మచారియైన వామనుడు రాగానే ఆ సభలోని కొందరు ప్రజలు గుసగుసలాడారు. కొందరు గజిబిజి పడ్డారు. కొందరు తికమక పడ్డారు. అలా ఆ సభలోని వారందరూ పెద్ద కలకలం చేసారు.535: సభలో అలా కలకలం జరుగుతుండగా, ఆ పొట్టి బ్రహ్మచారి బలిచక్రవర్తి సభామంటపం దరిచేరాడు.

536: పుట్టుకన్నదే లేనివాడు, అదితి సుతుడు, లక్ష్మీదేవి పతి అయిన ఆ వామనుడు, చెవులకు ఇంపుగా సామవేదం పఠించే ఉద్గాతల గానాలు విన్నాడు. మంత్రతంత్రాలను వివరిస్తూ హోమం చేసే హోతలను కలుసుకున్నాడు. హోమకుండంలో అహవనీయం, గార్హపత్యం, దక్షిణాగ్ని అనే మూడగ్నులను (త్రేతాగ్ను)వెలిగించే ఋత్విజులను చూసాడు. యాగవిధులను నేర్పరితనంతో పేర్కొంటున్న సభాపతులను సమీపించాడు. ఆ సభను బాగా ఆకర్షించాలని అనుకొని కొంతసేపు ఆ సభలో తిరుగాడాడు.537: అంతే కాక.538: ఆ పొట్టి బ్రహ్మచారి వెరపు చూపుతూ, ఒయ్యారంగా వంగుతూ, జనంలోకి దూరుతూ, "హరి హరి" అంటూ, చాటుకు వెడుతూ, ఉలికిపడుతూ కొంతసేపు చుట్టూతిరుగుతూ కొంతసేపు నటించాడు.539: ఆ సభలో వామనుడు కొందరితో వాదోపవాదాలు చేసాడు. కొందరితో కలిసి వేదాన్ని చదివాడు. కొందరితో చక్కగా సల్లాపాలు సాగించాడు. కొందరితో వాదించాడు. కొందరితో చక్కగా మాట్లాడాడు.540: అంతే కాకుండా అందరితోనూ అనేక విధాలుగా వ్యవహరిస్తూ విహరించసాగాడు.541: వామనుడు మెల్లమెల్లగా అడుగులు వేస్తూ నడిచాడు. అక్కడక్కడ నేల దిగబడుతుంటే అడుగులు తడబడుతూ నడిచాడు. మధ్యలో కొద్దిగా మాట్లాడుతు, తడబడుతూ, కలవరపడుతూ బలిచక్రవర్తిని సమీపించాడు.

పద్యనడక:

బలిచక్రవర్తి యాగశాలలోనికి వామనరూపంతో మాయావటువుగా అవతరించిన విష్ణువు ప్రవేశించే ఘట్టం. పద్యం నడక వామనుని నడకతో పోటీపడుతోందా అన్నట్టు అద్భుతంగా ఉంది.

542:అలా మాయాభిక్షుక రూపంలో ఉన్న వామనుడు ఆ దానవచక్రవర్తి అయిన బలిని చూసి ఇలా అన్నాడు.543: "ఇతడేనా రాక్షసచక్రవర్తి! ఇతడేనా దేవేంద్రుడు, అగ్ని, యముడు మొదలైన దిక్పాలకుల గర్వాన్ని తొలగించిన మొనగాడు! ఇతడేనా అత్యాశలేని నిండైన హృదయం కలవాడు! ఇతడేనా పెక్కు యజ్ఞాల పుణ్యకార్యాలలో ప్రీతితో దానమిచ్చేవాడు! ఇతడేనా దేవతాస్త్రీల మనస్సులను కలవరపెట్టే వెన్నెలవంటి కీర్తికలవాడు! ఇతడేనా సత్య ధర్మాలతో ప్రకాశించే స్వరూపం కలవాడు!".544: ఇలా పలికి, పవిత్ర దర్భలు, అక్షతలు

పట్టుకున్న తన కుడిచెయ్యి సాచి వామనుడు ఇలా అన్నాడు.545: "ముల్లోకాలను శాసించే అధికారం కలవాడా నీకు స్వస్తి! అవలీలగా దేవేంద్రుడంత వానిని వెలవెల పోయేలా చేసినవాడా! ఉన్నత పదవిలో మెలిగేవాడా! మునీంద్రుల పొగడ్తలందుకున్న శుభకరమైన యాగకార్యాలతో విహరించేవాడా! దేవతాస్త్రీల మెడలలోని బంగారు మంగళసూత్రాలను తొలగించేవాడా! సమస్త రాక్షసలోక సార్వభౌముడా! నీకు శుభమగు గాక."546: అలా బలిని దీవించిన వామనుడు కరచరణాలతో మానవాకారం ధరించిన వేదరాశివలె అతని ముందు నిలబడ్డాడు. జడలుకట్టిన జుట్టు, దండము, గొడుగు, కమండలం ధరించి ఉన్నాడు. అతని చంకలో భిక్షాపాత్ర వ్రేలాడుతున్నది. అతని ముఖం చంద్రబింబంవలె అందంగా వుంది. మాయా వాదనల చతురోక్తులు పలుకుటలో అతడు నేర్పరి. సూర్యుని కిరణాలతో కప్పబడి వెలవెల పోయిన ఇతర గ్రహాలమాదిరిగా ఆ బ్రహ్మచారి ముందు భృగువంశపు బ్రాహ్మణులు మరుగుపడిపోయారు. వారు కూర్చున్న చోటు నుండి లేచి నిలబడి వామనుని క్షేమాన్ని అడిగి తియ్యని మాటలతో అతణ్ని గౌరవించారు. బలిచక్రవర్తి అతనికి మ్రొక్కి ఆసనంపై కూర్చోపెట్టాడు. అతని అడుగులను తుడిచాడు. తన ఇల్లాలు బంగారు కలశంతో నీళ్ళు పోయగా, రాక్షస చక్రవర్తి ఆ వడుగు అడుగులు కడిగి తడి తుడిచాడు. ఆ సమయంలో...547: జటాజూటంలో చంద్రుని ధరించిన మహాదేవుడైన శివుడు ఎల్లప్పుడూ ఏళ్ళను తలపై ధరిస్తాడో, అటువంటి వామనుని కాళ్లు కడిగిన నీళ్ళను బలిచక్రవర్తి మేలుకలిగించేవిగా తలచి తలపై చల్లుకున్నాడు.

వామనుని భిక్ష కోరు మనుట

548: అలా కాళ్ళు కడిగి తలపై జల్లుకున్న ఆ చక్రవర్తి విచ్చేసిన వామనునితో ఇలా అన్నాడు.549: "ఓ బ్రహ్మచారీ! నీపేరేమిటి? ఎవరి పిల్లవాడవు? నీవు నివసించే చోటేది? నీవు ఇక్కడికి రావడంవల్ల నా వంశము, నా జన్మ సఫలము అయ్యాయి. నేను చాలా పుణ్యాత్ముడను అయ్యాను. ఈ యజ్ఞం పవిత్రం అయింది. నా కోరికలు నెరవేరాయి. అగ్నులు బాగా వేల్వబడ్డాయి. ఈ సమయం చాలా శుభదాయకం అయింది. 550: ఓ బ్రాహ్మణోత్తముడా! నీకేం కావాలో కోరుకో. మేలైన వస్త్రములా? డబ్బులా? పండ్లా? అడవి సంపదలా? గోవులా? గుఱ్ఱములా? రత్నాలా? రథాలా? మంచి ఆహారాలా? కన్యలా? ఏనుగులా? బంగారమా? భవనాలా? గ్రామాలా? పొలాలా? భూభాగాలా? లేకపోతే ఇవి కాకుండా ఇంకేమైనా కోరుకుంటున్నావా?"551:ఇలా ధర్మబద్ధంగా బలిచక్రవర్తి పలికిన పలుకులకు సంతోషించిన భగవంతుడైన వామనుడు ఇలా అన్నాడు.

వామనుని సమాధానము

552: "ఇది నా చోటు అని ఎలా చెప్పగలను! ఒక చోటనకుండా అన్ని చోట్లా ఉంటాను. ఎవరికి చెందినవాడనని చెప్పగలను? నేను నాఅంతవాడనై స్వేచ్ఛగా నడుచుకుంటాను. నా నడవడి ఇది అని ఎలా చెప్పగలను? పూనికతో మూడుపోకడలూ పొగలను. అదీ, ఇదీ నేర్చుకున్నానని చెప్పడము ఎందుకు గాని, అన్ని విద్యలూ నేర్చుకున్నాను. వేరే వారు ఎవ్వరూ నన్ను చేరదీయరు. నేనే వారిని చేరదీస్తాను. నేను ఒంటరివాణ్ణి. చుట్టాలు ఎవరూ లేరు. ఇంతకు ముందు నాకు సిరికూడా ఉండేది. ఎక్కువగా నేను మంచివారితో కలిసి మసలుతుంటాను. అదే నా నివాసము.553: ఆ సంగతి అట్లుండనీ...554: ఇప్పుడు నాతో నీవు అన్నమాట యదార్థం. మంచి కీర్తిని ఇచ్చేది, నీ వంశానికి తగినది, ధర్మంతో కూడినది మీ వంశం. మీ కులంలో కనికరం కలవారూ ఆత్మబలం కలవారు తప్ప వేరేవారు పుట్టలేదు. మీలో యుద్ధం చెయ్యడానికి దానం ఇవ్వడానికి భయపడేవారు ఎవరూ లేరు. దరిచేరిన ప్రత్యర్థులకు పరాక్రమంతో, దేహి అనే అర్థులకు దానంతో తృప్తి కలిగిస్తారు. మీ పూర్వీకులు అందరూ గొప్ప మేటివీరులు. ఆకాశంలో వెలిగే చంద్రునిలా మీ వంశంలో ప్రహ్లాదుడు మేలైన కాంతివంతమైన కీర్తితో ప్రకాశిస్తాడు. మీవంశం సమృద్ధమైన ఆ కీర్తితో సముద్రంవలె పెంపారుతుంది.555: పూర్వం మీ మూడవ తరం తాత అయిన హిరణ్యాక్షుడు విశ్వాన్ని జయించి గదా దండాన్ని ధరించి భూలోకం అంతా తిరిగాడు. ఎక్కడా పగవాడు కనిపించలేదు. చివరకు అతనిని విష్ణువు వరాహరూపంలో పరిమార్చాడు. ఆ సంగతిని హిరణ్యాక్షుని సోదరుడైన హిరణ్య కశిపుడు విన్నాడు. విష్ణువు పరాక్రమానికి ఆశ్చర్యపడ్డాడు. విష్ణువు విజయాన్ని, బలాన్ని తూలనాడాడు. వెంటనే అసురమర్దనుడు విష్ణువు యొక్క పట్టణమైన వైకుంఠంపై దండెత్తాడు.556: అప్పుడు శూలాన్ని ధరించి ప్రళయకాల యమునివలె వస్తున్న హిరణ్యకశిపుణ్ణి చూసి, సమయా సమయాలు గుర్తించగల మాయలమారి కనుక, విష్ణువు తన మనస్సులో ఇలా ఆలోచించాడు.
557: ఈ హిరణ్యకశిపుడిని యుద్ధంలో ఎదిరించి జయించడానికి వీలుకాదు. అలా కాకుండా నేను ఎక్కడికైనా వెళ్ళిపోతే ఇక లోకంలోని ప్రాణుల పైకి మృత్యువు మాదిరిగా దండెత్తి, భయపెట్టి పారద్రోలుతాడు, అనుకొని విష్ణువు ఉపాయాన్ని ఆలోచించాడు. సూక్ష్మ రూపంతో ముక్కురంధ్రం గుండా హిరణ్యకశిపుని హృదయంలో ప్రవేశించాడు.558: ఆ తరువాత ఆ రాక్షసేంద్రుడు హిరణ్యకశిపుడి వైకుంఠం ప్రవేశించి, విష్ణువు కోసం వెదకాడు. కానీ పగవాడు కనిపించ లేదు. కోపంతో ఆ రాక్షసుడు విష్ణువు కోసం ఆకాశాన్ని, భూలోకాన్ని, స్వర్గలోకాన్ని గాలించాడు. సకల దిక్కులను, భూగర్భాలను, సముద్రాలను, పట్టణాలను, అడవులనూ అంతటా వెదికాడు. లోకంలో విష్ణువు జాడ ఎక్కడా చిక్కలేదు. కడకు వెతుకుట ఆపి ఇలా అనుకున్నాడు.559:

వరచేలంబులొ మాడలో ఫలములో వన్యంబులో గోవులో
హరులో రత్నములో రథంబులొ విమృష్టాన్నంబులో కన్యలో
కరులో కాంచనమో నికేతనములో గ్రామంబులో భూములో
ధరణీ ఖండమొ కాక యే మడిగెదో ధాత్రీసురేంద్రోత్తమా!

"నా శత్రువు మరణించి ఉండవచ్చు. మరణించకుండా ఉండి ఉంటే నన్ను ఎదుర్కొనేవాడే కదా. మరణించిన పగవారిపై పగబూనడం తగదు." అని హిరణ్యకశిపుడు అనుకొని విష్ణువుపై దండయాత్ర ఆపెను.560: ఈ విధంగా అనుకొని దండయాత్ర ఆపేసాడు. అలాంటి మీ ముత్తాత హిరణ్యకశిపుడు గుణాలు లెక్కలేనన్ని ఉన్నాయి అనుకో. వాటిని అలా ఉండనీ.561: ఇక మీ తండ్రి మాత్రం సామాన్యుడా! ఇంద్రాదులు బ్రాహ్మణులవలె బాధ నటిస్తూ అర్థించగా 'సరే తీసుకోండి' అంటూ మీ తండ్రి వారికి తన ఆయుస్సును దానమిచ్చేసాడు. నీవు కూడా వారికి ఏమాత్రం తీసిపోవు.562: నీవు ముల్లోకాలను పాలించావు. ఇంద్రాది దేవతలను ఓడించావు. దానమివ్వడంలో, గుణాలలో మీ పెద్దలకు సరిపోలిన వాడవు అయ్యావు. రాక్షసులను రక్షించడంలో సమర్థుడవు అయ్యావు.

వామనుడు దాన మడుగుట

563: అంతే కాకుండా.564: రాజ్యాధికారం కలిగినప్పుడు గౌరవింపదగినవారికి,బ్రాహ్మణులకు, బిచ్చగాళ్ళకు ధనాన్ని పంచిపెడుతూ బ్రతకాలి. అలా చేయనివాడి బ్రతుకు, ధనము, గృహములు నిరర్థకమైనవి, పరిత్యజింప తగినవి.
565: దాతలను లెక్కించేటప్పుడు ముల్లోకాలలో గొప్పవాడుగా మొట్టమొదట నిన్నే ఎన్నిక చేస్తారు. ఇంతవాడవు అయినా ఇంతవరకూ నిన్ను ఇమ్మంటూ ఏనాడూ నేను పీడించలేదు.566:

ఒంటివాఁడ నాకు నొకటి రెం డడుగుల
మేర యిమ్ము సొమ్ము మేర యొల్ల;
గోర్కిఁదీర బ్రహ్మకూకటి ముట్టెద
దానకుతుకసాంద్ర! దానవేంద్ర!.

ఓ దానవరాజా! దానం చేయాలనే చిక్కని కుతూహలం కలవాడా! బలిచక్రవర్తీ! నేను ఒంటరివాడిని. నాకు సొమ్ములు, భూములు అక్కరలేదు. మూడడుగుల నేల మాత్రము ఇమ్ము. దానితో తృప్తిపడి బ్రహ్మానందం పొందుతాను." 567: ఇలా మూడు అడుగుల నేల అడిగిన ఉత్కృష్ట భిక్షుకుడైన వామనుడితో, బహు దొడ్డ దాత అయిన బలిచక్రవర్తి ఇలా అన్నాడు.

568: "ఓ బ్రాహ్మణుడా! నీ మాటలన్నీ ఉన్నమాటలే. వాటిని ఒప్పుకోవలసిందే. ముమ్మాటికీ సత్యములే. అందుకు పెద్దలు కూడా కాదనరు. కానీ పాపం అడక్క అడక్క అడిగి ఇంత కొంచెమే అడిగావు. చాలా బాగుంది. కానీ అడిగేటప్పుడు దాత గొప్పదనాన్ని, అతని గొప్ప గుణాన్ని తలచాలి కదా!"569: అని బలిచక్రవర్తి మరల ఇలా అన్నాడు.570:

వసుధాఖండము వేఁడితో? గజములన్ వాంఛించితో? వాజులన్
వెసనూహించితొ? కోరితో యువతులన్ వీక్షించి కాంక్షించితో?
పసిబాలుండవు; నేర వీ వడుగ; నీ భాగ్యంబు లీపాటి గా
కసురేంద్రుండు పదత్రయం బడుగ నీ యల్పంబు నీ నేర్చునే?

"భూభాగమో, ఏనుగులో, గుఱ్ఱాలో కోరాలి. లేదా అందగత్తెలను చూసి కాంక్షపుడితే జవరాండ్రను కోరు కోవాలి,కాని చిన్నపిల్లాడివి కదా అడగటం తెలియదు, నీ సిరి/సామర్థ్యం ఇంత అల్పమైనది. కనుకనే మూడు అడుగులు మాత్రమే అడిగావు, ఐనా ఇంతటి రాక్షస చక్రవర్తిని ఇంత అల్పం ఎలాఇస్తాను?."అని అంటున్నాడు మూడడుగుల మేర దానం అడిగిన వామనుడితో బలిచక్రవర్తి.571: ఇలా ఇంత చిన్నదానమా అంటున్న యాగ యజమాని బలిచక్రవర్తితో మేధావి అయిన వామనుడు ఇలా అంటున్నాడు.572: "అయ్యా! నేను బ్రహ్మచారిని. నాకు గొడుగో, యజ్ఞోపవీతమో, కమండలం, మొలతాడు పంటివి ఉపయోగిస్తాయి. అంతేకాని బ్రహ్మచారి నైన నా కెందుకు భూములు, ఏనుగులు, గుఱ్ఱాలు, స్త్రీలు?. నా నిత్యకృత్యాలకి వాటితో పనిలేదు కదా! కాదని తోసేయకుండ నే కోరిన ఆ మూడు అడుగుల చోటిస్తే అదే నాకు బ్రహ్మాండం.573: అంతేకాకుండా...574: లభించినది ఎంత కొంచెం అయినాసరే ఉబ్బితబ్బిబ్బు పడకుండా, అదే పదివేలుగా భావించి తృప్తి పొందాలి. అలా తృప్తిపడని వారికి సప్తద్వీపాల సంపదలు వచ్చిపడినా కూడా తృప్తి తీరదు.575: బలి రాక్షస మహారాజా! ఆశ మిక్కిలి పొడవైన తాడు వంటిది. దానికి అంతు ఉండదు. పూర్వకాలంలో పృధుచక్రవర్తి, గయుడు మొదలైన రాజులు సముద్రాల దాకా వ్యాపించిన సామ్రాజ్యాన్ని సంపాదించి పాలించారు. వారు సైతం వృథాగా కష్టపడినవారే కాని అర్థంమీద, కామంమీద ఆశలను వదలుకోలేదు. అంతటి వారు కూడా ఆశల అంతు చూడలేదు కదా.576: తృప్తిపడేవాడు ముల్లోకాల్లో గౌరవింపబడతాడు. తృప్తునికి ఎప్పుడూ సుఖం కలుగుతుంది. సంతోషం లేకపోవడమే తిరిగి పుట్టడానికి కారణం. సంతోషంవల్ల మోక్షం కూడా సమకూరుతుంది. పూటపూటకూ తనంత తానుగా దొరికినదానితో సంతోషపడుతుంటే తేజస్సు పెరుగుతుంది. నీళ్ళ వలన నిప్పు చల్లారినట్లుగా సంతోషం లేకపోతే తేజస్సు తగ్గిపోతుంది. నీవు రాజువు కదా అని అవీ ఇవీ అన్నీ అడగడం భావ్యం కాదు. నాకు తగినట్లుగా నేను అడిగిన మూడుఅడుగులు కాదనకుండా ఇమ్ము. అంతే చాలు, అదే చాలు."

శుక్ర బలి సంవాదము

577: ఇలా చాలంటూ పలికిన వామనునికి మూడు అడుగుల భూదానం ఇవ్వడానికి బలిచక్రవర్తి జలకలశం చేతిలోనికి తీసుకుని సమాయత్తం అవుతున్నాడు. అంతలో రాక్షసరాజ్య నిర్వాహణాదక్షుడైన శుక్రాచార్యుడు దానశీలుడైన దానవ చక్రవర్తి బలితో ఇలా అన్నాడు.578: "రాక్షసేశ్వరా! బలీ! ఇతడు బ్రాహ్మణుడు కాదు. అనంతాత్ముడైన హరి, విష్ణువు. దేవతల కార్యాన్ని సాధించడానికి కశ్యపుని కొడుకుగా అదితి గర్భంలో పుట్టినవాడు. అయ్యో! తెలియకుండా ఇతనికి దానం ఇస్తానని ఒప్పుకున్నావు. దీని వలన రాక్షసులకు కష్టం వస్తుంది. ఇతడు నిన్ను మోసగించి నీ సంపదను, తేజస్సును, రాజ్యాన్ని ఇంద్రునికి ఇస్తాడు. విశ్వరూపం ధరించి మూడడుగులతో లోకాలు అన్నిటినీ ఆక్రమిస్తాడు. నీ ఐశ్వర్యం అంతా ధారపోసి నీవు నిరుపేదగా ఎలా బ్రతుకుతావు?579: ఇతడు ఒక పాదంతో భూలోకాన్ని, ఇంకొకపాదంతో స్వర్గలోకాన్ని కప్పివేస్తాడు. బాగా పెద్ద ఆకారం ధరించి, దిక్కులు, ఆకాశం పిక్కటిల్లేటట్లు పెరిగి, అంతా తానై నిండిపోతాడు. అప్పుడు నీవు ఎక్కడికి పోతావు చెప్పు.580: ఇస్తానని చెప్పి ఇవ్వకపోతే, వచ్చే నరకాన్ని త్రోసిపుచ్చడానికి నీకు శక్తి ఉంది. "దాతకు నాశనం తెచ్చే దానం దానమే కాదు" అని పెద్దలు చెప్తారు. తాను ధనవంతుడుగా ఉంటూ దానాన్ని, యజ్ఞాన్ని, తపస్సును గురించి ఆలోచించాలి. ఉత్తముడైన పురుషుడు తన ధనమంతా ఐదు భాగాలు చేసి కామానికి, అర్థానికి, ధర్మానికి, కీర్తికి, ఆశ్రయించిన వారికి సమానంగా పంచాలి. ఆ విధంగా చేసేవాడు, ఈ లోకంలో, ఆ లోకంలో కృతార్థుడై సుఖపడతాడు. తనకు మించిన ధర్మం న్యాయం కాదు.

581: అంతేకాకుండా, ఈ విషయంలో ఎంతో ప్రసిద్ధమైన ఒక ఋగ్వేదసూక్తి ఉన్నది. దాన్ని చెబుతాను శ్రద్ధగా విను.582: రాజా! సచ్చరిత్రా! దేనిని ఇవ్వడం వలన సమస్తమూ నష్టము అవుతుందో ఆ దానము ఇవ్వరాదు. ఇస్తానని మాట ఇచ్చినాసరే. దానివల్ల అసత్య దోషం అంటదు. ఆత్మ అనే చెట్టుకు అసత్యమే మూలం కదా. అటువంటి ఆత్మ వృక్షానికి సత్యం పూలు, పండ్లుగా ఉంటుంది. అసత్యం అనే మూలం బాగుంటే ఆత్మ అనే వృక్షం చెడదు. మొదలు చెడితే చెట్టు, పూలు, పండ్లు చెడతాయి. పండ్లు పూలు లేకపోయినా మొదలు బాగా ఉంటే వృక్షం వృద్ధి చెందుతుంది. కాబట్టి మొదటికి చేటు వాటిల్లకుండా, లోటు రాకుండా, పదుగురిలో పలుచన కాకుండా దానం చేసే దాత చెడిపోడు. అందుచేత, సత్యంకోసం నీవు ఇతనికి దానమిస్తే నీకు మిగిలేది ఏమీ ఉండదు.583: దాత సంపద అంతటికి సమానమైన దానం ఒక పక్క అడుగుతూ,"నేను అడిగేది స్వల్పమే, సమస్త సంపదలూ కాదు" అంటూ అబద్ధం చెప్పరాదు కదా! ఆ విధంగా చెప్పేవాడు నీచుడు, పిరికివాడు,వాడు ప్రాణమున్న పీనుగ, వాడి బ్రతుకు వ్యర్థము.

584: దీనిలో ఇంకొక విశేషం ఉంది వివరిస్తాను విను.585: ఓ బలిచక్రవర్తి! ఆడవారి విషయంలో, పెళ్ళిళ్ల సందర్భంలో, ప్రాణానికి, ధనానికి, గౌరవానికి భంగం కలిగేటప్పుడు, భీతిల్లిన గోవులను, విప్రులను కాపాడేటప్పుడూ, అవసరమైతే, అబద్ధం చెప్పవచ్చు. దాని వల్ల ఏ పాపమూ రాదు.586: దాతలలోకెల్లా అగ్రేశ్వరుడా! బలీ! ఈ పొట్టివాడు సాక్షాత్తు విశ్వభర్త, విష్ణువు. అంత తేలికగా ఇతను ఇక్కడ నుండి వెళ్ళడు. మూడు లోకాలను మూడు అడుగులుగా కొలిచే త్రివిక్రమరూపం ధరించి, బ్రహ్మాండం అంతా నిండిపోతాడు. అప్పుడు అతనిని ఎవ్వరూ ఆపలేరు తెలుసా? దానం వద్దు, గీనం వద్దు. ఈ బ్రహ్మచారిని పంపివెయ్యి. నీ కులాన్ని, రాజ్యాన్ని, పరాక్రమాన్ని నిలబెట్టుకో".

587: ఇలా తమ మేలు కోరి, గురువు శుక్రుడు చెప్పగా, గొప్ప యశస్సు గల బలి ఒక క్షణం పాటు కన్నులు మూసుకుని ఇలా అన్నాడు.588 : "ఓ మహాత్మా! శుక్రాచార్యా! నీవు చెప్పింది నిజమే. లోకంలో ఇదే గృహధర్మం కూడా. అర్థము, కామము, కీర్తి, జీవనోపాయము వీటిలో ఏది అడిగినా ఇస్తానని చెప్పాను. ధనంపై దురాశతో అడిగినవానికి లేదని చెప్పి త్రిప్పి పంపించలేను. ఇచ్చిన మాట తప్పడం కంటే పాపం లేదు. పూర్వం భూదేవి "ఎంతటి చెడ్డ పనిచేసిన వాడిని అయినా మోస్తాను, కాని ఆడినమాట తప్పిన వాడిని మాత్రం మోయలేను." అని చెప్పింది కదా? యుద్ధంలో వెనుతిరగకుండా వీరమరణం పొందడం, మాటకు కట్టుబడి సత్యంతో బ్రతకడం, మానధనులు అయిన వారికి మేలైన మార్గాలు కదా?.589: దున్నే రైతుకు మంచి పొలము, మంచి విత్తనాలు ఒక చోటే దొరకడం అరుదు. అదే విధంగా దాతకు తగిన ధనము, దానిని తీసుకునే ఉత్తముడు దొరికే అదృష్టం అపురూపం కదా!590:

కారేరాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం బొందరే?
వారేరీ సిరిమూటఁగట్టుకొని పోవం జాలిరే? భూమిపైఁ
బేరైనం గలదే? శిబిప్రముఖులుం బ్రీతిన్ యశః కాములై
యీరేకోర్కులు? వారలన్ మఱచిరే యిక్కాలమున్? భార్గవా!

శుక్రాచార్యా! పూర్వకాలంలో కూడ ఎందరో రాజులున్నారు. వారికి రాజ్యాలు ఉన్నాయి. వాళ్ళు ఎంతో అహంకారంతో ఎంతో ఔన్నత్యాన్ని సాధించినవారే కదా! వారెవరూ సంపదలు మూటగట్టుకొని పోలేదు. కనీసం ప్రపంచంలో వారి పేరైనా మిగిలి లేదు. శిబి చక్రవర్తివంటి వారు కీర్తికోసం సంతోషంగా అడిగినవారి కోరికలు తీర్చారు కదా. వారిని ఈ నాటికీ లోకం మరువలేదు. బలిచక్రవర్తి రాక్షసరాజైనా సత్యసంధుడు, తనువు నశ్వరతను, సిరుల అస్థిరతను ఎరిగిన జ్ఞాని, కనుకనే ఆచార్యుడు శుక్రుడు చెప్పిన రాజనీతిని కాదని తన నిర్ణయం చెప్తున్నాడు.591: ఓ మహాత్మా! శుక్రాచార్యా! ఎడతెగని యజ్ఞ యాగాలు, వ్రతాలూ చేసినా, పుణ్యకార్యాలు చేసినా విష్ణువును దర్శించడం వీలు పడదు. అటువంటి గొప్పవాడు కురచ అయి అడుగుతున్నాడు. అతడు కోరినదానిని ఇవ్వడం కంటే నావంటి వాడికి ఇంకేం కావాలి?592:

595. మేరువు దల క్రిం దైనను
బారావారంబు లింకఁ బాఱిన లోలో
ధారుణి రజమై పోయినఁ
దారాధ్వము బద్ధమైనఁ దప్పక యిత్తున్.

ఆదిన్ శ్రీసతి కొప్పుపైఁ, దనువుపై, నంశోత్తరీయంబుపై,
బాదాబ్జంబులపైఁ, గపోలతటిపైఁ, బాలిండ్లపై నూత్నమ
ర్యాదం జెందు కరంబు గ్రిం దగుట మీఁదై నా కరంబుంట మేల్ గాదే?రాజ్యము గీజ్యమున్
సతతమే?కాయంబు నాపాయమే?

నిరయంబైన, నిబంధమైన, ధరణీ నిర్మూలనంబైన, దు
ర్మరణంబైనఁగులాంతమైన నిజమున్ రానిమ్ము,కానిమ్ము పో;
హరుఁడైనన్, హరియైన, నీరజభవుం డభ్యాగతుండైన నౌఁ;
దిరుగన్ నేరదు నాదు జిహ్వ; వినుమా; ధీవర్య! వే యేటికిన్?

ఇతడు దానం కావాలని చాచిన చేయి ఎంతో గొప్పది కదా! మొదట లక్ష్మీదేవి యొక్క కొప్పు ముడి మీద, శరీరం మీద, పైట చెంగు మీద, పాదపద్మాల మీద, చెక్కిళ్ళ మీద, పాలిండ్ల మీద సరికొత్త మర్యాదలు పొందే దివ్యమైన హస్తం. అంతటి చెయ్యి కిందది కావటం నాచెయ్యి పైది కావటం ఎంత అదృష్టం! ఎంత మేలు! దీని ముందు ఈ రాజ్యం ఏ పాటిది! ఇదేమైనా శాశ్వతంగా ఉండేదా! ఈ శరీరం పడిపోకుండా ఉంటుందా?593: మిగతావి అన్నీ అనవసరమయ్యా. నే బంధింప బడటం, నాకు దుర్మరణం కలగటం, నరకం దాపురించటం, నా కులమే నాశనం కావటం, భూమండలం బద్దలవటం, నిజంగానే వస్తే రానివ్వు. జరిగితే జరగనీ, ఏమైనా సరే నేను మాత్రం అబద్ధమాడ లేను. దానం పట్టడానికి వచ్చిన వాడు సాక్షాత్తు ఆ పరమశివుడే అయినా, ఆ విష్ణుమూర్తే అయినా, ఆ బ్రహ్మదేవుడే అయినా సరే నా నాలుకకి ఆడిన మాట తప్పటం రాదు. పరమ విజ్ఞాన స్వరూపా, శుక్రాచార్య! నా నిర్ణయం వినవయ్య!–594:

నిర్మల ప్రవర్తన గల శుక్రాచార్యా! అదేం మాట, అన్నమాట ప్రకారం ఆలస్యం చేయకుండా దానం ఇస్తే విష్ణువు ఎందుకు బంధిస్తాడు? ఒకవేళ బంధించాడే అనుకో అతడే దయతో విడిచి పెడతాడు. విడిచి పెట్టకపోతే పోనీ ఇబ్బందేం ఉంది?

బలి దాన నిర్ణయము

595: మేరుపర్వతం తిరగబడితే పడవచ్చు, సప్తసముద్రాలు ఇంకిపోతే పోవచ్చు, ఈ భూమండలం అంతా తనలో తనే పొడిపొడి అయితే కావచ్చు, ఆకాశం బద్దలు అయితే కావచ్చు. కాని నేను మాత్రం ఇస్తానన్న దానం తప్పకుండా ఇస్తాను.596: మహానుభావా! ఈ పొట్టి పిల్లవాడు ఎప్పుడూ ఇతరులను అడగటం అన్నది లేదుట. ఒంటరియట. కన్నవాళ్ళు, తోడబుట్టిన వాళ్ళు లేరుట. అన్ని విద్యల మూలసారం తెలిసిన నేర్పరియట. నా ముందు చేతులు చాపి నిల్చున్న ఇలాంటి పసివాడిని గెంటి వేయటానికి నా మన సొప్పటం లేదు."597: ఇలా పలికిన ఆ సత్యమార్గం నుండి చలించని వాడు, వామనునికి దానమివ్వాలనే కుతూహలంతో ఉన్నవాడు, నిర్మలమైన కీర్తి గలవాడు, దృఢసంకల్పం గలవాడు, ఆడిన మాట తప్పనివాడు, అర్థులకు ఆత్మబంధువై బలిచక్రవర్తి మీద శుక్రాచార్యులు కోపగించుకుని ఇలా శాపమిచ్చాడు, "నా ఆజ్ఞ మీరావు, కాబట్టి త్వరలో పదభ్రష్టుడవై పోతావు." గురువుగారి శాపానికి గురైనప్పటికీ బలి బాధపడలేదు. అసత్యమార్గం అవలంభించలేదు. అంత.598: బాగా బ్రతికినా, పెక్కు కష్టాలకు గురయినా, పేదరికం వచ్చినా, ప్రాణానికి ధనానికి చేటు వచ్చినా, కడకు చావు సంభవించినా సరే మానధనులు మాట తప్పలేరు.

వామనునికి దాన మిచ్చుట

599: ఆ సమయంలో...600: చందమామ వంటి ముఖము గల బలిచక్రవర్తి ఇల్లాలు వింధ్యావళి. ఆమె నడకలు రాజహంస నడకలు. ఆ సందర్భంలో ఆమె భర్త సైగ గమనించింది. బ్రహ్మచారి కాళ్ళు కడగడానికి బంగారు కలశంతో నీళ్ళు తెచ్చింది.601: అప్పుడు మాయా బ్రహ్మచారి వామనుడితో, ఆ రాక్షసేంద్రుడు బలిచక్రవర్తి ఇలా అన్నాడు. 602: "ఓ బాలకా! లేవయ్యా! ఇలా రావయ్యా! నీవు అడిగింది ఇస్తాను. నీ పాదాలు కడగనివ్వు. ఇంకా ఆలస్యం చేయటం దేనికి."603: బలిచక్రవర్తి పిలుపును విని.. .604: బలిచక్రవర్తి రెండు చేతులతో కడగడానికి అనువుగా వామనుడు తన పాదాన్ని సాచాడు. ఆ పాదం యోగులు, దేవతలు సేవించునది, వారు కోరుకొనే సంపదలను సమకూర్చునది, భక్తితో వంగిన లక్ష్మీదేవి నొసటి మీది కస్తూరి కుంకుమతో కూడినది, పద్మాల పరిమళం గుబాళించున్నది, వేదాలరాశి అనే మణిమంజీరాలు అలంకరించుకున్నది.605: దేవతలను కష్టాలనుండి కాపాడేది, కలకాలము మేలు కలిగించేది, సమస్త ఉపనిషత్తులకు అలంకారం అయినది, భవబంధాలను పోకార్చి మోక్షాన్ని సమకూర్చేది, వామనావతారుడు విష్ణువు యొక్క కుడిపాదమును బలిచక్రవర్తి నీటితో కడిగాడు.606: అదేవిధంగా ఆ చక్రవర్తి వామనుని ఎడమ పాదాన్ని కడిగాడు. పవిత్ర జలాలను

నెత్తి మీద చల్లుకున్నాడు. ఆచమనం చేసాడు. దేశము, కాలము మొదలైన వాటిని లెక్కించి (సంకల్పం చెప్పుకుని)...607: బలిచక్రవర్తి చేతులు సాచి వామనుడిని పూజించాడు. "బ్రాహ్మణుడవు, ప్రసిద్ధమైన వ్రతం కలవాడవు, విష్ణు స్వరూపుడవు, వేదాల నియమాలు తెలిసిన వాడవూ, అయిన నీకు మూడడుగుల నేల దానం చేస్తున్నాను." అని పలికి "పరమాత్మునకు ప్రీతి కలుగుగాక." అంటూ వెను వెంటనే ధారపోసాడు. అది చూసి విశ్వం అంతా ఆశ్చర్య పోయింది.608: ఆ సమయంలో...609: నీళ్ళధార పడకుండా శుక్రాచార్యుడు కలశ రంధ్రానికి అడ్డుపడి ఆపేసాడు. సాక్షాత్తు విష్ణువు అయిన వామనుడు ఆ సంగతి తెలుసుకుని దర్భకొనతో పొడిచాడు. దానివలన శుక్రుడు ఒంటి కన్ను వాడు అయ్యాడు.610: అలా ఒంటి కన్నువాడై శుక్రాచార్యుడు అడ్డు తప్పుకున్న పిమ్మట...611: ఆటంకం లేకుండా దైవవిద్వేషి బలిచక్రవర్తి చేతిలోనుండి నిరాటంకంగా పవిత్ర జలం ధారపోసాడు. ఆ పవిత్ర నీటిబిందువులకు లక్ష్మీపతి వామనుడు తన చెయ్యి ఒడ్డాడు. ఆ చెయ్యి ఎలాంటిది అంటే... రాక్షసుల శిరస్సులు ఖండించునది. లక్ష్మీదేవిని ఆకర్షించడంలో మేలైనది. లక్ష్మీదేవి శిరోజాలను సేవించునది. ఆమె నిర్మల కుచాగ్రములపై మర్యాదలు అనుభవించేది.612: బలిచక్రవర్తి అందించిన దానధారను పద్మాలవంటి కన్నులు గలస్వామి వామనుడు స్వీకరించాడు. ఆ జలధార మునుల నియమాలకు ఆధారమైనది. రాక్షసస్త్రీలను కన్నీటి పాలు చేసేది. రాక్షసరాజులను నిరాధారులుగా మార్చేది.613:

కమలనాభు నెఱిఁగి కాలంబు దేశంబు
నెఱిఁగి శుక్రు మాట లెఱిగి నాశ
మెఱిఁగి పాత్ర మనుచు నిచ్చె దానము బలి
మహి వదాన్యుఁ డొరుఁడు మఱియుఁ గలఁడె.

బలిచక్రవర్తి విష్ణుమూర్తిని తెలుసుకున్నాడు. దేశకాలాలు తెలుసుకున్నాడు. శుక్రుని మాటలు అర్థం చేసుకున్నాడు. తనకు చేటు వాటిల్లుతుందని తెలుసుకున్నాడు. అయినప్పటికి యోగ్యమైనదిగా భావించి ఆ దాన మిచ్చాడు.

లోకంలో అటువంటి మహాదాత మరొకడు టాడా?614: ఓ పరీక్షిన్మహారాజా! సర్వ భూతాలకూ విష్ణువు అధిపతి కదా. కనుక, ఆయనకు బలిచక్రవర్తి దానం చేయగానే దిక్కులు అన్నీ కళకళలాడాయి.పంచభూతాలూ "భళి భళీ" అని పొగిడాయి. 615:

క్షితిదానమిచ్చు నతఁడును
నతికాంక్షఁ బరిగ్రహించు నతఁడును దురిత
చ్యుతులై శతవత్సరములు
శతమఖ లోకమునఁ గ్రీడ సలుపుదు రెలమిన్.

అంతట మాయాబ్రహ్మచారి బలిచక్రవర్తితో ఇలాఅన్నాడు. "భూమిని దానం ఇచ్చినవాడికి,దానిని ప్రీతితో తీసుకున్న వాడికి పాపాలు నశించిపోతాయి. వారు సంతోషంగా నూరు యాగాలు చేస్తే దక్కే స్వర్గలోకంలో నూరేండ్లు విహరిస్తారు.616: అందుచేత, ఏ దానమూ భూదానానికి సమానం కాదు. భూదానం ఇచ్చిన నీకు ఇహ పర లోకాలు రెంటిలోనూ కీర్తి, పుణ్యము కలుగుతాయి." అని పలికి మాయాబ్రహ్మచారి మళ్లీ ఇలా అన్నాడు.617: "నేనెందుకు దీనిని అడిగానని నీ మనస్సులో చింతించకుండా, సత్యం పెంపొందే విధంగా దానము ఇవ్వు. ఈ మూడడుగులు ఇస్తే మాకు మూడు లోకాలు ఇచ్చినట్లే."618: ఇలా పలికిన వామనుడి పలుకులకు విరోచనుడి కొడుకు అయిన బలి మనస్సు ఎంతో సంతోషంతో నిండిపోయింది.619:

పుట్టి నేర్చుకొనెనొ పుట్టక నేర్చెనో
చిట్టి బుద్ధు లిట్టి పొట్టివడుగు
పొట్ట నున్న వెల్ల బూమెలు నని నవ్వి
యెలమి ధరణి దాన మిచ్చె నపుడు.

ఈ పొట్టి బ్రహ్మచారి ఈ చిట్టి బుద్ధులు పుట్టిన పిమ్మట నేర్చుకున్నాడా! పుట్టకముందే నేర్చుకున్నాడా? ఇతని పొట్ట నిండా మాయలే అంటు నవ్వి సంతోషంగా భూదానం చేశాడు.620: బలిచక్రవర్తి ఔదార్యాన్ని, అతనిగొప్పదనాన్ని గ్రహాలు, మునీశ్వరులు. సిద్ధులు, గంధర్వులు, కిన్నరులు, యక్షులు, గరుడులు, దేవతలు, సర్పరాజులూ అందరూ పొగిడారు. పూలవానలు కురిపించారు. దేవతల విజయ దుందుభులు మారుమ్రోగాయి.621: ఇట్లు వామనుడు దానాన్ని గ్రహించి...

త్రివిక్రమ స్ఫురణ.:

622. ఇంతింతై, వటుఁడింతయై మఱియుఁ దా నింతై నభోవీథిపై
నంతై తోయదమండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుం డగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై.

బలిచక్రవర్తి మూడడుగుల మేర భూమి ధారపోయగానే గ్రహించిన వామనుడు చూస్తుండగానే ఇంత పొట్టి బ్రహ్మచారి, ఇంత ఇంత చొప్పున ఎదగటం మొదలెట్టాడు, అంతట్లోనే అంత పొడుగు ఎదిగాడు,

అలా ఆకాశం అంత ఎత్తు పెరిగాడు,

అదిగో మేఘాలకన్నా పైకి పెరిగిపోసాగాడు,పాలపుంత,

చంద్రమండలం అన్నీ దాటేసాడు, అదిగదిగో

ధ్రువ నక్షత్రం కూడ దాటేసాడు, మహర్లోకం మించిపోయాడు. సత్యలోకం కన్నా ఎత్తుకి, ఇంకా ఎత్తుకి పెరిగి

పోతూనే ఉన్నాడు. మొత్తం బ్రహ్మాండ భాండం అంతా

నిండిపోయి వెలిగిపోతున్నాడు, ఆహా ఎంతలో ఎంత త్రివిక్రమ

రూపం దాల్చాడో

శ్రీమన్నారాయణ మహాప్రభువు!

623.

రవిబింబం బుపమింపఁ బాత్రమగు ఛత్రంబై శిరోరత్నమై
శ్రవణాలంకృతియై గళాభరణమై సౌవర్ణకేయూరమై
ఛవిమత్కంకణమై కటిస్థలి నుదంచద్ఘంటయై నూపుర
ప్రవరంబై పదపీఠమై వటుఁడు దా బ్రహ్మాండమున్ నిండుచోన్.

వామనుడు బ్రహ్మాండమంతా నిండిపోతుంటే, మింట నుండే సూర్యబింబం ఆ పరాత్పరునికి అలంకారంగా పోల్చి చెప్పడానికి తగి ఉన్నాడట. అది ఎలాగంటే ఆ సమయంలో క్రమక్రమంగా త్రివిక్రమునికి గొడుగులా, తర్వాత శిరోమణిలా, తర్వాత మకరకుండలంలా, పిమ్మట కంఠాభరణంలా, ఆ పిమ్మట బంగారు భుజకీర్తుల ఆ పిమ్మట కాంతులీనే కంకణంలా, అపైన మొలలోని గంటలా, అనంతరం మేలైన కాలి అందెలా, చివరికి పాదపీఠంలా పోల్చడానికి తగి ఉన్నాడట.

సౌందర్యము :

పద్యాలను అందంగా కళ్ళకు కట్టినట్లు అలవోకగా చెప్పడంలో సిద్ధహస్తుడై మన పోతనామాత్యుల వారి త్రివిక్రమావతరణ అత్యద్భుతం. ఈ పద్యాలుతెలుగు సాహిత్యానికే మకుటాయమానాలుగా ఎన్నదగ్గవి. ఉపమానం అని చెప్తూ ఉపమానానికి గొప్పదనం అబ్బేలా చేయుట సామాన్యము కాదు.

624: ఈ విధంగా విష్ణువు సత్త్వరజస్తమో రూపక విశ్వరూపాన్ని పొంది విజృంభించాడు. భూమి, ఆకాశము, స్వర్గము, దిక్కులు, దిక్కుల మధ్య ప్రదేశాలు, సముద్రాలు, చరాచరములైన సమస్త ప్రాణులూ తానే అయ్యాడు. క్రమంగా భూలోకాన్ని అతిక్రమించాడు. భువర్లోకము, సువర్లోకము, మహర్లోకము, జనోలోకము, తపోలోకము, దాటిపోయాడు. సత్యలోకం కంటే ఎత్తుగా ఎదిగిపోయాడు. అన్నిచోట్ల మూలమూలలు, సందుసందులు నిండిపోయాడు. మహోన్నత ఆకారంతో పాదాల అడుగు భాగంలో రసాతలాన్ని, పాదాలలో భూమిని, పిక్కలలో పర్వతాలను, మోకాళ్ళలో పక్షులను, తొడలలో దేవతలను, వస్త్రంలో సంధ్యాకాలాన్ని, రహస్యాంగంలో ప్రజాపతులను, పిరుదులలో రాక్షసులను, నాభిలో ఆకాశాన్ని, కడుపులో సప్తసముద్రాలను, వక్షంలో నక్షత్రసమూహాన్ని, హృదయంలో ధర్మాన్ని, స్తనద్వయంలో ఋతాన్ని సత్యాన్ని, మనస్సులో చంద్రుణ్ణి, ఎదలో లక్ష్మీ దేవిని, కంఠంలో వేదాలను, భుజాలలో ఇంద్రాదులైన దేవతలను, చెవులలో దిక్కులు, తలలో స్వర్గలోకాన్ని, తలవెంట్రుకలలో మేఘాలను, ముక్కుపుటాలలో వాయువును, కన్నులలో సూర్యుణ్ణి, ముఖంలో అగ్నిని, వాక్కులో సమస్త ఛందస్సును, నాలుకలో వరుణునీ, కనుబొమ్మలలో కార్యాకార్యాలను, రెప్పలలో

రేయింబవళ్ళను, ఫాలభాగంలో కోపాన్ని, క్రింది పెదవిలో లోభాన్ని, స్పర్శలో కామాన్ని, రేతస్సులో జలాన్ని, వీపులో అధర్మాన్ని, అడుగులలో యజ్ఞాలను, నీడలో మరణాన్ని, నవ్వులో మాయావిశేషాలను, రోమాలలో సస్యాలను, నరాలలో నదులను, గోళ్ళలో రాళ్లను, బుద్ధిలో బ్రహ్మను, ప్రాణాలలో దేవర్షి గణాలను, శరీరంలో చరాచర సకలప్రాణులనూ, ఇమిడించి కొన్నాడు. ఆయన మేఘం వలె మ్రోగే పాంచజన్యమనే శంఖం, శార్ఙ్గమనే ధనుస్సు, సుదర్శనమనే చక్రము, కౌమోదకి అనే గదాదండం, నందకమనే ఖడ్గం, అక్షయాలైన అంపపొదులతో ప్రకాశిస్తున్నాడు. మకర కుండలాలు, కిరీటం, భుజకీర్తులు, హారాలు, కాలి అందెలు, కంకణాలు, కౌస్తుభమణి, రత్నాల మొలనూలు, పీతాంబరం, వైజయంతీమాలికతో విరాజిల్లు తున్నాడు. సునందుడు, జయుడు, విజయుడు మొదలైన పరిచారకుల సమూహం చుట్టూ చేరి ఉంది. ఆయన మేరలేని తేజస్సుతో మెరుస్తున్నాడు. బ్రహ్మాండం ఆయన దేహానికి మేలిముసుగుగా ఒప్పుతున్నది.

625: విశ్వరూపాన్ని ధరించిన త్రివిక్రముడు తన ఒక పాదముతో భూలోకాన్ని కప్పి, మొదటి అడుగుగా స్వర్గ లోకాన్ని దాటి, రెండవ పాదము ఉంచాడు. రెండవ అడుగుగా వేసిన పాదముతో పైలోకాలను అన్నింటినీ దాటిపోయాడు.ఆ మహారూపం పట్టకపోవడంవలన బ్రహ్మాండ భాండం పైపెంకు పెటపెటలాడి బ్రద్దలైపోసాగింది. స్వామి తప్ప ఇంకెవరూ కనిపించకుండా పోయారు. ఆ విశ్వరూపుడు మాటలకు, చూపులకు అందరానివాడై సంశోభించాడు.626: రాజా! విశ్వరూపంతో ఒకపాదం కింద ఉన్న భూమండలం పద్మానికి అంటుకున్న చిన్న బురద రేణువు వలె ఒప్పింది. ఇంకొక పాదం మీద ఉన్న ఆకాశం పద్మం మీద వాలిన తుమ్మెదవలె ప్రకాశించింది.627: ఆ సమయంలో...628: అన్నిలోకాలను దాటిపోయిన త్రివిక్రముని కాలిగోళ్ళకాంతికి సత్యలోకం లోని బ్రహ్మ తేజస్సు సూర్యునిముందు దివిటీ వలె వెలవెల పోయింది.629: సంసారబంధాలను తెంచుకొని మోక్షాన్ని పొంది బ్రహ్మ లోకంలో నివాసం చేస్తున్న మహారాజులు మరీచీ మొదలైన వారు, సనందుడు మొదలైన దేవర్షులు, అక్కడ ఎప్పుడూ ఆకారం ధరించి మారు మ్రోగుతుండే పురాణాలు, తర్కశాస్త్రాలు, వేదాలు, వేదాంగాలు, ఇతిహాసాలు, ధర్మ శాస్త్రాలు, మహజ్ఞానులైన పుణ్యాత్ములు మున్నగువారు అందరు సర్వనియంత అయిన మహావిష్ణువు పాదాన్ని దర్శించారు. ఆ పాదానికి మిక్కిలి భక్తితో మ్రొక్కారు. మనస్సులలో "మేము భావిస్తున్న పెన్నిధి కూడా కనిపించింది. ఈనాడు మేము ధన్యులం అయ్యాము." అనుకున్నారు.630:

తనపుట్టిల్లిదె పొమ్మటంచు నజుఁడుం దన్నాభిపంకేరుహం
బు నిరీక్షించి నటించి యున్నత పదంబుం జూచి తత్పాదసే
చనముం జేసెఁ గమండలూదకములం జల్లించి;తత్తోయముల్
వినువీథిం బ్రవహించె దేవనదినా విశ్వాత్ముకీర్తిప్రభన్.

మహావిష్ణువు బొడ్డు తామరను చూసి "నా జన్మస్థానం ఇదే సుమా!" అనుకుంటూ అజుడైన బ్రహ్మదేవుడు సంతోషించాడు. ఆ మహోన్నత పాదాన్ని దర్శించు కున్నాడు. తన కమండల జలంతో స్వామి పాదాన్ని కడిగాడు. ఆ జలధారలు కీర్తి కాంతితో నిండి ఆకాశంలో దేవనదిగా ప్రవహించాయి.631: ఇంకా ఆ సమయంలో...632: యోగమార్గంలో ఊహించి బ్రహ్మదేవుడు మున్నగు లోకపాలకులు మహావిష్ణువుకు అనేక రకాలైన పూలమాలలతో పూజలు చేసారు, మేలైన సుగంధ ద్రవ్యాలను, ధూపదీపాలను సమర్పించారు, అనంతమైన పేలాలను, అక్షతలను చల్లారు, ఫలాలు, కానుకలు పెట్టారు, సంతోషంతో కీర్తించారు, శంఖాలు మున్నగువాటిని ఊదారు, జయజయ నాదాలు చేసారు, కరుణాసముద్రా! త్రివిక్రమ దేవా! అని కొనియాడారు, భల్లూకరాజైన జాంబవంతుడు అన్ని దిక్కులలో ఢంకా మ్రోగిస్తూ విష్ణుదేవుని విజయాన్ని చాటాడు.633: అన్నిలోకాలలోనూ వ్యాపించి నిండిన భగవంతుణ్ణి కంటితో చూడడానికి, మనసుతో ఊహించ డానికి వీలుకాక బలిచక్రవర్తి, ఆ సభలోని వారు చక్కటి స్తోత్రాలు చేసారు.

దానవులు వామనుని పై దాడి

634: అటు పిమ్మట విష్ణువు మరల తన వామనరూపాన్ని ధరించాడు. హేతి, ప్రహేతి, విప్రచిత్తి మొదలైన రాక్షసులు ఇంద్రుడు మొదలగు దేవతలను గెలిచిన వీరులు. అంతటి ఆ రాక్షస వీరులు "ఇతడు మూడడుగుల నెపంతో ప్రపంచమంతా ఆక్రమించుకున్నాడు. మాయతో బ్రహ్మచారి రూపాన్ని పొందిన విష్ణువు అని తెలియక మన రాజు ఆడినమాట తప్పకుండా దానమిచ్చాడు. బలిచక్రవర్తి వద్ద తప్పు లేదు. ఈ పొట్టివాడు ఎదురులేని మహిమతో లోకాలను స్వాధీనం చేసుకున్నాడు. వీటిని ఇంద్రుడు మున్నగువారికి ఇచ్చేస్తాడు. ఈ బ్రహ్మచారి తప్పించుకొని పారిపోకుండా పట్టి చంపేయాలి." అంటూ బెదిరిస్తూ కేకలు వేస్తూ యుద్ధానికి సిద్ధం అయ్యారు. గండ్రగొడ్డళ్ళు, అడ్డకత్తులు, ఈటెలు వంటి ఆయుధాలు ధరించి, చెలరేగి అన్నివైపుల మూగారు. అదంతా చూసి విష్ణుసేవకులైన సునందుడు, నందుడు, జయుడు, జయంతుడు, విజయుడు, ప్రబలుడు, ఉద్బలుడు, కుముదుడు, కుముదాక్షుడు, గరుడుడు, పుష్పదంతుడు, విష్వక్సేనుడు, శ్రుతదేవుడు, సాత్వతుడు మొదలైన సేనాపతులు పదివేల ఏనుగుల బలంతోగల తమతమ సైన్యాలను, ఆయుధాలను సమకూర్చుకున్నారు. యుద్ధంలో రాక్షస సైన్యాలను ఎదిరించి తుదముట్టించడానికి ఉత్సాహంతో సిద్ధపడ్డారు. అప్పుడు బలి శుక్రాచార్యుని శాపాన్ని గుర్తు తెచ్చుకొని రాక్షసులతో ఇలా అన్నాడు.635: "ఓ రాక్షసవీరులారా! ఆగండి! యుద్ధానికి వెళ్ళకండి. మనకు ఇది సమయం కాదు. సర్వప్రాణుల సుఖాలకు, దుఃఖాలకు అధికారియైన దేవుని ఓడించడం మన వల్ల కాదు. మొదట మనకు రాజ్యాన్ని ఇచ్చాడు. దేవతలకు చేటు కలిగించాడు. ఇప్పుడు దానికి వ్యతిరేకంగా చేసాడు. అటువంటి దేవుని ఏమనగలము! ఇదే మన అదృష్టఫలం. అనేక సార్లు భయపడి పారిపోయిన విష్ణుసేవకులు ఇప్పుడు మిమ్మల్ని ఎదిరించడం దైవనిర్ణయం. మనకు అదృష్టం అనుకూలించినప్పుడు శత్రువులను జయిద్దాము.

ఇప్పుడు వద్దు. 636: అంతేకాక..637: రాజైనవాడు ఎంతటి కోటలు, మంత్రులు, సైన్యాలు, మంత్రాలు, ఔషధాలు, తెలివి తేటలూ ఉన్నప్పటికీ కాలాన్ని గమనించి ఓర్పు, ఉపాయాలతో యుద్ధం చేయడమే సరైన పని.

బలిని బంధించుట

638:కనుక, ఇప్పుడు శత్రువులతో యుద్ధానికి పూనుకోవడం తగదు. మనకు అనుకూలమైన సమయంలో గెలువవచ్చు. అనవసరంగా శ్రమపడకుండా తొలగిపొండి.'' అని బలిచక్రవర్తి చెప్పాడు. అప్పుడు విష్ణుభక్తులకు భయపడి రాక్షసులు రసాతలానికి వెళ్ళిపోయారు. అటుపిమ్మట యాగంలో సోమపానం చేసే చివరి దినాన విష్ణువు అభిప్రాయాన్ని తెలుసుకుని గరుడుడు బలిచక్రవర్తిని వరుణ పాశాలతో బంధించాడు.639: చేతులు, కాళ్ళు కట్టబడిన బలి చక్రవర్తి, "ఇది విష్ణువు దయ దీనికి ఏమీ చేయలేను'' అనుకుంటూ, సంకోచం ఏమీ లేకుండా మౌనం వహించాడు. అన్నివైపులా హాహాకారాలు చెలరేగాయి.640: ఐశ్వర్యం నశించినా బలిచక్రవర్తిలో దీనత్వము, కంపము కలుగలేదు. అంతే కాదు వెనుకటికంటే ఔన్నత్యము. జ్ఞానము, ధైర్యము అధికం అయ్యాయి. అప్పుడు బలిచక్రవర్తిని చూచి వామనుడు ఇలా అన్నాడు.

641: "ఓ దనుజేంద్రా! బలీ! మూడడుగుల నేల ఇస్తాను అన్నావు కదా. భూలోకము, సూర్య చంద్రుల దాకా ఉండే స్థలము నాకు ఒక అడుగుకి సరిపోయింది. స్వర్గలోకం ఒక అడుగుకి సరిపోయింది. నీ సంపద అంతా ఈనాడు రెండు అడుగులైంది.ఇక మూడవ అడుగుకు చోటెక్కడుంది? ఇస్తానన్న అర్థాన్ని ఇవ్వనివాడు నరకాన్ని పొందడం నిజమే కదా! అందువల్ల, నీకు కొంచెం సేపటిలో నరకం ప్రాప్తిస్తుంది. సందేహం లేదు. అలాకాకుండా మూడవ అడుగు ఇవ్వదలుచు కుంటే ఆచోటు నాకు చూపించు. బ్రాహ్మణులకు స్వాధీనం కావలసిన దానిని కాదనడానికి బ్రహ్మకు కూడా సాధ్యం కాదు."642: వామనుడి ఈ మాటలు విన్న బలిచక్రవర్తికి సత్యభంగం అవుతుంది ఏమో అనే సందేహం కలిగింది. అది విషబాణంలా మనసును గాయపరచింది. అయినా అతడు దిగులుచెందకుండా ప్రసన్న మైన ముఖంతో బుద్ధిశాలి అయిన వామనుడితో ఇలా అన్నాడు.643:

> సూనృతంబుఁ గాని సుడియదు నా జిహ్వ
> బొంకఁజాల; నాకు బొంకు లేదు;
> నీ తృతీయపదము నిజము నా శిరమున
> నెలవు సేసి పెట్టు నిర్మలాత్మ!

"ఓ పుణ్యాత్ముడా! నా నాలుక సత్యాన్ని తప్ప పలుకనే పలుకదు. అబద్ధమన్నది చెప్పనే చెప్పలేను. నాలో అసత్య మన్నది లేదు. నీ మూడవ అడుగు శాశ్వతంగా నా తలమీద పెట్టు మహాత్మా!''

మూడడుగులు దానంగా గ్రహించిన, వామనుడు త్రివిక్రమావ తారం ధరించి రెండు అడుగులలో మొత్తం ముల్లోకాలు ఆక్రమించాడు. మూడో అడుగు ఎక్కడ పెట్టమన్నావు చూపించమన్నాడు. పరమ దానశీలుడు, సత్యసంధుడు అయిన బలిచక్రవర్తి 'నీ పాదం నా తలమీద పెట్టు పరమేశా!' అని ఇలా సమాధానం చెప్తున్నాడు.644: భగవాన్! నరకానికి పోవడం, శిక్షింపపడటం, ఉన్నతమైన పదవి పోవడం, బంధింపబడటం, సర్వ సంపదలు నశించటం, కష్టాలు అన్నీ రావడం కన్నా కూడ అసత్యం చెప్పడానికే ఎక్కువ భయపడతాను సుమా.645: అంతే కాకుండా...646: ఓ పరమేశ్వరా! ఆనందస్వరూపా! తల్లితండ్రులు, అన్నదమ్ములు, మిత్రులు, గురువులు, బుద్ధిచెప్పడంతో ఏమీ నష్టం కలుగదు. దాని వల్ల తరువాత మేలే కలుగుతుంది. మదంతో కన్నులు కనిపించని మావంటి రాక్షసులకు నీవు సకాలంలో చెదరిపోకుండా వెలిగే చూపును ఇచ్చావు. అందువల్ల నీవు గురువులలో మొదటిగురువు అయ్యావు. నీవు నన్ను బంధించడం శిక్షగా, సిగ్గుగా, లోటుగా, బాధగా కానీ నేను భావించను. ఇదివరలో చాలామంది రాక్షసులు నిన్ను ఎదిరించి పోరాడి యోగీశ్వరులు పొందే స్థానాన్ని పొందారు కదా స్వామీ! నీదగ్గర అసాధ్యం అన్నదేముంది?647:

చెలియే మృత్యువు? చుట్టమే యముఁడు? సంసేవార్థులే కింకరుల్?
శిలలం జేసెనె బ్రహ్మదన్ను? దృఢమే జీవంబు? నో చెల్లరే;
చలితం బౌట యెఱుంగ కీ కపట సంసారంబు నిక్కంబుగాఁ
దలఁచున్ మూఢుఁడు సత్యదాన కరుణాధర్మాదినిర్ముక్తుఁడై.

అయ్యయ్యో! మృత్యువు ఏమైనా ఆప్తమిత్రమా ఏమిటి? లేక యముడు దగ్గర చుట్టమా? యముని సేవకులు భక్తితో సేవించాలి అనేటంత బుద్ధిమంతులా ఏమిటి? పోనీ ప్రాణం ఏమైనా శాశ్వతమా? లేక బ్రహ్మ ఈ శరీరాన్ని రాళ్ళతో మలచాడా? సత్యం ఇలా ఉండగా, మూర్ఖుడు సత్యము, దానము, దయ, ధర్మము మొదలైనవాటిని వదలివేస్తున్నాడు. ఈ మాయాసంసారము సత్యమని భావిస్తున్నాడు.648: పురాణ పురుషా! "చుట్టాలు, దొంగలు, కొడుకులు, అప్పుల వాళ్ళు, భార్యలు ముక్తిని దూరంచేసేవారు. సంపదలు నిలకడ లేనివి. శరీరం స్థిరం కాదు. ఇతరులు తమ ప్రయోజనాన్నే కోరతారు.

కాలం నిలువదు. ఆయుస్సు త్వరగా గడుస్తుంది. ఐశ్వర్యం తొందరగా వెళ్ళిపోతుంది" అనుకున్నాడు పుణ్యాత్ముడైన మా తాత ప్రహ్లాదుడు. ఆయన తన తండ్రిని విడనాడి నీ పాదాలను సేవించాడు. అదృష్టవంతుడైన అతనికి మరణంలేని మనుగడ దొరికింది. పూర్వం మావారు శత్రువులుగా మారితే తప్ప నిన్ను దర్శించలేకపోయారు. నీవు అర్థివై వచ్చి నన్ను దేహి అనడం మా పూర్వ పుణ్య ఫలమే కదా స్వామీ!".

649: ఇలా బలిచక్రవర్తి పలుకుతున్న సమయంలో...650: అక్కడకి ప్రహ్లాదుడు వచ్చాడు. అతడు విశాల వక్షస్థలమూ, తాజా పద్మాలవంటి కన్నులు కలవాడు, పచ్చని పట్టువస్త్రాన్ని కట్టుకున్నాడు, చక్కగా మాట్లాడడంలో నిపుణుడు.
సంసారపు బంధాలను తెగతెంచుకున్న సుగుణసంపన్నుడు, భక్తితో భగవంతుని పాదాలను లోబరచుకున్నవాడు, దుఃఖాన్ని పారద్రోలి జ్ఞానవిద్యతో ఆనందించేవాడు, అటువంటి ప్రహ్లాదుణ్ణి బలిచక్రవర్తి సంతోషంగా దర్శించాడు.

ప్రహ్లాదాగమనము

651: బలి చక్రవర్తి తన తాత రాక గమనించినా, వరుణ పాశాలతో కట్టివేయబడి ఉన్నందు వలన, ప్రహ్లాదుడికి నమస్కారం చేయడానికి వీలుకాలేదు. బలిచక్రవర్తి కన్నులలో కన్నీళ్ళు పొంగాయి, అతడు సిగ్గుతో తలవంచుకున్నాడు, వినయంగా తలవంచి తాతకు మ్రొక్కు చెల్లించాడు. అప్పుడు, ప్రహ్లాదుడు మొగసాలలో సునందుడు మొదలైన వారితో కూర్చుని యున్న వామనదేవుని చూసాడు, సంతోషంతో అతని కన్నులు చెమ్మగిల్లాయి, ఒడలు పులకరించింది, అతడు స్వామికి సాగిలబడి నమస్కరించి ఇలా మనవి చేసాడు.652: "స్వామీ నీవు వీనికి మొదట ఇంద్రపదవి ఇచ్చావు. మరల దానిని ఈనాడు తొలగించడంతో చాలా మేలు అయింది. ఆ పదవి అజ్ఞానానికి, అహంకారానికీ మూలకారణమై ఉన్నది, గర్వం అనే కారుచీకటిని కలిగించే దానిని దయతో పోగొట్టుట రక్షించడమే, అంతేకాని ఈ బంధనం శిక్షించడం కాదు, పరమాత్ముని తెలుసుకున్న వానికి ఇంద్రపదవి ఎందుకూ కొరగానిది, అది నీపాదసేవకు సాటిరాదు, ఇంద్రపదవితో గర్వం పెరిగి కళ్లు కనిపించవు, చెవులు వినిపించవు, మనస్సుకు మైకం కమ్ముతుంది, నిన్ను మరచిపోతాడు. అటువంటి పదవిని విడిపించి వీనికి గొప్ప ఉపకారమే చేసావు.".653: లోకనాథుడు, లోకదర్శకుడు అయిన విష్ణుదేవునకు ప్రహ్లాదుడు నమస్కరించి అలా పలుకుతున్న సమయములో.654: బలిచక్రవర్తి భార్య వింధ్యావళి కన్నీరు కారుస్తూ మందగమనంతో అచ్చటికి వచ్చింది. ఆమె వక్షస్థలం నిండా గట్టిగా పైట చెరగు బిగించుకుని ఉంది. రెండుచేతులను నుదుటిపై జోడించి "దయామయా! లక్ష్మీపతీ! నాకు పతిభిక్షపెట్టు" అంటూ ముల్లోకాలకు ప్రభువైన వామనమూర్తిని వేడుకున్నది.655: అలా చేర వచ్చిన ఆ ఇల్లాలు వింధ్యావళి స్వామి పాదాలకు మ్రొక్కి ఇలా అన్నది.656:"ఓ లోకపూజ్యుడా! లోకాలు నీకు సంచరించే విహార స్థలాలు. నిజానికి లోకాలకు రాజువు నీవే. కాని తెలివిలేని మూర్ఖులు ఈ లోకాలకు తామే పాలకులమని భావిస్తారు.

657: కా దనఁడు పొమ్ము లే దీ
రా దనఁడు జగత్త్రయైక రాజ్యము నిచ్చెన్
నా దయితుఁ గట్టనేటికి?
శ్రీదయితాచిత్తచోర! శ్రితమందారా!

ఆశ్రిత జనుల పాలిటి కల్పవృక్షమా! "కాదు, లేదు, పో, ఇవ్వను" అనలేదు కదా. మొత్తం ముల్లోకాల రాజ్యాన్ని నీకు ఇచ్చేసాడు కదా! ఇంకెందుకు స్వామీ! లక్ష్మీపతీ! నా పతిని బంధిస్తున్నావు?

హిరణ్యగర్భాగమనము

658: ఇలా ప్రహ్లాదుడు, వింధ్యావళి విన్నవించు సమయాన బ్రహ్మదేవుడు వచ్చి వామనుడి రూపంలో ఉన్న శ్రీమహావిష్ణువుతో ఇలా అన్నాడు.659: "ఓ దేవదేవా! దేవవంద్యా! జగన్నాథా! కమలాల వంటి కన్నులుగల శ్రీహరీ! నీవు సకల ప్రాణులకు ఈశ్వరుడవు, ఆరాధ్యనీయుడవు, బలిచక్రవర్తి గొప్పదాత. ఇతడు నీకు తన ధనమంతా ఇచ్చేసాడు. ఇతడు శిక్షింపదగినవాడు కాదు. నీచే దయ చూపదగిన వాడు. ఇతని భయాన్ని పోగొట్టి బంధవిముక్తుణ్ణి చెయ్యి. ఇతడు నీ పాదాలను కోరి జలములతో అభిషేకించి, గరిక పత్రితో పూజించిన భక్తుడు. లోకాధిపతివైన నీవు స్వయంగా దరిచేరి అడగడాన్ని తెలిసి కూడా తన రాజ్యమంతా ఇచ్చేసాడు. ఇటువంటి ఈ బలిని తాళ్ళతో కట్టివేయడం న్యాయము కాదయ్యా!"660: ఇలా విన్నవించిన బ్రహ్మదేవుడి మాటలు విని భగవంతుడగు వామనుడు ఇలా అన్నాడు.

661: "ఎవడి మీద నేను దయ చూపాలని అనుకుంటానో, వాడి సంపద అంతటిని అపహరిస్తాను. సంసార సంబంధమైన గొప్ప మైకంతో ఎవడు లోకాన్ని నిందించి నన్ను తిరస్కారిస్తుంటాడో, వాడు ఎప్పటికీ నానా యోనులలో పుడుతూ, చస్తూ నరకానికి పోతూ ఉంటాడు. ఎవడైతే ధనానికి, వయస్సుకు, రూపానికి, విద్యకు, బలానికి, ఐశ్వర్యానికి, వృత్తికి, జన్మకు సంబంధించిన గర్వాన్ని విడిచిపెట్టి ఎల్లప్పుడు నిర్మలంగా ఉంటాడో, వాడిని నేను ప్రీతితో కాపాడుతాను. నా భక్తుడైనవాడు అజ్ఞానం, దురాశ, గర్వం, లౌకికసంపదలతో మదించి నశించడాన్ని ఆశించడు.662: ఈ పుణ్యాత్ముడు బంధింపబడ్డాడు. గురువు శాపం వలన పరితాపానికి గురయ్యాడు. బంధువులనుండి విడువబడ్డాడు. ప్రాప్తించిన అధికారాన్ని, ఐశ్వర్యాన్నీ కోల్పోయి పేదవాడు అయ్యాడు. ఐనా నిర్మలంగా ఉన్నాడు. సత్యాన్ని, దయను, సన్మార్గాన్ని వదలకుండా ఉన్నాడు. జ్ఞానియై గెలవడానికి సాధ్యంకాని అజయ అని పేరు పడ్డ మాయను గెలిచాడు. ఇతడు గొప్ప మహానీయుడు.663:వీనిని పుణ్యాత్ముడైన రాక్షసేశ్వరుడిగా ఆదరించాలనే ఉద్దేశంతోనే నేను ఇంతవరకూ ఊరకున్నాను. ఇతడు మంచి నడవడి కలవాడు, సత్యవాది, మేలు మేలు ఈతని ప్రవర్తనకు నాకు మెప్పుకలుగుచున్నది.

రాక్షసుల సుతల గమనము

664: సావర్ణి మనువు కాలంలో ఇతడు దేవతలకు ప్రభువై దేవేంద్రుడు అవుతాడు. దేవతలకు సైతం ఊహించడానికి వీలుకాని ఆ పదవికి నేనే పిలిపిస్తాను. తరువాత దయతో కాపాడతాను కూడ.665: రోగాలు, శ్రమలు, ఆపదలు, దుఃఖాలు లేకుండా, విశ్వకర్మ చేత సృష్టింపబడిన సుతలలోకంలో, అంతవరకూ ఇతడు దానవుల సేవలు అందుకుంటూ, ఐశ్వర్యంతో వైభవాలతో ఉంటాడు." 666: ఈవిధంగా పలికిన భగవంతుడైన వామనుడు బలిచక్రవర్తితో ఇలా అన్నాడు.

667:"ఇంద్రసేనమహారాజా! నీకు మేలు కలుగుతుంది. భయపడవద్దు. నీ త్యాగం శ్రేష్ఠమైనది. సుతలలోకంలో ఉండడానికి దేవతలు సైతం కుతూహల పడతారు. అంత చక్కటి ఆ లోకం లోనివారికి దుఃఖము, కష్టము, దుర్మరణము, రోగబాధలు, కీడు కలగవు. అటువంటి లోకంలో నీవు ఉండు. నీ ఆజ్ఞమీరిన రాక్షసులను నా చక్రం నరుకుతుంది. ఆ లోకదిక్పాలకు నీమీద అధికారం ఉండదు. ఇక ఇతరులను లెక్కించేది ఏముంది? ఎల్లప్పుడూ నేను నిన్ను రక్షిస్తూ, కనికరంతో కనిపెట్టి ఉంటాను.668 : దైత్యదానవుల కలయిక వలన నీకు కలిగిన రాక్షసత్వం నన్ను ధ్యానించడం వలన త్వరలో తొలగిపోతుంది. మా ఆజ్ఞప్రకారంగా సంతోషంగా సుతలంలో ఉండు."669:

ఇలా ప్రీతితో పరమాత్ముడు పలికిన తియ్యని మాటలు బలిచక్రవర్తి చెవులలో దూరి, లోపలా బయటా నిండాయి. సంతోష బాష్పాలు రెప్పల చాటునుండి తోసుకుంటూ కాలువలై వెలువడి ప్రవహించాయి. వక్షస్థలమంతా పులకాంకురములు నిండాయి. అప్పుడు బలిచక్రవర్తి మిక్కిలి వేడుకతో చేతులు జోడించాడు. స్థిరమైన మనస్సుతో మెల్లగా ఇలా అన్నాడు. 670:

"ఓ శేషశాయిశయనా! శ్రీమహావిష్ణూ! నీవు దిక్పాలకుల మీద కూడా ఏనాడూ ఇంతటి దయచూపలేదు. ఈనాడు నన్ను గొప్పగా గౌరవించావు. నా జీవితానికి తేజస్సును ఇచ్చి కాపాడావు. ఈ మన్నన, ఈ కరుణ, ఈ మాటలు, మర్యాద నాకు చాలు. నిన్ను తెలుసుకొని ఆశ్రయించినవారికి ఎన్నడూ కష్టాలు కలుగవు." 671: ఇలా విష్ణుమూర్తిని స్తుతించి, బలిచక్రవర్తి విష్ణువునకు, బ్రహ్మదేవునకు, చంద్రశేఖరుడైన శివునికి నమస్కరించాడు. బంధవిముక్తుడై తన పరివారంతో చేరి సుతలలోకానికి వెళ్ళిపోయాడు. విష్ణుమూర్తి దయతో ధన్యుడై కులాన్ని ఉద్ధరించిన మనుమణ్ణి చూచి ప్రహ్లాదుడు సంతోషించాడు. భగవంతునితో ప్రహ్లాదుడు ఇలా అన్నాడు. 672:

"ఓ మంగళ స్వరూపా! బ్రహ్మదేవుడు సైతం ఇంతగా నీ అనుగ్రహాన్ని పొందలేదు. శివుడు కూడా ఇంతగా ఆదరాభిమానాలు పొందలేదు. ఇంక ఇతరులనగా ఎంత? బ్రహ్మోదేవుడు మున్నగు వారిచేత నీవు పూజింపబడువాడవు. నిన్ను దరిజేరడానికి ఎవరికీ సాధ్యం కాదు. అటువంటి నీవు మారాక్షసుల కోటకు రక్షకుడవు అయ్యావు. నీ పాదపద్మాల మకరందాన్ని సేవించిన మహిమవల్ల బ్రహ్మోదేవుడు మున్నగువారు ఐశ్వర్యాన్ని పొందారు. కానీ, మేము చాలా అల్పులము. నీచజన్ములము. ఏమి తపస్సు చేయడంవల్ల మామీద నీ కరుణాకటాక్షం కురిసిందో ఊహించలేము. నీవు మమ్ములను కాపాడడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది.673: అంతేకాకుండా.674: నీవు అన్నింటిలో వ్యాపించి ఉంటావు. అందరిని సమానంగా చూస్తావు. అయినప్పటికీ ఒక్కొక్కసారి పక్షపాతము చూపుతావు. భక్తిలేనివారి కోరికలు తీర్చవు. కల్పవృక్షం వలె భక్తులైనవారి కోర్కెలు నెరవేర్చుతావు." 675: ఇలా మనవి చేసిన ప్రహ్లాదుడితో పరమాత్ముడు ఇలా అన్నాడు. 676: "నాయనా! ప్రహ్లాదా! మంచిది. నీవు నీ మనుమనితో, నీ వారితోపాటు సుతలలోకానికి వెళ్ళు. నేను గదాహస్తుడనై వచ్చి మిమ్ములను కాపాడుతాను. అక్కడ మీకు ఏ కష్టమూ కలుగదు.677:

ఈ విధంగా సుతలమునకు వెళ్ళమని ఆజ్ఞాపించిన భగవంతునికి ప్రహ్లాదుడు నమస్కరించి ప్రదక్షిణ చేసాడు. నొసటిపై చేతులు జోడించి సెలవు తీసుకున్నాడు. ఆ తరువాత, అతడు బలిచక్రవర్తిని, రాక్షసుల సమూహాన్ని వెంటపెట్టుకొని, ఒక గొప్ప గుహ గుండా సుతలలోకానికి వెళ్లాడు. అటు పిమ్మట, మహావిష్ణువు బ్రహ్మవేత్తలైన ఋత్విజుల నడుమ సభలో కూర్చుని యున్న శుక్రాచార్యుని చూసి, ఇలా అన్నాడు.

బలియజ్ఞ విస్తరణ

678 : "శుక్రాచార్యా! విప్రోత్తమా! బలిచక్రవర్తి యజ్ఞంలో మిగిలిన కార్యాన్ని నెరవేర్చు. లోపం ఏమాత్రం రాకూడదు. ఆగిపోయిన యజ్ఞకార్యాలు మీవంటి బ్రహ్మవేత్తలవల్ల సఫలమవుతాయి."679: ఇలా యజ్ఞం సంపూర్తి చేయమనిన విష్ణువుతో శుక్రుడు ఇలా అన్నాడు.

680: "నీవే అన్ని కార్యాలకూ అధినాథుడవు. నీవే యజ్ఞాలకు అధికారివి. నీవు సంతోషిస్తే ఏ కార్యాలకూ లోపం కలుగదు. నిన్ను ధ్యానంచేస్తే ధనానికి, దేశానికి మంత్రతంత్రాలకు ప్రాప్తించిన దోషాలు తొలగిపోతాయి. మంచిది. నీ ఆజ్ఞ ప్రకారమే చేస్తాను. నీ ఆజ్ఞకు లోబడి మెలగడము మానవులకు మేలు. ఇంతకంటే భాగ్యం ఏముంది." ఇలా అనిన శుక్రుడు విష్ణువు ఆజ్ఞను తలదాల్చి బలిచక్రవర్తి యాగాన్ని పూర్తి చేసాడు. అతనికి బ్రాహ్మణులు, ఋషులు తోడ్పడ్డారు.681: ఈ విధంగా విష్ణువు వామనావతారం ఎత్తి, బలిచక్రవర్తి వద్ద భూదానం తీసుకున్నాడు. తన అన్న అయిన ఇంద్రుడికి దయతో స్వర్గలోకాన్ని ఇచ్చాడు. ఆ సమయంలో

దక్షుడు, భృగువు మొదలైన ప్రజాపతులు, శివుడు, కుమారస్వామి, నారదుడు మున్నగు దేవర్షులు, పితృదేవతలు, రాజులతో పాటు కలిసి బ్రహ్మదేవుడు "లోకాలకు, దిక్పాలకులకు వామనుడు ప్రభువు" అని శాసనం చేసాడు. ఈ విషయం కశ్యపుడికి అదితికి సంతోషం కలిగించింది. పిమ్మట, "ధర్మానికి, కీర్తికి, సంపదలు, శుభాలు, దేవతలు, వేదాలకు స్వర్గానికి మోక్షానికి ఉపేంద్రుడైన వామనుడే అధికారి" అని నిర్ణయించాడు.682:

పరీక్షిన్మహారాజా! అటుపిమ్మట బ్రహ్మ దేవుడు, దిక్పాలకులు దేవేంద్రుడితో కలిసి ఎంతో ఆదరంతో వామనుణ్ణి విమానంపై కూర్చోపెట్టుకుని అమరావతికి తీసుకుని వెళ్లారు.683:
ఈ విధంగా బలవంతుడైన తమ్ముడి ప్రాపువల్ల, ఇంద్రుడికి ఇంద్రపదవి తిరిగి లభించింది. శ్రేష్ఠుడైన తమ్ముడుంటే అన్నగారి కోరికలు నెరవేరవా? 684: దేవతలతల్లి అదితికి కడపటివాడైన కొడుకు వామనుడు భిక్షం అడిగి సంపాదించిన ముల్లోకాలూ తన అన్నకే ఇచ్చేసాడు. అందులో భాగాన్ని, లాభాన్ని అడగలేదు. ఈవిధంగా అన్నల కోసం ఎంత శ్రమపడే తమ్ముళ్ళు అయినా వామనునితో సరిపోలగలరా? 685: దేవతల సమూహాన్ని కన్న అదితి చివరకి అదృష్టం పండేటట్లు వామనుడిని కన్నది. కడుపు పగిలేలా పదిమందిని కనేకన్నా, ఏ తల్లికైనా అలాంటి కొడుకు ఒక్కడు చాలు.686: అలా వామనుడు సంపాదించి ఇచ్చిన మూడులోకాల సామ్రాజ్య సంపదనూ దేవేంద్రుడు తిరిగి పొందాడు.
అటుపిమ్మట బ్రహ్మదేవుడు, శివుడు, కుమారస్వామి, భృగువు మొదలైన మునులూ, పితృదేవతలు, దక్షుడు మొదలైన ప్రజాపతులు, సిద్ధులు, దేవతలూ, ఇంకా తక్కినవారు అందరూ విష్ణుదేవుని లీలావిలాసాలకు ముచ్చట పడుతూ, పొగుడుతూ ఆటపాటలతో తమతమ నివాసాలకు వెళ్ళిపోయారు." అనిచెప్పి శుకుడు ఇలా అన్నాడు.687:
"రాజా! పరీక్షిత్తూ! త్రివిక్రమావతారుడైన వామనుడి గొప్ప గుణాలను పూర్తిగా తెలుసుకోవడం, లెక్కించడం ఎవరికీ సాధ్యం కాదు. భూమిలోని ధూళి కణాలను లెక్కపెట్టగలిగిన వాడికైనా, ఇది సాధ్యం కాదు. ఇంక వేరేవారి సంగతి చెప్పేదేముంది!688: అత్యద్భుతలీలలతో కూడిన విష్ణుమూర్తి నిర్మల వర్తనములను గురించి తెలిపే ఈపుణ్య చరిత్రను వినేవాడు గొప్ప భాగ్యవంతుడు అవుతాడు. చివరకి ప్రకాశించే ప్రభావంతో దివ్యలోకాలను పొందుతాడు.689:
పరీక్షిన్మహారాజా! మానవులకు, పితృదేవతలకు, దేవతలకు సంబంధించిన పుణ్యకార్యాలు చేసే సమయాలలో ఎవరైతే త్రివిక్రముని చరిత్రను కీర్తిస్తుంటారో, వారు ఎప్పుడూ సర్వ సుఖాలు పొందుతూ ఉంటారు.690: జంభాసురుని సంహరించిన ఇంద్రుడు, దేవతలు, అశక్తులై స్వర్గాన్ని ఓడి పోయారు. విష్ణుమూర్తి వారిని కాపాడటానికి వామనావతారం ఎత్తి, విరోచనుని కొడుకు బలిచక్రవర్తిని మూడు అడుగుల నేల దానం ఇమ్మని అడిగి పుచ్చుకున్నాడు. త్రివిక్రమావతారం ఎత్తి రెండు అడుగులు వేయడంతోనే బ్రహ్మాండం అంతా నిండిపోయి

ఆనందంగా ఉండే ఆ వామనుడికి ఎప్పుడూ మ్రొక్కుతూ ఉంటాను." 691: అని ఈ విధంగా శుకబ్రహ్మ పరీక్షిత్తు మహారాజునకు వామనావతార చరిత్రను చెప్పెను" అని సూతమహర్షి శౌనకాది మహర్షులకు చెప్పగా వినిన వారు సూతునితో ఇలా అన్నారు.

మత్స్యావతార కథా ప్రారంభం

692: "సూతమహర్షి! నీవు బహునిర్మల హృదయం కలవాడవు. పూర్వం విష్ణుమూర్తి మత్స్యావతారం ఎత్తాడు కదా, ఆ కథ అంతా వినాలని బాగా ఆసక్తిగా ఉంది. కర్మానికి కట్టుబడి ఉండే జీవుడు లోకంలో గౌరవము, జ్ఞానము లేని చేపగా పుడుతూ ఉండవచ్చు గానీ, భగవంతుడు అయిన విష్ణుమూర్తి ఎందుకు ఏదో మంచిది అన్నట్లు అలాంటి చేపరూపు ధరించాడు? అలా ధరించి ఎక్కడ ఉన్నాడు? ఏమి కార్యాలు సాధించాడు? అవతారాలలో మొదటి వరుసలోది అయిన ఆ మీనావతారం ఎత్తడానికి కారణం ఏమిటి? దాని అవసరం ఏమిటి? ఇవన్నీ వివరంగా తెలుపడానికి నీవే సమర్థుడవు. దేవాధిదేవుడు విష్ణుమూర్తి కథలు సకల లోకాలకూ మేలు చేకూర్చేవి కదా, కనుక ఈ వృత్తాంత సవివరంగా విశదీకరించు."

693: అంటూ మీనావతారం కథ వివరించమని శౌనకాదులు అడిగారు. అంతట సూతమహర్షి వారితో ఇలా అన్నాడు "మీరు అడిగినట్లే పరీక్షిత్తు అడిగితే, భగవత్స్వరూపుడు అయిన శుకమహర్షి ఇలా చెప్పాడు.694: "వినుము పరీక్షిత్తు మహారాజా! ప్రభువు అయిన విష్ణుమూర్తి వేదాలను, బ్రాహ్మణులను, గోవులను, దేవతలను, సజ్జనులను, ధర్మాన్ని, అర్థాన్ని రక్షించడం

కోసం అవతారాలు ఎత్తుతూ ఉంటాడు. వాయువులాగే గొప్పరూపాలలో, సూక్ష్మరూపాలలో చేరి ఉంటాడు. ఎక్కువ తక్కువలు లేని గుణరహితుడై శాశ్వత నిర్గుణ పరబ్రహ్మము అయినప్పటికీ, అతను గొప్పదనాన్ని, తక్కువతనాన్ని, గుణాల కలయికను పొందుతూ ఉంటాడు. కనుక అతడు మత్స్యావతారం ధరించడంలో ఆశ్చర్యం లేదు.

పోయిన కల్పం పూర్తి అవుతున్న సమయంలో సత్యవ్రతుడు అనే ద్రవిడదేశపు రాజు కేవలం నీళ్ళే ఆహారంగా తీసుకుంటూ నది గట్టుమీద విష్ణుని గూర్చి తపస్సు చేసేవాడు.695: ఒకనాడు సత్యవ్రతుడు కృతమాలిక అనే నది వద్ద విష్ణువుకు ప్రీతి కలిగేలా నీళ్ళతో తర్పణం వదులు తున్నాడు. ఆ సమయంలో అతని దోసిలిలోనికి ఒక చేపపిల్ల వచ్చి చేరింది. అతను ఉలిక్కిపడి, ఆ చేపపిల్లను మరల నదినీటిలోకి వదలిపెట్టాడు. ఆ చేపపిల్ల నీటిలోనుండి రాజు సత్యవ్రతుడితో ఇలా అన్నది.696:

పాటువచ్చిన జ్ఞాతి ఘాతులు పాపజాతి ఝషంబు లీ
యేటఁ గొండొక మీనుపిల్లల నేఱి పట్టి వధింప న
చ్చోటు నుండక నీదు దోసిలి చొచ్చి వచ్చిన నన్ను న
ట్టేటఁ ద్రోవఁగఁ బాడియే? కృప యింత లేక దయానిధీ!

"ఓ దయామయా! దయమాలి దాయాదులను చంపే పాపపు జాతి చేపలు ఈ ఏటిలో ఉన్నాయి. అవి చిన్న చేపలను పట్టి మింగేస్తాయి. అందుకే ఇక్కడ ఉండలేక నీ దోసిలి లోనికి వచ్చి చేరాను. దయలేకుండా ఇలా నన్ను నట్టేటిలో వదిలేయడం న్యాయం కాదు.697: ఓ పుణ్య చరితుడా! ఇంక చేపలు పట్టే జాలరి వాళ్ళు వలలు వేస్తారు. నదిని కలతపెట్టి నన్ను పట్టుకుంటారు. తప్పించుకుని పోకుండా, మెడ పట్టుకుంటారు అప్పుడు ఎక్కడకని పోగలను? 698: ఓ దీనవత్సలా! సత్యవ్రతా! నన్ను పెద్ద చేపలు అయినా తినేస్తాయి. లేదంటే, ధూర్తులు అయిన జాలరులైనా పట్టుకుంటారు. అలా చచ్చిపోకుండా నన్ను కాపాడు. బలహీనులను కాపాడగలిగే అవకాశం కంటే గొప్ప అదృష్టం ఏముంటుంది?"699: అలా చేప పిల్ల పలికిన మాటలు విని కరుణాహృదయుడైన ప్రభువు సత్యవ్రతుడు, దానిని తన కమండలంలోని నీళ్ళలోకి ఎక్కించి, తన నివాసానికి తీసుకుని వెళ్ళాడు. ఆ చేప పిల్ల రాత్రి గడిచే సరికి పెరిగి కమండలం నిండి పోయింది. దానికి ఉండటానికి కమండలంలో చోటు చాలక రాజుతో ఇలా అన్నది.700:
"ఓ రాజేంద్రా! ఈ కమండలం నేను ఉండటానికి సరిపోదు. ఇంకొక దానిని తీసుకురా" అని చేప పిల్ల అంది. సత్యవ్రతుడు దానిని పెద్ద నీళ్ళ గంగాళంలోకి మార్చాడు.701: ఒక్క క్షణంలో ఆ మీనం మూడు చేతుల పొడవు పెరిగిపోయి, (చెయ్యి=రెండు మూరలు/ మూడు అడుగులు పొడవు...ఆంధ్ర వాచస్పతము) ఆ గంగాళం అంతా నిండిపోయింది. చోటు సరిపోక ఇంకొకటి

తెమ్మంది. దయానిధి అయిన ఆ రాకుమారుడు ఆ మత్స్యాన్ని చిన్న మడుగులోకి మార్పించాడు. ఆ మడుగు కూడా సరిపోనంత పెరిగిపోయి "నాకు తిరగడానికి చోటు చాలటం లేదు" అంది. ఆ భూపాలకుడు మంచివాడు కనుక ఆ జలచరాన్ని నీరు సమృద్ధిగా ఉన్న పెద్ద సరస్సులో ఉంచాడు. అది కూడా సరిపోనంతగా పెరిగిపోయి ఆ మహామత్స్యం చోటు చాలటం లేదని చెప్పుకుంది. బహు దొడ్డ సన్మార్గ చరితుడు, పుణ్యశీలీ కనుక ఆ మహా మీనాన్ని తీసుకు వెళ్ళి మహా సముద్రంలో వదిలాడు.

సముద్రము మొసళ్ళకు నెలవు అని పేరుకదా. "ఈ సముద్రంలో పడ్డ నన్ను పెద్ద మొసళ్ళు చుట్టుముట్టి చంపి తినేస్తాయి. ఇన్నాళ్ళూ కాపాడి, ఇవాళ నన్ను ఇలా వదలివేయకు, బయటకు తీసుకురా" అని మొరపెట్టుకుంది. ప్రాజ్ఞుడైన ఆ మహా జలచరంతో రాజు ఇలా అన్నాడు.702: "ఒక్క రోజులో నూరు యోజనాల మేర పెరిగిపోయావు. ఇలాంటి చేపలను మేము ఎప్పుడూ కనివిని ఎరుగము.చేపల జాతులకు ఎక్కడా ఇలాంటి శరీరం ఉండదు. నీవు ఎవరవు? ఎందుకోసం నన్ను తిప్పలు పెడుతూ తిప్పుతున్నావు. దీనులను కాపాడటానికి ఈ మహా మీనరూపం ధరించిన నీవు విష్ణువే అని తెలుసుకున్నాను. అచ్యుతా! నారాయణా! పురుషోత్తమా! లోకాలు సృష్టించి,పోషించి లయం చేసుకునే మహానుభావు డవు నీవే. దీనులకు, భక్తులకు నీవే దిక్కు. మహిమాన్వితమైన నీ లీలావతారాలు సర్వ ప్రాణులకూ మేలు కలిగిస్తాయి. అటువంటి నీకు మొక్కుతున్నాను.703:

మేము నీకు పరాయివాళ్ళం కాదు. నిర్మల జ్ఞానం కలవాళ్ళము. మాకు అండగా నీవు ఉంటావు. భక్తులలో నివసించే వాడవు నీవు. నీకు నిత్యం నమస్కరించే వాడికి చేటు కలుగనే కలుగదు కదా.704: హరీ! లక్ష్మీదేవి వక్షస్థలంపై క్రీడిస్తూ సంతోషంగా విహరించే ఆనంద స్వరూపుడవు. తామస ప్రకృతితో తిరిగే చేప రూపాన్ని ఎందుకు ధరించావో తెలుపుమయ్యా!"

మీనావతారుని ఆనతి

705: ఇలా సత్యవ్రత మహారాజు ఈ మత్స్యావతార కారణం చెప్పమని అడిగాడు. ఆ యుగం చివర కాలంలోని ప్రణయవేళ సముద్రంలో ఒంటరిగా సంచరించాలని భావిస్తున్న శ్రీమహావిష్ణువు సత్యవ్రతునితో ఇలా అన్నాడు.

706: "ఓ రాజా! ఈ రాత్రి గడచిన పిమ్మట రాబోయే ఏడవ నాటితో బ్రహ్మదేవుడికి ఒక పగలు పూర్తి అవుతోంది. భూలోకం మొదలు మూడులోకాలూ ప్రళయసముద్రంలో మునుగుతాయి. అప్పుడు నా ఆజ్ఞానుసారం ఒక పెద్ద నావ నీ దగ్గరకు వస్తుంది. అప్పుడు నీవు సమస్త ఓషధులు, విత్తనాల రాసులు ఆ నౌకపై పెట్టుకుని ప్రళయసముద్రంలో విహరించు. సప్తఋషులు నీతో కలిసి ఆ ఓడలో ఉంటారు. మీ ముందు అంతా పెనుచీకటి ఆవరిస్తుంది. మునుల మేని కాంతులు మిణుకు మిణుకు అంటూ మెరుస్తుంటాయి. సముద్రంలో నావ ఊగుతూ తేలుతూ సాగిపోతూ ఉంటుంది.707: మత్స్యరూపం ధరించిన నేను ఆ ఓడ సముద్రం అలలకు దెబ్బతినకుండా అన్నివైపులా నా పెద్ద పొలుసులతో కూడిన నా రెక్కలను కదిలిస్తూ ఉంటాను. నావను ముక్కలు చేయడానిక వచ్చే పెద్ద పెద్ద జలచరాలను తరిమేస్తూ ఉంటాను. ఒక పెద్ద పాము నా ఆజ్ఞానుసారం, అక్కడ కనిపిస్తుంది. సుడిగాలులకు నావ తిరగబడకుండా ఆ పాముతో నా కొమ్ముకొనకు ఆ నావను బంధించు. నీకూ మునీశ్వరులకూ చేటు వాటిల్ల కుండా ఆ ప్రళయకాలం గడిచేంతవరకు నేను రక్షిస్తూ ఉంటాను. ఇందుకోసమే నేను ఈ మీనరూపం ధరించాను.

ఇంకొక విశేష ప్రయోజనం కూడా ఉన్నదనుకో. పరబ్రహ్మ స్వరూపమైన నా మహిమ తెలుసుకో. మరి నేను నిన్ను అనుగ్రహిస్తాను." ఇలా పలికి శ్రీమన్నారాయణుడు ఆ సత్యవ్రత మహారాజు చూస్తుండగా అదృశ్యం అయ్యాడు.708 : అలా శ్రీ మహా విష్ణువు చేప రూపంతో చెప్పిన విషయాలను తలచుకుంటూ, తపశ్శాలి అయిన సత్యవ్రత మహారాజు తూర్పువైపుగా తలగడ పెట్టుకుని దర్భల శయ్యమీద పరుండి మీన రూపుడు చెప్పిన ప్రళయ సమయం కోసం వేచి ఉన్నాడు.709: ఇంతలో ప్రళయ సమయం దగ్గరపడగా... 710: మెరుపులతో కూడిన మేఘాలు ఎడతెరపి లేకుండా బహుభయంకరమైన వర్షపు జడులు కురుస్తున్నాయి, సముద్రాలు చెలియలికట్ట దాటి పొంగిపొరలి దేశాలను ముంచేస్తున్నాయి.

కల్పాంత వర్ణన

711: తరువాత...712:పరీక్షిత్తు మహారాజా! గడచిపోయిన కల్పం అంతం కాగా, బ్రహ్మప్రళయం అనే నైమిత్తిక ప్రళయం ఏర్పడింది. సముద్రాలు చెలియలి కట్టలు దాటాయి. నిట్టనిలువుగా ఆకాశమంత ఎత్తుకు లేచిన అలల సముద్రంలో లోకాల సరిహద్దులు

చెరిగిపోయాయి. ప్రాణులు సమస్తం కూలిపోయాయి.713: అట్టి బ్రహ్మదేవుని రాత్రి సమయం అయిన మహా ప్రళయ కాలంలో.714: రాజ్యాన్ని ఏలే రాజా పరీక్షిత్తూ! అవిశ్రాంతంగా కూర్చుని ఓర్పుతో ప్రాణులను సృష్టించి జన్మించుట లేని వాడగు బ్రహ్మదేవుడు అలసి పోయాడు. వీపు నడుము నొచ్చసాగాయి. అతడు ఒళ్ళు విరుచుకుంటూ, ఆవులిస్తూ సృష్టికార్యాన్ని ఆపాడు. నడుం వాల్చి, కళ్ళు మూసుకొని, చెయ్యి తలగడగా పెట్టుకున్నాడు. గురకలు పెడుతూ కలలు కంటూ ఒళ్ళు తెలియని నిద్ర పోయాడు.715: అలా బాగా అలసిపోయిన బ్రహ్మదేవుడు నిద్రపోయాడు. అతని ముఖాలనుండి వేదాలు వెలువడినాయి. హయగ్రీవుడు అనే రాక్షసవీరుడు వాటిని దొంగిలించాడు.

ఆ హయగ్రీవుడికి తప్ప అలా దొంగతనం చేయడం ఇతరులకు సాధ్యం కాదు.716: అలా వేదాలను చెరపట్టిన హయగ్రీవుడు వాటిని చదువ సాగాడు. బయటి ప్రపంచంలో ఉండటానికి భయపడిన అతడు బ్రహ్మదేవుడు నిద్రలో ఉండటం గమనించి, వేగంగా సముద్రంలోకి వెళ్ళిపోయాడు.717: ఈ విధంగా వేదాలను అపహరించుకుపోయి సముద్రంలో మునిగిన ఆ రాక్షసదొంగ హయగ్రీవుడిని జయించడం కోసము,వృక్షాలు, తీగలు అన్నింటి విత్తనాలు సమస్తం సముద్రంలో తడసి, పాడయిపోకుండా రక్షించడం కోసం, జగత్తులోని సమస్త కార్యములకు స్థితికారుడు అయిన శ్రీమహావిష్ణువు ఆ ప్రళయకాల ఆరంభంలో మీనరూపం ధరించాడు...718: అలా విష్ణుమూర్తి మత్స్యావతారం ఎత్తాడు. చిన్నచిన్న రెక్కలు, పెద్దపెద్ద మీసాలు, పొట్టితోక, బంగారపు రంగు శరీరము, శ్రీకరమైన మచ్చలు,చక్కని ముఖం,ఒక కొమ్ము, మిరుమిట్లు గొలిపే చూపులతో ఆ మహామత్స్యరూపం విరాజిల్లు తోంది.

గురుపాఠీన విహరణము

719: అలా భగవంతుడు శ్రీమహావిష్ణువు లక్ష ఆమడల పొడవైన మత్స్య రూపం ధరించాడు. సముద్రంలో ప్రవేశించి ....720: అతడు తళతళలాడే పెనురూపంతో ప్రళయ జలాలలో వేదాలకోసం వెదకటానికి పూనుకున్నాడు. ఒకసారి జలచరాలతో కలిసి తిరుగుతాడు. ఒకసారి వేగంగా గట్లవైపు దుమికి వస్తాడు. ఒకసారి ఆకాశానికి ఎగురుతాడు. ఒకసారి నీళ్ళ లోపల దాగి ఉంటాడు. ఒకసారి సముద్రంలో మునిగి తేలుతాడు. ఒకసారి బ్రహ్మాండాన్ని ఒరుసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఒకసారి చేపల గుంపును పట్టి మ్రింగుతాడు. ఒకసారి నీళ్ళను పీల్చి వెలుపలికి చిమ్ముతాడు. ఆ విధంగా ఆ మహామత్స్య మూర్తి రెక్కలు చాస్తూ, మీసాలు కదిలిస్తూ, మేని పొడలు మెరపిస్తూ, కన్నులకాంతులు ప్రసరిస్తూ, ఒడలు విరుచు కుంటూ, తళతళలాడుతూ సాగరగర్భంలో విహరించాడు.

కడలిలో నావను గాచుట

721: సత్యవ్రతుడు ప్రళయ కాలం వచ్చి సముద్రజలాలు భూలోకాన్ని ముంచివేయడానికి ముందే భక్తులకు తోడునీడైన భగవంతుణ్ణి ధ్యానించుతున్న సమయంలో శ్రీహరి ప్రేరణతో ఒక నావ అక్కడకి వచ్చింది.

722: సత్యవ్రతుడు ఉత్సాహంతో ఆ ఓడ దగ్గరకు వెళ్ళి, అనేక ఓషధులు, విత్తనాలను దాని మీదకి ఎక్కించాడు. విష్ణువును స్తోత్రం చేస్తూ మునులతో పాటు ఆ నావను ఎక్కాడు. భయంభయంగా సముద్రం మీద తేలుతూ పోతున్నాడు. అప్పుడు భక్తలోకాన్ని ఆకర్షించుటలో నేర్పరితనము కలిగిన చేపను (మీనావతారుని) ఎదురుగా చూచెను. 723: అలా కనబడిన మహా మీనరూపుని కొమ్ముకు సత్యవ్రతుడు ఒక పెద్ద పామును తాడుగా చేసి ఆ ఓడను కట్టివేసాడు. సంతోషంతో హృదయాన్ని పదిలపరచుకున్నాడు. ఋషులతోపాటు అతడు విష్ణువును ఈవిధంగా పొగడ సాగాడు...724: "ఓ భగవంతుడా! తమలో పుట్టిన అజ్ఞానం ఆవరించడం వలన కొందరు ఆ అజ్ఞాన మూలమైన సంసారంలో పడి చిక్కుకొని మోసపోయి కలతపడతారు. అటువంటివారు అదృష్టం వలన పరమాత్ముడవు అయిన నిన్ను సేవించి మోక్షాన్ని పొంది సంతోషపడతారు. ఆ విధంగా అందరినీ ఆదరించే నీవు మమ్ములను కాపాడు.725: లక్ష్మీపతీ! హరీ! సూర్యుడే కన్నులుగా నీవు ప్రాణులను చూస్తూ ఉంటావు. జ్ఞానం లేనివానికి దుర్బుద్ధి కలవానికి నీవే తండ్రివి. కాబట్టి కన్నులు ఉన్నవాడు కన్నులు లేనివాడికి దారి చూపిన విధంగా మమ్ములను ఉద్ధరించు. గురుడవై మాకు దారి చూపించు.

726: హరీ! విష్ణుమూర్తీ! బంగారం అగ్నితో చేరడం వలన మేలైన మెరుగు పొందుతుంది. ఆ విధంగానే నిన్ను పూజించే భక్తుల పాపాలు నాశనమై మోక్షం లభిస్తుంది.727:పరమాత్మా!హరీ! నీవు హృదయకుహరంలో ఉండే ఈశ్వరుడవు. నీ అనుగ్రహంలో పదివేలవంతులో ఒక లేశ భాగం వలన దేవేంద్రపదవి కలుగుతుందట. ఇక నిన్ను మెప్పిస్తే, లభించని భాగ్యం ఏముంటుంది?728: దయా సముద్రుడవై శ్రీమహావిష్ణువా! పనికిమాలినవాడిని గొప్ప వాడు అనుకొని దరిచేరేవారు చెడిపోతారు. నిన్ను నమ్ముకొని మంచిమార్గంలో నడవగలిగితే సందేహం లేకుండా అభేద రూపమైన ముక్తిని పొందుతాడు.729: నారాయణా! మత్స్యావతారా! నీవు స్నేహితుడుగా, బంధువుగా, జ్ఞానస్వరూపుడుగా, మానవుల మనస్సులోనే మసలుతావు. ఆత్మవై అండగా ఉంటావు. ప్రభువై కోరికలు పండిస్తావు. అటువంటి నిన్ను అనుసరించకుండా, లోకం ఏవేవో అనవసరపు పేరాశలకు బందీ అయిపోయి పరుగులు పెడుతుంది. అదృష్టహీనుడు బంగారు రాశి లభించినా దక్కించుకోలేడు కదా!730: కర్మఫలానికి లోబడి సముద్రంలో మునిగి కూరుకుపోయిన

లోకాన్ని మేలుకొలిపే మహాత్ముడవు నీవు. నీవు దేవతలకు ప్రభుడవు. అటువంటి నీవు మాకు గురువు అయ్యావు.

731:ఓసర్వేశ్వరా! దేవాధిదేవా! మా విన్నపాలు మన్నించమంటూ ప్రార్థిస్తున్నాను. నాలోని సంకటాన్ని తొలగించి నన్ను నీ లోకానికి చేర్చుకోమని వేడుకుంటున్నాను.732: ఈ విధంగా సత్యవ్రతుడు ప్రార్థన చేయగా విని, మత్స్య రూపంతో సముద్రంలో సంచరిస్తున్న మహావిష్ణువు సంతోషించాడు. ఆ పరమాత్ముడు సాంఖ్యయోగంతో కూడిన పురాతన వేద భాగాన్ని అతనికి బోధించాడు. మునులతోపాటు సత్యవ్రతుడు భగవంతుడు చెప్పిన సనాతనమైన బ్రహ్మ జ్ఞానాన్ని తెలుసుకుని ధన్యుడయ్యాడు. సత్యవ్రతుడు ఈ కల్పంలో వివస్వంతుడని పిలువబడే సూర్యునికి శ్రాద్ధదేవుడు అనే పేరుతో పుట్టి విష్ణువు దయవల్ల ఏడవమనువు అయ్యాడు. ప్రళయరాత్రి ముగిసి తెల్లవారే పర్యంతమూ ఆ విధంగా విష్ణువు మత్స్య స్వరూపంతో తిరుగుతున్నాడు.

733:
ఉఱ కంభోనిధి రోసి వేదముల కుయ్యున్ దైన్యముం జూచి వేఁ
గఱు లల్లార్చి ముఖంబు సాఁచి బలువీఁకందోఁక సారించి మే
న్మెఱయన్ దౌడలు దీటి మీస లదరన్ మీనాకృతిన్ విష్ణుఁ డ
క్కఱటిం దాఁకి వధించె ముష్టిదళితగ్రావున్ హయగ్రీవునిన్.

వేదాలు బాధతో మొరపెట్టుకోవడాన్ని ఆ కాళరాత్రి ముగిసే తెల్లవారుజామున విష్ణుమూర్తి కన్నాడు. వేగంగా రెక్కలు అల్లార్చి, నోరు తెరిచాడు, ఉత్సాహంతో తోక ఊగించాడు, మేను మెరపించాడు, దౌడలు చక్క జేసుకున్నాడు, మీసాలు కదిలించాడు, దుష్టుడు, మహాబలిష్టుడైన హయగ్రీవుణ్ణి హతమార్చాడు.

ప్రళయావసాన వర్ణన

734: అలా హయగ్రీవాసురుణ్ణి సంహరించి వేదాలను ఉద్ధరించే సమయానికి ప్రళయకాలం ముగిసింది.735: అలా ప్రళయకాలం ముగుస్తుండటంతో, ఎప్పుడు తెలవారుతుందో అనుకుంటూ ఎదురుచూస్తున్న మునుల హృదయాలు సంతోషించాయి. మైమరచి నిద్రిస్తున్న సరస్వతి లేచి బ్రహ్మ పక్కన కూర్చుండి ఓరగా పైట సర్దుకుంది. ప్రళయకాలం మాసిపోయిన బ్రహ్మ తేజస్సు మరల మిసమిసలాడింది. ప్రాణులు సంపాదించిన పూర్వపుణ్యాలు ఆయన కడకన్నులకు అగుపించాయి. అప్పుడు నిద్రలోవున్న బ్రహ్మదేవుడు అవయవాలను కదిలించాడు. ఆవులించి మేల్కొని నిక్కి. ఒడలు విరుచుకుంటూ కన్నులు తుడుచుకున్నాడు. తిరిగి సృష్టి చేయడానికి కూర్చున్నాడు.736: ఆ సమయంలో...

737: భగవంతుడు ఇంద్రుడి శత్రువు అయిన హయగ్రీవుణ్ణి చంపేసి, వాడు అపహరించిన వేదాల చెర విడిపించాడు. వాటిని తెచ్చి నిద్రలేచిన బ్రహ్మదేవుడికి దయాపూర్వకంగా అప్ప గించాడు.738:పద్మనాభుడు అయిన విష్ణుదేవుడికి సత్యవ్రతుడు అర్ఘ్యం సమర్పించి ప్రళయ సముద్రంలోనుండి బయటపడి మనువు అయ్యాడు. ఆ పద్మాక్షుడిని విష్ణువును పూజించకుండా ఐశ్వర్యం ప్రాప్తించదు కదా!

మత్స్యావతార కథా ఫలశ్రుతి

739: రాజఋషియైన సత్యవ్రతుడి భక్తిని,మత్స్యావతారం ధరించిన శ్రీ మహావిష్ణువు మహిమను, ప్రకటించే ఈ పుణ్య చరిత్రను విన్నవాడు సంసారబంధాల నుంచి విముక్తుడు అవుతాడు.740: ఓ రాజా! ప్రతిదినము మత్స్యావతారం కథను శ్రద్ధతో చదివేవాడు మోక్షాన్ని పొందుతాడు. అతని కోరికలు నెరవేరుతాయి.ఇదిసత్యం.741: ప్రళయసముద్రంలో మైమరచి నిద్రించే బ్రహ్మదేవుడి ముఖాల నుండి వెలువడిన వేదాలను దొంగిలించిన దుష్టరాక్షసుడిని సంహరించి, సత్యవ్రతుడు సంతోషించేటట్లు బ్రహ్మస్వరూపాన్ని తెలిపి, అన్నింటికి ఆధారుడై, మత్స్యావతారంతో సముద్రంలో మునుగుతూ, తేలుతూ సంచారం చేసిన మహావిష్ణువునకు నమస్కారం చేస్తున్నాను."742: అని శుకయోగీంద్రుడు పరీక్షిత్ నరేంద్రునకు చెప్పాడు.

పూర్ణి

743:~ రాజులలో ఇంద్రునివంటి వాడా! రాక్షసరాజులనే గొప్ప అడవిని కాల్చినవాడా! రాజులచేత స్తుతింపబడినవాడా! రాజులలో తలమానికం అయినవాడా! మహానుభావుడైన శివునిచేత పూజింపబడినవాడా! గుణసంపన్నుడా! రఘువంశలలామా!

744:~ దేవతల శత్రువులైన రాక్షసులను తెగటార్చిన వాడా! దేవతలకు మేలుచేసినవాడా! భూభారమును నివారించినవాడా! పుణ్యాత్ములను రక్షించేవాడా! నిర్మల, శుభకర రూపం కలవాడా! ఆత్మీయులను పోషించేవాడా! స్వచ్ఛమైన గొప్ప కీర్తి కల వాడా! ఎల్లప్పుడూ ధర్మాన్ని ఆదరించే వాడా! శ్రీరామా!

745:~ పరమశివుని దయవల్ల కలిగిన కవితాసౌందర్యం కలవాడు, కేశనమంత్రి పుత్రుడు, సహజ పాండిత్యుడు అయిన పోతనామాత్యుడు రచించిన శ్రీమహాభాగవత పురాణం అనే మహాకావ్యంలోని అష్టమస్కంధం. దీనిలో స్వాయంభువుడు, స్వారోచి షుడు, ఉత్తముడు, తామసుడు అనే మనువుల చరిత్ర, ఏనుగుకు మొసలికీ జరిగిన పోరాటం, శ్రీహరి గజేంద్రుణ్ణి కాపాడడం, రైవతుడు, చాక్షుషుడు అనే మనువుల చరిత్ర, దేవదానవులు సముద్రాన్ని మథించడం, పరమేశ్వరుడు విషాన్ని మ్రింగడం, పాలసముద్రంలో అమృతం మొదలైనవి పుట్టడం, దేవతలకు, రాక్షసులకు పోరాటం జరగడం, విష్ణువు మోహిని రూపంతో రాక్షసులను మోసగించి దేవతలకు అమృతాన్ని పోయడము, రాక్షససంహారము, శివకేశవుల సరస

సంభాషణము, విష్ణువు మోహిని రూపంతో శివుణ్ణి భ్రమింప చేయడం, వైవస్వతుడు, సూర్యసావర్ణి, దక్షసావర్ణి, బ్రహ్మసావర్ణి, ధర్మసావర్ణి, భద్రసావర్ణి, దేవసావర్ణి, ఇంద్రసావర్ణి అనే మనువుల వృత్తాంతము, బలిచక్రవర్తి యుద్ధానికి వెళ్ళడం, స్వర్గలోక వర్ణనం, దేవతల పలాయనం, వామనావతారము, శుక్రాచార్యుడు బలిచక్రవర్తుల సంభాషణము, వామనుని త్రివిక్రమ స్ఫురణము , రాక్షసులు సుతలానికి వెళ్ళడం, సత్యవ్రతుని వృత్తాంతము, మత్స్యావతార చరిత్ర అనే కథలు ఉన్నాయి.

ఓం నమో భగవతే వాసుదేవాయ!!
ఓం! ఓం! ఓం!ఓం! శాంతిః! శాంతిః! శాంతిః!
సర్వే జనాః స్సుఖినో భవతు!!

'పోతన భాగవతం తెలుగువారి జీవితాలలో పెనవేసుకుపోయిన కావ్యం.' ఇరివెంటి కృష్ణమూర్తి

'పోతన గారి భాగవతం లభించటం జన్మజన్మల పుణ్యవిశేషం.' కరుణశ్రీ

"భాగవత తత్వానికి హృదయం అష్టమ స్కంధం"

- సహజకవి, కవితాబ్రహ్మ పోతన భాగవతం నవరస పరిపూర్ణ భరితం
- తెలుగు వారు గుండెలలో అప్యాయంగా దాచుకున్న అనేక ఘట్టాలు అందంగా అమర్చబడ్డాయి.
- గజేంద్రమోక్షం, సముద్రమధనం, వామనావతారం, త్రివిక్రమావతారం, మత్స్యావతారం
- మధుర నాదపరిపూర్ణ ఛంధస్సుతో రమణీయ పదాలతో అలంకరించిన పద్యం ద్వారా ఏకత్వంలో భిన్నభావాలు స్ఫురింపజేసారు.
- ఈ అమృతసాగరంలో ఎంత ఆస్వాదించినా తృప్తి తీరదు.

తెలుగు భాగవతం. ఆర్గ్. telugubhagavatam.org లక్ష్యాలు

భాగవత స్ఫూర్తి మాధుర్యాల్ని విశ్వవ్యాప్తంగా పంచటం

నెట్టింట్లో భాగవతం జాలగూడు (వెబ్ పోర్టల్)

అరచేతిలో భాగవతం చరణి గ్రంథం, సంచార యాప్

భాగవత ప్రచరణ, ప్రచారం